'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 320

మంగళవారం 10-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

84,000 పైకి సెన్సెక్స్

భారత్–అమెరికాల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ఉత్సాహంతో సోమవారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్ అరశాతం పెరిగింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లూ కొనసాగాయి. సెన్సెక్స్ 485 పాయింట్లు పెరిగి 84 వేల స్థాయిపైన 84,066 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 174 పాయింట్లు లాభపడి 25,867 వద్ద నిలిచింది. –బిజినెస్‌లో

మహారాజ శ్రీ నల్వాడి కృష్ణరాజ వడయార్
మైసూర్ మహారాజు

108 సంవత్సరాల పురాతన సబ్బు అద్భుత వారసత్వాన్ని దార్శనిక నాయకత్వం మరలా స్మరిస్తోంది.

కర్ణాటకకు గర్వకారణమైన, 108 సంవత్సరాల పురాతన సబ్బు వారసత్వాన్ని కొనసాగిస్తూనే నూతన, రాజసమైన రూపులో అందిస్తున్నందుకు మేము గర్విస్తూ, సాదరంగా అందజేస్తున్నాము. తరతరాలుగా ప్రేమను పొందిన ఒక ఐకాన్ వారసత్వ సువాసన సహజమైన గంధం నూనెతో ముందుకు సాగుతోంది.

KSDL, సమర్థవంతమైన నాయకత్వంలో, మైసూర్ శాండల్ ఉత్పాదన పోర్ట్ ఫోలియోను విజయవంతంగా మార్చినది.

శ్రీ సిద్ధరామయ్య
గౌరవ ముఖ్యమంత్రి,
కర్ణాటక ప్రభుత్వం

శ్రీ డి.కె. శివకుమార్
గౌరవ ఉప ముఖ్యమంత్రి,
కర్ణాటక ప్రభుత్వం

శ్రీ ఎం.బి. పాటిల్
భారీ, మధ్యతరహా పరిశ్రమలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి,
కర్ణాటక ప్రభుత్వం

శ్రీ అప్పాజీ సి.ఎస్. నడగౌడ
గౌరవ ఎమ్మెల్యే,
ముద్దేబిహాళ్ నియోజకవర్గం,
ఛైర్మన్, K.S.D.L



బ్రాండ్ తరువాతి అద్భుత అధ్యాయంలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో ఫేస్ ఆఫ్ ది బ్రాండ్‌గా నిలిచేందుకు అంగీకరించిన కుమారి తమన్నా భాటియాకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

అద్భుతమైన గత సాంప్రదాయాన్ని నూతన తరం స్వీకరించే నూతన శకం ప్రారంభం కానున్నది.

* 100% NATURAL SANDALWOOD OIL

* 100% స్వచ్ఛమైన సహజసిద్ధమైన గంధపు నూనె కలిగిన ఏకైక సబ్బు

తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే... అంతర్జాలం కాస్తా మాయాజాలం అవుతుంది. డబ్బులు పోగొట్టుకోవడం నుంచి ప్రైవసీకి ముప్పు రావడం వరకు ఎన్నో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పుడు మన నిత్యావసరాల జాబితాలో 'ఇంటర్నెట్' భాగం అయింది. ఆ నెట్టింట ప్రయోజనాలూ, ఉపయోగాలతో పాటు మింగేసే అనకొండలు కూడా ఉన్నాయి. వాటి బారిన పడకుండా ఉండడం ఈరోజుల్లో సవాలుగా మారింది. 'ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. అన్ని విధాలుగా ఆలోచించాలి. తొందరపాటు కూడదు' అనేది సేఫ్టీ ఇంటర్‌నెట్ తారకమంత్రం...

ఆన్‌లైన్‌లో అనకొండలున్నాయి!

గిబ్లీ స్టైల్ ఏఐ ఆర్ట్

గిబ్లీ–స్టైల్ ఏఐ ఆర్ట్ మన ఫొటోలను చిత్రవిచిత్రమైన, యానిమీ–స్టైల్ చిత్రాలుగా

మారుస్తుంది. సరదా సంగతి ఎలా ఉన్నా, ఈ గిబ్లీ–స్టైల్ ఆర్ట్ ట్రెండ్ అనేది ప్రైవసీ, డాటా సెక్యూరిటీకి సంబంధించి ముప్పు తెచ్చిపెడుతుందని చెబుతున్నారు టెక్ నిపుణులు.

మరికొన్ని...

ప్రైవసీ నైట్‌మేర్: గిబ్లీ–స్టైల్ ఆర్ట్‌లాంటి ఫీచర్‌లను అందించే కొన్ని యాప్‌లు, ప్లాట్‌ఫామ్‌లు యూజర్‌ల ముఖ కవళికలు, రకరకాల ఎక్స్‌ప్రెషన్స్‌కు సంబంధించిన చిత్రాలను సేకరించి స్టోర్ చేసి ప్రాసెస్ చేస్తున్నాయి. దీన్నే ప్రైవసీ నైట్‌మేర్ అంటున్నారు.

డీప్‌ఫేక్: మహిళలు, పిల్లలు అప్‌లోడ్ చేసిన పర్సనల్ ఫొటోలు, సెల్ఫీలతో డీప్‌ఫేక్స్ సృష్టించే ప్రమాదం ఉంది. తెలియకుండానే ఓకే అనేస్తున్నారు: ఫ్యూచర్ మోడల్ ట్రైనింగ్‌కు సంబంధించి స్టోర్ చేయడానికి, విక్రయించడానికి ఏఐ డెవలపర్‌లు పర్సనల్ ఫొటోలను ఉపయోగిస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన నిబంధనలను చాలామంది యూజర్‌లు తెలియకుండానే అంగీకరిస్తున్నారు!

•••

లైక్‌నెస్ ఎక్స్‌ప్లాయిటేషన్

నిజమైన వ్యక్తి, ముఖ్యంగా మహిళల పోలికలను, ఏఐ జనరేటెడ్ క్యారెక్టర్స్‌లో మెర్జ్ చేస్తున్నారు. వీటిని హానికరమైన పనుల కోసం ఉపయోగించే ప్రమాదం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రైవసీ పాలసీకి సంబంధించి స్పష్టత లేని, అనుమానించే రీతిలో ఉన్న ఏఐ టూల్స్‌ను ఉపయోగించవద్దు.
- ప్రైవసీ పాలసీలను జాగ్రత్తగా చదవాలి. అప్‌లోడ్ చేసిన ఇమేజ్‌లను ఏఐ ప్లాట్‌ఫామ్‌లు ఎలా స్టోర్ చేస్తున్నాయి, ఎలా ఉపయోగిస్తున్నాయనేది లోతుగా అర్థం చేసుకోవాలి.
- దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉండే సెన్సిటివ్, పర్సనల్ ఫొటోలను అప్‌లోడ్ చేయవద్దు.
- ఫొటోలను అప్‌లోడింగ్ చేసే ముందు లొకేషన్ డాటా, వ్యక్తిగత వివరాలు లేకుండా చూసుకోవాలి.
- ఏఐ అకౌంట్స్ ఆథెంటికేషన్ కోసం స్ట్రాంగ్ పాస్ వర్డ్స్ ఉపయోగించాలి.
- ఉచిత ఏఐ పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ అనుమతులు కోరితే వాటిని ఉపయోగించే విషయంలో పునరాలోచన చేయాలి.

•••

వాయిస్ క్లోనింగ్ స్కామ్

ఒక తండ్రికి విదేశాల నుంచి ఫోన్ వచ్చింది. ఆయన కుమారుడు వికాస్ వేరే దేశంలో ఉద్యోగం చేస్తున్నాడు.

'ఒక కేసులో వికాస్‌ను అరెస్ట్ చేశాం. ఒకసారి మాట్లాడండి' అన్నది అవతలి గొంతు.

'నాన్న... నేను చెప్పిన ఎకౌంట్‌కు అర్జంటుగా డబ్బు పంపించు. అలా చేయకపోతే జైల్లో ఉండాల్సి వస్తుంది' భయం ఉట్టిపడే గొంతుకతో అన్నాడు వికాస్. అది తన కుమారుడి వాయిసే కాబట్టి ఆ పెద్దాయన వారు అడిగినన్ని డబ్బులు పంపాడు.

ఆ తరువాత ఎప్పటికో వికాస్ నుంచి ఫోన్ రాగానే ఆత్రంగా ఫోన్ ఎత్తాడు...

'రిలీజ్ చేశారా? క్షేమంగా ఉన్నావా?' అని ఆత్రంగా అడిగాడు.

'రిలీజ్ చేయడం ఏమిటి?' అని షాకై పోయాడు వికాస్. జరిగినదంతా చెప్పాడు తండ్రి. తన వాయిస్ ఎవరో క్లోనింగ్ చేశారు అనే విషయం వికాస్‌కు అర్థమైంది. బ్లాక్‌మెయిల్ చేయడం నుంచి డబ్బులు డిమాండ్ చేయడం వరకు స్కామర్స్ వాయిస్ క్లోనింగ్ చేస్తున్నారు. దీన్ని 'వాయిస్ క్లోనింగ్ స్కామ్' అంటారు.

జాగ్రత్తలు

- అనుమానించడానికి ఏమాత్రం టైమ్ ఇవ్వకుండా 'మీ అమ్మాయి చాలా సీరియస్‌గా ఉంది'లాంటి మాటలు స్కామర్‌లు ఉపయోగిస్తారు. వెంటనే ఎమోషనల్ కాకుండా కాస్త ఆలోచించడం మంచిది.
- అపరిచిత ఫోన్లకు సంబంధించి 'నిజమా? కాదా?' అని నిర్ధారించుకోవడానికి కుటుంబ సభ్యులతో సీక్రెట్ పాస్‌వర్డ్ ఏర్పాటు చేసుకోవాలి. లేదా వారికి మాత్రమే జవాబు తెలిసిన కొన్ని ప్రశ్నలు అడగాలి.
- స్కామర్లు మీ వాయిస్ కాప్చర్ చేయకుండా ఉండడానికి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన వీడియోలను మీ సన్నిహితులు మాత్రమే చూసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిమితులు విధించాలి.

•••

ప్రేమ కోసమై నెట్ (వల)లో పడెనే... పాపం...

మన దేశంలో రొమాన్స్ స్కామ్‌లు అంతకంతకూ పెరుగుతున్నాయి. డేటింగ్ యాప్స్‌లో నకిలీ ప్రొఫైల్‌ను ఉపయోగిస్తున్నారు. డాక్టర్, మిలిటరీ ఆఫీసర్, సాఫ్ట్‌వేర్ కంపెనీ సీయీవో... ఇలా రకరకాల ప్రొఫైల్‌లను సృష్టిస్తున్నారు. ఈ ప్రొఫైల్ నిజమే అనుకొని ప్రేమ ప్రపంచంలోకి వచ్చిన వారిని, ప్రేమబంధం బలపడిన తరువాత 'అర్జంటుగా అవసరం ఉంది డియర్' అని (ఫేక్) ఎమర్జెన్సీల పేరుతో డబ్బు లాగుతున్నారు. ఇదొక రకం అయితే సన్నిహితంగా ఉన్న ఫొటోలతో బ్లాక్ మెయిల్ చేయడం అనేది మరో రకం. డేటింగ్ యాప్‌లలో 39 శాతం మంది యూజర్‌లు వివిధ రూపాల్లో రొమాన్స్ స్కామ్స్ బారిన పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ స్కామ్‌ల బారిన పడిన బాధితులు డబ్బులు పోగొట్టుకోవడం మాత్రమే కాదు డిప్రెషన్ బారిన కూడా పడుతున్నారు. ఆత్మహత్య ప్రయత్నాలు చేస్తున్నారు.

కొన్ని జాగ్రత్తలు... • పేరు నమోదు చేసుకునే ముందు డేటింగ్ యాప్ లేదా మ్యాట్రిమోనియల్ అథెంటిసిటీని ధ్రువీకరించుకోవాలి • నివాస చిరునామా, వ్యక్తిగత వివరాలను బహిర్గత పరచకపోవడం మంచిది • డేటింగ్ యాప్‌లో పరిచయం అయిన వారిని ప్రత్యక్షంగా కలుసుకొని తగిన ప్రశ్నలు అడగాలి • మ్యాట్రిమోనియల్ సైట్‌లలో ఎన్‌ఆర్‌ఐ ప్రొఫైల్స్‌కి సంబంధించి చాలా జాగ్రత్తలు తీసుకోవాలి • బ్యాంకింగ్ సమాచారం, గుర్తింపు లేదా పాస్‌పోర్ట్ కాపీలు, ముఖ్యమైన సమాచారం తెలియని సైట్‌లకు అందించవద్దు.

స్మిషింగ్ స్కామ్

బ్యాంకులు, ప్రభుత్వ సంస్థల పేర్లతో వ్యక్తిగత, ఆర్థిక, లాగిన్ సమాచారాన్ని దొంగిలించడానికి రూపొందించిన మోసపూరిత టెక్స్ మెసేజ్‌ను స్మిషింగ్ స్కామ్ అంటారు. 'మీ ఎకౌంట్‌ను సస్పెండ్ చేస్తున్నాం' అంటూ మెసేజ్ రావచ్చు. 'డియర్ కస్టమర్' పేరుతో వచ్చే మెసేజ్‌లో పెద్దగా వివరాలేమీ లేకపోవడం, అనుమానాస్పద మెసేజ్‌లు, ఊహించని రిక్వెస్ట్‌లు నోటిఫికేషన్‌ల రూపంలో రావడం.. మొదలైనవి స్మిషింగ్ స్కామ్‌లో భాగం.

కొన్ని జాగ్రత్తలు

- తెలియని, అన్‌ఎక్స్‌పెక్టెడ్ మెసేజెస్‌ల నుంచి వచ్చిన లింక్‌లను క్లిక్ చేయకూడదు. అటాచ్‌మెంట్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు
- చట్టబద్ధమైన కంపెనీ లేదా బ్యాంకు నుండి వచ్చినట్లు ఏదైనా మెసేజ్ క్లెయిమ్ చేసుకుంటే, టెక్స్‌లో ఉన్నవి కాకుండా వారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఫోన్ నంబర్ ద్వారా వారిని నేరుగా సంప్రదించాలి.
- అనుమానంగా అనిపించిన మెసేజ్‌లను మీ సెల్యూలార్ ప్రొవైడర్‌కు, ఫెడరల్ కమ్యూనికేషన్ కమిషన్(ఎఫ్‌సీసీ)కు రిపోర్ట్ చేయాలి.
- సెన్సిటివ్ ఎకౌంట్స్‌కు సంబంధించి మల్టీ–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (ఎంఎఫ్‌ఏ)ను ఎనేబుల్ చేయాలి.

... ఇవి మాత్రమే కాదు, మ్యాట్రిమోనియల్ స్కామ్స్, విషింగ్ ఎటాక్స్, గేమింగ్ స్కామ్స్, ఆన్‌లైన్ డేటింగ్ ఫ్రాడ్స్... ఇలా ఎన్నో స్కామ్‌లు ఆన్‌లైన్‌లో పొంచి ఉన్నాయి.

'నాకు అన్నీ తెలుసు. నన్ను ఎవరూ మోసం చేయలేరు' అనే అతి ఆత్మవిశ్వాసంతో ఉంటే బాధితుల్లో మొదటి వరసలో మీరే ఉంటారు! అందుకే ఆన్‌లైన్‌కు సంబంధించి ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఆపదలు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. •

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఫిబ్రవరి 9న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,60,720	1,60,700	1,58,840	1,60,700	1,60,500	1,59,820
బంగారం (22 క్యారెట్లు)	1,49,750	1,45,600	1,45,600	1,49,970	1,47,760	1,46,500
వెండి	2,78,000	2,74,000	3,00,000	2,74,000	2,73,000	3,00,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

ఈ సినిమాతో అందరికీ హై రావాలి

- 'దిల్' రాజు

• సురేశ్ బాబు, అనిల్, ఎస్. కృష్ణ, 'దిల్' రాజు, అనన్య

అనన్య శర్మ, ఎస్. కృష్ణ, పల్లవి దొర, కృష్ణ కమల్, సాయి కృష్ణ, రేవంత్ (బుల్లిరాజు) ప్రధాన తారాగణంగా నటించిన సినిమా 'హై'. అనిల్ రావిపూడి చిత్రాలకు సహ రచయితగా పని చేసిన ఎస్.కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు రచయిత–సహ నిర్మాత, యాక్టర్‌గా చేశారు. హరీష్ పెద్ది, ఎస్. కృష్ణ, శేఖర్ దివ్వెల నిర్మించిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను హీరో వెంకటేశ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ–''డైరెక్టర్, యాక్టర్, రైటర్, ప్రొడ్యూసర్.. నాలుగు పాత్రలతో పరిచయమవుతున్న సాయికి ఆల్ ది బెస్ట్. ఈ సినిమాతో యూనిట్‌కి హై రావాలి'' అన్నారు. ''సాయి ప్రయత్నం మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిర్మాత డి.సురేశ్ బాబు. ''కొత్త జానర్‌లో డిఫరెంట్ స్క్రీన్ ప్లేతో తీసిన సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అని తెలిపారు దర్శకుడు అనిల్ రావిపూడి. ''ఈ సినిమా తీసేందుకు నాకు రెండు సంవత్సరాలు పట్టింది'' అని పేర్కొన్నారు ఎస్.కృష్ణ. ''ప్రేక్షకులకు ఓ సరికొత్త ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే చిత్రం ఇది'' అన్నారు నిర్మాత హరీష్ పెద్ది.

ఆయా షేర్

• నాని

'ది ప్యారడైజ్' సినిమా కోసం అదిరిపోయే డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ చేస్తున్నారు జడల్. ఏ రేంజ్‌లో అనేది సిల్వర్ స్క్రీన్స్‌పై చూడాలి. 'దసరా' వంటి సూపర్‌హిట్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ది ప్యారడైజ్'. మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమాలో జడల్ అనే పాత్రలో నాని నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నానిపై ఇంట్రో సాంగ్ చిత్రీకరిస్తున్నారు. 'ఆయా షేర్..' అంటూ సాగే ఈ పాటకు సుధన్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ ఎనిమిది భాషల్లో ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

డ్రాగన్ యాక్షన్

• ఎన్టీఆర్

జోర్డాన్‌లో ల్యాండ్ అయ్యారు డ్రాగన్. హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్). రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్, టొవినో థామస్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారని సమాచారం. కాగా, ఈ సినిమా కొత్త షెడ్యూల్ జోర్డాన్ లొకేషన్స్‌లో ప్రారంభం అయిందని తెలిసింది. దాదాపు నెలపాటు జరిగే ఈ షూటింగ్‌లో ప్రధానంగా మూడు యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారట ప్రశాంత్ నీల్. ఈ సినిమాలోని ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, మే 20న ఎన్టీఆర్ బర్త్ డేకి 'డ్రాగన్' ఫస్ట్ లుక్, టీజర్ రిలీజ్ కావొచ్చనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

టాలీవుడ్‌లో మళ్లీ అసమ్మతి సెగలు

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కార్మికులకు మధ్య మళ్లీ అసమ్మతి సెగలు రేగుతున్నాయి. తమ సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని, లేకుంటే మార్చి 1 నుంచి ఆందోళన చేస్తామంటూ 'తెలుగు సినీ, టీవీ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్ ప్రొడక్షన్ సెట్ అసిస్టెంట్ యూనియన్', 'తెలుగు సినీ స్టూడియోస్ వర్కర్స్ యూనియన్' స్పష్టం చేశాయి. ఈ మేరకు 'తెలుగు సినీ, టీవీ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్ ప్రొడక్షన్ సెట్ అసిస్టెంట్ యూనియన్' జనరల్ సెక్రటరీ ఎల్.రాజేంద్ర ప్రసాద్, 'తెలుగు సినీ స్టూడియోస్ వర్కర్స్ యూనియన్' జనరల్ సెక్రటరీ ఎం. వీరేశ్.. విడివిడిగా 'తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికార్లకు సోమవారం లేఖలు పంపించారు. వాటి సారాంశం ఇలా... ''మీరు పంపిన లేఖ సారాంశాన్ని మా యూనియన్ సర్వసభ్య సమావేశంలో సభ్యులకు వినిపించాం. మా సభ్యుల నిర్ణయం ప్రకారం ఈ నెల 28 లోపు మా సమస్యలను తేల్చకపోతే మాకు అనుకూలంగా ఉండే సంఘాలతో కలిసి తగిన న్యాయం జరిగే వరకు మార్చి 1 నుంచి నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నాం. దీని వల్ల నిర్మాతలకు జరిగే నష్టానికి కార్మికులది బాధ్యత కాదు. ప్రభుత్వం, ఫిల్మ్ చాంబర్ పెద్దలతో ఫెడరేషన్ వారు చర్చలు జరిపి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. లేని పక్షంలో జరిగే నష్టానికి మా యూనియన్లకు ఎలాంటి సంబంధం లేదని తెలియజేస్తున్నాం'' అని పేర్కొన్నారు.

పుట్టినరోజు ప్రత్యేకం

• సుమంత్

మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశం నేపథ్యంతో రూపొందిన సినిమా 'మహేంద్రగిరి వారాహి'. ఈ సోషియో ఫ్యాంటసీ సూపర్ నేచురల్ చిత్రంలో సుమంత్ హీరోగా నటించారు. మీనాక్షి గోసామి, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, కమల్ కామరాజు, సత్యసాయి శ్రీనివాస్, వంశీ చాగంటి, మంజు భార్గవి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. రాజశ్యామల పతాకంపై సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో మధు కాలిపు నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. సోమవారం (ఫిబ్రవరి 9) సుమంత్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా కొత్త గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాలోని ముఖ్య పాత్రల్లో ప్రముఖ హీరో, హీరోయిన్లు నటించారని, వారి వివరాలను, రిలీజ్ డేట్‌ను త్వరలోనే వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది.

తల్లి ప్రేమే గొప్పది

• కారుణ్య, సుమన్ బాబు

సుమన్ బాబు లీడ్ రోల్‌లో నటించడంతో పాటు దర్శకత్వం వహించిన చిత్రం 'ఎర్ర చీర'. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా, బేబీ సాయి తేజస్విని ముఖ్య పాత్ర పోషించారు. బేబీ డమరి సమర్పణలో ఎన్‌వీవీ సుబ్బారెడ్డి, సీహెచ్. వెంకట సుమన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 6న విడుదల అయింది. ఈ మూవీ థ్యాంక్స్ మీట్‌లో డిస్ట్రిబ్యూటర్, జయలక్ష్మి ఫిల్మ్స్ అధినేత ద్రోణాదుల వెంకట్రావ్ మాట్లాడుతూ–''సుమన్ బాబు ఎంతో కష్టపడి కుటుంబమంతా చూసేలా 'ఎర్రచీర' మూవీ తీశారు. మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని చెప్పారు. దర్శకుడు, నటుడు, నిర్మాత సుమన్ బాబు మాట్లాడుతూ–'' భర్త ప్రేమ కంటే తల్లి ప్రేమే గొప్పదంటూ చూపించిన సందేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మా మూవీ కన్నడ వెర్షన్‌ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం'' అని తెలిపారు. ''ఈ మూవీలో రెండు క్యారెక్టర్స్ చేశాను. అందులో పార్వతి పాత్రను బాగా ఎంజాయ్ చేశాను'' అని కారుణ్య చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కారుణ్య చౌదరి పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది 'ఎర్రచీర' మూవీ యూనిట్.

కథపై నమ్మకంతో...



• గోపిక, హేమంత్, అయానా

హేమంత్ కుమార్, అయానా, గోపికా సురేష్, అచ్యుత్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'ఆల్ఫా'. విజయ్. ఎన్ దర్శకత్వంలో హేమంత్ కుమార్, ఆనంద్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న రిలీజ్ కానుంది. రవిశంకర్, మంజునాథ్ ఈ సినిమాని తెలుగులో పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు సముద్ర మాట్లాడుతూ–''ఆల్ఫా' ట్రైలర్ బాగుంది. యశ్, రిషబ్‌శెట్టిలా హేమంత్ కూడా పెద్ద విజయాన్ని అందుకోవాలి'' అన్నారు. ''కథపై నమ్మకంతోనే ఈ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేస్తున్నాం'' అని తెలిపారు హేమంత్ కుమార్. ''ఈ చిత్రంలో నేను పోషించిన పోలీస్ ఆఫీసర్ పాత్ర సవాల్‌గా అనిపించింది'' అన్నారు అయానా. ''ఇందులో నేను చేసిన ఆకాంక్ష రోల్ మహిళలకు నచ్చుతుంది'' అని తెలిపారు గోపికా సురేష్. డిస్ట్రిబ్యూటర్ రవిశంకర్, రాయల్ రిడ్జ్ స్పాన్సర్ శ్రీనివాస్ మాట్లాడారు.

విప్లవ వీరుడు ఆరంభం

• ఇంద్రజ, పరుచూరి గోపాలకృష్ణ

ఇంద్రజ ప్రధాన పాత్రలో, జైశ్వర్, సోనాలి జంటగా 'విప్లవ వీరుడు' మూవీ ఆరంభం అయింది. ఎస్. నాగరాజ్ రావు దర్శకత్వంలో ఏవీ జయరాం నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ సోమవారం ప్రారంభం అయింది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ క్లాప్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇంద్రజ మాట్లాడుతూ–''బ్రిటీష్ వారిని మనం ఎలా ఎదుర్కొన్నాం? సామాన్య ప్రజలు స్వాతంత్ర్యపోరాటంలో ఎలా పాల్గొన్నారు? అనే అంశాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. నేను రాణి భవానిదేవి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు. ''సినిమా చరిత్రలో 'విప్లవ వీరుడు' నిలిచిపోతుంది'' అన్నారు జైశ్వర్. ''ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్'' అని తెలిపారు ఎస్.నాగరాజు. ''టిప్పు సుల్తాన్ కాలం నాటి కథ ఇది'' అని పేర్కొన్నారు ఏవీ జయరాం. హీరోయిన్ సోనాలి, నటుడు పటేల్ అశోక్ రెడ్డి మాట్లాడారు. ఈ సినిమాకు సంగీతం: ఉదయ్.

గాయపడ్డ సింహం నవ్విస్తుంది

- తరుణ్ భాస్కర్

• తరుణ్ భాస్కర్, ఫరియా అబ్దుల్లా

''గాయపడ్డ సింహం' సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. చాలామందికి అమెరికా వెళ్లాలనే లక్ష్యం ఉంటుంది. కానీ, వీసాలు చాలాసార్లు రిజెక్ట్ అవుతుంటాయి. ఇలాంటి నేపథ్యంతో కశ్యప్ చెప్పిన 'గాయపడ్డ సింహం' కథ విన్నప్పుడు విపరీతంగా ఎంజాయ్ చేశాను. ప్రేక్షకులను కూడా మా మూవీ నవ్విస్తుంది'' అని తరుణ్ భాస్కర్ తెలిపారు. ఆయన హీరోగా, ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'గాయపడ్డ సింహం'. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కల్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ–''గాయపడ్డ సింహం' కథ విన్న వెంటనే తరుణ్ భాస్కర్ ఓకే చెప్పారు'' అన్నారు. ''ఈ మూవీని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అన్నారు ఫరియా అబ్దుల్లా. ''మా సినిమాని అన్నివర్గాల ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను'' అని విజయ్ కృష్ణ అన్నారు. ''వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న సినిమా ఇది'' అని భాను కిరణ్ పేర్కొన్నారు.

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 320

మంగళవారం 10-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

దక్షిణాఫ్రికా శుభారంభం

57 పరుగులతో కెనడాపై విజయం.. మార్క్‌రమ్ అర్ధసెంచరీ - 10లో

ఏప్రిల్ 1 విడుదల

పాన్ రూల్స్ రీ లోడెడ్.. బైక్ నుంచి బంగ్లా వరకు ఒకటే రూల్ - 13లో



సాంకేతికతకు సాగిలపడొద్దు

సాంకేతికతకు బానిసలుగా మారే పరిస్థితి తెచ్చుకోవద్దని విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ అప్రమత్తం చేశారు.

వివరాలు 6లో ▸



మావల్ల మోదీకి ముప్పా?

సభా కార్యకలాపాల నిర్వహణలో నిష్పాక్షికంగా వ్యవహరించాలని స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ మహిళా ఎంపీలు లేఖ రాశారు.

వివరాలు 6లో ▸



స్పీకర్‌పై అవిశ్వాసం!

స్పీకర్ ఓం బిర్లా అధికార పక్షం కొమ్ము కాస్తున్నారంటూ ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో ప్రతిపక్షాలున్నాయి.

వివరాలు 6లో ▸



క్లాస్‌లోనే కాల్పులు

పంజాబ్‌లో లా కాలేజీ తరగతి గదిలో యువతిపై ఓ విద్యార్థి కాల్పులు జరపగా.. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'స్థానిక' ఎన్నికలపై నేడు ఎస్ఈసీ సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నీలం సాహ్ని మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో విజయవాడలోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు.

వివరాలు 2లో ▸

వైద్య చికిత్సల ధరలపై హైకోర్టు విచారణ

ఎన్టీఆర్ వైద్య సేవల కింద అందించే చికిత్సల ధరల ఖరారు సమయంలో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ఇచ్చిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

వివరాలు 5లో ▸

బాబు సర్కారుపై 'శివ'మెత్తిన స్వాములు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో తగిన ఏర్పాట్లు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైంది. ముందస్తు ఏర్పాట్లు చేయడంలో అలక్ష్యం ప్రదర్శించడంతో భక్తులను నియంత్రించలేక అధికారులు చేతులెత్తేసి వారికి ప్రత్యక్ష నరకాన్ని చూపించారు.

వివరాలు 5లో ▸

ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానల్ మంజూరుకు ఆదేశాలివ్వండి

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌తో పాటు ప్రమోషన్ చానల్ మంజూరు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం హైకోర్టులో పిటిషన్ వేసింది.

వివరాలు 2లో ▸

మరింత ఎత్తుకు 'ఆల్మట్టి'.. నాడూ నేడూ బాబు మౌనమే

ఏపీ ఆయకట్టు ఎడారే!

రూ.87,818 కోట్లతో భూసేకరణ, పునరావాస కల్పనకు కర్ణాటక గ్రీన్ సిగ్నల్

డ్యామ్ ఎత్తు 519.6 నుంచి 524.256 మీటర్లకు పెంపు పనులు వేగవంతం



- 129.72 నుంచి ఏకంగా 279.72 టీఎంసీలకు పెరగనున్న నిల్వ సామర్థ్యం
- యూకేపీ–3 కింద అదనంగా 173 టీఎంసీలు వాడుకుని 5.90 లక్షల హెక్టార్లకు నీళ్లు.. ఇప్పటికే 1.13 లక్షల హెక్టార్లలో జలాలను పారించిన కర్ణాటక
- సుప్రీంలో సవాల్ చేస్తూ ఎస్సెల్పీలు దాఖలు చేసిన మహారాష్ట్ర, తెలంగాణ
- ఏపీ హక్కులను హరిస్తున్నా పట్టించుకోని చంద్రబాబు సర్కార్
- కృష్ణాలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీల నికర జలాల్లో ఎగువ నుంచి రావాల్సిన ప్రవాహం 442 టీఎంసీలు
- ఆల్మట్టి ఎత్తు పెంచితే ఆ ప్రవాహం రాదంటున్న సాగునీటిరంగ నిపుణులు
- కృష్ణా జలాలపై ఆధారపడ్డ ఆయకట్టు ఎడారేనంటూ మన రైతుల ఆందోళన
- ఆల్మట్టి ఎత్తు పెంపుపై 2014 అక్టోబర్‌లో డీపీఆర్‌కు కర్ణాటక టెండర్ నోటిఫికేషన్
- నాడు అభ్యంతరం చెప్పకుండా డీపీఆర్ తయారీకి పచ్చజెండా ఊపిన చంద్రబాబు
- ఆ డీపీఆర్ ఆధారంగానే ఇప్పుడు ఆల్మట్టి ఎత్తు పెంపు పనులు చేపట్టిన కర్ణాటక
- 1996 వరకూ ఆల్మట్టి ఓ ఆనకట్టే.. నిల్వ సామర్థ్యం 17.82 టీఎంసీలే
- దేవెగౌడను ప్రధానిగా చేశానంటూ ఇప్పటికీ జబ్బలు చరుచుకుంటున్న చంద్రబాబు
- నాడు ప్రధాని హోదాలో ప్రపంచ బ్యాంకుతో రుణం మంజూరు చేయించి ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు 519.6 మీటర్లకు పెంపు పనులు చేపట్టిన దేవెగౌడ
- అడ్డుకోకుండా నాడు బాబు మౌనం.. నేటికీ వెంటాడుతున్న ఆ పాపాలు

2 లో

ఆప్కాస్ ఉద్యోగాలకు

మంగళం!?

ఇటీవల సమగ్ర శిక్ష విడుదల చేసిన పోస్టుల్లో 50% ప్రైవేటుపరం?

ఈ పోస్టులకు ఇప్పటికే జిల్లాల్లో వేలాది మంది దరఖాస్తు

సంక్షేమ శాఖలో కూడా ఇదే విధానం అమలుకు రంగం సిద్ధం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలన్నీ అనుయాయులకు కట్టబెట్టేందుకు స్కెచ్

10 శాఖల్లో ఉద్యోగులకు 10.5 నెలలకే వేతనాలు చెల్లించాలని ఆదేశం

ప్రభుత్వ తాజా జీవో నం.12తో మళ్లీ శ్రమ దోపిడీ

ఇప్పటికే ఐదు నెలలుగా వొకేషన్ ఇన్‌స్ట్రక్టర్లకు వేతనాలివ్వని కాంట్రాక్టు సంస్థ

గత ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రక్షణకు 'ఆప్కాస్' ఏర్పాటు

లక్ష మందికి పైగా చిరుద్యోగులకు ఏజెన్సీల దోపిడీ నుంచి ప్రభుత్వపరంగా రక్షణ

జీవో 12తో బాబు గత పాలనను గుర్తుతెచ్చుకుని కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన

- వివరాలు 14లో

ద్రవ్య లోటు రూ.85,269 కోట్లు

దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికం

- రాష్ట్ర సొంత ఆదాయం జీఎస్‌డీపీలో 7.6 శాతమే
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్ కంటే ఏపీ సొంత ఆదాయం తక్కువ
- నకిలీ మద్యం, ఇసుక, మైనింగ్ ఇలా అన్నింటా టీడీపీ నేతల దోపిడీ.. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి
- జీఎస్‌డీపీలో 35 శాతానికి ఎగబాకిన ఏపీ అప్పులు
- గత ఏడాది కన్నా ఏడు శాతం తగ్గిన ఎక్సైజ్ రాబడి
- సీఎం సదస్సులో ఆర్థిక శాఖ ప్రజెంటేషన్

2 లో

ఐఏఎస్‌లం.. అన్నీ తెలుసనుకోవద్దు



- నేర్చుకోవడానికి, తెలుసుకోవడానికి యత్నించాలి
- వృద్ధి, తలసరి ఆదాయం లక్ష్యాలు సాధన బాధ్యత కలెక్టర్లు, మంత్రులదే
- సంతానోత్పత్తి పెంచేందుకు ప్రోత్సాహకాలు
- మంత్రులు, కలెక్టర్లతో సీఎం చంద్రబాబు

2 లో

బాబు పాలనలో హాలా'హలం'

రోజుకు 8 మంది రైతు, రైతు కూలీల బలవన్మరణం

- 2025లో 2,865 మంది ఆత్మహత్య
- అన్నివర్గాలూ కలిపి 8,433 మంది బలవన్మరణం
- 2024 కంటే 4.8శాతం పెరిగిన ఆత్మహత్యలు
- భవితపై భరోసా లేకనే..
- చంద్రబాబు ప్రభుత్వంలో దుస్థితి ఇదీ
- పోలీసు శాఖ నివేదిక వెల్లడి

2 లో

గుంటూరులో ప్లకార్డులతో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా తదితరులు

'వక్ఫ్' రణభేరి

ఆస్తుల పరిరక్షణకు నడుం కట్టిన వైఎస్సార్‌సీపీ

మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద నిరసనలు

కాజేతకు కూటమి సర్కారు పన్నుతున్న కుట్రలపై కన్నెర్ర

10 లో

ఓఆర్ఆర్ భూసేకరణలో మా భూములకు మినహాయింపు ఇవ్వండి

కంకిపాడు మండల రైతుల వినతి

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుకు ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణలో మా భూములకు మినహాయింపు ఇచ్చి రక్షణ కల్పించండి' అంటూ కృష్ణా జిల్లా కంకిపాడు మండలానికి చెందిన రైతులు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు సోమవారం 'మీ కోసం'లో వినతిపత్రం అందజేశారు.

2 లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర	ఫారం దగ్గర లైవ్ బర్డ్	120 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	213 కిలో
₹75	రిటైల్ లైవ్ బర్డ్	147 కిలో	స్కిన్ లెస్	243 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి

'ఏ ఏ రంగాల్లో ప్రజల మీద ఎంతెంత సెస్సులు, పన్నులు వేయాలో, ప్రజలు వాటిని ప్రశ్నించే అధికారం లేకుండా చట్టాలు ఎలా చేయాలో వీళ్లు అధ్యయనం చేస్తార్సార్!

రాష్ట్రంలో పల్లెలు కన్నీరు పెడుతున్నాయి

- రోడ్లు లేని గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు చూసి దుఃఖం ఆపుకోలేకపోయా
- గ్రామీణ నిరుద్యోగులు ఉపాధిలేక అల్లాడిపోతున్నారు
- వారి పరిస్థితి కంటతడి పెట్టించింది.. మూడ్రోజుల పాటు 35 గ్రామాలు తిరిగి 480 కుటుంబాలతో మమేకమయ్యా
- టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

2 లో

సర్‌కు ఆటంకం కలిగిస్తే ఊరుకోం

బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం హెచ్చరిక.. జాబితా పూర్తికి మరో వారం గడువు

పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ విషయంలో ఎన్నికల కమిషన్(ఈసీ), రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. సర్ ప్రక్రియకు అవరోధాలు కలిగించవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అదే సమయంలో, ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈసీ గడువును మరో వారంపాటు పొడిగించింది.

6 లో

సీబీఓ పోస్ట్‌లకు సై అంటారా!

ఇటీవల కాలంలో నిరంతరం ఉద్యోగ నోటిఫికేషన్లతో పలకరిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. తాజాగా మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా 16 సర్కిల్స్‌లో.. రెండు వేలకుపైగా సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. దీంతో బ్యాంకు ఉద్యోగార్థులకు మరో చక్కటి అవకాశం అందుబాటులోకి వచ్చింది.

- వివరాలు భవితలో..

ఆగని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వహణకు టెండర్లు.. కార్మికుల్లో తీవ్ర ఆందోళన

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ వైపు నెట్టేస్తున్న చర్యలు ఆగడంలేదు. ఇప్పటికే సింటర్ ప్లాంట్, ఎస్ఎంఎస్–1 వంటి కీలక విభాగాలను ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిన యాజమాన్యం.. తాజాగా థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ–1) నిర్వహణను కూడా ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు అడుగులు వేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

10లో

ఒకే ఘటనపై ఎన్ని కేసులు పెడతారు

అంబటి మీద కేసుల నమోదుపై పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

మిగిలిన ఫిర్యాదులను ఎందుకు వాంగ్మూలాలుగా పరిగణించడం లేదో చెప్పండి

రాంబాబుపై కేసుల విషయంలో సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని ఆదేశం

తదుపరి విచారణ మార్చి 1కి వాయిదా

14 లో

క్లుప్తంగా...

'స్థానిక' ఎన్నికలపై నేడు ఎస్ఈసీ సమావేశం

19 రాజకీయ పార్టీలకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నీలం సాహ్ని మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. విజయవాడలోని ఎస్ఈసీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి 19 రాజకీయ పార్టీలను ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి ఫలితాల ప్రకటన వరకు అన్ని వివరాలు (నామినేషన్ల దాఖలు మాత్రం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఉంటుంది) పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్‌తోపాటు మొబైల్ అప్లికేషన్‌ను ఎస్ఈసీ రూపొందించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వీటి వినియోగం గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్‌తో పూర్తి ఆన్‌లైన్ విధానంలో రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలను ఎస్ఈసీ నీలం సాహ్ని స్వీకరిస్తారని వెల్లడించారు.

ఓఆర్ఆర్ భూ సేకరణలో మా భూములకు మినహాయింపు ఇవ్వండి

కంకిపాడు మండల రైతులు

అవుటర్ రింగ్ రోడ్డు భూ సేకరణ బాధిత రైతులు

చిలకలపూడి (మచిలీపట్నం): 'అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుకు ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణలో మా భూములకు మినహాయింపు ఇచ్చి రక్షణ కల్పించండి' అంటూ కృష్ణా జిల్లా కంకిపాడు మండలానికి చెందిన రైతులు జేసీ ఎం.నవీన్‌కు సోమవారం 'మీ కోసం'లో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అవసరానికి మించి కూటమి ప్రభుత్వం అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రైతుల నుంచి పెద్ద ఎత్తున భూ సేకరణ చేపడుతోందన్నారు. ఈ కారణంగా వందలాది మంది రైతులు భూములను కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కంకిపాడు మండలంలోని చలివేంద్రపాలెం, దావులూరు, నెప్పల్లి, కోలవెన్ను మీదుగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని... దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఓఆర్ఆర్ నిర్మాణానికి అవసరమైన భూములను సేకరిస్తే అభ్యంతరం లేదని వాస్తవానికి విరుద్ధంగా చేపడుతున్న భూసేకరణతో పలు పరిశ్రమలు, రైతులకు చెందిన భూములు కోల్పోవడంతో నష్టం జరుగుతోందన్నారు.

యూరప్ పర్యటనకు ఏపీ మహిళా రైతులు

సాక్షి, అమరావతి: ఆదర్శ మహిళా రైతు శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందిన ఇరువురు యూరప్ పర్యటనకు ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి 30 రోజులపాటు యూరప్‌లోని ఏడు దేశాల్లో వీరు పర్యటించనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా దురుబిలి గ్రామానికి చెందిన ఆరిక నరసమ్మ, అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, సంతపాలెం గ్రామానికి చెందిన లాలం జ్యోతి జర్మనీ, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, పోలాండ్, బెల్జియం తదితర దేశాల్లోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడంతోపాటు వివిధ పరిశోధన సంస్థలను సందర్శిస్తారు. వీరితోపాటు రైతు సాధికార సంస్థ అధికారి యర్రకొండ సుధాకర్, అంతర్జాతీయ సహకార విభాగం ఉద్యోగి స్వాతి సభ్యులుగా వెళ్తున్నారు. బెర్లిన్‌కు చెందిన ఫౌండేషన్ ఆన్ ఫ్యూచర్ ఫార్మింగ్ అనే సంస్థ ఈ పర్యటన నిర్వహిస్తోంది.

ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానల్ మంజూరుకు ఆదేశాలివ్వండి

హైకోర్టులో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం పిటిషన్

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌తో పాటు ప్రమోషన్ చానల్ మంజూరు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. తమ వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన కోర్టును కోరారు.

బాబు పాలనలో హాలా'హలం'

రోజుకు 8 మంది రైతు, రైతు కూలీల బలవన్మరణం

2025లో 2,865 మంది ఆత్మహత్య

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రైతులకు హాలాహలమే దిక్కవుతోంది. రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల మరణమృదంగం మోగుతోంది. రోజుకు సగటున 8 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. అంటే ప్రతి మూడు గంటలకు ఓ రైతు/రైతు కూలీ బతుకు భారమై బలవన్మరణానికి పాల్పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ వ్యవసాయ వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 2025లో రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల దయనీయ స్థితి ఇదీ... రాష్ట్ర పోలీసు శాఖ అధికారికంగా వెల్లడించిన చేదు నిజం ఇదీ. 2025లో రాష్ట్రంలో 393 మంది రైతులు, 2,472 మంది రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు.

గృహిణులూ బలి

బలవన్మరణం పాలైన వారిలో గృహిణులు రెండో స్థానంలో ఉన్నారు. 1,884 మంది గృహిణులు ఆత్మహత్య చేసుకున్నారు. అంటే రాష్ట్రంలో గృహహింస వేధింపులు పెరుగుతున్నాయన్నది స్పష్టమవుతోంది. మహిళా భద్రతపట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే అందుకు కారణమన్నది స్పష్టమవుతోంది.

2025లో రాష్ట్రంలో ఆత్మహత్యలు ఇలా..	
రైతులు, రైతు కూలీలు	2,865
గృహిణులు	1,884
ప్రైవేటు ఉద్యోగులు	1,841
విద్యార్థులు	978
నిరుద్యోగులు	466
ప్రభుత్వ ఉద్యోగులు	215
ఇతరులు	184

రైతులు, రైతు కూలీలు, గృహిణులతోపాటు ఇతర వర్గాల ప్రజల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయని పోలీసు శాఖ నివేదిక వెల్లడించింది. 2024లో కంటే 2025లో రాష్ట్రంలో ఆత్మహత్యలు 4.8 శాతం పెరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సమర్పించిన నివేదికలోని ప్రధాన అంశాలు ఇవీ...

- రాష్ట్రంలో 2024లో 8,045 మంది ఆత్మహత్య చేసుకున్నారు. కాగా 2025లో ఆత్మహత్య చేసుకున్నవారి సంఖ్య 8,433కు పెరిగింది.



భవితపై భరోసా లేకనే...

రాష్ట్రంలో భవిష్యత్‌పై భరోసా లేకనే అత్యధికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పోలీసు శాఖ నివేదిక వెల్లడించింది. 2025లో ఆత్మహత్యలు చేసుకున్న వారిలో పురుషులు 6,360మంది, మహిళలు 2,073 మంది ఉన్నారు. బలవన్మరణం పాలైన వారిలో 30 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసులో ఉన్నవారు అత్యధికంగా 4,594 మంది ఉన్నారు. భవిష్యత్‌పై భరోసా లేకనే వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

- మరింత ఎత్తుకు 'ఆల్మట్టి'.. నాడూ నేడూ బాబు మౌనమే..

ఏపీ ఆయకట్టు ఎడారే!

రూ.87,818 కోట్లతో భూ సేకరణ, పునరావాస కల్పనకు కర్ణాటక గ్రీన్ సిగ్నల్

డ్యామ్ ఎత్తు 519.6 నుంచి 524.256 మీటర్లకు పెంపు పనులు వేగవంతం

సాక్షి, అమరావతి: ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.6 నుంచి ఏకంగా 524.256 మీటర్లకు పెంచడంపై కర్ణాటక సర్కార్ దూకుడుగా వ్యవహరిస్తోంది. డ్యామ్ ఎత్తు పెంపు పనులపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి 2014 అక్టోబర్ 25నే టెండర్ పిలవగా నాడు అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ అభ్యంతరం చెప్పలేదు. అప్పట్లో రూపొందించిన డీపీఆర్ ప్రకారం.. తాజాగా ఆల్మట్టి డ్యామ్ ఎత్తును కర్ణాటక సర్కార్ పెంచుతుండగా, ఇప్పుడైనా చంద్రబాబు ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీల నుంచి ఏకంగా 279.72 టీఎంసీలకు పెరుగుతుంది. ప్రస్తుతం ఎగువ నుంచి శ్రీశైలానికి వరద ప్రవాహం జూలై ఆఖరుకు వస్తోంది. అదే ఆల్మట్టి ఎత్తు పెంచితే ఆగస్టు రెండో వారానికిగానీ.. శ్రీశైలానికి ఎగువ నుంచి వరద ప్రవాహం చేరదని.. దాంతో నీటి లభ్యత భారీగా తగ్గి రాష్ట్రంలో కృష్ణా జలాలపై ఆధారపడ్డ ప్రాజెక్టుల ఆయకట్టు ఎడారిగా మారుతుందని సాగునీటిరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుతో బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల సాంగ్లీ, కొల్హాపూర్ జిల్లాలు ముంపునకు గురవుతాయని మహారాష్ట్ర సర్కార్.. తమ ప్రాజెక్టుల ఆయకట్టుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. కానీ.. చంద్రబాబు సర్కార్ మాత్రం కనీసం నోరు మెదపకపోవడంపై సాగునీటిరంగ నిపుణులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వడివడిగా భూ సేకరణ, పునరావాసం

ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచితే 20 గ్రామాలతోపాటు భాగల్‌కోట్ మున్సిపాల్టీలో 11 వార్డుల ప్రజలకు పునరావాసం కల్పించాలి. ముంపునకు గురయ్యే భూమితోపాటు.. నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి మొత్తం 1,33,967 ఎకరాలను సేకరించేందుకు కర్ణాటక సర్కార్ సిద్ధమైంది. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పనకు రూ.87,818 కోట్లను మంజూరు చేసింది. మాగాణి భూమికి ఎకరానికి రూ.40 లక్షలు.. మెట్ట భూమికి ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని పేర్కొంటూ భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇక భాగల్‌కోట్ మున్సిపాల్టీలో 11 వార్డుల ప్రజలకు పునరావాసం కల్పన పనులను వేగవంతం చేస్తూనే 20 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఓవైపు డ్యామ్ ఎత్తు పెంచే పనులను వేగంగా చేపడుతూ మరోవైపు అప్పర్ కృష్ణా ప్రాజెక్టు మూడో దశ(యూకేపీ-3) కింద 5.94 లక్షల హెక్టార్లకుగానూ.. ఇప్పటికే 1,13,500 హెక్టార్లను అభివృద్ధి చేసి గతేడాది ఆ ఆయకట్టుకు సాగునీటిని కూడా అందించింది. సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి కర్ణాటక సర్కార్ దూకుడుగా వ్యవహరిస్తూ.. ఏపీ హక్కులను హరిస్తున్నా సరే చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

కేడబ్ల్యూడీటీ - 2 తుది నివేదిక అమలుకు ఒత్తిడి..

కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లకు పంపిణీ చేస్తూ కేడబ్ల్యూడీటీ-2 (కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్) కేంద్రానికి 2010 డిసెంబర్ 30న ఇచ్చిన తొలి నివేదిక.. 2013 నవంబర్ 29న ఇచ్చిన తుది నివేదికను సవాల్ చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఎస్సెల్పీ(స్పెషల్ లీవ్ పిటిషన్) దాఖలు చేసింది. దాంతో ఇప్పటిదాకా కేడబ్ల్యూడీటీ-2 తుది నివేదికను అమలు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదు. అయితే తక్షణమే కేడబ్ల్యూడీటీ-2 తుది నివేదికను అమలు చేయాలని కేంద్రంపై ఓవైపు ఒత్తిడి చేస్తూనే.. మరోవైపు ఆ తుది నివేదికలో కేటాయించిన నీటిని వినియోగించుకోవడానికి కర్ణాటక సర్కార్ చర్యలు చేపట్టింది. కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా కేడబ్ల్యూడీటీ-1 కేటాయించిన 2,130 టీఎంసీలను కొనసాగిస్తూనే.. 65 శాతం, సరాసరి ప్రవాహాల ఆధారంగా 448 టీఎంసీలను కేడబ్ల్యూడీటీ-2 అదనంగా మూడు రాష్ట్రాలకు పంపిణీ చేసింది. ఇందులో కర్ణాటకకు 173 టీఎంసీలను కేటాయించింది. అందులో యూకేపీ-3 కింద 130 టీఎంసీలను వినియోగించుకోవడానికి అనుమతి ఇచ్చిన కేడబ్ల్యూడీటీ-2.. ఆ మేరకు ఆల్మట్టి ఎత్తును 524.256 మీటర్లకు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చింది.

సాగునీటి మాట దేవుడెరుగు.. తాగునీటికీ ఇబ్బందులే

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణాలో 75 శాతం లభ్యత ఆధారంగా 811 టీఎంసీలను కేడబ్ల్యూడీటీ-1 కేటాయించింది. ఇందులో 369 టీఎంసీల లభ్యత ఉమ్మడి రాష్ట్రంలోని కృష్ణా బేసిన్‌లో ఉంటుందని.. ఎగువ నుంచి 442 టీఎంసీల ప్రవాహం వస్తుందని పేర్కొంది. ఇక కృష్ణా నదిలో 65 శాతం, సరాసరి లభ్యత కింద కేడబ్ల్యూడీటీ-2 కర్ణాటకకు 173 టీఎంసీలు, మహారాష్ట్రకు 81 టీఎంసీలను కేటాయించింది. కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులు, కేడబ్ల్యూడీటీ-2 కేటాయింపులు కలిపితే మహారాష్ట్ర వాటా 585 నుంచి 666, కర్ణాటక వాటా 734 నుంచి 907 టీఎంసీలకు పెరుగుతుంది. అంటే.. మహారాష్ట్ర, కర్ణాటక 1,573 టీఎంసీలను వాడుకున్న తర్వాతే దిగువకు నీటిని విడుదల చేస్తాయి. ఆల్మట్టి ఎత్తు పెంపుతో ఆ మేరకు నీటిని అదనంగా కర్ణాటక నిల్వ చేసుకుని, వినియోగించుకోనుంది. దాంతో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద ప్రవాహం రావడంలో తీవ్ర జాప్యం చోటు చేసుకోనుంది. ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేడబ్ల్యూడీటీ-2 కేటాయించిన అదనపు జలాలు 194 టీఎంసీల మాట దేవుడెరుగు.. కేడబ్ల్యూడీటీ-1 కేటాయించిన నికర జలాలు 811 టీఎంసీల లభ్యత కూడా ఉండదని సాగునీటిరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎగువ నుంచి రావాల్సిన 442 టీఎంసీల ప్రవాహంలో భారీ ఎత్తున కోత పడుతుందని.. ఇది రాష్ట్రంలో కృష్ణా జలాలపై ఆధారపడ్డ ప్రాజెక్టుల ఆయకట్టును ఎడారిగా మార్చుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు కాదు కదా.. కనీసం గుక్కెడు తాగునీటికీ ఇబ్బందులు తప్పవని సాగునీటి నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నాడు ఆనకట్టను రిజర్వాయర్‌గా.. నేడు రిజర్వాయర్‌ను మెగా రిజర్వాయర్‌గా!

ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు 1995 వరకూ 506.87 మీటర్లు.. నీటి నిల్వ సామర్థ్యం 17.82 టీఎంసీలు మాత్రమే. ఆ ఆనకట్ట ద్వారా యూకేపీ తొలి దశ కింద 4.25 లక్షల హెక్టార్లకు కర్ణాటక సర్కార్ 1996 వరకూ నీళ్లందించింది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. 1996లో యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసి.. నాటి కర్ణాటక సీఎం దేవెగౌడను ప్రధానిగా చేశానని గొప్పగా చెబుతుంటారు. ఆ సమయంలో ప్రధాని హోదాలో ఉన్న దేవెగౌడ ప్రపంచ బ్యాంకు నుంచి రుణాన్ని మంజూరు చేయించి.. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును 506.87 మీటర్ల నుంచి 519.6 మీటర్లకు పెంచుతూ, నీటి నిల్వ సామర్థ్యాన్ని 17.82 నుంచి 129.72 మీటర్లకు పెంచే పనులను చేపట్టారు. కృష్ణా జలాలపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హక్కులను కర్ణాటక సర్కార్ కాలరాస్తూ ఆల్మట్టి ఆనకట్టను రిజర్వాయర్‌గా మార్చేసినా చంద్రబాబు అప్పుడు నోరుమెదపలేదు. దాంతో యూకేపీ-2 కింద అదనంగా 54 టీఎంసీలను వినియోగించుకుంటూ 1.97 లక్షల హెక్టార్లకు 2002 నాటికే కర్ణాటక నీళ్లందించింది. దీని వల్ల ఎగువ నుంచి జూన్ నాటికి శ్రీశైలానికి చేరాల్సిన కృష్ణా వరద.. ఇప్పుడు జూలై ఆఖరుకుగానీ చేరడం లేదు. ఇక ఇప్పుడు ఆల్మట్టి రిజర్వాయర్‌ను మెగా రిజర్వాయర్‌గా మార్చేస్తూ.. ఏపీ హక్కులను కాలరాస్తున్నా సరే చంద్రబాబు ప్రభుత్వం మౌనవ్రతాన్ని వీడకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో పల్లెలు కన్నీరు పెడుతున్నాయి

- వాట్సాప్ స్టేటస్‌తో టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి ఆవేదన

వాట్సాప్ స్టేటస్‌లో ఎమ్మెల్యే వ్యాఖ్యలు

తిరువూరు: రాష్ట్రంలో పల్లెలు కన్నీరు పెడుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తన వాట్సాప్‌లో స్టేటస్ పెట్టారు. తాను మూడ్రోజులపాటు 35 గ్రామాలు తిరిగి 480 కుటుంబాలతో మమేకమయ్యానని, రహదారుల్లేని గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు చూసి దుఃఖం ఆపుకోలేకపోయానంటూ ఆ స్టేటస్‌లో పేర్కొన్నారు. గ్రామీణ నిరుద్యోగులు ఉపాధి లేక అల్లాడిపోతున్నారని, వారి పరిస్థితి సైతం కంటతడి పెట్టించిందని కొలికపూడి పేర్కొన్నారు. ఇప్పుడు కొలికపూడి వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి.

మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ యూనిట్

ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్‌లకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఓడరేవు పనులను పట్టాలెక్కించడంతో మచిలీపట్నం ఇప్పుడు పోర్టు ఆధారిత పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఇప్పటికే గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్, యునైటెడ్ పెట్రో గ్రూపులు మచిలీపట్నం వద్ద నౌకల తయారీ, రిపేర్ల యూనిట్లను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాయి. దీంతో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మచిలీపట్నం వద్ద నౌకల తయారీ, రిపేర్ల యూనిట్ ఏర్పాటుకు ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తోంది. డిజైన్ బిల్ట్ ఫైనాన్స్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) విధానంలో నౌకల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ని పిలవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏపీ మారిటైమ్ బోర్డు తగు చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర పెట్టుబడులు మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐఏఎస్‌లం.. అన్నీ తెలుసనుకోవద్దు

నేర్చుకోవడానికి, తెలుసుకోవడానికి యత్నించాలి

- వృద్ధి, తలసరి ఆదాయం లక్ష్యాల సాధన బాధ్యత కలెక్టర్లు, మంత్రులదే
- కాలం చెల్లిన, అవసరం లేని చట్టాలు రద్దు చేస్తాం
- రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలపై ఆడిట్ చేయాలి
- సలహాలు కాదు.. ఏమి చేస్తే ఫలితాలు వస్తాయో చేసి చూపించండి
- సంతానోత్పత్తి పెంచేందుకు ప్రోత్సాహకాలు
- హాస్టల్ విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత
- ఎర్ర చందనం విక్రయం ద్వారా రూ.కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశాం
- మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఐఏఎస్‌లు అయిపోయాం.. అన్నీ తెలుసనే ధోరణి వీడి నేర్చుకోవడం, తెలుసుకోవడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లు, కార్యదర్శులు, శాఖాధిపతులకు సూచించారు. 2025–26 జీఎస్‌డీపీ వృద్ధి 12.16 శాతం లక్ష్యం అనుకుంటే ఇప్పుడు 9.88 శాతమే వృద్ధి నమోదైందని, అందరూ సరిగా పనిచేస్తే 13 శాతం వృద్ధి రావాలని సీఎం పేర్కొన్నారు. ఎవరు సరిగా పనిచేయడం లేదో తమ వద్ద వివరాలు ఉన్నాయని స్పష్టం చేశారు. అంచనాలను ఇచ్చామని, ఆ మేరకు వృద్ధి వస్తోందా..? లేదా..? అనేది కలెక్టర్లు దృష్టి సారించడంతోపాటు తెలియకపోతే తెలుసుకోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లతో సీఎం సమావేశం నిర్వహించారు. జీఎస్‌డీపీ వృద్ధి, విద్య, వైద్య, ఆదాయ ఆర్జన తదితర రంగాలపై సమీక్షించారు. జీఎస్‌డీపీ వృద్ధి, తలసరి ఆదాయం లక్ష్యాల సాధన బాధ్యత కలెక్టర్లతోపాటు మంత్రులదేనని సీఎం స్పష్టం చేశారు. లక్ష్యాలు సాధించకపోవడానికి నిర్లక్ష్యం లేదా తెలియకపోవడమే కారణమన్నారు. ఈ ఏడాది లక్ష్యాల్లో వెనుకబడితే వచ్చే ఏడాది కవర్ చేయాలని, లేదంటే ఆ శాఖలు డిఫాల్టర్లు అవుతాయని వివరించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కాలం చెల్లిన, అవసరం లేని చట్టాలు రద్దు చేస్తామన్నారు. కేంద్రం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలపై ఆడిట్ చేయాలని చెప్పారు. రాత్రింబవళ్లూ పనిచేయడం కాదని, మనసు పెట్టి పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని సీఎం పేర్కొన్నారు. 'నాకు సలహాలు ఇవ్వద్దు.. ఏమి చేస్తే ఫలితాలు వస్తాయో అది చేసి చూపించండి' అని సీఎం సూచించారు. తనతోపాటు కింది స్థాయి వరకు ఉద్యోగులంతా సమష్టిగా పనిచేస్తేనే ఫలితాలు వస్తాయన్నారు. యూరప్ దేశాల్లో వృద్ధులు పెరిగిపోతున్నారని, రాష్ట్రంలో జనాభా తగ్గిపోతోందని, ఈ నేపథ్యంలో సంతానం పెంచేందుకు ప్రోత్సహకాలతో జనాభా నిర్వహణ విధానాన్ని మార్చిలో అసెంబ్లీలో ప్రకటిస్తామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి విధానం అమల్లోకి వస్తుందన్నారు.

కుప్పంలోనే 14.9 శాతం మందికి బాల్య దశలోనే గర్భధారణ

రాష్ట్రంలో సిజేరియన్ డెలివరీలను తగ్గించి సాధారణ డెలివరీలు పెరిగేలా అవగాహన కల్పించాలని చంద్రబాబు సూచించారు. బాల్య వివాహాలపైనా సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా కుప్పంలోనే 14.9 శాతం మంది బాల్య దశలోనే గర్భం దాల్చుతున్నారని, ఇవి కూడా జనాభాపై ప్రభావం చూపుతున్నాయని ఓ అధికారి వివరించారు. 71 లక్షల మంది పిల్లల ఆరోగ్య డేటాను ఆన్‌లైన్‌లోకి తీసుకురావాల్సిందిగా సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు తరుచూ అనారోగ్య సమస్యలు వస్తే కలెక్టర్లు, మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదని వెల్లడించారు. పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని సీఎం పేర్కొన్నారు. అటవీ శాఖ దగ్గర ఉన్న ఎర్ర చందనం అమ్మకం ద్వారా అధిక ఆదాయం వస్తుందని అంచనా వేశామని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు మురిగిపోతే అధికారులే బాధ్యత వహించాలన్నారు. అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల విషయంలో జిల్లా కలెక్టర్లు తక్షణం కేవైసీ చేపట్టాలన్నారు. 1,04,727 పీడీ ఖాతాల్లో ఉన్న అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.148 కోట్లుగా ఉన్నాయని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి రూ.26,021 కోట్లు వచ్చే అవకాశం ఉందని సీఎం వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు

ద్రవ్య లోటు రూ.85,269 కోట్లు

- దేశంలో ఏపీలోనే అత్యధికం
- సీఎం సదస్సులో ఆర్థిక శాఖ ప్రజెంటేషన్

సాక్షి, అమరావతి: దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో ద్రవ్యలోటు ఉన్నట్లు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక ఏడాది డిసెంబర్ నాటికి ఏపీ అత్యధికంగా రూ.85,269 కోట్లు ద్రవ్యలోటుతో ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయచంద్‌తో కలసి ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టిన టీడీపీ నేతలు.. నకిలీ మద్యంతో దోపిడీ, విచ్చలవిడిగా బెల్టు షాపులు, చివరకు ప్రకృతి వనరులను కూడా వదలకుండా సిలికా, క్వార్ట్జ్, మైనింగ్ దోపిడీతో తమ జేబులు నింపుకోవడమే దీనికి కారణమని రాజకీయ విశ్లేషకులు, ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మూలధన వ్యయం 10 శాతమే..

డిసెంబర్ నాటికి రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.60,481 కోట్లకు చేరిందని పీయూష్ కుమార్ తెలిపారు. మొత్తం వ్యయం రూ.1,97,950 కోట్లు కాగా ఇందులో రెవెన్యూ వ్యయం 90 శాతం, మూలధన వ్యయం కేవలం 10 శాతం మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అప్పులు జీఎస్‌డీపీలో 35 శాతానికి చేరినట్లు చెప్పారు. జీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత ఆదాయం కేవలం 7.6 శాతమే ఉందన్నారు. ఒడిశా (13.3 శాతం), ఛత్తీస్‌గఢ్ (12 శాతం) కంటే తక్కువగా ఉండటంతో కేంద్ర నిధులపై ఏపీ ఎక్కువగా ఆధారపడుతున్నట్లు సూచిస్తోందన్నారు. రాష్ట్ర స్థిర ధరల ఆధారంగా జీఎస్‌డీపీ వృద్ధి 9.88 శాతంగా ఉండగా జీఎస్‌డీపీ రూ.9,52,261 కోట్లుగా నమోదైందని చెప్పారు. 2028–29 నాటికి రూ.29 లక్షల కోట్లు జీఎస్‌డీపీ లక్ష్యం కాగా రూ.27 లక్షల కోట్లు సాధ్యం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు.

ఎక్సైజ్ రాబడి లక్ష్యం రూ.26,870 కోట్లు..

రాష్ట్ర సొంత ఆదాయం లక్ష్యం రూ.1,34,208 కోట్లుగా నిర్ధారించగా జనవరి నాటికి రూ.83,500 కోట్లు వసూలైనట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ తెలిపారు. వాణిజ్య పన్నుల ద్వారా ఈ ఏడాది జనవరి నాటికి రూ.42,861 కోట్లు ఆర్జించగా, గత ఏడాది ఇదే సమయానికి రూ.41,385 కోట్లు వసూలయ్యాయి. ఎక్సైజ్ రాబడి గత ఏడాది కన్నా ఏడు శాతం తగ్గుదల నమోదైంది. గతేడాది జనవరి నాటికి ఎక్సైజ్ రాబడి రూ.16,032 కోట్లుగా ఉండగా ఈ ఏడాది జనవరి నాటికి రూ.14,963 కోట్లు రాబడి మాత్రమే నమోదైంది. ఎక్సైజ్ మొత్తం రాబడి లక్ష్యం రూ.26,870 కోట్లు కాగా ఇప్పటి వరకు 56 శాతమే సాధించినట్లు తెలిపారు. కేంద్ర సహాయ పథకాల నిధులు గతేడాదితో పోల్చితే స్వల్పంగా తగ్గి రూ.6,579 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. పన్ను వసూళ్లలో సమర్థత, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు, విభాగాల మధ్య సమన్వయం ద్వారా ఆదాయ వృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కౌన్సిల్ తీర్మానంతో గోల్‌మాల్!

టేబుల్ అజెండా అంశం: 67

విషయం : జి.వి.యం.సి.– మధురవాడ జోన్.2–పట్టణ ప్రణాళిక విభాగం – విశాఖపట్నం రూరల్ మండలం తహశీల్దార్ వారి నుండి జోన్-2 మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వారికి– పరదేశిపాలెం గ్రామంలోని సర్వే నెం.203/2P లో Ac.0.50 సెం. విస్తీర్ణంలో ఉన్న హౌసింగ్ బోర్డు స్థలమును M/s. ఆమోద పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి కేటాయించుటకు మరియు దీనికి బదులుగా ప్రభుత్వమునకు చెందిన సర్వే నెం.168P లోని Ac.1.15 cts స్థలాన్ని హౌసింగ్ బోర్డు వారికి విపణం (Alienation) చేయడం పై ప్రతిపాదనలు – గౌరవ కౌన్సిల్ వారి తీర్మానము కొరకు - సమర్పించుట - గురించి.

ఆంధ్రజ్యోతికి భూకేటాయింపు విషయాని కౌన్సిల్ సమావేశంలో టేబుల్ అజెండా 67వ అంశంగా చేర్చిన కాపీ

జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో జీరో అవర్ ముగిసిన అనంతరం టేబుల్ ఎజెండా లో 67వ అంశం సభ్యులు చర్చించగా ఆ అంశాన్ని వాయిదా వేయడమైనదని మేయరు తెలిపారు.

పౌర సంబంధాల అధికారి,
జీవీఎంసీ.
9:21 PM

67వ అంశాన్ని వాయిదా వేసినట్టు మేయర్ తెలిపారని జీవీఎంసీ పీఆర్వో ఇచ్చిన మెసేజ్

ఆమోదం లేకపోయినా వారికి మాత్రం 'ఆమోద'మే!
కౌన్సిల్‌లో ఆమోదించకపోయినా ఆమోదించినట్టు రికార్డులు
కౌన్సిల్ సమావేశం జరిగిందే 2025 ఆగస్టు 22న
టేబుల్ అజెండాలోని 67వ అంశాన్ని ఆమోదించని కౌన్సిల్
స్పష్టంగా ప్రకటించిన మేయర్
తర్వాత మాత్రం ఆమోదించినట్టు రికార్డులు
తహసీల్దారుకు లేఖ రాసిన జీవీఎంసీ జోనల్ కమిషనర్
ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లే కారణమంటూ ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఇప్పటికే తమ బంధువు సంస్థ గీతం ఆక్రమిత భూములను క్రమబద్ధీకరించుకునేందుకు గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో ఎన్నడూ లేనివిధంగా గూండారాజ్‌ను అమలు చేసి తీర్మానాన్ని ఆమోదించుకున్న అధికార పార్టీ.. ఇప్పుడు తోకపత్రిక విషయంలో మరో అడుగు ముందుకు వేసి ఏకంగా రికార్డులు మార్చి మరీ భూమిని కట్టబెట్టేందుకు సిద్ధపడినట్టు స్పష్టమవుతోంది. అత్యవసరమైన అంశాలను చేర్చాల్సిన టేబుల్ అజెండాలో చివరి అంశంగా (67వ అంశం) తన తోకపత్రిక ఆంధ్రజ్యోతి పబ్లికేషన్స్.. ఆమోద పబ్లికేషన్స్‌కు భూ కేటాయింపు అంశాన్ని గత ఏడాది ఆగస్టు 22 నాటి సమావేశంలో చంద్రబాబు ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చింది. అయితే ఈ విషయాన్ని కౌన్సిల్ తిరస్కరించింది. కౌన్సిల్ సమావేశం ఈ తీర్మానాన్ని తిరస్కరించిన నేపథ్యంలో రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ సమావేశపు వివరాలను ప్రకటన రూపంలో జీవీఎంసీ విడుదల చేసింది. ఇందులో స్పష్టంగా టేబుల్ అజెండాలో ఉన్న 67వ అంశాన్ని కౌన్సిల్ ఆమోదించలేదని ప్రకటించారు. అయినప్పటికీ.. రికార్డుల్లో మాత్రం కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించినట్టుగా పేర్కొంటూ తహసీల్దారుకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ (జోన్–2) లేఖ రాశారు. ఇందులో స్పష్టంగా 2025 ఆగస్టు 22 నాటి జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆమోదించినట్టుగా పేర్కొన్నారు. ఈ రికార్డుల తారుమారులో ఎవరి పాత్ర ఎంత ఉందనే వ్యవహారం ఇప్పుడు తేలాల్సి ఉంది.

లాంఛనమే అయితే..!

వాస్తవానికి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం లాంఛనమే అంటూ స్థానిక సంస్థల అధికారాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేసింది తోకపత్రిక. నిజంగా జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం కేవలం లాంఛనమే అయితే.. గీతంకు భూ కేటాయింపుపై ఎందుకంతగా రాద్ధాంతం చేసి.. ప్రతిపక్ష కార్పొరేటర్లపై దాడికి దిగి మరీ చర్చలేకుండానే ఆమోదించినట్టుగా ప్రకటించారు. స్థానిక సంస్థలు అంగీకరించకుండా భూమిని కేటాయించడం నేరుగా ముఖ్యమంత్రికి కూడా సాధ్యమయ్యే పనికాదు. ఆ విషయం తోకపత్రికకు కూడా స్పష్టంగా తెలుసు. అందుకే అత్యవసరంగా టేబుల్ అజెండా మీదకు తెచ్చి.. ఆమోదించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే సభ్యుల నుంచి ఒత్తిడి రావడంతో ఆమోదం పొందలేదు. ఆ తర్వాత మరో కౌన్సిల్ సమావేశంలో ఆమోదింపజేసుకునేందుకు తీర్మానం రూపంలో ముందుకు రావాల్సిందే. అంతేతప్ప.. ఏదో ఒక సభ్యుడు అనుమానం వ్యక్తం చేస్తే.. వ్యక్తిగతంగా అనుమానం తీర్చాం కాబట్టి ఆమోదించినట్టుగా రికార్డులు సృష్టిస్తామంటే కుదరని పని. ఈ విషయం కూడా తోకపత్రికకు స్పష్టంగా తెలుసు. ఆమోదించని తీర్మానాన్ని.. కౌన్సిల్ తిరస్కరించిన తీర్మానాన్ని మళ్లీ కౌన్సిల్ ముందు పెడితే ఆమోదించే అవకాశం లేదని అవగాహన ఉంది. అందుకే రికార్డులు తారుమారు చేసి కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించినట్టుగా రికార్డులు మార్చివేశారు. ఈ రికార్డుల మార్పిడి వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంతమేర ఉందనేది లోతుగా విచారిస్తే కచ్చితంగా అసలు దొంగల గుట్టు బయటకు వచ్చే అవకాశం ఉంది. నిజంగా జీవీఎంసీ తీర్మానం లాంఛనమే అయితే రికార్డులు మార్చాల్సిన అవసరం ఎందుకు వస్తుంది? వాస్తవానికి జీవీఎంసీ తీర్మానం తప్పనిసరి కాబట్టే ఏకంగా రికార్డులు మార్చి మరీ.. ఆమోదించని తీర్మానాన్ని ఆమోదించినట్టుగా పేర్కొన్నారు. ఎలాగూ ఉంది తమ ప్రభుత్వమే కదా అనే ధీమాతోనే ఈ తతంగం నడిపించినట్టు తెలుస్తోంది.

రికార్డులు మార్చిందెవరు?

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశపు అజెండాను సెక్రటరీ సెల్ తయారుచేస్తుంది. సమావేశపు వివరాలను కూడా సదరు సెక్రటరీ సెల్ నమోదు చేయడంతో పాటు మినిట్స్‌ను కూడా నమోదు చేస్తుంది. ఈ విధంగా తయారైన మినిట్స్‌ను మేయర్ ఆమోదానికి ఉంచి.. ఆ కాపీని సభ్యులందరికీ అందజేయాల్సి ఉంటుంది. అయితే కౌన్సిల్‌లో ఆమోదించని విషయాన్ని కాస్తా ఆమోదించినట్టు రికార్డుల్లోకి ఎక్కించడంలో సెక్రటరీతోపాటు సెక్రటరీ సెల్ పాత్ర ఏమిటనేది తేలాల్సి ఉంది. అంతేకాకుండా సదరు సెక్రటరీ సెల్‌పై ఒత్తిడి తెచ్చిన వ్యక్తులు ఎవరనేది కూడా లోతుగా విచారిస్తే తేలనుంది. ఇప్పటివరకు సదరు సమావేశపు వివరాలను సభ్యులకు కూడా అందించలేదని తెలుస్తోంది. ఉద్దేశపూర్వకంగానే ఈ సమావేశపు వివరాలను సభ్యులకు ఇవ్వకుండా దాగుడు మూతలు ఆడారా? అనే విషయం కూడా తేలాల్సి ఉంది. ఎలాగూ ఉంది తమ ప్రభుత్వమే కదా అని స్థానిక సంస్థల నిర్ణయాన్ని ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోవడం ఏమిటనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. మొత్తంగా ఆమోదం లభించని తీర్మానం కాస్తా తమ తోకపత్రిక కోసం 'ఆమోద'ముద్ర వేయించడంలో ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేటినుంచి శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

ముస్తాబవుతున్న ముక్కంటి క్షేత్రం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం ముస్తాబైంది. మంగళవారం నుంచి 14 రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. కన్నప్ప ధ్వజారోహణంతో మంగళవారం ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ఈమేరకు భక్తకన్నప్ప కొండపై ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా మంగళవారం నుంచి 23 వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 23 వరకు రాహుకేతు పూజలను రద్దుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే 15 మహాశివరాత్రి రోజున అన్ని రకాల పూజలు, ప్రత్యేక దర్శనం టికెట్లను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. 14 నుంచి 16 వరకు అంతరాలయ దర్శనాలను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

భృంగివాహనంపై శ్రీశైలేశుడు



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం శ్రీశైలేశుడు భ్రమరాంబా సమేతుడై భృంగి భుజస్కంధాలపై ఊరేగాడు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో భృంగివాహనాన్ని సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై ఆసీనులను చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు పూజలు చేశారు. గంగాధర మండపం నుంచి నందిమండపం, అక్కడి నుంచి వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం సాగింది.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు.. భౌతిక దాడులు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రశ్నించే వారిపై అక్రమ కేసుల నమోదు, భౌతిక దాడులకు పాల్పడే విష సంస్కృతిని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన మాజీ మంత్రి అంబటి రాంబాబును వీలైనన్ని రోజులు జైలులో నిర్బంధించాలన్నదే సీఎం చంద్రబాబు ఉద్దేశమని ధ్వజమెత్తారు. లడ్డూ వ్యవహారంలో కూటమి ప్రభుత్వ దుష్ప్రచారంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌పై టీడీపీ గూండాలు హత్యాయత్నానికి పాల్పడ్డారని, వారి ఇళ్లను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తల్లిపై పెట్రోల్ పోసి కాల్చి చంపిన కొడుకు

వైఎస్సార్ కడప జిల్లాలో దారుణం

సుందరమ్మ(ఫైల్)

ఎర్రగుంట్ల: వైఎస్సార్ కడప జిల్లాలో కన్న కొడుకే తల్లి పాలిట కాలయముడయ్యాడు. మనవరాలు లత వద్ద తీసుకున్న డబ్బు కట్టాలని తల్లి సుందరమ్మ కుమారుడు జాకోబ్‌కు చెప్పింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అతడు సోమవారం తల్లిపై పెట్రోల్ పోసి కాల్చి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉంటున్న సుందరమ్మ (80)కు నలుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జాకోబ్ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జాకోబ్‌కు ముగ్గురు కుమారులు, కుమార్తె లత ఉన్నారు. లతకు వివాహం చేశారు. అయితే పోట్లదుర్తిలో ఇల్లు కట్టుకోవడానికి జాకోబ్, కుమార్తె లత వద్ద రూ.18 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తంతో ఇంటిని కట్టుకున్నాడు. అప్పుగా ఇచ్చిన డబ్బును ఇవ్వాల్సిందిగా లత తండ్రి జాకోబ్‌ను అడిగింది. ఈ విషయంలో కుమార్తెతో గొడవ పడ్డాడు. దీంతో తల్లి సుందరమ్మ అప్పుగా తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వమని జాకోబ్‌కు చెప్పింది. తన కుమార్తె లతకు మద్దతుగా మాట్లాడుతావా అంటూ తల్లితో జాకోబ్ గొడవ పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుందరమ్మపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వెంటనే స్థానికులు ఆమెను ప్రొద్దుటూరు ఆస్పత్రికి, అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమె మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

కొవ్వూరులో డ్రగ్స్ కలకలం

బెంగళూరు నుంచి రాజమహేంద్రవరానికి డ్రగ్స్ తరలిస్తున్న ముఠా
ముగ్గురు యువకులు, ఒక మహిళ అరెస్టు

తాళ్లపూడి: బెంగళూరు నుంచి రాజమహేంద్రవరానికి డ్రగ్స్ తరలిస్తున్న ముఠాలోని ముగ్గురు యువకులు సహా ఒక మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ కథనం ప్రకారం.. ఈ ముఠా బెంగళూరులో డ్రగ్స్ కొనుగోలు చేసి, ఓ కారులో రాజమహేంద్రవరం తరలిస్తోంది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో దొమ్మేరు వెళ్లే గామన్ బ్రిడ్జి అండర్‌పాస్ వద్ద ఈ కారును పోలీసులు సోమవారం అడ్డుకుని, డ్రగ్స్ ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వీరిలో రాజమహేంద్రవరంలోని బొమ్మూరుకు, ప్రస్తుతం కోలమూరుకు చెందిన కటారి సూర్య కిషన్, విశాఖపట్నం వేపగుంట ప్రాంతానికి చెందిన ముమ్మిడి విజయలక్ష్మి, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన నొక్కు మహిదీప్, రాజవోలుకు చెందిన ఇసుకపట్ల వివేక్ వర్ధన్ ఉన్నారు. ఈ ముఠా నుంచి రూ.90 వేల విలువైన 18.15 గ్రాముల మెత్ (మత్తు పదార్థం), కారు, మూడు సెల్‌ఫోన్లు, విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం, తణుకు చుట్టుపక్కల గ్రామాల్లోని కళాశాల విద్యార్థులే ప్రధాన లక్ష్యంగా ఈ ముఠా డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. వీరందరూ డ్రగ్స్‌కు బానిసలై డబ్బుల కోసం బెంగళూరు నుంచి మెత్ తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నట్లు సమాచారం. నిందితులపై కేసు నమోదు చేశారు.

ఘనంగా గుణదల మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

సమష్టి దివ్యబలి పూజలో బిషప్ తెలగతోటి రాజారావు, ఇతర గురువులు

గుణదల(విజయవాడ తూర్పు): విజయవాడలోని గుణదల మేరీమాత 102వ మహోత్సవాలు(తిరునాళ్లు) సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, సిల్వర్ జుబిలేరియన్ గురువులు నేలటూరి ఫ్రాన్సిస్, మద్దాల జోసఫ్, పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ముఖ్య ప్రసంగీకులు ఫాదర్ ఫ్రాన్సిస్ భక్తులకు దైవ సందేశం అందించారు. అనంతరం గురువులు సమష్టి దివ్య బలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్ సునీల్‌రాజు, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ చిన్నిప్ప తదితరులు పాల్గొన్నారు. బుధవారం వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. తొలి రోజు రాష్ట్రం నలుమూలల నుంచి మరియతల్లిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. సోమవారం ఉదయం నుంచే గుణదల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది.

మహిళా ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

కాపు సామాజికవర్గ ప్రజాప్రతినిధిని కుట్రపూరితంగా దించేసిన టీడీపీ కూటమి నేతలు
వైఎస్సార్‌సీపీ సభ్యులకు బెదిరింపులు
ఐదుగురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలతో ఎమ్మెల్యే పంచకర్ల క్యాంపు
మరో వైఎస్సార్‌సీపీ సభ్యుడికి గండి బాబ్జీ వల

వైఎస్సార్‌సీపీ సభ్యులను నేరుగా క్యాంపు నుంచి బస్సులో తీసుకొస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ఓ మహిళా ఎంపీపీపై పగబట్టి మరీ పదవి నుంచి తప్పించింది. కాపు సామాజికవర్గానికి చెందిన విశాఖ జిల్లా పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణిని అవిశ్వాస తీర్మానం ద్వారా అక్రమంగా కుర్చీ ఖాళీ చేయించారు. సంపూర్ణ బలం ఉన్న వైఎస్సార్‌సీపీ పాలకవర్గాన్ని కుట్రలు, కుతంత్రాలతో జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పెందుర్తి టీడీపీ ఇంచార్జి గండి బాబ్జీ విచ్ఛిన్నం చేశారు. తద్వారా తొమ్మిది మంది ఎంపీటీసీల్లో టీడీపీ నుంచి గెలిచిన ఏకైక ఎంపీటీసీ సభ్యురాలికి ఎంపీపీ పదవిని కట్టబెట్టేందుకు మార్గం సుగమం చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన ఎంపీటీసీ సభ్యులను బెదిరించి, క్యాంపులు నిర్వహించి అవిశ్వాసంలో చేతులెత్తేలా చేశారు. అయితే, పెందుర్తి పాలకవర్గం గడువు కేవలం ఏడునెలలు మాత్రమే ఉండడం గమనార్హం.

శిబిరాలు నిర్వహించి మరీ: 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పెందుర్తి మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఎనిమిది చోట్ల ఘన విజయం సాధించింది. టీడీపీ నుంచి కేవలం ఒకేఒక్క సభ్యురాలు విజయం సాధించింది. అప్పట్లో సభ్యులంతా నాగమణిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఆమెను తప్పించేందుకు స్కెచ్ వేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఐదుగురు ఎంపీటీసీ సభ్యులను బెదిరింపులకు గురిచేశారు. వారితో గతనెల 19న ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం చేయించారు. అనంతరం వారందరినీ గోవా, ఊటీ తదితర ప్రాంతాల్లో క్యాంపులకు తీసుకువెళ్లి.. సోమవారం ఓటింగ్ సమయానికి వెంటబెట్టుకుని వచ్చారు. మరో ఎంపీటీసీ సభ్యుడిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ తీసుకురాగా ఒకరు గైర్హాజరయ్యారు. పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మధుపాడ నాగమణి మీద పెట్టిన అవిశ్వాస తీర్మానంపై విశాఖ ఆర్డీఓ సుధాసాగర్ సోమవారం ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి అనుకూలంగా వైస్ ఎంపీపీ చిరికి దేముడు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో.. ఎంపీపీ నాగమణి తన పదవిని కోల్పోయారు.

రూ.1.25 కోట్లు ఇస్తే సరి.. లేకుంటే యాసిడ్‌తో చంపేస్తా

బంగారపు షాపు కుటుంబానికి లేఖ ద్వారా వీఆర్‌ఏ హెచ్చరిక
వీఆర్‌ఏని అదుపులోకి తీసుకున్న డీఎస్పీ

చీమకుర్తి: రూ.1.25 కోట్ల డబ్బులు లేదా కేజీ బంగారాన్ని ఇవ్వండి.. లేకపోతే యాసిడ్ పోసి మీ కుటుంబం మొత్తాన్ని చంపేస్తానంటూ ప్రకాశం జిల్లా చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న వ్యక్తి బంగారం వ్యాపారం చేసుకునే ఒక కుటుంబాన్ని బెదిరించాడు. డిమాండ్ చేసిన డబ్బు లేక బంగారం తీసుకుని ఒంగోలులోని కొత్తపట్నం వెళ్లే దారిలో ఉన్న ఫ్లైఓవర్ వద్దకు రావాలని లేఖ రాసి ఆదివారం రాత్రి బంగారు దుకాణ యజమాని ఇంటి ముందు పడేశాడు. సోమవారం బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు బెదిరింపులకు పాల్పడిన వీఆర్‌ఏని చీమకుర్తి పోలీసుల ద్వారా ఒంగోలు డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. బాధిత కుటుంబ యజమాని చలువాది శ్రీలక్ష్మి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఈ విషయం సంచలనం సృష్టించింది. ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో నిందితుడిని విచారిస్తున్నట్లు తెలిసింది. చలువాది శ్రీలక్ష్మి కుటుంబం కొన్నేళ్లుగా చీమకుర్తి పట్టణంలో బంగారం వ్యాపారం చేసుకుంటూ అందరికీ సుపరిచితం కావడంతో చీమకుర్తి పట్టణంలో దావానలంలా ఈ విషయం వ్యాపించింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు చీమకుర్తి సీఐ డి. ప్రసాదరావు తెలిపారు.

కాణిపాకం ఆలయానికి రూ.కోటి విరాళం

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన మీనాక్షి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున కె శ్రీనివాసరావు సోమవారం రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. స్వామివారి దర్శనార్థం కాణిపాకం వచ్చిన ఆయన, వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనం అనంతరం దేవస్థానం ఈవో పెంచల కిశోర్‌ను కలిసి భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన కోసం విరాళ అంగీకార పత్రాన్ని అందజేశారు.

విచారణకు వెళితే పోలీసుపైనే ఎదురుదాడి

పుల్లంపేట: తిరుపతి జిల్లా పుల్లంపేట మండల కేంద్రంలో విచారణకు వెళితే పోలీసులపై ఎదురుదాడి చేసి గాయపరచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పుల్లంపేట మండలంలోని కోనయ్యగారిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి ఆదివారం రాత్రి మద్యం మత్తులో పుల్లంపేటలో నివాసం ఉంటున్న తన మేనత్త ఇంటికి వచ్చి గొడవపడ్డాడు. దీంతో మేనత్త భర్త తిమ్మారెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రాత్రివేళ నిందితుడిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తుండగా హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు చేతివేళ్లను నిందితుడు కొరికేశాడు. రెండు వేళ్లకు గాయం కావడంతో సుబ్బరాజుకు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై చిన్నరెడ్డప్ప తెలిపారు.

హే రాం!

రామమందిరం వద్దే బార్ అండ్ రెస్టారెంట్
ధర్నాకు దిగిన మహిళలు
తక్షణం తొలగించాలని గ్రీవెన్స్‌లో శ్రీకాకుళం కలెక్టర్‌కు వినతి

బార్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం క్రైమ్: అధికారులు నిబంధనలకు రాంరాం పలికారు. రామ మందిరం వద్దే యథేచ్ఛగా బార్ అండ్ రెస్టారెంట్ పెట్టడంతో స్థానిక మహిళలు ఆగ్రహోదగ్రులయ్యారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రం సమీపంలోని పొన్నాడ బ్రిడ్జి వంతెన బస్‌షెల్టర్ సమీప రామమందిరం వద్ద ఏకంగా బార్ అండ్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. అయితే మందుబాబుల ఆగడాలు రాత్రి,పగలూ శ్రుతిమించడంతో సోమవారం స్థానిక మహిళలు రోడ్డుమీదకొచ్చి ధర్నాలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వెళ్లి బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని, రామమందిరాన్ని, హిందుత్వాన్ని కాపాడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. నిత్యం పిల్లలు బడులకు వెళ్లే దారిలో, ఉన్నతాధికారులు పనులకు వెళ్లే బాటలోనే ఈ బార్ ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని మండిపడ్డారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళా కానిస్టేబుల్‌పై చర్యలు

కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి/సీతారామపురం: కావలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ సీఐ వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 8న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దృష్ట్యా ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కావలి డీఎస్పీ శ్రీధర్ సోమవారం తెలిపారు. కావలిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దిగువ స్థాయి సిబ్బందికి పైస్థాయి అధికారుల నుంచి ఏవైనా సమస్యలు ఉంటే.. అంతకంటే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాలే తప్ప తమ ఇష్టం వచ్చినట్టు మీడియా ముందు మాట్లాడటం సరికాదన్నారు. ఆమె సమస్య ఇంతవరకు తమ దృష్టికి రాలేదన్నారు. మహిళా కానిస్టేబుల్ ఇలా చేయడం క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా.. 'కోడ్ ఆఫ్ కాండక్ట్' నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మహిళా కానిస్టేబుల్‌ను ఎస్పీ అజిత సస్పెండ్ చేశారని సీతారామపురం ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

బిల్లుల చెల్లింపులో 'పచ్చ'పాత వైఖరి దారుణం

వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: 'పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను అధికారులు టార్గెట్ చేసి... బిల్లులు చెల్లించకపోవడం సరికాదు. వారు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదు?' అని వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపులో పక్షపాత ధోరణికి నిరసనగా సోమవారం పెనుకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు నిరసన చేపట్టారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED PASTOR
for CANTONMENT BAPTIST CHURCH
Cantonment, Vizianagaram - 535 003, Andhra Pradesh
Applications are invited from qualified and committed Baptist Pastors for pastoral ministry at Cantonment Baptist Church.
About Church:
Established in 1961, Cantonment Baptist Church has a congregation of approximately 2,500, with two worship services (Telugu and English). The church emphasizes spiritual growth and evangelism, encouraging believers to grow in Christ.
Requirements: Qualification & Experience
1. Bachelor of Divinity (B.D) or higher theological degree from Serampore University or institutions affiliated to Serampore University
2. Baptist background with sound Baptist doctrine
3. Ordained and married (Marriage Licence is mandatory)
4. Born-again Christian with a clear calling to pastoral ministry
5. Proficient in English and Telugu, with the ability to lead the English service
6. Age between 35 - 45 years
7. Minimum 8 years of pastoral experience in Baptist churches
Facilities Provided
• Free accommodation
• Yearly bonus and other benefits as per church norms
Interested candidates may apply on or before 28 February 2026, submitting bio-data, copies of certificates, and relevant documents (hard and soft copies).
Email: cbcvizianagaram1961@gmail.com
Short listed candidates will be called for trail message
Rev. Dr.R.Madhusudhan Rao
(Deacon Board Chairman) Cantonment Baptist Church, Cantonment, Vizianagaram - 535003
Contact phone for any information :-
Ph : 9490662958, 6281025304

కులాంతర వివాహంపై గ్రామపెద్దల కన్నెర్ర

దళిత యువతిని వివాహమాడిన బీసీ యువకుడి కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించాలని నిర్ణయం
ఎస్పీకి ఫిర్యాదు చేసిన యువ దంపతులు

ఒంగోలు టౌన్: ఆ యువకుడిది బీసీ సామాజిక వర్గం. యువతిది దళిత సామాజికవర్గం. ఇద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లికి ఇద్దరి పెద్దలు అంగీకారం తెలిపారు. మధ్యలో కుల పెద్దలు ఓవరాక్షన్ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పంకువారికుంట గ్రామానికి చెందిన చెక్క స్వాతి, అదే మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన రాకేష్ గౌడ్ ప్రేమించుకుని ఆరు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. రాజుపాలెంలోనే కాపురం పెట్టారు. గ్రామానికి చెందిన కుల పెద్దలకు ఇది నచ్చలేదు. సూటిపోటి మాటలతో వేధించడం మొదలుపెట్టారు. ఈ నెల 7వ తేదీ రాజుపాలెంలోని దేవాలయం వద్ద పంచాయితీ పెట్టి రాకేష్ కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. యువతి దూరపు బంధువైన బిల్లా చెన్నయ్య సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో దీనిపై ఫిర్యాదు చేశారు.

మాట్లాడుతున్న రాకేష్, స్వాతి

అనంతరం బాధిత జంట మీడియాతో మాట్లాడుతూ కులాంతర వివాహం చేసుకున్న తమను గ్రామ పెద్దలు మానసికంగా హింసిస్తున్నారని, పంచాయితీ పెట్టి గ్రామం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల పెద్దలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఎస్పీకి విన్నవించారు.

సాక్షి

మంగళవారం, 10 ఫిబ్రవరి 2026

సాహసోపేతమేగానీ...

సహనం, ఓర్పు, సంయమనం, ప్రయామం, నిగ్రహం... ఎదుటివారు ఎంతగా రెచ్చగొడుతున్నా మాట తూలకుండా ప్రశాంతంగా ఉండే స్థితిని చెప్పటానికి ఇలా బోలెడు పదాలున్నాయి. కనీసం ఆర్నెల్లుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయినట్టేనని తరచు చెబుతూవచ్చారు. అందుకు మన దేశం నుంచి ఆశాజనకమైన స్పందన రానప్పుడల్లా రెచ్చిపోయి మాట్లాడారు. పాకిస్తాన్ పౌర, సైనిక అధినేతల్ని నెత్తినెక్కించుకుని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. జమ్మూ–కశ్మీర్ భౌగోళిక చిత్రపటాన్ని పాకిస్తాన్ సంబరపడేలా మార్చేశారు. ఎన్ని చేసినా మన ప్రభుత్వం మౌనంగా ఉండిపోవటం, లేదా ఆచితూచి మాట్లాడటం పనికొచ్చినట్టుంది. ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత–అమెరికాల మధ్య ఒక అవగాహన కుదిరిందని మొన్న శనివారం అధికారికంగా ఉమ్మడి ప్రకటన వెలువడింది. అందుకు సంబంధించిన ఒక అమరిక (ఫ్రేమ్‌వర్క్) కూడా రూపొందింది. అంతే... వెనువెంటనే 25 శాతం అదనపు సుంకాలు రద్దయ్యాయి. ఇకపై సుంకాలు 18 శాతానికి మాత్రమే పరిమితమవుతాయని అమెరికా ప్రకటించింది. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితి అలముకున్న తరుణంలో మన దేశం ఈ మాదిరి ఒప్పందానికి సంసిద్ధం కావటం ఒక సాహసోపేతమైన చర్య.

అయితే 'ఇల్లలకగానే పండగ కాద'న్నట్టు ఈ ఒప్పందం వాస్తవ రూపం దాల్చేవరకూ ఒకింత ఉత్కంఠ, సంశయం తప్పవు. అటు తర్వాత కూడా దిన దిన గండం ఉండనే ఉంటుంది. అక్కడున్నది ట్రంప్ గనుకే ఈ సమస్య. ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు గమనిస్తే ఇది తెలుస్తుంది. 'భారత్ ఇకపై రష్యా నుంచి చమురు కొనడం ఆపేసి, ఆ ఉత్పత్తులను అమెరికా నుంచే కొంటుందని ఆశిస్తున్నామ'ని అందులో ఉంది. భారత–రష్యా చమురు వాణిజ్యంపై తమ నిఘా ఉంటుందని కూడా అంటున్నది. ఈ విషయంలో మన దేశం అధికారికంగా ఏమీ చెప్పలేదు. ఉమ్మడి ప్రకటనలోనూ ఆ ప్రస్తావనలేదు. కానీ జాతీయ ఇంధన ప్రయోజనాలే మన గీటురాయి అని గతంలో మోదీ అన్నారు. మన వ్యవసాయ, పాడి రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రశ్నే లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ చెబుతున్నారు. అలాగే అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు సుంకాలు తగ్గించబోమంటున్నారు. అయితే ఉమ్మడి ప్రకటనలో అమెరికాకు సంబంధించిన అన్ని పారిశ్రామిక సరుకులు, విస్తృతశ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు లేదా రద్దు చేయటానికి భారత్ అంగీకరించిందని ఉంది. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేనట్టయితే భారత్ వెనక్కి తగ్గిందని ట్రంప్ యాగీ చేయటంతోపాటు, అదనపు సుంకాలకు సాకుగా ఉపయోగించుకుంటారు.

ప్రస్తుత భారత–అమెరికా వాణిజ్యం 13,000 కోట్ల డాలర్ల మేర ఉంది. ఇందులో అమెరికాకు మన ఎగుమతులు 8,500 కోట్ల డాలర్ల వరకూ ఉంటే, అమెరికా నుంచి దిగుమతులు 4,500 కోట్ల డాలర్ల వరకూ ఉన్నాయి. అంటే మనం 4,000 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులులో ఉన్నాం. దీన్ని మార్చాలన్నదే ట్రంప్ తాపత్రయం. అందుకే వచ్చే అయిదేళ్లలో అమెరికా నుంచి 50,000 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులుండేలా ఒప్పందం నిర్దేశిస్తోంది. ఇంధనం ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, సాంకేతిక ఉత్పత్తులు, అరుదైన లోహాల వంటివి ఉంటాయంటున్నారు. అంటే ఆ దేశం నుంచి ఏటా అదనంగా వందకోట్ల డాలర్ల అదనపు ఉత్పత్తులు వస్తాయి. అప్పుడు మన వాణిజ్య మిగులు ఆవిరై, లోటులో పడుతుంది. దీన్ని ఏ విధంగా సర్దుబాటు చేస్తారు?

కార్మికుల అవసరం ఎక్కువుండే మన ఉత్పత్తులకు ఒప్పందం వల్ల భారీ ప్రయోజనం కలిగే అవకాశమైతే ఉంటుంది. ఆ రకంగా దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఇక జన్యుమార్పిడి ఆహారం అనారోగ్యహేతువని, ఆ విత్తనాల వల్ల దిగుబడి భారీగా వచ్చినా, అవి వాడిన పంటపొలాల్లో భవిష్యత్తులో దేశీయ విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉండదని గతంలో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ విషయంలో సందేహాలన్నీ నివృత్తి చేయాలి. అలాగే తుది ఒప్పందం సమయానికి అవసరమైన మార్పులు, చేర్పులకు ఇరుపక్షాలూ సిద్ధపడే షరతుపైనే ఏ ఒప్పందంపైనైనా సంతకం చేయాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.7.30 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ ఉ.8.16 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ప.12.42 నుండి 2.28 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.35 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.48 వరకు, **అమృత ఘడియలు:** రా.11.20 నుండి 1.04 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

మనదే బాధ్యత!

సాంస్కృతిక వారసత్వ చిహ్నాల నిర్వహణ సరిగా లేదని ప్రభుత్వాన్ని, అధికారులను నిందించటం మానేయాలి. వాటిని కాపాడుకునే బాధ్యతను పౌరులుగా మనమే స్వీకరించాలి. మనమే ముందు తరాల వారికి వాటిని పదిలంగా అప్పగించి వెళ్లాలి.

– విక్రమ్‌జిత్ సింగ్ రూప్‌రాయ్, హెరిటేజ్ యాక్టివిస్ట్

నిరంతరం



మనస్సు అనేది నిరంతరం పదును పెడుతూ ఉండవలసిన సాధనం. చదువు చెప్పే టీచర్ కూడా చదువు నేర్చుకునే విద్యార్థిలాగే ఉండాలి. ఎప్పుడైతే టీచర్ నేర్చుకోవటం ఆపేస్తారో, అప్పుడే టీచర్‌గా ఉండటం కూడా మానేస్తారు. టీచర్ నిత్య విద్యార్థి!

– మృణాల్ చటర్జీ, విద్యావేత్త–రచయిత

ఏఐ ఫలాలు

ఏఐ కారణంగా ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏమీ రాదు. పైగా ఏఐ, ఉద్యోగాలను సృష్టిస్తుంది కూడా! అయినా ఉద్యోగులు అంటే కేవలం సాఫ్ట్‌వేర్ రంగంలోని వాళ్లేనా? రైతులు, టీచర్లు, డాక్టర్లు, ట్రక్ డ్రైవర్‌లకు ఏఐ వల్ల అందే ఫలాలను మనం ఎలా విస్మరించగలం?

– నటరాజన్ చంద్రశేఖరన్, టాటా సన్స్ ఛైర్మన్

ప్రయోగాలు



నా తలపై ఉన్న 'మహిళా షెఫ్' అనే కిరీటాన్ని చూడకండి. మీకు వడ్డించటం కోసం నా రెండు చేతులతో మీ డైనింగ్ టేబుల్ మీదకు నేను తెస్తున్న వంటకాలను రుచి చూసి నన్ను గుర్తించండి. ప్రయోగాలు చేయగలిగితే మీరైనా మంచి షెఫ్ కావచ్చు.

– గరిమా అరోరా, షెఫ్

అప్పు

మీ దగ్గర డబ్బు లేకపోయినా, ఉన్నట్లు చూపించుకోటానికి ఖరీదైన వస్తువులను కొంటుంటే – 'నా దగ్గర డబ్బు ఉంది' అని చెప్పగల స్థితికి మీరు ఎప్పటికీ చేరుకోలేరు. అప్పు చేయటం వల్ల ప్రయోజనం తాత్కాలికమే! తీర్చ లేకపోతే జరిగే నష్టం ఎప్పటికీ పూడ్చుకోలేనిది!

– అంకుర్ వారికూ, మనీ ఇన్‌ఫ్లుయెన్సర్

ఉద్యోగం

మీ బంధువుల మాట వినకండి. వారికి మీ గతం గురించిన అంచనా ఉంటుంది తప్ప, మీ భవిష్యత్తు గురించిన ఆలోచన ఉండదు. దాదాపు 70 శాతం మంది, ఇష్టమైన ఉద్యోగాలు చేయటం లేదు. బంధువులకో, ఇంట్లో వాళ్లకో ఇష్టమైన ఉద్యోగాలు మాత్రమే చేస్తున్నారు.

– సృష్టి మహేంద్రో, కెరీర్ కౌన్సెలర్

అసమానతలను రాజేయనున్న ఏఐ

విశ్లేషణ

మదన్ సబ్నవీస్

దావోస్‌లో ఇటీవల జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో చర్చించిన ప్రాథమికాంశాలలో 'కృత్రిమ మేధ (ఏఐ)– దాని ప్రభావం' కూడా ఉంది. ఏఐని ఆశ్రయించక తప్పని ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా దాన్ని అనుసరించడంలో మందగమనంతో సాగవచ్చునేమోకానీ, ఏదో ఒకనాడు దాన్ని అక్కున చేర్చుకోక తప్పదు. ఏఐని ఆశ్రయించడం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి; అదే సమయంలో... అటు కంపెనీలు, ఇటు ప్రభుత్వాలలో కొన్ని ఆందోళనలున్నాయి.

'ఫోరమ్' సర్వే ఏం చెబుతోంది?

ఆర్థికవేత్తలలో ఫోరమ్ ఈ అంశంపై నిర్వహించిన సర్వే కొన్ని ఆసక్తికరమైన ఫలితాలను వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో కొన్నింటి స్థానాన్ని ఏఐ ఆక్రమిస్తుందని దాదాపు 54 శాతం మంది అంగీకరించారు. కంపెనీలు ఏఐని ఎక్కువ వినియోగించుకుంటే లాభాల మార్జిన్లు పెరుగుతాయని సుమారు 45 శాతం మంది నమ్ముతున్నారు. అంటే, కంపెనీల సామర్థ్యం పెరుగుతుందని భావిస్తున్నారు. జనాభాలోని కొన్ని వర్గాలకు వ్యతిరేకంగా ఇది వివక్షకు దారితీయవచ్చని 21 శాతం మంది భయాలు వ్యక్తపరిచారు.

వివిధ రంగాల పరిశ్రమల సామర్థ్యం ఏఐతో మెరుగుపడుతుందని మన దేశంలోనూ దాదాపుగా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏఐని ఎక్కువ వినియోగించుకోవడం వల్ల అన్ని కంపెనీల్లో కస్టమర్ సర్వీస్ విభాగం సేవలు మెరుగుపడతాయి. ఆ విభాగం చాట్‌బాట్స్‌ను సృష్టించుకోవడం వల్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. సామర్థ్యాన్ని పెంచుకునేందుకు దాదాపు అన్ని సేవా రంగాల పరిశ్రమలూ అటువంటి సాధనాలను ఉపయోగించుకోవడం ప్రారంభించాయి. కస్టమర్లకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు రిటైల్ కస్టమర్లతో ప్రమేయమున్న అన్ని వ్యాపార సంస్థలూ ఏఐని ఆశ్రయించక తప్పదు.

కీలక రంగాల్లో ఏఐ వినియోగం

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా రంగంలో రుణ యోగ్యతను మదింపు చేసేందుకు ఏఐని వినియోగిస్తున్నారు. రుణం కోరుతున్న కంపెనీకి చెందిన మొత్తం సమాచారాన్ని ఏఐ సమీకరించి, తిరిగి చెల్లించగల సామర్థ్యంపై అంచనాలు అందివ్వగలదు. కలన గణితాలను ఆధారం చేసుకుని, ఏ మేరకు రుణం మంజూరు చేయవచ్చునో, ఎంత వడ్డీ వసూలు చేయవచ్చునో తెలుపుతుంది. ముందే నిర్ణయించిన సూచికలను ఆధారం చేసుకుని ఆ కంపెనీ ఎగవేయడానికి ఏమైనా అవకాశం ఉందా అని కూడా చెప్పగలుగుతుంది. ఏఐ వినియోగం వల్ల మోసాన్ని కనిపెట్టడం తేలిక. ఫలితంగా, ఆ రంగానికి ఎంతో మేలు చేసినదవుతుంది.

> ◆ పెట్టుబడులతో పెద్ద సంస్థలు ఏఐ నిచ్చెనమెట్లు ఎక్కేస్తాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఆర్థిక స్తోమత అంతంత మాత్రం కనుక, అది వాటికి సాధ్యం కాని పని. కొన్ని సంస్థలు పోటీ పడలేక రంగం నుంచి వైదొలగక తప్పని స్థితి ఏర్పడవచ్చు.

ఐటీ రంగంలో ఇప్పటికే పెక్కు మార్పులు కనిపిస్తున్నాయి. మొత్తం కోడింగ్ ప్రాసెస్, ప్రోగ్రామింగ్ పనిని ఏఐకి అప్పగిస్తున్నారు. ఈ కంపెనీలు సూచిస్తున్న పరిష్కారాలు క్లయింట్లకు ఉపయోగపడుతున్నాయి. ఆ క్లయింట్లు ఏఐ వినియోగంతో హెచ్చు సామర్థ్య స్థాయిలతో తమ ప్రాజెక్టులను వేగవంతం చేసుకుంటున్నారు. రిటైల్ రంగంలో, కస్టమర్ సంబంధ మాడ్యూల్ మొత్తాన్ని ఏఐ ద్వారా ప్రోగ్రామింగ్ చేస్తున్నారు. అది ఉత్పత్తులను సమర్థంగా డెలివరీ చేసేందుకు ఉపయోగపడుతోంది. స్టోరుకు వెళ్ళే వినియోగదారుల ఇష్టాలు, అభిరుచుల సమాచారం మొత్తాన్ని ఏఐ క్రోడీకరిస్తోంది. వాటికి తగ్గట్లుగా ఆ యా ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం తేలికవుతోంది. ఆరోగ్య రక్షణ రంగంలో సప్లై చెయిన్ నిర్వహణను ఏఐ సమకూరుస్తోంది. ఏ వ్యాపార రంగానికైనా ఏఐ వినియోగం అనివార్యంగా మారుతోందనీ, దాన్ని ఉపయోగించుకోవడం వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయనీ వీటివల్ల స్పష్టమవుతోంది.

కంపెనీలు భవిష్యత్తుకు తగ్గట్లుగా వ్యాపార ప్రణాళికలు రూపొందించుకునేందుకు కూడా క్రమేపీ ఏఐని ఆసరా చేసుకుంటున్నాయి. ఏఐ సాధనాలు అందించిన ఇన్‌పుట్ల ఆధారంగా వ్యూహాలు రచించుకుంటున్నాయి. బడ్జెట్ తయారు చేసుకునేటప్పుడే ప్రత్యర్థి సంస్థల నుంచి ఎదురుకాగల పోటీని అంచనా వేసుకోగలుగుతున్నాయి.

కాకపోతే, ఏఐని ఒక టెక్నాలజీగా వినియోగించుకోవడం చౌక కాదు. విద్యుచ్ఛక్తి ఎక్కువ అవసరమవుతుంది. గ్లోబల్ డేటా సెంటర్ విద్యుత్ వినియోగం 2035 నాటికి 1,200 టెరావాట్–గంటలను మించిపోవచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా వేసింది. అంటే, 2024 స్థాయిలకన్నా దాదాపు మూడింతలు ఎక్కువ. ఏఐ వృద్ధికి సమాంతరంగా విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని పెంచుకోవాలి. అయితే, ముందుందు ఈ వ్యయాలు తగ్గుతాయనీ, లాభాలు పెంచుకునే వీలుంటుందనీ కంపెనీలు భావిస్తున్నాయి. ఖర్చుల మాట అట్టేపెట్టినా, మన దేశంలో పరిస్థితులు ఎలా మారతాయన్నది చూసుకోవాలి.

దేశ కార్మికశక్తికి సవాల్

మనది మిగులు కార్మిక ఆర్థిక వ్యవస్థ. ఉద్యోగాల అవసరం ఉన్నవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. నిపుణులైనవారు తక్కువ సంఖ్యలో ఉన్నారు. నైపుణ్యం పెద్దగా అవసరం లేని లాజిస్టిక్స్, నిర్మాణ రంగాలు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. నిర్దిష్ట నైపుణ్యాలు ఉన్నవారు దొరకడం ఒక సవాల్.

ఏఐ వినియోగాన్ని పెంచుకుంటున్న కంపెనీలు ఇపుడున్న సిబ్బందిని తిరిగి నిపుణులుగా తయారు చేయడంపై దృష్టి పెట్టాలి. లేదంటే వారిని గాలికి వదిలేసినట్లు అవుతుంది. అయితే, కొత్తగా నైపుణ్యాలను నేర్పించడానికి వయసు ఒక ప్రధాన సమస్యగా పరిణమిస్తోంది. కనుక, ఉద్యోగాలు కోల్పోయేవారి సంఖ్య పెరిగి తీరుతుంది. విశ్వవిద్యాలయ స్థాయిలో వివిధ కోర్సుల పాఠ్య ప్రణాళికల్లో ఏఐని అంతర్భాగం చేయడం వల్ల కొత్తగా ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే మాట కూడా నిజం. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారికి మాత్రం కోతల బెడద తప్పకపోవచ్చు.

సర్వేలో వెల్లడైన రెండవ పెద్ద అంశం– అసమానత. పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టి, ఏఐ నిచ్చెనమెట్లు ఎక్కేస్తాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉంటుంది కనుక, అది వాటికి సాధ్యం కాని పని. ఇది ఆ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని మరింత పెంచుతుంది. కొన్ని సంస్థలు పోటీ పడలేక రంగం నుంచి వైదొలగక తప్పని స్థితి ఏర్పడవచ్చు.

ఈ అసమానత సమస్య సిబ్బందికి కూడా వర్తిస్తుంది. అవసరమైన నైపుణ్యం ఉన్నవారికి వెంటనే ఉద్యోగాలొస్తాయి. మామూలు ఉద్యోగాలలో కంటే ఎక్కువ జీతభత్యాలు లభిస్తాయి. మిగిలిన రంగాలవారి కన్నా ఐటీ రంగం ఎక్కువ జీతభత్యాలు ఇవ్వజూపగలగడం ఇప్పటికే చూస్తున్నాం. ఏఐ విషయంలోనూ అదే జరుగుతుంది. వస్తూత్పత్తి నుంచి కస్టమర్ సర్వీస్ వరకు వివిధ సంస్థలు తమ కార్యకలాపాలకు అవసరమైన చట్రాలను డిజైన్ చేయగలిగిన ఏఐ నిపుణులకి ఎక్కువ జీతాలు ఇవ్వజూపుతాయి.

వ్యాసకర్త ఆర్థికవేత్త, రచయిత

ఆ నిర్ణయం ప్రధానిదా? ఆర్మీ ఛీఫ్‌దా?

అభిప్రాయం

డానీ

భారత్–చైనా సరిహద్దులో 2020లో జరిగిన ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదు. అయితే ఇప్పుడు కొత్తగా ఓ ప్రశ్న దేశాన్ని కుదిపేస్తోంది. యుద్ధం అంచున నిలిచిన వేళ సైన్యానికి రాజకీయ ఆదేశాలొచ్చాయా, లేదా? ఈ ప్రశ్నలకు కేంద్ర బిందువుగా మారిన ఒక పుస్తకం ప్రచురణ కాకముందే పార్లమెంటును కుదిపేసింది. భారత ఆర్మీ మాజీ ఛీఫ్ జనరల్ ఎమ్ఎమ్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం అధికారికంగా ఇంకా ప్రచురణ కాలేదు. కానీ, ఆ పుస్తకంలోని కొన్ని అంశాలు 'క్యారవాన్' మ్యాగజైన్ ద్వారా బయటకు రావడంతో దేశ రాజకీయాల్లో భూకంపం మొదలైంది. 2020 జూన్ నాటి సంగతి. గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. ఆ తర్వాత తూర్పు లద్దాఖ్ మొత్తం ఉద్రిక్తతల్లో మునిగిపోయింది. చైనా సైన్యం కైలాష్ రేంజ్ వైపు కదలడం మొదలు పెట్టింది. ఇది కేవలం సరిహద్దు సమస్య కాదు; ఒక యుద్ధ ప్రకటన!

2020 ఆగస్టు 31. రాత్రి సమయం. చైనా యుద్ధ ట్యాంకులు భారత స్థావరాలకు కిలోమీటర్ దూరంలో మోహరించాయి. భారత కమాండర్లు అప్రమత్తమై దాడిని తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ విధానపరంగా ఒక సమస్య వచ్చిపడింది. ఢిల్లీ నుండి ఎలాంటి ఆదేశాలూ లేవు. స్పష్టమైన ఆదేశాలు లేకుండా కాల్పులు చేయకూడదన్న నిబంధనలున్నాయి. అప్పటి ఆర్మీ ఛీఫ్ నరవణె రక్షణ మంత్రి, జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు, విదేశాంగ మంత్రి అందరికీ ఫోన్ చేసి 'ఏం చేయాలి?' అని అడిగారు. వెంటనే స్పందన రాలేదు. తరువాత రక్షణ శాఖ మంత్రి నుండి ఫోన్ వచ్చింది. రెండే రెండు క్లుప్త వాక్యాలు. 'ప్రధానితో మాట్లాడాను... జో ఉచిత్ సమ్‌ఝో వో కరో' (ఏది సరైనది అనుకుంటే అది చెయ్యండి). ఈ సూచన విని షాక్‌కు గురైనట్టు నరవణె రాసుకున్నారు. యుద్ధానికి సంబంధించిన ప్రాణప్రదమైన అంశం ఇది.

ఇలాంటి ఉద్రిక్త సన్నివేశాలు 1971లో ఇందిరాగాంధీ హయాంలోనూ, 1999లో వాజ్‌పేయి హయాంలోనూ వచ్చాయి. వాళ్ళిద్దరూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నరవణె ఆ పుస్తకంలో చెప్పిందేమంటే ప్రధాని మోదీలో అలాంటి నిర్ణయాత్మక స్పష్టత కనిపించలేదు అని! ప్రజాస్వామిక వ్యవస్థలో శాసన వ్యవస్థే నిర్ణయాలు తీసుకుంటుంది, దాన్ని సైన్యం పాటిస్తుంది. చైనా విషయంలో మోదీ తడబడినట్టుగా నరవణె కథనం ద్వారా అర్థం అవుతోంది. సరిగ్గా ఈ అంశమే ప్రతి పక్షానికి ఆయుధంగా మారింది.

జాతీయ భద్రత కారణంగా నరవణె పుస్తకాన్ని పరిశీలించాల్సి ఉందని రక్షణ శాఖ అంటున్నది. ఏడాదిన్నర గడిచినా సమీక్ష పూర్తి కాలేదు. ప్రచురణకు అనుమతి రాలేదు. జాతీయ భద్రత కన్నా తమకు ఎదురయ్యే రాజకీయ ఇబ్బందుల గురించే కేంద్ర ప్రభుత్వం ఎక్కువగా జంకుతున్నదనే విమర్శలూ ఉన్నాయి. ఒక ఆర్మీ మాజీ ఛీఫ్ తన యుద్ధ అనుభవాలను ప్రజలతో పంచుకోకూడదా?

ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో నరవణె పుస్తకంలోని కొన్ని అంశాలను ప్రస్తావించడానికి ప్రయత్నించినపుడు అధికార పక్షాలు అడ్డుకున్నాయి. 'అగ్నివీర్', 'అగ్నిపథ్' పథకాల మీద కూడా నరవణె అసంతృప్తిని వ్యక్తం చేశారు. శాశ్వత ఉద్యోగ భద్రత లేదనీ, జీతాలు కూడా తక్కువనీ గుర్తు చేశారు. భారత సైన్యం భవిష్యత్తు మీద ఆందోళన వ్యక్తం చేశారు. క్యారవాన్ పత్రిక ఆ పుస్తకంలోని కొన్ని అంశాలతో ముఖచిత్ర కథనాన్ని ప్రచురించింది. మిగిలిన పుస్తకంలో ఇతర సందరాల్లో మోదీజీ నాయకత్వాన్ని నరవణె పొగిడి ఉండవచ్చు. మొత్తం పుస్తకం అందుబాటులోనికి వస్తేగానీ అంతిమ నిర్ణయం చెప్పలేము.

వ్యాసకర్త రాజకీయ, సామాజిక విశ్లేషకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

బాల్యంపై అరకొర పెట్టుబడి

ఇన్ బాక్స్

భారతదేశం ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో బాలలు, యువకులు ఉన్న దేశం. 0–18 సంవత్సరాల వయస్సు గలవారు దేశ జనాభాలో సుమారు 40% ఉన్నారు. అయినప్పటికీ, బాలల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, రక్షణ కోసం ప్రభుత్వానికి ప్రాధాన్యం లేదు. బడ్జెట్ ఫర్ చిల్డ్రన్ (సీబీఎస్) లేదా చైల్డ్ బడ్జెట్ స్టేట్మెంట్ అనేది యూనియన్, రాష్ట్ర బడ్జెట్లలో బాలలకు సంబంధించిన ఖర్చుల విశ్లేషణ చేసే సంస్థ. గత పదేళ్ల (2015–2025)లో ఈ ఖర్చులు తగ్గుముఖం పట్టాయనీ, ఇది బాలల అభివృద్ధికి తీవ్ర నష్టం కలిగిస్తున్నదనీ హెచ్చరించింది.

గత దశాబ్దంలో యూనియన్ బడ్జెట్‌లో బాలల కోసం కేటాయింపులు నామమాత్రంగా పెరిగినప్పటికీ, మొత్తం బడ్జెట్‌లో వాటా తగ్గింది. 2014–15లో మొత్తం ఖర్చులో 4.5% ఉండగా, 2024–25లో ఇది 2.3%కు తగ్గింది. స్థూల జాతీయోత్పత్తిలో బాలల ఖర్చు వాటా 2017–18లో 0.41% నుండి 2024–25 నాటికి 0.32%కు తగ్గింది. 2025–26లో 0.33%, 2026–27లో 0.34%కు స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ, ఇది దేశ ఆర్థిక వృద్ధి (8–9%)కి సరిపడా లేదు.

ప్రపంచ దేశాలతో పోలిస్తే మన పరిస్థితి దయనీయంగా ఉంది. నిపుణుల సూచనల ప్రకారం బాలల అభివృద్ధికి జీడీపీలో కనీసం 5 నుంచి 6 శాతం నిధులు అవసరం. విద్యపైనే క్యూబా 9.39 శాతం వెచ్చిస్తుంటే, వియత్నాం, చైనా వంటి దేశాలు కూడా భారీగా సామాజిక వ్యయం చేస్తున్నాయి.

భారత్‌లో మాత్రం ఈ ప్రాధాన్యం లోపించడం వల్ల పోషకాహార లోపం, పేదరికం వంటి సమస్యలు తరతరాలుగా వెంటాడుతున్నాయి. బాలల కోసం చేసిన కేటాయింపుల్లో విద్యకు 75–77 శాతం కేటాయింపులు ఉంటే... ఆరోగ్య రంగానికి కేటాయింపులు 5 శాతం కంటే తక్కువే. రాష్ట్రాల మధ్య కూడా భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. కేరళ ప్రతి బాలుడిపై రూ. 18,203 వెచ్చిస్తుంటే, బిహార్‌లో ఇది కేవలం రూ.4,363 మాత్రమే! బాలలకు ఓటుహక్కు లేకపోవడం వల్ల రాజకీయంగా వారి కోసం గళమెత్తేవారు లేరు. ఫలితంగా కేవలం ఆర్థిక స్తోమత ఉన్నవారే నాణ్యమైన బాల్యాన్ని పొందగలుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్ వాటాను 5 శాతానికి పెంచాలి. కేరళ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తూ ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్, రక్షణ వంటి అంశాలపై దృష్టి సారించాలి. కార్పొరేట్ రాయితీలను తగ్గించి అయినా చిన్నారుల భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టాలి. బాలలే దేశ సంపద, వారి అభివృద్ధిపైనే మన డెమోగ్రాఫిక్ డివిడెండ్ ఆధారపడి ఉంటుంది.

– డా॥ కె. రమాప్రభ । సామాజిక కార్యకర్త

'ఇన్నోవేషన్' ఇండియా

డేటా పాయింట్

'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్'లో మన దేశ ర్యాంకు గత 5 ఏళ్లలో బాగా మెరుగైంది. 2015లో 81 నుంచి 2025లో 38కి పెరిగింది.



ఆందోళన పరిష్కారమా?

జ్యోతిర్మయం

అది ఒక అందమైన గ్రామం. అక్కడ ఒక సాధువు నివసించేవాడు. ఆయన జ్ఞానానికి పెట్టింది పేరు. ఎక్కడికి వెళ్ళినా అక్కడ తలెత్తే సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు మంచి నైపుణ్యం ఉండేది. ఆయన తెలివైన అభిప్రాయాలను వినడానికి ఎల్లప్పుడూ జనసమూహం గుమికూడేది. ఆయన సలహా స్పష్టంగా, లోతైనది కాబట్టి... చదువురానివారు, ధనవంతులు ఇలా ఎందరో ఆయనను చూడటానికి వచ్చేవారు. గ్రామ ప్రజలు వచ్చి తనను కలవడం, తన అభిప్రాయాలను తెలుసుకోవడం ఆయనకు నచ్చినప్పటికీ, వారు తరచుగా తమ జీవిత సమస్యల గురించి పదే పదే చెప్పుకొని బాధపడటం ఆయనకు కొంచెం బాధ కలిగించింది.

ఒకరోజు స్థానికులందరినీ తనను కలవమని చెప్పాడు. ప్రజలందరూ ఆయన మాట ప్రకారం ఆశ్రమం వద్ద గుమిగూడారు. బయటకు వచ్చిన సాధువు అందరినీ చూసి నవ్వి ఒక జోక్ చెప్పడం ప్రారంభించాడు. ఆయన చెప్పిన జోక్ బాగుందని జనమంతా పగలబడి నవ్వారు. సాధువు మళ్ళీ అదే జోకు చెప్పాడు. జనంలో నవ్వు సగానికి తగ్గింది. ఆయన అక్కడితో ఆగలేదు. మళ్ళీ అదే చెప్పగా, ప్రజలు ముఖం చిట్లించడం ప్రారంభించారు. ఒకేదాన్ని పదే పదే చెబుతారేమిటీ అని చెవులు కొరుక్కున్నారు.

అప్పుడాయన, 'ప్రజలారా! నేను ఒకే మాటను మళ్ళీ మళ్ళీ చెబితే మీరందరూ ముఖం చిట్లించారు. అటువంటప్పుడు సమస్యల గురించి మళ్లీ మళ్లీ ఆలోచించడం సరైనదేనా?' అని చెప్పి నిశ్శబ్దంగా ఆశ్రమంలోకి వెళ్ళిపోయాడు. దీంతో ప్రజలు తాము చేస్తున్న తప్పును గ్రహించి అక్కడి నుంచి ఇళ్ళకు వెళ్ళిపోయారు. అదే పనిగా సమస్య గురించి ఆలోచిస్తూ ఆందోళన చెందడం వల్ల ఆ సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదని సాధువు చెప్పకనే చెప్పాడు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్య

సుబ్రహ్మణ్యం(ఫైల్)

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని తాతాలవారిపల్లె వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బి.సుబ్రహ్మణ్యం(36) సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామసముద్రానికి చెందిన సుబ్రహ్మణ్యం గతేడాది జూలైలో బదిలీపై తాతాలవారిపల్లె సచివాలయానికి వచ్చారు. ఆయన ఆత్మహత్య చేసుకోవడానికి ముందు తల్లి నీలమ్మకు ఫోన్ చేసి తనకు ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయని చెప్పాడు. అనంతరం స్థానిక బైపాస్ రోడ్డు వద్ద తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే తలుపును లోపల గడియపెట్టుకుని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సుబ్రహ్మణ్యం తల్లి నీలమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

90% సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించాలి

వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి డిమాండ్

సాక్షి, అమరావతి: భూసారం పెరగాలన్నా, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నా పచ్చిరొట్ట ఎరువు సాగు చేయాలని, కానీ ఆ విత్తనాలు రైతులకు అందుబాటు ధరల్లో లేవని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసే పిల్లిపెసర విత్తనం విజయవాడలో రిటైల్ ధర కిలో రూ.350 కాగా, క్వింటా రూ.35వేలు ఉందని పేర్కొన్నారు. జీలుగ విత్తనం కిలో రూ.150 చొప్పున క్వింటా రూ.15వేలు పలుకుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఇంత ధర పెట్టి పచ్చిరొట్ట విత్తనాలు కొనే స్థితిలో రైతులెవ్వరూ లేరన్నారు. భూసారం పెరగాలి, రసాయన ఎరువుల వాడకం తగ్గాలనుకుంటే ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను 90శాతం సబ్సిడీపై రైతులకు అందించాలని నాగిరెడ్డి డిమాండ్ చేశారు. మరోవైపు రైతులు పండించి ప్రజలకు మంచి ప్రొటీన్ అందించే పెసర, మినుము, శనగ పంటలకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర దక్కటం లేదన్నారు.

కాకాణిపై మరో అక్రమ కేసు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసుల పరంపర కొనసాగుతోంది. తాజాగా ఆదివారం రాత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కోవూరు పోలీసులు మరో అక్రమ కేసు నమోదు చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో బాలిక అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. బాలిక మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి కాకాణి శనివారం రాత్రి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలో షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్న కాకాణి నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు, బాలిక నివాస స్థలానికి సంబంధించిన వివరాలను పరోక్షంగా బహిర్గతం చేశారంటూ కోవూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆదివారం రాత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై సెక్షన్ 61 (2), 196 (1), 72(1), 352ఆర్/డబ్ల్యూ3 (5) బీఎన్ఎస్, 23(1) పోక్సో యాక్ట్ 2012 కింద కేసు నమోదు చేశారు.

బాబు సర్కారుపై 'శివ'మెత్తిన స్వాములు

శ్రీశైలం దర్శన ఏర్పాట్లలో అలక్ష్యంపై మండిపాటు

- క్యూలైన్ల గేట్లు పగులగొట్టి.. ఆలయంలో బైఠాయించి నినాదాలు
- సీఎం, డిప్యూటీ సీఎం, చైర్మన్, ఈవో డౌన్‌డౌన్ అంటూ ధర్మాగ్రహం
- భారీగా తరలివచ్చిన శివస్వాములు, పాదయాత్ర భక్తులు
- నియంత్రించలేక చేతులెత్తేసిన అధికారులు
- గంటలతరబడి క్యూలైన్లలో చంటిపిల్లలు, వృద్ధుల నరకయాతన
- ఉచిత దర్శన ప్రవేశ ద్వారం వద్ద ఎండలో రోడ్డుపైనే పడిగాపులు
- శివయ్య దర్శనం చేసుకోకుండానే వెనుతిరిగిన వేలాదిమంది
- అస్వస్థతకు గురైన భక్తులను తీసుకువచ్చేందుకు దారి లేని వైనం
- నిర్లక్ష్యాన్ని భరించలేక శివ స్వాముల్లో కట్టలు తెంచుకున్న అసహనం
- స్వాములపై లాఠీ ఎత్తి ఏఎస్పీ యుగంధర్‌రెడ్డి అత్యుత్సాహం

ఆలయ రాజగోపురం వద్ద సీఎం, డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న శివస్వాములు, శివస్వాములపై లాఠీ ఎత్తి బెదిరిస్తున్న ఏఎస్పీ యుగంధర్‌రెడ్డి

శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించి మల్లికార్జున స్వామి దివ్య దర్శనం కోసం భక్తులు పరితపిస్తారు. దీనికోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. దీనికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సిన చంద్రబాబు కూటమి సర్కారు విఫలమైంది. ముందస్తు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంలో అలక్ష్యం ప్రదర్శించింది. ఫలితంగా సోమవారం బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తులను నియంత్రించలేక అధికారులు చేతులెత్తేశారు. భక్తులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించారు. క్యూలైన్లలో గంటల తరబడి పడిగాపులు పడిన వృద్ధులు, మహిళలు, చంటిపిల్లలు అల్లాడిపోయారు. శివస్వాములూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతకూ అధికారులు రద్దీని నియంత్రించలేకపోవడంతో శివస్వాముల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వారు క్యూలైన్ల తాళాలు పగులగొట్టి, ఆలయంలో బైఠాయించి సీఎం, డిప్యూటీ సీఎం, చైర్మన్, ఈఓ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అయినా అధికారులు చేష్టలుడిగి చూస్తుండిపోవడంతో చాలా మంది శివస్వాములు, భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనం చేసుకోకుండానే ఉసూరుమంటూ వెనుతిరిగి వెళ్లారు.

ఉచిత కంపార్ట్‌మెంట్ల గోడలు పైకెక్కి అవస్థలు పడుకుంటూ బయటికి వస్తున్న భక్తులు

సొమ్మసిల్లిన శివస్వామి

ఘాట్ రోడ్లలో స్తంభించిన ట్రాఫిక్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఈ ఏడాది పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని తెలిసినా ముందస్తు అంచనా వేయడంలో బాబు సర్కారు, దేవస్థానం అధికారులు విఫలమయ్యారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజైన ఆదివారం మధ్యాహ్నం వరకు సాధారణంగా ఉన్న రద్దీ సాయంత్రం నుంచి పెరిగిపోయింది. భారీ సంఖ్యలో వాహనాల్లో, పాదయాత్రగా భక్తులు పోటెత్తారు. అలాగే ఆదివారం రాత్రి భారీగా తరలివస్తున్న వాహనాలతో ఇరువైపులా ఘాట్‌రోడ్లలో, శ్రీశైలంలో ట్రాఫిక్ స్తంభించింది.

చేతులెత్తేసిన దేవస్థానం

ఈ నెల 8 నుంచి శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శివమాల స్వీకరించి, జ్యోతిర్ముడిని కలిగిన శివస్వాములకు ఈ నెల 8 నుంచి 12 వరకు మాత్రమే మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. సామాన్య భక్తులకు మల్లన్న అలంకార దర్శనం కల్పిస్తున్నారు. మల్లన్న స్పర్శదర్శనం కోసం భారీ సంఖ్యలో శివస్వాములు శ్రీగిరి చేరుకున్నారు. సాధారణ భక్తులు సైతం అదే స్థాయిలో మల్లన్న దర్శనానికి తరలివచ్చారు. అయితే అధిక సంఖ్యలో తరలివచ్చిన శివస్వాములకు స్పర్శదర్శనం కల్పించడంలో దేవస్థాన అధికారులు విఫలమయ్యారు. సాధారణ భక్తులను, శివస్వాములను నియంత్రించలేక దేవస్థాన అధికారులు చేతులెత్తేశారు.

ఎండలో కాళ్లు కాలుతున్నా.. భక్తుల పడిగాపులు

భక్తుల రద్దీని నియంత్రించడంలో విఫలమవడంతో పాటు భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ అలసత్వం ప్రదర్శించారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు, టాయిలెట్ల సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు నానా అవస్థలు పడ్డారు. ఉచిత క్యూలైన్ ప్రవేశ మార్గం వద్ద ఎండలో రోడ్డుపై భక్తులు బారులు తీరారు. ఎండవేడిమికి మహిళలు, చంటిపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ల వద్ద వేచిఉన్న భక్తులకు రోడ్డుపై మ్యాట్ కూడా వేయలేదు. ఎండలో కాళ్లు మాడుతున్నా.. భక్తులు అలాగే పడిగాపులు పడాల్సి వచ్చింది. దీంతో గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న శివస్వాములు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఒక్కసారిగా ముందుకు తోసుకొచ్చి క్యూలైన్లతాళాలను పగులగొట్టి, తాత్కాలిక క్యూలైన్ల ఇనుప మెష్‌లను తొలగించి, ఇత్తడి క్యూలైన్లను తొలగించే యత్నం చేశారు. ఆలయంలోని మనోహర గుండం వద్ద పెద్ద ఎత్తున శివస్వాములు బైఠాయించారు. సీఎం, డిప్యూటీ సీఎం, దేవస్థాన ఈఓ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సనాతన ధర్మం అంటూ బీరాలు పలికే సీఎం, డిప్యూటీ సీఎం పాలనలో ఇంత అధ్వానంగా దేవస్థానం వ్యవస్థ ఉండడం మా ఖర్మ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

శివస్వాములపై లాఠీ ఎత్తిన ఏఎస్పీ

శివస్వాములను నియంత్రించేందుకు వచ్చిన నంద్యాల జిల్లా ఏఎస్పీ యుగంధర్‌రెడ్డి అత్యుత్సాహం ప్రదర్శించారు. శివస్వాములపై లాఠీ ఎత్తారు. దీంతో భక్తులు ఆగ్రహించి ఏఎస్పీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏఎస్పీని తక్షణం సస్పెండ్ చేయాలని ఆలయ రాజగోపురం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. చివరికి ఏఎస్పీ అక్కడి నుంచి నిష్క్రమించడంతో శివస్వాములు శాంతించారు.

హిందూ మఠాలపై చంద్రబాబు రెడ్‌బుక్

- లడ్డూ వ్యవహారంలో ప్రజల్లో పలుచన కావడంతో తనకు మద్దతు పలకాలంటూ మఠాలకు ఆదేశాలు
- ఒత్తిడిచేసి పెద్ద జీయంగార్‌తో లేఖ విడుదల చేయించారు
- టీటీడీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ వ్యవహారంలో తనకు అనుకూలంగా ప్రకటనలు చేయించుకునే పనిలో సీఎం చంద్రబాబు నిమగ్నమయ్యారని టీటీడీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, గొడ్డుకొవ్వు, పందికొవ్వు, చేపనూనె కలిశాయంటూ బాధ్యతారహితమైన ప్రకటనలు చేసిన చంద్రబాబు.. అవి అసత్యాలని సీబీఐ–సిట్ దర్యాప్తులో తేలడంతో ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, తన అబద్ధాలను నిజం చేయించుకోవాలని, అవమానకర పరిస్థితుల నుంచి బయటపడాలని రోజుకో కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'హిందూ ఆధ్యాత్మిక మఠాలపైనే తన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రయోగిస్తూ దేశవ్యాప్తంగా తిరుమల క్షేత్రం పరువు, ప్రతిష్టను దెబ్బతీసే అపవిత్ర కార్యక్రమాలకు ఒడిగడుతున్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు సీఎంవోలో ఓ అధికారికి ఈ ప్రత్యేక బాధ్యతలు అప్పగించగా, టీటీడీలో కొందరు అధికారులు వీరికి సహాయపడుతున్నారు. దక్షిణాది సహా దేశంలోని హిందూ ఆధ్యాత్మిక మఠాలకు వెళ్లి వారిని ఒత్తిళ్లకు గురిచేసి, అసత్యాలు చెప్పి తనకు అనుకూలంగా మఠాధిపతుల చేత లేఖలు విడుదల చేయించడం, వాటిని తమ ఎల్లో మీడియాలో ప్రధాన శీర్షికల్లో ప్రచురించి, దుర్బుద్ధితో కూడిన ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

పెద్ద జీయంగార్‌పై కొద్దిరోజులుగా ఒత్తిడి

తిరుపతిలోని పెద్ద జీయంగార్ మఠంపై ఇలాగే ఒత్తిడి తెచ్చి లేఖ విడుదల చేయించారు. కొన్నిరోజులుగా ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నా నిరాకరించిన నేపథ్యంలో నేరుగా సీఎంవో కార్యాలయమే రంగంలోకి దిగింది. చంద్రబాబు తన ప్రత్యేక కార్యదర్శి, టీటీడీ కొత్త ఈవో ముద్దాడ రవిచంద్రను పెద్ద జీయర్ వద్దకు పంపి తనకు అనుకూలంగా లేఖ రాయించుకున్నారు. వేయి సంవత్సరాల రామానుజాచార్యుల పరంపరనే భ్రష్టుపట్టించడానికి కూడా చంద్రబాబు వెనుకాడలేదు. ఈ కార్యక్రమాల కోసమే ముద్దాడ రవిచంద్రను టీటీడీ ఈవోగా నియమించారు. హిందూ ధర్మానికి, ఆధ్యాత్మిక ప్రపంచానికి చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారు. వేల సంవత్సరాల ప్రతిష్ట ఉన్న తిరుమల ఆలయాన్ని రాజకీయాలకోసం దెబ్బతీయడం అత్యంత శోచనీయం. శ్రీవారి భక్తులు, మఠాలపై చంద్రబాబు తన రాజకీయ స్వార్థంతో చేస్తున్న దాడిగానే దీన్ని చూడాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు కుట్రలను గమనించి ప్రతి ఒక్కరు వాటిని తిప్పికొట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బర్డ్ ఫ్లూ కలకలం!

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండు బర్డ్‌ఫ్లూ కేసులు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని అమ్మగారిపల్లి, పుట్టవారిపల్లి గ్రామాల్లో ఏవియన్ ఇన్‌ఫ్లూ(బర్డ్‌ఫ్లూ) కేసులు నమోదయ్యాయి. ఈ గ్రామాల్లో పెద్ద ఎత్తున పక్షులు మృత్యువాతపడడంతో నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (ఎన్ఐఏహెచ్‌డీ)కి పంపి పరీక్షించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మరోవైపు చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలో కూడా పెద్ద ఎత్తున పక్షులు మృత్యువాతపడడంతో నమూనాలను ఎన్ఐఏహెచ్‌డీకి పంపించారు. ఈ వ్యాధి నియంత్రణకు పశుసంవర్ధకశాఖ చర్యలు చేపట్టింది. వ్యాధి సోకిన, లక్షణాలున్న అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కేసులు నమోదైన, లక్షణాలు గుర్తించిన గ్రామాలకు కిలోమీటరు పరిధిలో ఉన్న ప్రాంతాన్ని ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గాను, పది కిలోమీటర్ల పరిధిని సర్వైలెన్స్ ప్రాంతంగా ప్రకటించారు. వలస పక్షులు ఎక్కువగా వచ్చే ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి, నెల్లూరు, వైఎస్సార్ కడప, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో సైతం ప్రత్యేక జీవభద్రత చర్యలు చేపట్టారు. కాగా బర్డ్‌ఫ్లూ పట్ల ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పశుసంవర్థకశాఖ డైరెక్టర్ దామోదరనాయుడు తెలిపారు.

తిరుమల లడ్డూపై చంద్రబాబు 'గోబెల్స్' ప్రచారం

- తప్పుడు ఆరోపణలపై స్వామివారికి, ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సాక్షి, అమరావతి: పాలనను గాలికొదిలేసిన చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతోందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ నివేదిక ప్రకారం కూటమి ప్రభుత్వంలోనే కల్తీ నెయ్యి సరఫరా అయిందని.. కల్తీ జరగడానికి బాధ్యుడు చంద్రబాబేనని తేల్చి చెప్పారు. కల్తీ నెయ్యి ఆరోపణలు ఎదుర్కొంటున్న బోలేబాబా డెయిరీకి నెయ్యి సరఫరా నిమిత్తం 2018లో చంద్రబాబే అనుమతిలిచ్చారని ఆధారాలతో సహా వివరించారు. స్వార్థ రాజకీయాల కోసమే శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను తగ్గించేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇప్పటికైనా చంద్రబాబు స్వామివారి ముందు తన తప్పును ఒప్పుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జవాబు చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుదే

చంద్రబాబు సర్కార్ హయాంలో సరఫరా అయిన నెయ్యి ట్యాంకర్ల నుంచి తీసిన శాంపిల్స్‌పై చేసిన పరీక్షల చుట్టూనే ఈ కేసు నడుస్తోంది కాబట్టి జవాబు చెప్పాల్సిన బాధ్యత కూడా చంద్రబాబుపైనే ఉందని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. 2024 జూన్ 12, 21, 25, జూలై 4న టీటీడీకి వచ్చిన ట్యాంకర్లలోని నెయ్యి నాణ్యతపై పరీక్షలు జరగ్గా.. అవన్నీ నాణ్యతా పరీక్షలో పాస్ అయ్యాయి. ఆ తర్వాత జూలై 2న వచ్చిన రెండు ట్యాంకర్లు, జూలై 12న వచ్చిన రెండు ట్యాంకర్ల నెయ్యిలో నాణ్యత, నిర్దేశించిన ప్రమాణాలు లేవన్న కారణంతో వాటిని వెనక్కి పంపించారని చెప్పారు. తిరస్కరించిన ట్యాంకర్లను జూలై 24 ఉదయం శ్రీకాళహస్తిలోని రాఘవేంద్ర స్టోన్ క్రషర్ వద్ద, వైష్ణవి డెయిరీకి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో పార్క్‌చేసి తిరిగి టీటీడీకీ దొడ్డిదారిన పంపించారన్నారు. అంటే ఈ కేసుకు మూలం, కల్తీ జరిగిందని ఆరోపణలు వచ్చింది కూడా చంద్రబాబు హయాంలోనే అని స్పష్టం చేశారు.

యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకే ఇవ్వాలి

- ఆక్వా రైతులకు ఇచ్చిన హామీని తక్షణం నెరవేర్చాలి
- వైఎస్సార్‌సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురాం డిమాండ్

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆక్వా, నాన్ ఆక్వా జోన్ పరిధితో సంబంధం లేకుండా రైతులకు యూనిట్ రూపాయిన్నరకే కరెంట్ ఇవ్వాలని, నెలాఖరులోపు హామీని నెరవేర్చకపోతే వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని వైఎస్సార్‌సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆక్వారంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. 20 నెలలవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. దళారీల దోపిడీతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సోయా రేట్లు పతనమైనప్పుడు ఫీడ్ ధరలు తగ్గించకపోతే వైఎస్ జగన్ హెచ్చరికతో తగ్గించారని, కానీ ఇప్పుడు సోయా రేట్లు పెరిగాయనే సాకుతో గతంలో తగ్గించిన రూ.4 ఫీడ్ ధర పెంచేశారని చంద్రబాబు సర్కారును దుయ్యబట్టారు. అమెరికా సుంకాల పేరుతో రొయ్యల ధరలు తగ్గిస్తే, ఇప్పుడు అమెరికా సుంకాలు 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించినా రొయ్యల ధరలు పెంచలేదని విమర్శించారు. నాడు వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటే నేడు కూటమి ప్రభుత్వంలో దళారుల రాజ్యమే నడుస్తోందని మండిపడ్డారు.

వేతన సవరణ కమిషన్‌ను నియమించాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే వేతన సవరణ కమిషన్‌ని, కమిషన్‌కు చైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని, పీఆర్సీ కమిషన్ రిపోర్టును మూడు నెలల్లో పూర్తిచేసి 40 శాతం పైగా ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు 29 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు.

విస్తరణాధికారుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు విద్యాసాగర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణాధికారులకు జాబ్‌చార్ట్, హోదా మార్పు అంశాలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు విద్యాసాగర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవ నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం ఏపీ ఎన్జీవో హోంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులకు నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ లేక, దశాబ్దాల తరబడి పదోన్నతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. వ్యవసాయ డిప్లొమా చేసిన వారికి సర్వీసులో ఒకసారి పదోన్నతి ఇవ్వాలని ప్రభుత్వానికి రాష్ట్ర జేఏసీ ద్వారా విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర ఏఈవో సంఘం నేతలు జేఏసీ నాయకులకు విజ్ఞప్తి చేశారు.

నాపై కేసు కొట్టేయండి

హైకోర్టులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిటిషన్

సాక్షి, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఓ బాలిక మృతికి సంబంధించి ప్రభుత్వాన్ని విమర్శించినందుకు తనపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు తనపై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కోవూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు మల్లారెడ్డి చేసిన ఫిర్యాదు ఆధారంగా కోవూరు పోలీసులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మరికొందరిపై ఈ నెల 8న కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో చేసిన ఆరోపణలు ప్రాథమికంగా ఎటువంటి నేరాన్ని రుజువు చేయడం లేదని కాకాణి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కేవలం స్థానిక రాజకీయ నాయకులను సంతృప్తి పరచడానికే తనపై కేసు పెట్టారన్నారు. కేవలం బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించడానికే వెళ్లానని, అక్కడకు అధికార పార్టీ నేతలు కూడా వచ్చారని, అయితే పోలీసులు వారిపై కేసు పెట్టకుండా తనపై కేసు పెట్టారని కాకాణి తన పిటిషన్‌లో తెలిపారు.



హైకోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి జోగి రమేష్

రాజకీయ ప్రేరణతోనే నాపై కేసు పెట్టారు

ఆ కేసును కొట్టేయాలని పిటిషన్

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ నెల 6న తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు తనపై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తిరుమల శ్రీవారి లడ్డూ నెయ్యిపై అధికార పార్టీ తప్పుడు ప్రచారంపై వ్యాఖ్యలు చేసినందుకు జోగి రమేష్ ఇంటిని టీడీపీ నేతలు, కార్యకర్తలు తగులబెట్టారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ఈ నెల 6న జోగి రమేష్, కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఆయన ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా జగన్‌కు స్వాగతం పలికేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా భారీగా జన సమీకరణ చేసి, ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారంటూ ఇబ్రహీంపట్నం ఎస్ఐ రవివర్మ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు జోగి రమేష్, మరికొందరిపై ఈ నెల 7న కేసు నమోదు చేశారు. రాజకీయ కక్ష, వేధింపుల్లో భాగంగానే ఈ కేసు నమోదు చేశారని, ఫిర్యాదులో తనకు వ్యతిరేకంగా ఎటువంటి నిర్దిష్ట ఆధారాలు లేవని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. అలాగే నేరంలో తన పాత్రను కూడా పేర్కొనలేదని తెలిపారు. అక్రమంగా గుమిగూడటం, పోలీసులపై నేరపూరిత బలప్రయోగం వంటి అంశాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవన్నారు. అయినా పోలీసులు రాజకీయ ప్రేరణతో తనపై తప్పుడు కేసు పెట్టారని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని జోగి రమేష్ కోర్టును కోరారు.

వైద్య చికిత్సల ధరలపై హైకోర్టు విచారణ

హాస్పిటల్స్ అసోసియేషన్ వినతిని పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ వైద్య సేవల కింద అందించే చికిత్సల ధరలను రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయిస్తూ గత ఏడాది డిసెంబర్ 8న జారీ చేసిన 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' (ఆర్ఎఫ్‌పీ)ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ కురుకూరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు చికిత్స ధరల ఖరారు సమయంలో హాస్పిటల్స్ ఇచ్చిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జరిగిన సమావేశాల్లో హాస్పిటల్స్ అసోసియేషన్‌తో చర్చించిన తర్వాతే ధరలు నిర్ణయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని విజయ్‌కుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన హామీని ఉల్లంఘించి చికిత్స ధరలను ఏకపక్షంగా ఖరారు చేస్తూ ఆర్ఎఫ్‌పీ ఇచ్చిందని తెలిపారు. పెరిగిన వైద్య ఖర్చులు, ద్రవ్యోల్బణం, ఆసుపత్రుల నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా పాత ధరలనే ఖరారు చేయడం శాస్త్రీయంగా లేదన్నారు. గతంలో అందించిన సేవలకు సంబంధించి సుమారు రూ.2 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించకుండానే కొత్త పథకాన్ని అమలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఆసుపత్రుల సంఘంతో చర్చించి, నిపుణుల కమిటీ ద్వారా శాస్త్రీయంగా ధరలను తిరిగి నిర్ణయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

అనకాపల్లిలో ఎస్సీ మహిళా వసతి గృహం ఏర్పాటు చేయాలి

సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తాడేపల్లి రూరల్: అనకాపల్లిలో ఎస్సీ మహిళా వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా శాఖ జాయింట్ డైరెక్టర్ రమాదేవికి సమస్యలను వివరిస్తూ వినతిపత్రమిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు మాట్లాడుతూ..అనకాపల్లి జిల్లా నూతనంగా ఏర్పడిన తరువాత అనేకమంది పేద, మధ్య తరగతి విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వస్తున్నారని తెలిపారు. 30 వేల మంది విద్యార్థులు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా చదువుకుంటున్నారని, కానీ అక్కడ బీసీ మహిళా వసతి గృహం ఒక్కటే ఉందని, అందులో 100 మంది ఉండాల్సి ఉండగా, 200 మంది విద్యార్థులు ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)
[CIN Number : U93000AP2015SGC105835], E-mail : cedmc.amaravati@gmail.com
Block 4, Near APCRDA Project Office, Rayapudi Post, Tulluru (M), Amaravati, Guntur (Dist), A.P - 522237
E-procurement-2nd call - Short Tender Notice
NO.12/HoD/UG&F/ADCL/ 2025-26 Dt: 07.02.2026
Name of the work : Development and Maintenance of Bio-fence around parks in Amaravati Capital City during 2025-26, ECV : Rs.46.91 Lakh.
The above bid from can be downloaded on "ap e-procurement" portal from 11.02.2026 to 18.02.2026, 3.00 PM and due date for submission of Bid on 18.02.2026 up to 3.30 PM, bid opening is on 18.02.2026 @ 4.00 PM. Please refer to www.apeprocurement.gov.in for details. For any further clarifications contact: Joint Director (i/c), ADCL Limited, Vijayawada, Mobile Number: 8977731970.

క్లాస్‌లోనే కాల్పులు

- అక్కడికక్కడే విద్యార్థిని మృతి
- తర్వాత తానూ కాల్చుకున్న తోటి విద్యార్థి
- పంజాబ్ లా కాలేజీలో ఘాతుకం

ప్రిన్స్ రాజ్

సందీప్ కౌర్

చండీగఢ్: పాఠాలు వినేందుకొస్తే ప్రాణాలు తీశాడో తోటి విద్యార్థి. పంజాబ్‌లోని తర్న్ తరణ్ జిల్లాలో సోమవారం ఉదయం లా కాలేజీ తరగతి గదిలో తోటి విద్యార్థుల సమక్షంలోనే ఈ దారుణ దాడి ఘటన జరిగింది. కాల్పులు జరిపిన 20 ఏళ్ల విద్యార్థి ప్రిన్స్ రాజ్ తలలో బుల్లెట్ దిగి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతుండగా బాధిత లా విద్యార్థిని సందీప్ కౌర్ ఘటనాస్థలిలోనే ప్రాణాలు కోల్పోయింది. రెప్పపాటు కాలంలో జరిగిన ఈ దాడి ఘటన మొత్తం ఆ తరగతి గదిలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. తమతోపాటు చదువుకుంటున్న విద్యార్థుల్లో ఒకరు మరొకరిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులకు తెగబడటంతో అక్కడే ఉన్న లా విద్యార్థులు భయంతో వణికిపోయి బయటకు పరుగులు పెట్టారు. పంజాబ్‌లోని ఉస్మా గ్రామంలో ఈ ఘటన జరిగింది. కొంతకాలంగా తమ అమ్మాయిని ప్రిన్స్‌రాజ్ వేధిస్తున్నాడని చివరకు పొట్టనబెట్టుకున్నాడని కౌర్ తల్లి హర్జీందర్‌సింగ్ కన్నీటిపర్యంతమయ్యారు.

డిప్యూటీ ఎస్పీ జగ్బీర్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం ఉస్మా గ్రామంలో మై భాగో లా కాలేజీలో రాజ్, కౌర్ న్యాయవిద్య మొదటి సంవత్సరంలో కలిసి విద్యనభ్యసిస్తున్నారు. ఎప్పట్లాగే సోమవారం విద్యార్థులు ఉదయం 9.14 గంటలకు కాలేజీలో తమ తరగతి గదికి కౌర్ వచ్చింది. అప్పుడే వచ్చిన రాజ్ ఆమె దగ్గరకొచ్చి ఏదో చెప్పబోతే పట్టించుకోలేదు. వీళ్ల వాదన విన్న తోటి విద్యార్థిని నవ్వుతూ వీళ్ల దగ్గరకొచ్చి 'బెంచీలో కూర్చుని మాట్లాడుకుందాం' అని చెప్పింది. దీంతో కౌర్, తోటి స్నేహితురాలి వెనక్కి వచ్చి చిట్టచివరి బెంచీలో కూర్చున్నారు. ముందు బెంచీలో రాజ్ కూర్చున్నాడు. అప్పటికి ఇంకా క్లాస్ మొదలు కాలేదు. ఈలోపే రాజ్ తన వెంట తెచ్చుకున్న బ్యాగు నుంచి ఒక గన్‌ను తీసి వెనువెంటనే కౌర్ తలకు గురిపెట్టి కాల్చాడు. బుల్లెట్ తలకు తగిలి కౌర్ అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఈలోపే రాజ్ గన్‌ను తన తలకు గురిపెట్టుకుని కాల్చుకుని నేలకొరిగాడు. ఇదంతా చూసిన పక్కనే ఉన్న తోటి విద్యార్థిని హతాశురాలైంది. కుప్పకూలిన కౌర్‌ను లేపేందుకు ప్రయత్నించింది. ఈలోపే కాల్పుల శబ్దాలు విని బయటి ఉన్న విద్యార్థులు సైతం లోపలికి పరుగెత్తుకొచ్చి దారుణం చూసి హాహాకారాలుచేశారు. అందరూ భయంతో పరుగెత్తడంతో పక్కనే ఉన్న విద్యార్థిని సైతం బయటకు వెళ్లిపోయింది. విషయం తెల్సి లా కాలేజీ సిబ్బంది ఇద్దరినీ ఆస్పత్రికి తరలించే ప్రయత్నంచేశారు. కౌర్ ఘటనాస్థలిలోనే తుది శ్వాస విడిచింది. రాజ్‌ను ఐసీయూలో చేర్పించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నిశ్చితార్థమైన అమ్మాయిని బలితీసుకున్నాడు

''నా కూతురు కౌర్‌ను రాజ్ గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. పెళ్లిచేసుకుంటానని 2, 3 సార్లు ఇంటికి కూడా వచ్చాడు. అయితే మూడు నెలల క్రితమే మా అమ్మాయికి వేరే అబ్బాయితో నిశ్చితార్థం కూడా అయింది. వేరే వ్యక్తితో వీడు ప్రాణంతీశాడు. మొదలు కాలేజీ నుంచి నాకు ఫోన్‌కాల్ వచ్చింది. మీ అమ్మాయికి గాయమైందని మాత్రమే చెప్పారు. పరుగున వచ్చి చూస్తే రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది''అని తల్లి హర్జీందర్ సింగ్ కన్నీటిపర్యంతమయ్యారు. ''శుక్రవారం కూడా నా చెల్లెని రాజ్ బెదిరించాడు. నాకు దక్కకపోతే ఎవరికీ దక్కకుండా చేస్తా అని వార్నింగ్ ఇచ్చాడు. రెండ్రోజులకే చంపేశాడు''అని కౌర్ అక్క మన్‌ప్రీత్ వెల్లడించారు.

మళ్లీ వాయిదా

లోక్‌సభలో అవే దృశ్యాలు ● అధికార, విపక్షాల వాగ్వాదం

న్యూఢిల్లీ: లోక్‌సభలో వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. అధికార, విపక్షాల మధ్య పలు అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉండటంతో సోమవారం కూడా సభ కార్యకలాపాలేవీ చేపట్టకుండానే వాయిదా పడింది. తొలుత ఉదయం రెండుసార్లు, అనంతరం మధ్యాహ్నం రెండింటి తర్వాత మంగళవారానికి సభను వాయిదా వేయాల్సి వచ్చింది. వారం రోజులుగా సభ నిత్యం అంతరాయాలనే ఎదుర్కొంటూ వస్తుండటం తెలిసిందే. ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకంలోని అంశాలను ప్రస్తావించేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రయత్నించడం, అందుకు మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా తీవ్ర అభ్యంతరం తెలపడం రగడకు దారితీసింది. నాటినుంచి సభలో ఆందోళనలు మినహా కార్యకలాపాలేవీ సాగడం లేదు.

పదేపదే అవాంతరాలు

ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రశ్నోత్తరాలు చేపట్టింది. ఆ వెంటనే విపక్ష సభ్యులు తమ స్థానాల నుంచి లేచి నినాదాలకు దిగారు. తాము లేవనెత్తిన పలు అంశాలపై తక్షణ చర్చకు పట్టుబట్టారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా వాటిని లేవనెత్తవచ్చని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. రాహుల్‌తో సహా సభ్యులంతా తమ అంశాలను లేవనెత్తవచ్చన్నారు. అయినా సభ్యులు వెనక్కు తగ్గకపోవడంతో తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. కేవలం కార్యకలాపాలను స్తంభింపజేయడమే లక్ష్యంగా వారు వ్యూహం రూపొందించుకుని సభకు వచ్చారంటూ మండిపడ్డారు. అయినా సభ్యులు శాంతించకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. తిరిగి సమావేశం కాగానే, ముందుగా రాహుల్‌ను మాట్లాడనివ్వాల్సిందేనని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. నిబంధనల మేరకు బడ్జెట్‌పై చర్చ ప్రారంభం కావాల్సి ఉందని సభాపతి స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ తమ ప్రధాన వక్తగా శశి థరూర్ పేరు ఇచ్చినందున ఆయన మాట్లాడాలని సూచించారు. విపక్షాల నినాదాలు ఆగకపోవడంతో సభ మధ్యాహ్నం రెండింటితో వాయిదా పడిడంది. తిరిగి సమావేశం కాగానే సభాపతి స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ బడ్జెట్‌పై చర్చను ప్రారంభించాల్సిందిగా థరూర్‌కు సూచించారు. తన ప్రసంగానికి ముందు విపక్ష నేత రాహుల్ కొన్ని అంశాలను లేవనెత్తదలచారని థరూర్ పేర్కొన్నారు. రాహుల్ బడ్జెట్‌పై ప్రసంగిస్తే అభ్యంతరం లేదని రాయ్ బదులిచ్చారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ, బడ్జెట్‌పై చర్చకు ముందు పలు అంశాలపై మాట్లాడేందుకు తనకు అవకాశమివ్వాలని పట్టుబట్టారు. అందుకు తనకు అవకాశమిస్తానని విపక్ష సభ్యులతో సమావేశం సందర్భంగా స్పీకర్ అంగీకరించినట్టు వెల్లడించారు. కానీ అలాంటిదేమీ లేకుండా నేరుగా బడ్జెట్‌పై చర్చను మొదలు పెడుతున్నారంటూ ఆక్షేపించారు. తనకు అలాంటి సమాచారమేదీ లేనందున ఇతర అంశాలు లేవనెత్తేందుకు అనుమతించలేనని రాయ్ పేర్కొన్నారు. స్పీకర్ అలాంటి అంగీకారానికి రాలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పష్టం చేశారు. ఒప్పందంపైనే రాహుల్ మాట్లాడాలనుకుంటే దానిపై స్పందించేందుకు స్పీకర్ సభలో అందుబాటులో ఉండాల్సి ఉంటుందన్నారు. అధికార, విపక్షాల్లో ఎవరూ పట్టు వీడకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు రాయ్ ప్రకటించారు.

ప్రధాని ప్రసంగం లేకుండానే ధన్యవాద తీర్మానం ఫిబ్రవరి 5న ఆమోదం పొందడం తెలిసిందే! ఇలా జరగడం 22 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. ఫిబ్రవరి 4న ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించే సందర్భంగా ఆయన స్థానం వద్దకు వెళ్లి అనూహ్య చర్యకు పాల్పడాలని కాంగ్రెస్ ఎంపీలు నిర్ణయించుకున్నట్టు కచ్చితమైన సమాచారం అందిందని స్పీకర్ పేర్కొన్నారు. అందుకే ఆయన భద్రత దృష్ట్యా సభకు రావద్దని తానే సూచించినట్టు తెలిపారు. దీన్ని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా తోసిపుచ్చారు. అది పచ్చి అబద్ధమన్నారు.


బిర్లా

రాహుల్ గాంధీ

భయంతోనే డుమ్మా

మోదీపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో పాటు దేశ భద్రత, ప్రజా ప్రయోజనాలతో ముడిపడ్డ పలు అంశాలపై బదులివ్వడానికి మోదీ సర్కారు భయపడుతోందని విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. అందుకే కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో జరగాల్సిన చర్చ నుంచి పారిపోతోందని ఆరోపించారు. ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నవరణె పుస్తకానికి సంబంధించి సభలో తాను లేవనెత్తిన ఇబ్బందికర అంశాలపై బదులివ్వాల్సి వస్తుందనే భయంతోనే ప్రధాన నరేంద్ర మోదీ గత వారం లోక్‌సభకు డుమ్మా కొట్టారంటూ ఎద్దేవా చేశారు. విపక్షాల నుంచి ముప్పు కారణంగానే ఆయన రాలేదన్న స్పీకర్ ప్రకటనపై తీవ్రంగా మండిపడ్డారు. ''అది పచ్చి అబద్ధం. అది నిజమే అయితే ముప్పుందంటున్న వాళ్లు అందుకు బాధ్యుడైన వ్యక్తిపై తక్షణం ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు?''అని ప్రశ్నించారు. సోమవారం రాహుల్ మీడియాతో మాట్లాడారు. ''నిండు సభలో మోదీపై దాడి చేసే ఆలోచనే కాంగ్రెస్ సభ్యులకు లేదు. ప్రజా సమస్యలతో పాటు అన్ని అంశాల మీదా అర్థవంతమైన చర్చ జరగాలనే విపక్షం కోరుకుంటోంది. సభకు వచ్చేందుకు మోదీకి దమ్ముండాలి. కానీ ఆయనకు నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం లేదు. సభలో అడుగు పెట్టగానే మేమెక్కడ నరవణె పుస్తకాన్ని తన చేతిలో పెడతామో అని మోదీ భయపడుతున్నారు. ప్రభుత్వం కూడా చర్చకు భయపడుతోందన్నదే నా వ్యక్తిగత అభిప్రాయం''అన్నారు.

స్పీకర్‌పై అవిశ్వాసం!

- తొలగించాలంటూ తీర్మానం
- త్వరలో ప్రవేశపెట్టే అవకాశం
- 103 మంది ఎంపీల సంతకం

న్యూఢిల్లీ: లోక్‌సభలో అధికార, విపక్షాల నడుమ వారం రోజులకు పైగా సాగుతున్న వివాదం కొత్త మలుపు తిరిగేలా కనిపిస్తోంది. ఈ ఉదంతంలో స్పీకర్ ఓం బిర్లా పూర్తిగా అధికార పక్షం కొమ్ము కాస్తున్నారంటూ విపక్షాలు మండిపడుతున్నాయి. ఇందుకు నిరసనగా ఆయనపై ఏకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో ఉన్నాయి! సోమవారం ఉదయం లోక్‌సభలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్లో జరిగిన భేటీలో విపక్ష నేతలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, వామపక్షాలు, ఆరెస్పీ తదితర పక్షాల నేతలు భేటీలో పాల్గొన్నారు. బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలంటూ రాజ్యాంగంలోని 94–సి ఆర్టికల్ కింద తీర్మానం ఇవ్వనున్నట్టు సమాచారం. విపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇతర విపక్ష నేతలను సభలో ప్రసంగించేందుకు అనుమతించనందుకు, 8 మంది విపక్ష ఎంపీలను అకారణంగా సస్పెండ్ చేసినందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై అసంబద్ధ ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై ఎలాంటి చర్యలూ తీసుకోనందుకు బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని తీర్మానంలో విపక్షాలు కోరనున్నాయి. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానంపై కనీసం 100 మంది ఎంపీల సంతకం అవసరం. ఇప్పటికే కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ తదితర పార్టీలకు చెందిన 103 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసినట్టు చెబుతున్నారు. దాన్ని త్వరలో లోక్‌సభలో ప్రవేశపెడతారని తెలుస్తోంది. అది ఎప్పుడన్నది మంగళవారం నిర్ణయించే అవకాశముందని విపక్ష నేత ఒకరు తెలిపారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. ''పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో విపక్షాలు ఎలాంటి తీర్మానమైనా ప్రవేశపెట్టవచ్చు. కానీ తీర్మానాన్ని నెగ్గించుకునేంత సంఖ్యా బలం విపక్షాలకు లేదు''అన్నారు.

బిర్లాతో విపక్షాల చర్చలు

అంతకుముందు విపక్ష సభ్యులు స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సోమవారం మధ్యాహ్నం లోక్‌సభ వాయిదా పడగానే రాహుల్‌తో పాటు అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), టి.ఆర్.బాలు (డీఎంకే) ఆయనతో భేటీ అయ్యారు. ప్రతిష్టంభనను తొలగించే దిశగా ఆయనతో చర్చలు జరిపారు. సభలో ఎందుకు ఆందోళన చేయాల్సి వస్తోందన్న అంశంపై తమ వాదన విన్పించారు. తాను లేవనెత్తిన అంశాలపై మాట్లాడేందుకు అనుమతిస్తే కేంద్ర బడ్జెట్‌పై చర్చకు సిద్ధమేనని రాహుల్ చెప్పారు. విపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తేయాలని, మహిళా ఎంపీలపై మోపిన అభియోగాలను వెనక్కు తీసుకోవాలని కూడా ఈ సందర్భంగా రాహుల్ డిమాండ్ చేసినట్టు చెబుతున్నారు. వారి డిమాండ్లపై అధికార పక్షంతో చర్చించి చెబుతానని బిర్లా బదులిచ్చినట్టు విపక్ష నేతలు చెప్పారు. స్పీకర్ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని వారన్నారు. విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వారం రోజులుగా కార్యకలాపాలేవీ చేపట్టకుండానే వాయిదా పడుతూ వస్తుండటం తెలిసిందే.

నాలుగోసారి

స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం దిశగా విపక్షాలు యోచిస్తుండటం కాక రేపుతోంది. దేశ చరిత్రలో ఇప్పటిదాకా మూడుసార్లు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాలు సభ ముందుకొచ్చాయి. అయితే వాటిలో ఏదీ నెగ్గలేదు. తొలిసారిగా అవిశ్వాస తీర్మానం పెట్టింది లోక్‌సభ తొలి స్పీకర్ జి.వి.మౌలంకర్‌పైనే కావడం విశేషం! అది అది వీగిపోయింది. తర్వాత హుకుంసింగ్‌పై పెట్టిన తీర్మానం సంఖ్య బలం లేని కారణంగా సభలో చర్చకు రాలేదు. మూడోసారి బలరాం జాఖడ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం కూడా వీగిపోయింది.

సాంకేతికతకు సాగిలపడొద్దు

నేర్చుకోవడం మానేసి ఏఐపై ఆధారపడొద్దు ● పరీక్షాపే చర్చా కార్యక్రమంలో విద్యార్థులకు ప్రధాని మోదీ హితబోధ

న్యూఢిల్లీ: సాంకేతికత అనేది విద్యార్థులను బానిసలుగా మార్చుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ అప్రమత్తంచేశారు. విద్యార్థి దశలో శిక్షణలో భాగంగా నేర్చుకునే పరంపరను కొనసాగించాలనీ అన్నింటిపై కృత్రిమ మేధ మీద ఆధారపడొద్దని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులకు విద్యా సంబంధ చిట్కాలు, సలహాలు చెబుతూ అత్యంత ప్రజాదరణతో కొనసాగుతున్న 'పరీక్షా పే చర్చా'కార్యక్రమం 9వ విడత రెండో ఎపిసోడ్ సందర్భంగా కోయంబత్తూర్, రాయ్‌పూర్, గువాహటి, గుజరాత్‌లకు చెందిన పలువురు ఔత్సాహిక విద్యార్థులతో ప్రధాని మోదీ ముచ్చటించారు. వాళ్లు అడిగిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానం చెప్పారు.

ఏఐ అంటే భయమేల?

''కృత్రిమ మేధ(ఏఐ) వంటి కొత్త తరం సాంకేతికతలను చూసి విద్యార్థులు భయపడొద్దు. ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ వాటిలోనూ మీరు రాణించాలి. ఏఐ లేదా స్మార్ట్‌ఫోన్‌ను అత్యున్నత గురువుగా భావించొద్దు. కొందరు పిల్లలకు తొలుత స్మార్ట్‌ఫోన్‌లో ఏదైనా చూశాకే వాళ్ల నోట్లోకి ముద్ద దిగుతుంది. మనం ఏఐను ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. అంతేగానీ అదే మన మార్గదర్శి అనే స్థాయిలో దానికి విలువ ఇవ్వొద్దు. పాఠ్య పుస్తకాల్లో ఉన్నదానికి ఏఐ సమాచారం అనేది అదనపు విలువ జోడింపు ఇస్తుంది అనే భావనతోనే మెలగాలి. అంతేగానీ నేర్చుకోవడం మానేసి పూర్తిగా ఏఐ ఆధారపడొద్దు. గతంలో ఎడ్లబండి మీద వెళ్లిన మనం ఇప్పుడు ఏరోప్లేన్‌లో వెళ్లినట్లుగా పాతరకం ఉద్యోగాలు మటుమాయమై ఎల్లప్పుడూ కొత్త రకం ఉద్యోగాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఉపాధి మారొచ్చేమోగానీ జీవితం మారదు. కొనసాగుతూనే ఉంటుంది. భయం, జంకూ వీడి కొత్త రకం సాంకేతికతలను నేర్చుకోవాలి. వాటిపై పట్టు సాధించాలి. సాంకేతికతతో మీ శక్తిసామర్థ్యాలను మరింత పెంపొందించుకోండి. సాంకేతికత సత్తాను మీ పనిలో చూపించండి''అని మోదీ సూచించారు.

పాతవి తిరగేయండి.. హాయిగా నిద్రపొండి

''పరీక్షలకు సంబంధించి పాత క్వశ్చన్ పేపర్లను తిరగేయండి. ప్రశ్నల తీరును అర్థంచేసుకోండి. పగలంతా పక్కా ప్రణాళికతో చదివేసి రాత్రి హాయిగా నిద్రపోండి. రాత్రి బాగా నిద్రపోతేనే ఉదయం అంతకంటే బాగా పరీక్ష రాయగల్గుతారు. పరీక్షకు బాగా సంసిద్ధమయ్యాక కొత్తగా ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. చక్కటి నిద్ర అనేది మిమ్మల్ని రోజంతా హుషారుగా ఉండేలా చేస్తుంది''అని అన్నారు. తమ పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చి చూసే ధోరణిని తల్లిదండ్రులు విడనాడాలని మోదీ సూచించారు.

రెండింటిపై స్వారీ చేయండి

విద్య, సొంత ఇష్టాయిష్టాలను సమన్వయం చేసుకోవడం కష్టంగా ఉందని ఓ విద్యార్థి వెలిబుచ్చిన ఆవేదనపై మోదీ తనదైన శైలిలో సలహా ఇచ్చారు. ''ఓ వైపు ఆర్ట్ అంటే ఇష్టం. మరోవైపు శాస్త్రసాంకేతిక రంగంలో రాణించాల్సిన పరిస్థితి. ఇలాంటి సందర్భాల్లో ఏం చేయాలో ఎటూపాలుపోక నిట్టూర్చేకంటే ప్రతి రోజూ లేదా వారానికి ఒకసారి సొంత ఇష్టాయిష్టాలపై దృష్టిపెట్టండి. విద్యకు ఎప్పట్లాగే అత్యంత ప్రాధాన్యతా ఇవ్వండి''అని సూచించారు. అంకుర సంస్థల వైపు మొగ్గుచూపొచ్చా? అని మరో విద్యార్థి అడగ్గా..'' ముందు అసలు మీరు ఏం చేయాలనుకుంటున్నారో ఒక స్పష్టతకు రావాలి. ఇప్పటికే ఉన్న సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు చేయదలిచారా? లేదంటే డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థల వంటి వాటికి కొత్త పరిష్కారాలు వెతకాలనుకుంటున్నారా? దీంట్లో స్పష్టత వస్తే అంకురసంస్థను స్థాపించాలా వద్దా అనేది తేలిపోతుంది. ముందుగా సాంకేతికత లేదా ఆర్థిక రంగాలపై పట్టున్న స్నేహితులతో ఒక బృందంగా ఏర్పడండి. స్టార్టప్‌ను ఆరంభించడానికి వయసుతో పనేలేదు. నిజంగా మీకు దీనిపై ఉత్సుకత ఉంటే ఇప్పటికే ఉన్న అంకురసంస్థలను సందర్శించండి. మీకున్న పరిజ్ఞానంతో ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను సిద్ధంచేయండి. అది బాగుంటే అందరినోటా పడి చివరకు భారీ మద్దతు లభిస్తుంది. ఆర్థికసాయమూ అందుతుంది. తర్వాత ఎలా ముందుకెళ్లాలనేది నిర్ణయించుకోవచ్చు''అని మోదీ సూచించారు.

విద్యార్థులతో సంభాషిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

మావల్ల మోదీకి ముప్పా?

- కాంగ్రెస్ మహిళా ఎంపీల ధ్వజం
- ఓం బిర్లాకు ఎంపీల లేఖాస్త్రం

న్యూఢిల్లీ: లోక్‌సభ పరిరక్షకునిగా సభా కార్యకలాపాల నిర్వహణలో నిష్పాక్షికంగా వ్యవహరించాలని స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ మహిళా ఎంపీలు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు వారు లేఖ రాశారు. ప్రియాంకాగాంధీ వాద్రాతో పాటు పలువురు సభ్యురాళ్లు దానిపై సంతకం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 4న సభలో బదులివ్వాల్సి ఉండగా ఆయన గైర్హాజరు కావడం తెలిసిందే. దాంతో ప్రధాని సమాధానం లేకుండానే మర్నాడు తీర్మానం సభ ఆమోదం పొందింది. మోదీ ప్రసంగం సందర్భంగా ఆయన స్థానం వద్దకు వెళ్లి 'అనూహ్య చర్య'కు పాల్పడాలని కాంగ్రెస్ వ్యూహం రూపొందించినట్టు తనకు పక్కా సమాచారముందని, అందుకే ప్రధానిని సభకు రావద్దని తానే చెప్పానని స్పీకర్ పేర్కొనడం తెలిసిందే. ఈ ప్రకటనను తీవ్రంగా తప్పుబడుతూ బిర్లాకు తామంతా లేఖ రాసినట్టు ప్రియాంక తెలిపారు. లేఖను గురించి ఆమె మీడియాతో మాట్లాడారు. మోదీ గైర్హాజరీని అందరూ ప్రశ్నిస్తుండటంతో ఆయన చర్యను ఎలాగైనా సమర్థించాల్సిందిగా అధికార బీజేపీ నుంచి స్పీకర్ చెప్పలేనంతటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ప్రియాంక అన్నారు. నెపాన్ని కాంగ్రెస్‌పై నెడుతూ అధికార పక్షమే ఆయనతో బలవంతంగా అసంబద్ధ ప్రకటన చేయించిందని మండిపడ్డారు. బిర్లా అలాంటి ప్రకటన చేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ''ప్రత్యేకించి కాంగ్రెస్ మహిళా ఎంపీలపై స్పీకర్ ఆరోపణలు చేశారు. మేమేమన్నా ప్రధానిని అడ్డుకునే వాళ్లమా? లేదంటే నిండు సభలో ఆయనపై చేయి చేసుకునే వాళ్లమా? వాస్తవం ఏమిటంటే మోదీకి ఆ రోజు సభకు వచ్చే ధైర్యమే లేకపోయింది. అందుకే రాకుండా తప్పించుకున్నారు. పైగా దాన్ని సమర్థించేందుకు స్పీకర్‌తో అబద్ధపు ప్రకటన ఇప్పించారు''అని ఆరోపించారు.

విలువను పణంగా పెట్టొద్దు

లోక్‌సభకు వచ్చి విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేకపోయిందని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఎద్దేవా చేశారు. ''మోదీ ప్రజా వ్యతిరేక సర్కారుపై మేం రాజీలేని పోరాటం చేస్తున్నాం. ఆయన నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్నాం. కేవలం ఈ కారణంగానే మమ్మల్ని లక్ష్యం చేసుకున్నారు''అని లేఖలో వారు ఆరోపించారు. ''విపక్ష నేత రాహుల్‌ను నాలుగైదు రోజులుగా సభలో మాట్లాడనివ్వడం లేదు. పాలక పక్షం కోరగానే 8 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారు. కానీ అధికార బీజేపీ సభ్యుడు మాత్రం గత ప్రధానుల గురించి నీచంగా మాట్లాడుతున్నా మీరు అడ్డుకోలేదు''అంటూ బిర్లా తీరును మహిళా ఎంపీలు ఆక్షేపించారు.

సీషెల్స్ అభివృద్ధికి... రూ.1,587 కోట్ల ప్యాకేజీ

అధ్యక్షుడు ప్యాట్రిక్‌తో మోదీ భేటీ

న్యూఢిల్లీ: తూర్పు ఆఫ్రికాకు చెందిన ద్వీప దేశం సీషెల్స్‌కు అభివృద్ధి సాయంగా రూ.1,587 కోట్ల ఆర్థిక ప్యాకేజీని భారత్ ప్రకటించింది. దీని సాయంతో సీషెల్స్‌లో సామాజిక గృహ నిర్మాణం, వృత్తి విద్యా శిక్షణ, ఆరోగ్యం, రక్షణ, సాగరతల భద్రత, ఇ–మొబిలిటీ తదితర రంగాల్లో పలు ప్రాజెక్టులను చేపట్టనున్నారు. భారత్‌లో ఆరు రోజుల పర్యటనలో ఉన్న సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ సోమవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. పలు అంశాలపై నేతలిరువురూ లోతుగా చర్చించారు. ద్వైపాక్షిక వర్తక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎగుమతులు, డేటా షేరింగ్, మారిటైం సైంటిఫిక్ రీసెర్చ్, డిజిటల్ సొల్యూషన్స్ వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య ఏడు ఒప్పందాలు కుదిరాయి. భారత్ సాయంతో సీషెల్స్ తమ దేశంలో సీషెల్స్ హైడ్రోగ్రాఫిక్ యూనిట్ (ఎస్‌హెచ్‌యూ)ను ఏర్పాటు చేయనుంది. భారత్, సీషెల్స్ బంధం సరికొత్త దశలోకి ప్రవేశించిందని భేటీ అనంతరం మోదీ చెప్పారు. ''రెండు దేశాల నడుమ చారిత్రక స్నేహముంది. పరస్పర విశ్వాసముంది. బంగారు భవిష్యత్తుపై ఉమ్మడి సంకల్పముంది. భారత్ సంకల్పించిన మహాసాగర్ (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ అక్రాస్ రీజియన్స్) విజన్‌లో సీషెల్స్ విడదీయలేని భాగం. సముద్రంతో పాటు నేలపై, నింగిలో కూడా ఇరు దేశాల బంధం కొనసాగుతుంది''అని మోదీ స్పష్టం చేశారు. కొలంబో సెక్యూరిటీ ఎన్‌క్లేవ్‌లోకి పూర్తి స్థాయి సభ్య దేశంగా సీషెల్స్‌కు స్వాగతం పలుకుతున్నట్టు చెప్పారు. ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద సీషెల్స్‌కు 1,000 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను అందించనున్నట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ వెల్లడించారు.

ప్యాట్రిక్ హెర్మినీతో ప్రధాని మోదీ చర్చలు

మోదీకి మారిషస్ ప్రధాని ఫోన్

మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ రామ్‌గులామ్ సోమవారం ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. ఇరుదేశాల నడుమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఈ సందర్భంగా నేతలు నిర్ణయించుకున్నారు. వచ్చే వారం ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొనేందుకు నవీన్ భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన్ను స్వాగతించేందుకు ఎదురు చూస్తున్నట్టు మోదీ చెప్పారు.

చంద్రయాన్-4కు స్థలం గుర్తింపు!

బెంగళూరు: చంద్రయాన్–4. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో 2028 లో చంద్రునిపైకి తలపెట్టిన మానవరహిత యాత్ర. దానికి ఇంకా కనీసం రెండేళ్ల సమయముంది. అయినా చంద్రయాన్–4 లాండర్ దిగేందుకు చంద్రునిపై అనువైన ప్రాంతాన్ని అప్పుడే గుర్తించింది! దక్షిణ ధ్రువ ప్రాంతంలో దాన్ని ఎంపిక చేశారు. ''ఇందుకోసం తొలుత చంద్రునిపై మోన్స్ మౌటన్ ప్రాంతంలో ఎంఎం 1, 3, 4, 5... ఇలా మొత్తం నాలుగు స్థలాల్ని షార్ట్ లిస్ట్ చేశాం. వాటి స్వభావం తదితరాలను ఆర్బిటార్ హై రెజల్యూషన్ కెమెరా (ఓహెచ్‌ఆర్‌సీ) ద్వారా లోతుగా వడపోశాం. చివరికి చంద్రుని ఉపరితలంపై లాండింగ్‌కు ఎంఎం 4 సైట్ అత్యంత అనువైనదని గుర్తించాం. దాన్నే ఖరారు చేశాం''అని ఇస్రో అధికారులు తెలిపారు.

ఆస్పత్రిలో పవార్

ఛాతీ ఇన్ఫెక్షన్‌తో చేరిక.. నిలకడగా ఆరోగ్యం

పుణె: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అనారోగ్య సమస్యలతో సోమవారం ఆస్పత్రిలో చేరారు. 85 ఏళ్ల పవార్ దగ్గు, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండటంతో పాటు శ్వాస తీసుకోవడం కష్టంగా మారడంతో బారామతిలోని స్వగృహం నుంచి ఆయన్ను హుటాహుటిన పుణెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. పవార్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ''ఆయనను సాధారణ వార్డులోనే చేర్చి వైద్య చికిత్స అందిస్తున్నాం. పలు పరీక్షలు నిర్వహించాం. వాటి ఫలితాలు వచ్చాక తదుపరి చికిత్సపై నిర్ణయం తీసుకుంటాం'' అని వివరించారు.

సర్‌కు ఆటంకం కలిగిస్తే ఊరుకోం

బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హెచ్చరిక ● జాబితా పూర్తికి మరో వారం గడువు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ విషయంలో ఎన్నికల కమిషన్(ఈసీ), రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. సర్ ప్రక్రియకు అవరోధాలు కలిగించవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అదే సమయంలో, ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈసీ గడువును మరో వారంపాటు పొడిగించింది. ఈ నెల 4వ తేదీన జరిగిన విచారణకు సీఎం మమతా బెనర్జీ స్వయంగా హాజరై వాదనలు వినిపించడం తెల్సిందే. 'వాట్సాప్ ద్వారా కాకుండా ఈసీ అధికారికంగా ఆదేశాలు జారీ చేయాలి. వాటిని ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. మైక్రో అబ్జర్వర్లను తొలగించాలి'అని కోరారు. వీటిపై సుప్రీంకోర్టు కేంద్రం, ఈసీలకు నోటీసులు జారీ చేసింది. సోమవారం వీటిపై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. 'సర్ విషయంలో ఎదురయ్యే ఆటంకాలను తొలగిస్తాం. ఈ విషయంలో ఎటువంటి అడ్డంకులను కలిగించం. ఇందులో మావైఖరి సుస్పష్టం'అని సీజేఐ తెలిపారు. సర్ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం కొనసాగాల్సిందేనని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అవగాహన లేని అధికారులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారు(ఈఆర్వో)లను నియమించిందంటూ ఈసీ తరపున సీనియర్ లాయర్ డీఎస్ నాయుడు అభ్యంతరం తెలపగా మైక్రో అబ్జర్వర్లు ఏకపక్షంగా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారంటూ బెంగాల్ ప్రభుత్వం తరపున న్యాయవాది శ్యామ్ దివాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 14వ తేదీకల్లా పూర్తి చేసి, తుది జాబితా ప్రకటించాల్సి ఉందంటూ ఆయన..స్వల్ప కారణాలు చూపి 1.68 లక్షల పేర్లను తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో, సంబంధిత దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయడానికి, తుది జాబితాకు గడువును మరో ఒక వారం పాటు గడువు పొడిగిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. వెరిఫికేషన్ అనంతరం విడుదల చేసే ఫలితాలను తాము తప్పనిసరిగా పరిశీలిస్తామని, అవసరమైన పక్షంలో జోక్యం చేసుకుంటామని సీజేఐ ప్రకటించారు. ఓటర్ల తుది జాబితాపై అంతిమ నిర్ణయం ఎన్నికల అధికారులకే ఉండాలని స్పష్టం చేసింది. బెంగాల్ ప్రభుత్వం అందజేస్తామంటున్న 8,505 మంది అధికారులకు ఎలాంటి బాధ్యతలను అప్పగించాలో ఈసీయే నిర్ణయిస్తుందని కూడా తెలిపింది. ఓటర్లకు ఈసీ విడుదల చేసిన నోటీసులను కొందరు తగులబెట్టారని లాయర్ డీఎస్ నాయుడు తెలపగా, ధర్మాసనం సీరియస్‌గా తీసుకుంది. ఇటువంటి ఘటనలపై అఫిడవిట్ సమర్పించాల్సిందిగా బెంగాల్ డీజీపీని ఆదేశించింది.

సాక్షి గుంటూరు
మంగళవారం । 10 । ఫిబ్రవరి । 2026



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 538.80 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 12,864 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 36.1380 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5200, గరిష్ట ధర రూ.6800, మోడల్ ధర రూ.6400 వరకు పలికింది.

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబును సోమవారం గుంటూరులోని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చారు. అంబటికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, న్యాయవాదులు పెద్ద ఎత్తున న్యాయస్థానం వద్దకు చేరుకున్నారు. కోర్టు వద్ద పోలీసులను భారీగా మోహరించారు. -గుంటూరు

న్యూస్‌రీల్

మంగళగిరిలో మేఘాలయ ఎన్‌హెచ్‌ఎం బృందం పర్యటన

మంగళగిరిటౌన్:గుంటూరు జిల్లా మంగళగిరిలో మేఘాలయ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) బృందం పర్యటించింది. ఈ మేరకు అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం కింద రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ అవలంబిస్తున్న విధానాలను మంగళగిరిలోని పలు యూపీహెచ్ సెంటర్లలో సోమవారం బృందం సమీక్షించింది. ఇందిరానగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పథకాల అమలు పై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనీమియా కింద గర్భిణులు, బాలింతలు, బాలికలు, విద్యార్థుల్లోని రక్తహీనత తగ్గించేందుకు అందిస్తున్న మాత్రలు, ఇతర చర్యల గురించి వైద్య అధికారులు వివరించారు. కార్యక్రమంలో మేఘాలయ ఎన్‌హెచ్‌ఎం సీనియర్ అధికారులు డాక్టర్ నోవెరినా మరక్, బాదోండర్ షిల్లా, ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూష తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్‌కు జాతీయ గోల్డెన్ మాస్టర్ స్ట్రోక్ అవార్డు



వినుకొండ:క్రియేటివ్ ఆర్ట్స్ అధినేత అంజి ఆకొండి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మాస్టర్ స్ట్రోక్ జాతీయ చిత్రకళా ప్రదర్శనలో వినుకొండ పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారులు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్ గీసిన మహేంద్ర మాత మేదరి చిత్రటానికి గోల్డెన్ స్ట్రోక్ అవార్డు లభించింది. జాతీయ సీనియర్ చిత్రకారులు దాకోజు శివప్రసాద్, వర్ధమాన నటుడు సుబ్బు, ఆర్టిస్ట్ ఆనంద్, ప్రొఫెసర్ సుందర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన జెస్టిస్‌ను పలువురు అభినందించారు.

ఏసీబీ వలలో పంచాయతీరాజ్ ఏఈ

చిలకలూరిపేట: లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సోమవారం చోటు చేసుకుంది. గుంటూరు రేంజ్ ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట పంచాయతీరాజ్ డీఈ కార్యాలయంలో పీవీ లక్ష్మీ సత్యనారాయణాచార్యులు ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఓ అప్రోచ్‌రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ పెద్ద మస్తానయ్యకు రూ.8 లక్షలు బిల్లు చెల్లించేందుకు మూడు శాతం అంటే రూ. 24 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించటంతో, ముందస్తు వ్యూహం ప్రకారం రూ. 24వేలు లంచం తీసుకుంటుండగా ఏఈను పట్టుకున్నారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు నాగరాజు, సుబ్బారావు, సురేష్, మన్మథరావు పాల్గొన్నారు.

గాయత్రీ మాత ఆలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు

గుంటూరురూరల్: చౌడవరం గ్రామం దాసరి పాలెంలో కొలువై ఉన్న ప్రసిద్ధ పంచముఖి గాయత్రీ మాత దేవాలయంలో 74వ బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం గాయత్రీ మాత సూర్యనారాయణస్వామి కల్యాణమహోత్సవ 16 రోజుల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు వెండి పట్టుచీరె అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టుపక్కల గ్రామాలు, నగరంలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఈ మహోత్సవాల నిర్వహణను దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ వడ్డే రామిరెడ్డి, సెక్రటరీ వడ్డే విజయభాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రాష్ట్రంలో అసలు పోలీసు వ్యవస్థ ఉందా..?

హోంశాఖ మాజీ మంత్రి తానేటి వనిత

మీడియాతో మాట్లాడుతున్న హోంశాఖ మాజీ మంత్రి తానేటి వనిత, పక్కన మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, అంబటి కుమార్తె మౌనిక

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : రాష్ట్రంలో అసలు పోలీసు వ్యవస్థ ఉందా అనే అనుమానం కలుగుతోందని హోంశాఖ మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసంపై టీడీపీ నాయకులు దాడి చేయటంతో పాటు, ఆయనపై అక్రమ కేసులు బనాయించిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమవారం సిద్ధార్థర్‌లోని అంబటి నివాసానికి వచ్చి వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ముందుగా దాడి జరిగిన కార్యాలయం, ఇంటిని పరిశీలించారు.

- తానేటి వనిత మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

తిరుమల లడ్డూ ప్రసాదంలో విషయంలో టీడీపీ అబద్ధాలు బయటపడ్డాయని, అసత్యాలు మాట్లాడి తప్పును కప్పిపుచ్చే ప్రయత్నంలో రాష్ట్ర వ్యాప్తంగా రెచ్చగొట్టే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారన్నారు. అసత్యాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీను తొలగించమంటే భౌతిక దాడులకు దిగటం సిగ్గుచేటన్నారు. అంబటి రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

- టీడీపీ అక్రమాల అడుగులకు మడుగులు వత్తుతున్న ప్రతి ఒక్కరూ చట్టం ముందు దోషులుగా నిలబటం తథ్యమన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ పరిపాలన కోసం ప్రజల ఎదురు చూస్తున్నారని చెప్పారు. కచ్చితంగా రానున్న రోజుల్లో టీడీపీ ప్రభుత్వం, అధికారులు చట్టబద్ధంగా మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.
- మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. టీడీపీ తప్పులను ప్రశ్నించిన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై అక్రమ కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు.
- గుంటూరులో వక్ఫ్ ఆస్తులకు అండగా పోరాటం చేస్తున్న నాయకుడు అంబటి రాంబాబు అని తెలిపారు. కేవలం అంబటి ఒక మాట తూలినంత మాత్రాన జరిగిన విధ్వంసం కాదని, పక్కా ప్లాన్ ప్రకారమే ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతున్న ఆయనపై దాడికి పాల్పడ్డారన్నారు. దాడులను ఆయన ఖండించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, అంబటి రాంబాబు కుమార్తె మౌనిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై మల్లేశ్వరుడు

మంగళగిరిటౌన్ : మంగళగిరిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మూడవరోజు స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు దాతలు ఆలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన కీర్తిశేషులు గోలి సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమారులు గోలి చిన్నారావు, గోలి నాగేశ్వరరావు, గోలి సాంబశివరావు, గోలి శ్రీనివాసరావు వ్యవహరించారు. దేవస్థాన ఈ.ఓ. గోపి ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.

శేషవాహనంపై దర్శనమిస్తున్న మల్లేశ్వరుడు

కోలాటం ఆడుతున్న మహిళలు

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

- రేషన్ ఇవ్వకుండానే ఇచ్చినట్లు బయోమెట్రిక్
- వేల టన్నులు రైస్ తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

రేషన్ బియ్యం బస్తాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వం ఉచితంగా అందించే బియ్యంకు అధిక ధరలు ఆశ చూపి లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి కొందరు చీకటి వ్యాపారాన్ని చేస్తున్నారు. పగలు సేకరించిన బియ్యాన్ని రాత్రి సమయంలో దర్జాగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఎవరికి ఇవ్వాల్సినవి వారికి ఇచ్చామంటూ నిర్భీతితో బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారు. కళ్లముందే అన్ని జరుగుతున్నా వారిపై చర్యలు శూన్యం. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థతోపాటు దుగ్గిరాల మండలంలో రేషన్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులు తమ జేబులు నింపుకోవడానికి అడ్డదారులు తొక్కుతూ బయో మెట్రిక్ వేయించుకుని రేషన్ ఇవ్వకుండా అరకొర నగదు ఇచ్చి లబ్దిదారులను మభ్యపెడుతు నెలకు రూ.లక్ష నుంచి రూ.2లక్షలు వెనుకవేసుకుంటున్నట్లు సమాచారం. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో 136 రేషన్ షాపులు ఉండగా, సుమారు 70వేలకు పైగా రేషన్ కార్డు దారులు ఉన్నారు. వీరికి నెలకు సుమారు 10వేల టన్నులకు పీడీఎస్ బియ్యం రేషన్ బియ్యంగా ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

- ఇటీవల కాలంలో గుంటూరుకు చెందిన ఓ మహిళ ఓ యూట్యూబ్ చానల్ నడుపుతూ తనతో పాటు మరికొంతమందిని విలేకరులుగా చేర్చుకుని మంగళగిరి నియోజకవర్గంతో పాటు కృష్ణ, గుంటూరు జిల్లాల్లో పలుచోట్ల రేషన్ డీలర్లను బెదిరించి నగదు వసూలు చేసినట్లు ఆయా జిల్లాల్లో పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు అందాయి.

ఇదే క్రమంలో పట్టణంలోని ఓ మహిళ నిర్వహిస్తున్న రేషన్ షాపునకు యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్న మహిళతో పాటు పలువురు నకిలీ విలేకరులు వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ మహిళ వారి మాట వినకపోవడంతో వారే అధికారులకు ఫోన్ చేయగా అధికారులు వచ్చి తనిఖీలు చేశారు. ఆ ఒక్క రేషన్‌షాపులో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జరిగిన సంఘటనపై సివిల్ సప్లయ్ అధికారులు కేసు నమోదు చేశారు.

ముందుగానే బయోమెట్రిక్...

60ఏళ్లు దాటిన వృద్ధులు, మంచానపడ్డ వారికి ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాలనే నిబంధనను ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఈ నిబంధన కొంతమంది డీలర్లకు బాగా కలసి వచ్చింది. నేరుగా ఈ–పాస్ మిషన్‌ను లబ్ధిదారుని ఇంటికి తీసుకువెళ్లి వేలిముద్ర తీసుకుని ఎంతో కొంత సొమ్ము ముట్టచెప్పి వచ్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ షాపు యజమానులు సివిల్ సప్లయిస్ నుంచి బియ్యం రాగానే ఎవరైతే బియ్యం తీసుకోరో వారిని గుర్తించి వారి ఇంటికి వెళ్లి వేలిముద్రలు వేయించుకుని ఒక కేజీ బియ్యానికి రూ 5 నుంచి రూ.10 చెల్లిస్తున్నారు. బియ్యంతోపాటు పంచదార అమ్ముకుంటున్నారు. మిల్లర్లకు కేజీ రూ.25 నుంచి రూ.35 వరకు అమ్ముతున్నారు.

బయటకు తరలించేది ఇలా...

రేషన్ డీలర్లు సేకరించిన బియ్యాన్ని హోటల్స్‌కు పంపగా.. మిగిలిన బియ్యాన్ని మండలంలో ఓ వ్యక్తి సేకరించి నియోజకవర్గంలోని దుగ్గిరాల, మంగళగిరి రూరల్ పరిధిలోని పలు మిల్లులకు అర్ధరాత్రి ఆటోల ద్వారా తరలిస్తున్నారు. ఎక్కడా కూడా పోలీసులు కానీ, సివిల్ సప్లయ్ అధికారులు గానీ తనిఖీలు నిర్వహించకపోవడంతో రేషన్ మాఫియాకు హద్దు లేకుండా పోయింది. ఒక లారీ ట్రిప్ గమ్యస్థానానికి చేరితే రాత్రికిరాత్రే రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. దీంతో కేసులు పెట్టినా పట్టించుకోకుండా ఈ చీకటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అదేవిధంగా పంచదార నిల్వలను పెద్ద పెద్ద దుకాణాలకు పంపించి, లావుగా ఉన్న పంచదారలో ఈ పంచదారను కలిపి కల్తీ చేస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.

మంగళగిరి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ గోడౌన్

వెట్టి చాకిరి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

వెట్టిచాకిరీ వ్యవస్థకు సంబంధించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా వెట్టి చాకిరి వ్యవస్థ (బాండెడ్ లేబర్) నిర్మూలనపై కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే వెట్టి చాకిరీ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థ ఒక సామాజిక దురాచారమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, గౌరవప్రద జీవనంకు అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వం వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం ద్వారా ఈ వ్యవస్థను పూర్తిగా నిషేధించిందన్నారు. చట్టంపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం, బాధితులను గుర్తించడం, పునరావాసం కల్పించడంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా బలవంతపు కార్మిక వ్యవస్థ, అప్పుల బానిసత్వం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాధితులకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. సామాజిక సంస్థలు, స్వచ్ఛందసంస్థలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడపాలనే లక్ష్యంతో సమాజం ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు. డీఆర్వో షేక్‌ఖాజావలి, కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ.గాయత్రి దేవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, డీపీఓ బీవీ నాగ సాయి కుమార్, కార్మిక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉబర్ తరహాలో డ్రోన్ సేవలు

అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ఉబర్ తరహాలో డ్రోన్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఈ డ్రోన్ సేవలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఉబర్ క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు పొందవచ్చన్నారు. ఎప్పుడైనా, ఎక్కడైనా రాష్ట్రంలో సేవలు లభిస్తాయని చెప్పారు. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు డ్రోన్ ద్వారా చల్లడం వంటి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. ఒకే యాప్‌లో అనేక సేవలు లభిస్తాయని చెప్పారు. డ్రోన్ వినియోగం వల్ల సమయం, కూలి ఆదా అవుతుందని అన్నారు. సమీప ప్రాంతంలోనే అద్దెకు డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్లే స్టోర్‌లో ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా లేదా సంబంధిత క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం వల్ల డ్రోన్ సేవలు పొందవచ్చన్నారు.

యువత జీవితాలను కాపాడుదాం

మాదక ద్రవ్యాలను నివారించి, యువత జీవితాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంస్థలలో మాదక ద్రవ్యాలు ప్రవేశించకుండా గట్టి నిఘా పెట్టాలని తెలిపారు.

- ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. 118 మందిపై కేసులు నమోదు చేశామని, గుంటూరు పట్టణంలో 28 హాట్‌స్పాట్‌లు, 92 ఉపయోగంలో లేని భవనాలు గుర్తించామని చెప్పారు.

అర్జీల పరిష్కారంలో సమన్వయం అవసరం

డీఆర్వో షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారానికి శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని డీఆర్వో షేక్ ఖాజావలి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడుతూ అర్జీలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల ఆకాంక్షలను అధికారులు అర్థం చేసుకుని సేవలందించాలన్నారు. ప్రభుత్వ సర్వీసులు పొందే హక్కు ప్రజలకుందని పేర్కొన్నారు. అర్జీ అందిన వెంటనే సంబంధిత అధికారులు సిబ్బందికి బదలాయించి పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం పీజీఆర్ఎస్‌కు 357, రెవెన్యూ క్లినిక్స్‌లో 109 మొత్తం 466 అర్జీలను డీఆర్వోతో పాటు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా అధికారులు పరిశీలించారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించండి

1986–87 సంవత్సరంలో వెంగళాయపాలెంలోని శ్రీశైలం కాలనీలో ది ప్రాజెక్ట్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో 320 మంది ప్రభుత్వ ఉద్యోగులు లే అవుట్ వేసుకున్నాం. తర్వాత కాలంలో అనేక క్రయ విక్రయాలు జరిగాయి. ఇటీవల ప్రభుత్వం దానిని నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీనిని నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయండి

– వెంగళాయపాలెం ప్లాట్ ఓనర్స్....

నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం

నవీన్ అనే వ్యక్తి వాస్తవానికి తెలగ (ఓసి) కులానికి చెందినవాడు. 2007 సంవత్సరంలో నకిలీ సర్టిఫికెట్‌తో విద్యుత్ శాఖలో ఉద్యోగం పొందాడు. దీనికి సంబంధించి ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారం కూడా ఉంది. దళితులకు చెందాల్సిన ఉద్యోగానికి నకిలీ సర్టిఫికేట్లతో ఉద్యోగం పొందిన నవీన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఎస్.వెంకటేశ్వరరావు, యనమదల, ప్రత్తిపాడు మండలం,

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

అమరావతి: ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం పొలం పనులు ముగించుకుని కాలువగట్టుపై వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడటంతో పామలూరి వెంకటేశ్వరరావు (45) అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న అమరావతి పోలీసులు మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి శవపంచనామా చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు వెంకటేశ్వరరావు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, వివాహితైన ఇద్దరు పిల్లలు ఉన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ.
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం ... ఋణగ్రహీతలు, కో-ఆబ్లిగెంట్స్, తనఖాదారులు మరియు హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదేమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం **"ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తము** కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ** వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. **13-03-2026**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడ మైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేదీ, రిజర్వు ధర, ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.

ఇ-వేలం తేది & సమయం : 13-03-2026, మ॥ 12.00గం. నుండి సా॥ 05.00 గం. వరకు
(10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

1) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : ఋణగ్రహీత : 1ఎ) శ్రీ బండ్ల వెంకటేశ్వర రావు, తండ్రి : నాగేశ్వరరావు, ఆర్ఎస్ నెం. 7/సి, డోర్ నెం. 5-90-57, ప్లాట్ నెం. 03, ఫ్లాట్ నెం. 10, నాల్గవ అంతస్తు, యోగేష్ ఎస్టేట్, 5/3, చంద్రమౌళి నగర్, గుంటూరు, ఏ.పి. - 522 006. **1బి) శ్రీమతి బండ్ల రాధిక**, భర్త : వెంకటేశ్వరరావు, ఆర్ఎస్ నెం. 7/సి, డోర్ నెం. 5-90-57, ప్లాట్ నెం. 03, ఫ్లాట్ నెం. 10, నాల్గవ అంతస్తు, యోగేష్ ఎస్టేట్, 5/3, చంద్రమౌళి నగర్, గుంటూరు, ఏ.పి. - 522 006. **సహ-ఋణగ్రహీత / హామీదారు: 2(ఎ) శ్రీ మంచికలపూడి శ్రీనివాసరావు**, తండ్రి : నరసింహారావు, ఫ్లాట్ నెం. 6, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్, 5వ అంతస్తు, రాజేంద్ర నగర్, గుంటూరు, ఏ.పి. - 522 006.

బకాయి మొత్తం : తేది. 30.06.2025 నాటికి రూ. 39,58,772.87 పై. (అక్షరాలా ముప్పై తొమ్మిది లక్షల యాభై ఎనిమిది వేల ఏడు వందల డెబ్బై రెండు రూపాయల ఎనభై ఏడు పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, గుంటూరు రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు సిటీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5/3, చంద్రమౌళి నగర్‌లో ఉన్న, డి. నెం. 7/సి వద్ద ఎకరా 5.87 సెంట్ల విస్తీర్ణంలో నుండి ఎకరా 3.07 1/2 సెంట్ల విస్తీర్ణంలోని భూమి అందలి ప్లాట్ నెం. 3, మున్సిపల్ డి.నెం. 5-90-57 మరియు పాత అసెస్‌మెంట్ నెం. 5082, కొత్త అసెస్‌మెంట్ నెం. 20232 గల యోగేష్ ఎస్టేట్‌కు చెందిన ఆ భూభాగం యొక్క సరిహద్దులు : **తూర్పు:** బోడపాటి అరుణకు చెందిన ఆస్తి, **దక్షిణం:** 40 అ॥ల వెడల్పు గల మున్సిపల్ రోడ్డు, **పడమర:** మిట్టపల్లి రమేష్‌కు చెందిన ఆస్తి, **ఉత్తరం:** బోయపాటి అంజనేయులుకు చెందిన ఆస్తి. ఈ సరిహద్దుల లోపల గల స్థలంలో కొలతల ప్రకారం 896.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలం మరియు దానిలోని సులభ హక్కులు, అనుబంధ హక్కులు మొదలైన వాటితో సహా ఉమ్మడి మరియు కామన్ హక్కులతో కూడిన ఆస్తి.

షెడ్యూల్-బి : పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తి నందు మొత్తం 896.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలంలో 89.6 చ॥గ॥ల అవిభక్త, పేర్కొనబడని మరియు కనిపించని వాటా ఆస్తితో సహా అందలి నిర్మించిన యోగేష్ ఎస్టేట్ నందు స్టిల్ట్, గ్రౌండ్, మొదటి, రెండవ మరియు మూడవ అంతస్తుల పైన నాల్గవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 10 గా గల ఒక మూడు పడకల గదుల ఫ్లాట్, గోడలతో సహా 2000.00 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో మరియు సుమారు 500.00 చ॥అ॥ల ఒక కార్ పార్క్ స్థలం యొక్క ఉమ్మడి ప్రాంతాలతో సహా. పైన పేర్కొన్న స్థల వాటా కోసం మొత్తం నిర్మాణంలో నిర్మించబడింది (రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 14278/2014 తేదీ 25.1.2024). దీనికి **సరిహద్దులు: తూర్పు:** గ్రౌండ్ నందు ఖాళీ స్థలం, **దక్షిణం :** గ్రౌండ్ నందు ఖాళీ స్థలం, **పడమర:** ఉమ్మడి మెట్ల మార్గం, ఉమ్మడి కారిడార్, ఉమ్మడి లిఫ్ట్, **ఉత్తరం:** గ్రౌండ్‌లో ఖాళీ స్థలం.

కాంటాక్ట్ : శ్రీ ఎస్. గిరీష్ ప్రసాద్ (డీలింగ్ ఆఫీసర్) : **+91 9573621034**

రిజర్వు ధర : రూ. 95,79,500/- | ధరావత్తు : రూ. 9,57,950/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 96,000/-

2) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) శ్రీ కాకర్ల వెంకట శివ రామారావు, తండ్రి : కృష్ణమూర్తి, డి.నెం. 19-3-35, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఎపి- 522 003. **2. శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి**, భర్త : వెంకట శివ రామారావు, డి.నెం. 19-3-35, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఎపి- 522 003. **సహ-ఋణగ్రహీత / హామీదారు : శ్రీ బచ్చు హరి వెంకట రామారావు**, తండ్రి : కృష్ణమూర్తి, డి.నెం. 24-9-23, ఆర్.అగ్రహారం, గుంటూరు, ఎపి-522002.

బకాయి మొత్తం : తేది. 30.06.2025 నాటికి రూ. 69,92,077.06 పై. (అక్షరాలా అరవై తొమ్మిది లక్షల తొంభై రెండు వేల డెబ్బై ఏడు రూపాయల ఆరు పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : ఐటమ్ నెం. 1ఎ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుంటూరు నగరం, సంగడిగుంట, పదార్తివారి వీధి, పాత వార్డు నెం. 14, బ్లాక్ నెం. 5, టి.ఎస్. నెం. 350, డోర్ నెం. 19-3-35 మరియు 19-3-36, అసెస్‌మెంట్ నెం. 26184 మరియు 26185 నందు శ్రీ కాకర్ల వెంకట శివ రామారావు గారి పేరు మీద ఉన్న గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తుతో కూడిన 105.3/9 చ॥గ॥ల విస్తీర్ణంలో గల ఆర్‌సిసి రూఫ్ నివాస భవనం (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 12663/2010, తేదీ 27.12.2010 ప్రకారం) : **తూర్పు:** కాకర్ల కాశీ రత్న కుమారి గారి ఆస్తి, **పడమర:** వంగేటి వెంకట రామకృష్ణ గారి ఆస్తి, **ఉత్తరం:** అబ్దుల్ రెహమాన్ గారి గోడ ఆస్తి, **దక్షిణం :** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు.

ఐటమ్ నెం. 1బి : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు నగరం, సంగడిగుంట, పదార్తివారి వీధి, పాత వార్డ్ నెం. 14, బ్లాక్ నెం. 5, టి.ఎస్. నెం. 360, డోర్ నెం. 19-3-37, అసెస్‌మెంట్ నెం. 26186 చిరునామాలో శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి గారి పేరు మీద ఉన్న గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తుతో కూడిన 104 1/2 చ॥గ॥ల విస్తీర్ణంలో ఉన్న ఆర్‌సిసి రూఫ్ నివాస భవనం. దీనికి సరిహద్దులు (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 12664/2010, తేదీ 27.12.2010 ప్రకారం): **తూర్పు :** కాకుమాను కృష్ణమూర్తి గారి గోడ ఆస్తి, **పడమర:** కాకర్ల వెంకట శివ రామారావు గారి ఆస్తి, **ఉత్తరం:** అబ్దుల్ రెహమాన్ గారి గోడ ఆస్తి, **దక్షిణం :** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు. మొత్తం విస్తీర్ణం: 209.83 చ॥గ॥లు.

గమనిక : **గుంటూరు గౌరవనీయ నాల్గవ అదనపు జిల్లా జడ్జి వారిచే ఓ.ఎస్.నెం. 05/2023లో ఐ.ఎ. నెం. 94/2023 ద్వారా తేది : 24-01-2023 న జారీచేయబడిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఆస్తి నిషేధిత జాబితాలో ఉన్నది.**

కాంటాక్ట్ : శ్రీ ఎస్. గిరీష్ ప్రసాద్ (డీలింగ్ ఆఫీసర్) : **+91 9573621034**

రిజర్వు ధర : రూ. 1,40,15,650/- | ధరావత్తు : రూ. 14,01,565/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 1,45,000/-

3) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : ఋణగ్రహీత : 1. మెసర్స్ రామకృష్ణ ట్రేడర్స్, రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 4/132, షాపు నం. 12 & 13భవానీ గుడి ఎదురుగా, సప్తగిరి కళ్యాణ మండపం, మెయిన్ రోడ్, నల్లపాడు, గుంటూరు, ఎపి- 522 004. **1ఎ) శ్రీ కాకర్ల వెంకట శివ రామారావు**, తండ్రి : కృష్ణమూర్తి (మేనేజింగ్ పార్టనర్) డి.నెం. 19-3-35, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఎపి - 522003, **1బి) శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి (పార్టనర్)** భర్త : వెంకటశివ రామారావు, డి.నెం. 19-3-35, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఎపి- 522 003. **సహ ఋణగ్రహీత / హామీదారు : 1. శ్రీ కాకర్ల వెంకటశివ రామారావు**, తండ్రి : కృష్ణమూర్తి, డి.నెం. 19-3-35, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఎపి- 522 003. **2. శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి**, భర్త వెంకటశివ రామారావు, డి.నెం. 19-3-35, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఎపి- 522 003.

బకాయి మొత్తం : తేది. 30.06.2025 నాటికి రూ. 6,17,48,381.49 పై. (అక్షరాలా ఆరు కోట్ల పదిహేడు లక్షల నలభై ఎనిమిది వేల మూడు వందల ఎనభై ఒక్క రూపాయి నలభై తొమ్మిది పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : ఆస్తి నెం. 1 : షెడ్యూల్ 1ఎ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు నగరం, ఆనందపేట ఎక్స్‌టెన్షన్, పొన్నూరు రోడ్డులో బ్లాక్ నెం. 11 మరియు వార్డ్ నెం. 9, డి. నెం. 17-11-19, రీసర్వే టి.ఎస్. నెం. 778/3 ప్రకారం టి.ఎస్. నెం. 778/3ఎఫ్, 778/3జి మరియు 778/3హెచ్ లలో ఉన్న మొత్తం 12150 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలంలో 44.00 చ॥గ॥ల అవిభక్త మరియు పేర్కొనబడని స్థలం ఈ క్రింది సరిహద్దుల్లో ఉంది:- (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4618/2009, తేదీ 28.07.2009) భూమికి సరిహద్దులు: **తూర్పు:** రామగిరి రామారావు మరియు ఇతరుల ఆస్తి - 129 అ॥లు, **దక్షిణం :** ఎ.పి. ట్రాన్స్‌కో వారి ఆస్తి, అక్కడి నుండి బచ్చు శ్రీరాములు నుండి ఎస్.కె. మునీర్ మరియు ఇతరులకు అమ్మిన స్థలం - 770 అ॥లు, **పడమర:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు -140 అ॥లు, **ఉత్తరం:** రెండవ యజమానికి చెందిన స్థలం - 68 అ॥లు, **మళ్ళీ పడమర:** రెండవ యజమానికి చెందిన స్థలం - 25 అ॥లు, **మళ్ళీ ఉత్తరం:** అబ్దుల్ హాకీంకు చెందిన స్థలం - 811 అ॥. ఈ సరిహద్దుల లోపల మొత్తం 12150 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలంలో విక్రేతలు మరియు డెవలపర్‌కు చెందిన 8140 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలంలో నుండి 44 చ॥గ॥లు లేదా 36.78 చ॥మీ॥ల విస్తీర్ణంలోని అవిభక్త, పేర్కొనబడని మరియు విభజించడానికి వీలుకాని వాటా స్థలం, దానికి చెందిన అన్ని ఈజ్‌మెంట్ హక్కులు మరియు సౌలభ్య హక్కులతో సహా.

షెడ్యూల్ 1బి : మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదించిన ప్లాన్ ప్రకారం బ్లాక్ నెం. 3లోని ఫ్లాట్ నెం. 102 మరియు వర్క్ ప్లాన్ ప్రకారం 6వ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 102, పంచవటి (పొన్నూరు రోడ్డు) డోర్ నెం. 17-11-19లో, ప్రతిపాదిత 1100 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో ఉన్నది, ఇది పైన పేర్కొన్న సైటు వాటా నందు సదరు నిర్మాణంలో కేటాయించబడింది. **హద్దులు : తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర:** సాధారణ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దుల లోపల మొత్తం 12150 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం విస్తీర్ణంలో విక్రేతలు మరియు డెవలపర్ల వాటా అయిన 8140 చ॥గ॥లు స్థలంలో నుండి 44 చ॥గ॥లు లేదా 36.78 చ॥మీ॥ల అవిభక్త, పేర్కొనబడని మరియు విభజించడానికి వీలుకాని సైటు వాటా, దానికి చెందిన అన్ని ఈజ్‌మెంట్ హక్కులు మరియు అనుబంధ హక్కులతో సహా.

రిజర్వు ధర : రూ. 25,62,750/- | ధరావత్తు : రూ. 2,56,275/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 26,000/-

ఆస్తి - 2 : గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్ డిస్ట్రిక్ట్, కొత్త గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అగతవరప్పాడు గ్రామం, డి.నెం.148, సబ్ డివిజన్ తర్వాత ఆర్ఎస్ నెం. 148/1లో గల ఎకరా 11.98 సెంట్ల విస్తీర్ణంలో నుండి ఎకరా 3.00 సెంట్ల భూమి, మరియు ఆర్ఎస్ నెం.156/బిలో గల ఎకరా 7.56 సెంట్ల విస్తీర్ణంలో నుండి ఎకరా 0.50 సెంట్ల భూమి. ఈ రెండు ఆర్ఎస్ నంబర్లలోని మొత్తం ఎకరా 3.50 సెంట్ల భూమిని ప్లాట్లుగా విభజించగా, ప్లాట్ నెం. 16, 17 నందు మొత్తం 555.8 చ॥గ॥ల 11 అంగుళాల విస్తీర్ణం గల స్థలం దానికి సమీప డి.నెం. 15/16/158/1. శ్రీ కాకర్ల వెంకట శివ రామారావు, తండ్రి : కృష్ణమూర్తి గారి పేరు మీద ఉన్నది. దీనికి సరిహద్దులు : (రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం. 10147/2014) **ఆస్తికి సరిహద్దులు: తూర్పు:** మోపర్తి వెంకట సుబ్బయ్య గారికి చెందిన భూమి - 83.0 అ॥లు, **దక్షిణం :** ప్లాన్ ప్రకారం ప్లాట్ నెం. 18 స్థలం - 60.06 అ॥లు, **పడమర :** 22 అ॥ల వెడల్పు గల రహదారి - 83.03 అ॥లు, **ఉత్తరం:** చిగురుపాటి బాపయ్య గారికి చెందిన భూమి - 60.06 అ॥.

రిజర్వు ధర : రూ. 1,34,64,000/- | ధరావత్తు : రూ. 13,46,400/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 1,35,000/-

ఆస్తి - 3 : శ్రీ కాకర్ల కాశీ రత్నకుమారి గారి పేరిట గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా., సత్తెనపల్లె సబ్ డిస్ట్రిక్ట్, కంకణాలపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో, కంకణాలపల్లి శివారు, వెన్నాదేవి గ్రామంలో, కంకణాలపల్లి గ్రామం ఆర్.ఎస్.నెం. 215/1 వద్ద 750.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము దానికి సమీప డి.నెం. 3-204. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4836/1999) **తూర్పు :** కాకర్ల వెంకట శివ రామారావు నుండి విక్రేతకు బహుమతిగా ఇచ్చిన స్థలం, **దక్షిణం :** చీమలమర్రి జయరామి రెడ్డి అలియాస్ సైదా రెడ్డి గారి ఆస్తి, **పడమర :** మేడంశెట్టి వెంకటేశ్వర్లు గారి ఆస్తి, **ఉత్తరం:** హైవే రోడ్.

రిజర్వు ధర : రూ. 38,25,000/- | ధరావత్తు : రూ. 3,82,500/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 39,000/-

ఆస్తి - 4 : శ్రీ కాకర్ల కాశి రత్నకుమారి గారి పేరిట గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా., సత్తెనపల్లె సబ్ డిస్ట్రిక్ట్, కంకణాలపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో, కంకణాలపల్లి శివారు, వెన్నాదేవి గ్రామంలో, కంకణాలపల్లి గ్రామం ఆర్.ఎస్.నెం. 215/1 వద్ద 750.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము దానికి సమీప డి.నెం. 3-204. (రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4837/1999) **తూర్పు:** ఊటుకూరి అనసూర్యమ్మ నుండి విక్రేత వారు కొనుగోలు చేసిన స్థలం, **దక్షిణం :** చీమలమర్రి జయ రామిరెడ్డి అలియాస్ సైదా రెడ్డి గారి ఆస్తి, **పడమర :** మేడంశెట్టి వెంకటేశ్వర్లు గారి ఆస్తి, **ఉత్తరం:** హైవే రోడ్

రిజర్వు ధర : రూ. 38,25,000/- | ధరావత్తు : రూ. 3,82,500/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 39,000/-

ఆస్తి - 5 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, సత్తెనపల్లి సబ్ డిస్ట్రిక్ట్, సత్తెనపల్లి మున్సిపల్ ఏరియా, సత్తెనపల్లి సర్వే నెం. 207/ఎ లోని మొత్తం ఎకరా 11.88 సెంట్ల విస్తీర్ణంలో (ఎకరా 11.88 సెంట్లు - ఎకరా 0.27 సెంట్లు = 11.61 సెంట్లు), అందులో మహారాష్ట్ర వీధిలోని 2వ వార్డులో, ఇంటి నెం. 18-3-1/1కి ఉత్తరాన ఉన్న శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి పేరు మీద ఉన్న 454 చ॥గ॥ల ఖాళీ స్థలం యొక్క సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి - (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2144/2005) రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2144/2005 ప్రకారం సరిహద్దులు : తూర్పు : బజారు - 48 అ॥లు, దక్షిణం : ప్రజాపత్ గోపి గారికి చెందిన ఇల్లు - 84 అ॥లు, పడమర : అదే తేదీన విక్రేతలు షేక్ మహబుల్లాకు ఇదే డోర్ నంబర్‌లో అమ్మిన స్థలం - 48 అ॥లు, ఉత్తరం: విక్రేతలు అదే రోజున ప్రస్తుత టైటిల్ హోల్డర్‌కు అమ్మిన స్థలం - 86 అ॥లు. స్థలంలోని వాస్తవ సరిహద్దులు : **తూర్పు :** మున్సిపల్ రోడ్డు - సుమారు 44 అ॥లు, **దక్షిణం:** ప్రజాపత్ గోపికి చెందిన ఆస్తి - సుమారు 74 అ॥లు, **పడమర :** మున్సిపల్ రోడ్డు - సుమారు 44 అ॥లు, **ఉత్తరం:** శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారికి చెందిన ఆస్తి - సుమారు 74 అ॥లు. (ఈ సరిహద్దుల లోపల సుమారు 361.75 చ॥గ॥ల విస్తీర్ణం ఉంది)

రిజర్వు ధర : రూ. 72,25,850/- | ధరావత్తు : రూ. 7,22,585/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 75,000/-

ఆస్తి - 6 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, సత్తెనపల్లి సబ్ డిస్ట్రిక్ట్, సత్తెనపల్లి మున్సిపల్ ఏరియా, సత్తెనపల్లి సర్వే నెం. 207/ఎ లోని మొత్తం ఎకరా 11.88 సెంట్ల విస్తీర్ణంలో (ఎకరా 11.88 సెంట్లు - ఎకరా 0.27 సెంట్లు = 11.61 సెంట్లు), అందులో మహారాష్ట్ర వీధిలోని 2వ వార్డులో, ఇంటి నెం. 18-3-1/1కి ఉత్తరాన ఉన్న శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి పేరు మీద ఉన్న 454 చ॥గ॥ల ఖాళీ స్థలం యొక్క సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి - (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2143/2005) రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2144/2005 ప్రకారం సరిహద్దులు : తూర్పు : బజారు - 48 అ॥లు, దక్షిణం : ప్రజాపత్ గోపి గారికి చెందిన ఇల్లు - 84 అ॥లు, పడమర : అదే తేదీన విక్రేతలు షేక్ మహబుల్లాకు ఇదే డోర్ నంబర్‌లో అమ్మిన స్థలం - 48 అ॥లు, ఉత్తరం: బజారు - 48 అ॥లు, స్థలంలోని వాస్తవ సరిహద్దులు : **తూర్పు :** మున్సిపల్ రోడ్డు - సుమారు 53 అ॥లు, **దక్షిణం:** శ్రీమతి కాకర్ల కాశీరత్న కుమారి గారికి చెందిన ఆస్తి - సుమారు 74 అ॥లు, **పడమర :** మున్సిపల్ రోడ్డు - సుమారు 53 అ॥లు, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్డు - సుమారు 74 అ॥లు. (ఈ సరిహద్దుల లోపల సుమారు 435.77 చ॥గ॥ల విస్తీర్ణం ఉంది)

రిజర్వు ధర : రూ. 85,18,700/- | ధరావత్తు : రూ. 8,51,870/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 86,000/-

గుంటూరు గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తి వారిచే ది. 15.05.2023 తేదీన జారీ చేయబడిన ఓ.ఎస్ నెం. 31/2023లోని ఐఏ నెం. 341/2023 ప్రకారం ఆస్తి నెం. 1 నిషేధిత జాబితాలో ఉంది.
గుంటూరు గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తి వారిచే ది. 24.01.2023 తేదీన జారీ చేయబడిన ఓ.ఎస్ నెం. 05/2023లోని ఐఏ నెం. 94/2023 ప్రకారం ఆస్తి నెం. 2 నిషేధిత జాబితాలో ఉంది.
గుంటూరు గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తి వారిచే ది. 06.05.2023 తేదీన జారీ చేయబడిన ఓ.ఎస్ నెం. 31/2023లోని ఐఏ నెం. 341/2023 ప్రకారం ఆస్తి నెం. 3 నిషేధిత జాబితాలో ఉంది.
గుంటూరు గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తి వారిచే ది. 06.05.2023 తేదీన జారీ చేయబడిన ఓ.ఎస్ నెం. 31/2023లోని ఐఏ నెం. 341/2023 ప్రకారం ఆస్తి నెం. 4 నిషేధిత జాబితాలో ఉంది.
గుంటూరు గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తి వారిచే ది. 19.04.2023 తేదీన జారీ చేయబడిన ఓ.ఎస్ నెం. 31/2023లోని ఐఏ నెం. 341/2023 ప్రకారం ఆస్తి నెం. 5 నిషేధిత జాబితాలో ఉంది.
గుంటూరు గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తి వారిచే ది. 19.04.2023 తేదీన జారీ చేయబడిన ఓ.ఎస్ నెం. 31/2023లోని ఐఏ నెం. 341/2023 ప్రకారం ఆస్తి నెం. 6 నిషేధిత జాబితాలో ఉంది.

కాంటాక్ట్ : శ్రీ ఎస్. గిరీష్ ప్రసాద్ (డీలింగ్ ఆఫీసర్) : **+91 9573621034**

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://baanknet.com** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : **https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx** నందు చూడగలరు. అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం **Mail ID: arb.vijayawada@unionbankofindia.bank.in** లలో సంప్రదించవచ్చు.

తేది : **03-02-2026** | అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ

అంతర్జాతీయస్థాయికి తెలుగు నాటకం

మానవీయ విలువలు చాటిన రష్యన్ నాటకం 'ఏ వెరీ సింపుల్ స్టోరీ'

ఏ వెరీ సింపుల్ స్టోరీ నాటకంలో ఓ సన్నివేశం

నగరంపాలెం: నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా/వేదిక (తెలుగు నాటక పరిషత్‌ల సంఘం) సంయుక్తంగా మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న భారత్ రంగ్ మహోత్సవ్ – అంతర్జాతీయ నాటక ఉత్సవం నాలుగో రోజుకి చేరింది. సోమవారం జరిగిన సభకు వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షత వహించగా, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వైద్యురాలు ముత్తవరపు భార్గవిచౌదరి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సభలో తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలుగు నాటకం అంతర్జాతీయ స్థాయికి సాటి అని నిరూపించేలా భారత్ రంగ్ మహోత్సవ్ కొనసాగుతుందని అన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో నాటక రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో అంతర్జాతీయ నాటకోత్సవాలను ఏపీకి తేవడం అభినందనీయమన్నారు. సీనియర్ కళాకారులు సుబ్బరాయశర్మ, బుద్దాల వెంకట్రావు, వి.పురుషోత్తమం, దేవేంద్రలను సత్కరించారు. అనంతరం 'ఏ వెరీ సింపుల్ స్టోరీ' అనే రష్యన్ నాటకం ప్రదర్శించారు. రష్యన్ దర్శకుడు అలెక్సి బ్లాకి అద్భుత సృజన దృశ్యరూపంగా మలిచారు. మనుషుల స్వార్థానికి, జంతువుల నిస్వార్థ ప్రేమకు మధ్య ఉన్న సన్నని గీతను నాటకం ఆవిష్కరించింది. కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా భాషా సరిహద్దులను చెరిపేస్తూ అద్భుత అభినయంతో కరుణ, స్నేహం, పరస్పర అవగాహనే జీవిత పరమార్థమని ఈ నాటకం చాటిచెప్పింది.

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ సమావేశం

సమావేశంలో కమిటీ సభ్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి సీతానగరంలోని సీతా భవన్‌లో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యక్రమాలపై సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆరు నెలల కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికల ప్రకారం మార్చి 8వ -10 తేదీ వరకు కంచి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి స్వామి వారి సూచనల మేరకు ప్రకాశం బ్యారేజ్ నుంచి హంసల దీవి వరకు దేవత వృక్షాలను నాటడం జరుగుతుందని తెలిపారు. ఆషాఢ మాసం వ్యాస పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో ప్రతి దేవాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. గ్రామాల కేంద్రంగా ఉన్న దేవాలయాల్లో నిరంతర పూజా కార్యక్రమాలు, దీప ప్రజ్వలనలు, ధూపదీప నైవేద్యాలు నిరాటంకంగా కొనసాగేందుకు ఆర్థిక సహకారం అందించే పెద్దల మద్దతుతో చర్యలు తీసుకుంటామన్నారు. ట్రస్ట్ కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు

క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: గతనెల 30 నుంచి ఈనెల రెండు వరకు రాజస్థాన్ అజ్మీర్‌లోని పటేల్ సింథటిక్ స్టేడియంలో ఆల్ ఇండియా పోలీస్ అథ్లెటిక్స్ పోటీలు జరగ్గా, గుంటూరు జిల్లా పోలీసులు ప్రతిభ చాటారు. పలు పోటీల్లో పతకాలు సాధించిన ఏఆర్ హెచ్‌సీ ఎండీ షాహిదుల్లా (బంగారు పతకం), కానిస్టేబుల్ ఎం.లక్ష్మయ్య (వెండి పతకం), విశేష ప్రతిభ చాటిన ఏఎస్ఐ ఎం.సాంబశివరావును సోమ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించి, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు, ప్రతిష్ఠలు తేవాలన్నారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

సమస్యలు పరిష్కరించి..ఆకలి తీర్చాలని విజ్ఞప్తి

చీపుర్లతో రోడ్లు శుభ్రం చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

కొరిటెపాడు(గుంటూరు): దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు శ్యామలానగర్‌లోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. చొక్కాలు విప్పి చీపుర్లు చేతబట్టి రోడ్లు శుభ్రం చేస్తూ, సమస్యలు పరిష్కరించి తమ ఆకలి తీర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏలూరు, కోనసీమ జిల్లాలకు చెందిన పీఏసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ వెంటనే జీఓ నంబర్ 36ను అమలు చేసి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేసి అప్పటి వరకు మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ సీలింగ్‌ను రూ.2 లక్షల నుంచి ఎత్తి వేయాలన్నారు. గ్రాట్యూటీ చట్టం ప్రకారం చెల్లింపులు చేయాలన్నారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా, రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక నాయకులు మొవ్వా వెంకటేశ్వరరావు, టి.వెంకట రామయ్య, కె.సత్యనారాయణ, బి.రఘురామ్, పి.సత్యనారాయణ, వై.రామచంద్రరావు, పి.సుబ్బారావు, కె.వీరయ్య, ఏలూరు, కోనసీమ జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మూట్ కోర్టు పోటీల్లో విజేతగా 'సత్యభామ'

ప్రథమ బహుమతి అందుకున్న సత్యభామ లా కళాశాల విద్యార్థులు

ద్వితీయ బహుమతి అందుకున్న ఈరోడ్ లా కళాశాల విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: రెండు రోజులపాటు జేజేసీ లా కళాశాల రోడ్‌లోని జేసీ లా కళాశాలలో నిర్వహించిన 5వ జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీల్లో తమిళనాడు చెందిన సత్యభామ స్కూల్ ఆఫ్ లా, ఈరోడ్ న్యాయ కళాశాల విద్యార్థి బృందాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. విజేతలకు వరుసగా రూ.37,500, రూ.30 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు సోమవారం తెలిపారు. ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల కరస్పాండెంట్ వేమన కుప్పుస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో వ్యక్తిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతగుంటూరులోని కొత్తరాజువారి వీధిలో నివాసం ఉండే మేకల యశ్వంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతనికి మ్యాట్రిమోనీ యాప్ ద్వారా గుర్తుతెలియని మహిళ పరిచయమైంది. అతనితో సంభాషణ కొనసాగిస్తూ తాను ఒక యాప్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తున్నానని, నీవు కూడా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే అధిక మొత్తంలో వస్తాయని ఆన్‌లైన్ ట్రేడింగ్ లింక్ పంపింది. దానిని నమ్మి అతను దఫదఫాలుగా రూ.65 లక్షలు అతని అకౌంట్ నుంచి సదరు మహిళకు పంపగా, తన నుంచి ఎలాంటి డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు

బాపట్ల: రాజస్థాన్‌లో జనవరి 30 నుంచి ఈనెల 2వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో బాపట్ల క్రీడాకారులకు పతకాలు సాధించారని బాపట్ల అసోసియేషన్ కార్యదర్శి షేక్ నజీర్ పేర్కొన్నారు. ఆ మేరకు క్రీడాకారులను సోమవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అభినందించారు. 60 ఏళ్ల పైబడిన గ్రూపులో బత్తుల సాంబశివరావు హైజంప్‌లో సిల్వర్ మెడల్, 50 ఏళ్ల పైబడిన గ్రూపులో ఎం.మురళీకృష్ణారెడ్డి పోల్‌వాల్ట్‌లో సిల్వర్ మెడల్, 75 ఏళ్లు పైబడిన విభాగంలో 5 కిలోమీటర్ల వాకింగ్‌లో ముప్పనేని రామారావు బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ మేరకు క్రీడాకారులను బాపట్లలో పలువురు సన్మానించారు.

తిరునాళ్లలో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించం

డీఎస్పీ ఎం.హనుమంతరావు

నరసరావుపేట టౌన్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభల వద్ద నిర్వాహకులు కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హెచ్చరించారు. సోమ వారం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీన జరిగే కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు సంబంధించి సాధారణ ప్రభలు 100, విద్యుత్ ప్రభలు 30 నుంచి 40 వరకు వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. అందులో పరిసరాలలో డెకరేషన్ లైటింగ్ ఏర్పాటు చేసే ప్రదేశాలు, విద్యుత్ ప్రభల వైర్ల వద్దకు భక్తులు, పిల్లలు వెళ్లకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభల నిర్వాహకులకు సూచించారు. స్థానిక పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రాథమిక ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరునాళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేసినట్టు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకున్నామని, వాహనాల పార్కింగ్‌కి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల ఉత్సవాలు జరిగేలా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. డీఎస్పీతో పాటు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	94,459
అమ్మకాలు	90,847
నిల్వ	18,299

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు-5	13,500–25,500
273	14,000–22,000
341	14,000–25,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–21,500
నంబరు-5	13,000–21,000
341	14,000–24,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 20,500
బాడిగ-355	14,000 – 25,000
దేవనూరు డీలక్స్	15,000 – 27,000
ఆర్మూర్	13,000 – 18,000
తాలుకాయలు	8,000 – 12,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–19,000
బాడిగ - 355	14,000–24,500
తాలు	8,500 - 11,500

-కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **364**

కొమ్ములు : 315 బస్తాలు
(ధర రూ॥ల్లో)

కనిష్ట	గరిష్ట	మోడల్
11,800	13,011	13,011

కాయలు : 49 బస్తాలు

కనిష్ట	గరిష్ట	మోడల్
12,650	12,900	12,650

మొత్తం అమ్మకాలు : **273** క్వింటాళ్లు

-దుగ్గిరాల

రేపు అండర్-17 జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గుంటూరు రూరల్ లాలుపురంలోని కాజూరు పబ్లిక్ స్కూల్‌లో అండర్-17 బాలబాలికల సబ్ జూనియర్ పోటీల నిర్వహణ స్థాయి అసోసియేషన్ చైర్మన్ మార్పుపూడి రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు జనవరి 1, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 86399 22978 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER
ITR/ Salary Slip ... 7406939937.
GOLD FINANCE
... 81422 92071
... 83338 33368
PASSPORT MISSING
... 77806 16476
WANTED
... Ph: 99699 29196
... 79939 76590
... 7036761665
... 8143807128/ 9030928103
ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ నందు ... సెల్స్ అడ్వైజర్ ... 89788 55399
... Ph: 8985114453, 9391036931
... 9347335969, 8977182524
సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ... 7075167663 7075167541

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

దుగ్గిరాల: నూతన విద్యుత్ లైన్‌ల ఏర్పాటు నిమిత్తం దుగ్గిరాల మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఏఈ కె.గోపి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దుగ్గిరాల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన దుగ్గిరాల మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన షహజాద్, గుల్ఫాన్ బైక్‌పై వెళుతున్నారు. వీరిని ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన బస్సు చింతలపూడి వద్ద వెనుక నుంచి ఢీకొంది. దీంతో అదుపు తప్పిన చోదకులు బైక్‌పై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించగా సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వారిని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడేపల్లి 1వ వార్డుకు చెందిన వున్నా నారాయణమూర్తికి రూ.40,100లు, 2వ వార్డుకు చెందిన మోపిదేవి ధనలక్ష్మికి రూ.41,870లు, 3వ వార్డుకు చెందిన దాసరి అనితకు రూ.17,541లు, 13వ వార్డుకు చెందిన షేక్ సుల్తాన్ వలికి రూ.51,260లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, నాయకులు కోగంటి వెంకటేశ్వరరావు, వెన్నపూస మాల్యాద్రి రెడ్డి, ఎస్‌కే నాగుల్ మీరావలి, తాడిబోయిన గోపి, సాయిచంద్, సుధాకర్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సమ్మె నోటీసులు అందజేత

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలు విద్యాసంస్థలకు సోమవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజ్‌కుమార్, ధనుష్, భరత్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు

తాడికొండ: మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో గత రెండు రోజుల పాటు కొనసాగిన చదరంగం పోటీలు సోమవారంతో ముగిశాయి. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఆనంద్ చెస్ వింగ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో తిరుపతికి చెందిన స్వర్ణ విహాల్ 8 రౌండ్ల ఆటలో పాల్గొని 7.5 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో విజయవాడకు చెందిన జె.మల్లేశ్వరరావు, తృతీయ స్థానంలో రాజమండ్రికి చెందిన కె.సీతాసాగర్‌లు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ రామారావు చేతుల మీదుగా ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. విజేతలను చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వైవీ ఆంజేయులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మంగళగిరి టౌన్: ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళగిరి పట్టణంలో సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. సార్వత్రిక సమ్మెలో మంగళగిరి పరిసర ప్రాంతాల్లోని భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెంగయ్య, బాలాజీ, జేవీ రాఘవులు, భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, జానీబాషా, మాబూ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పలు ప్రజా సంఘాల నాయకులు తాడేపల్లి పట్టణ పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేస్తూ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బూరుగ వెంకటేశ్వర్లు మచ్చర్ పాయింట్ల వద్ద మున్సిపల్ కార్మికులతో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తాడేపల్లి సాయిబాబా ఆలయం సెంటర్ నుంచి జరిగే కార్మిక సమ్మెలో ఊరేగింపులో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వర్మ, సతీష్, కామాక్షి, శివయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ డాక్టర్ శాంతకుమారికి సోమవారం ఆశా వర్కర్లు సమ్మె నోటీసును అందజేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు వర్తింపజేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని కోరుతూ నిర్వహించనున్న సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీతానగరం యూనియన్ నాయకులు విశాలాక్షి, భానుమతి, కవిత, ఎస్.పూర్ణిమ, ఝాన్సీ లక్ష్మీభాయి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శాంతకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

దుగ్గిరాలలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

డిప్యూటీ తహసీల్దార్‌కు..

నులకపేటలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వీఆర్‌ఏల సంఘం మండల గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు నోటీసును అందజేశారు. 12న జరిగే సార్వత్రిక సమ్మెలో వీఆర్‌ఏలు పాల్గొంటారని డిప్యూటీ తహసీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బొక్క సాంబశివరావు, నామతోటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: దేశవ్యాప్తంగా ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు కోరారు. సోమవారం దుగ్గిరాల మండల కేంద్రంలోని షాదీఖానాలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ.. పోరాడి సాధించిన 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయనుందని తెలిపారు. ఇది అమలు జరిగితే కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేసేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని సీపీఐ మండల బంధ సంస్థ బీఎంకేయూ నాయకులు కె.ఈశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జెట్టి బాలరాజు, శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావు, యేగేశ్వరరావు, శివయ్య, ఏడుకొండలు, శివనాగేశ్వరమ్మ, బపవయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వడమే సొసైటీ లక్ష్యం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి టౌన్: పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించి వారి బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం చేయడమే శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ లక్ష్యమని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ మార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మండపంలో గుంటూరుకు చెందిన గుర్రం చినవీరయ్య సొసైటీ వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురుగుడు హనుమంతరావు, ప్రగడ రాజశేఖర్‌కు సోమవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. గుర్రం చినవీరయ్య హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ పారా మెడికల్ అధికారిగా ఉద్యోగ విరమణ చేశారని తెలిపారు. ఆయన గతంలో కూడా తమ సొసైటీకి రూ.లక్ష విరాళంగా అందజేశారని.. మరలా మరో రూ.లక్ష వితరణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. గత 42 ఏళ్లుగా మంగళగిరి ప్రాంతంలోని పేద చేనేత కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువు కోసం స్కాలర్‌షిప్‌లను తమ సొసైటీ ద్వారా అందిస్తున్నామన్నారు. ఎవరైతే తమ సొసైటీకి వితరణ అందిస్తున్నారో వారి చేతుల మీదుగానే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు చెక్కును అందజేస్తున్న దాత గుర్రం చినవీరయ్య

ఉపాధ్యాయుడు, విద్యార్థులకు సత్కారం

ఫిరంగిపురం: తమ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు వీఎస్ రామాంజనేయులు ప్రతిష్టాత్మక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నట్లు హెచ్‌ఎం లింగిశెట్టి సాంబయ్య తెలిపారు. మండలంలోని వేములూరిపాడు జెడ్పీ పాఠశాలలో సోమవారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య మాట్లాడారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం, జాతీయ సేవాదల్ ఆధ్వర్యంలో డాక్టర్ అబ్దుల్ కలాం రీసెర్చ్ ఫౌండేషన్ (న్యూఢిల్లీ) సహకారంతో విజయవాడలో రామాంజనేయులు ఈ అవార్డును అందుకున్నారని చెప్పారు. అగస్త్య ఫౌండేషన్ వారు నిర్వహించిన జిజ్ఞాస సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు జ్యోతిర్మయి, అనుశ్రీలు జాతీయస్థాయికి ఎంపికై ఈనెల 16న పూణేలో నిర్వహించే సైన్స్ ఎక్స్‌పోకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఉపధ్యాయుడు, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేజీవీపీ పాఠశాల సెక్రటరీ దేవానందరెడ్డి, ఉపాధ్యాయులు రాజు, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రామాంజనేయులు, విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లారీ ఢీకొని పెయింటర్‌కు తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: లారీ ఢీకొని పెయింటర్ తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని ఖాజీపేట వద్ద గుంటూరు–హనుమాన్‌పాలెం రహదారిపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు మండల గ్రామం గుడివాడకు చెందిన 35 ఏళ్ల గోవతోటి నాగరాజు పెయింటర్‌గా పనులకు వెళుతుంటాడు. మరో పెయింటర్‌తో కలసి బైక్‌పై వెళుతుండగా లారీ ఢీ కొట్టడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు విచారిస్తున్నారు.

చట్టాల మార్పుతో ప్రజలకు నష్టం

ఫిరంగిపురం: ప్రజలకు నష్టాలు కలిగించేలా ప్రభుత్వం చట్టాలను మార్పుచేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో కౌలు రైతుసంఘం, సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు తెలిపేలా ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమాన్ని అప్పారావు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. వామపక్షాల మద్దతుతో కేంద్రప్రభుత్వం తెచ్చిన మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తీసేసి జీరామ్‌జీ పేరుతో కొత్త చట్టం తీసుకు వచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా 12న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటేశ్వరరావు, నాగరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

మంగళగిరి టౌన్: కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హక్కుల పరిరక్షణకు సమష్టి ఉద్యమమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉపాధి విధానాలను రూపొందించాలని కోరారు. ఈనెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోట మాల్యాద్రి, కంచర్ల కాశయ్య, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 13 అర్జీలు

తెనాలిరూరల్: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్యాలయ పరిపాలనాధికారి శ్రీధర్‌బాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం 13 అర్జీలు దాఖలయ్యాయి. వాటిలో తెనాలి పురపాలక సంఘానికి సంబంధించి ఒకటి, రెవెన్యూ శాఖకు సంబంధించి నాలుగు, పంచాయతీరాజ్ శాఖవి నాలుగు, ఆరోగ్య శాఖకు సంబంధించి ఒకటి, పోలీసు శాఖకు సంబంధించి రెండు, పురపాలక సంఘం, మార్కెటింగ్ శాఖకు సంబంధించి ఒక్కో అర్జీ చొప్పున దాఖలయ్యాయి. అర్జీల స్వీకరణలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: MANGALAGIRI
O.S.NO.514/2022
Hearing Date:-10.03.2026
BETWEEN:
Plaintiff :- State Bank of India Pomrelallu Branch, Tadikonda Mandal, Guntur District, Rep. By Its Chief Manager
AND
Defendants :- The against 2nd defendant only is Kavuri Sekhar babu, S/o. Abraham, R/o. Door No.11-517-8, Hindu, aged 45, Nagaralu, Gorantla, Guntur city Mobile No. 9032066806
[illegible] Substituted service [illegible] 10.03.2026 [illegible]
From:- IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: MANGALAGIRI
To.
[illegible] 11-517-8, [illegible]
కాసు వెంకటరెడ్డి, అడ్వకేట్
[illegible] 14/3, గుంటూరు. సెల్ : 9346983822

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

తాడికొండ: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో పాటు 9 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారని తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దామచర్ల మధుసూధనరావు తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7, 8 తేదీల్లో చిత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లిగ్ పోటీల్లో 21 మంది విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. వీరిలో పి.మణికంఠ, డీవీ అజయ్‌కుమార్ రెడ్డి, వీవీ యోగేశ్వరరావు, కార్తీక్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా 6 మంది విద్యార్థులు సిల్వర్, 9 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించి పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు కోచ్ పి.నాగరాజు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి వైఎస్ మూర్తి, ఏటీపీ పీహెచ్ పద్మావతి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు రెజ్లింగ్ కోచింగ్ ఇప్పించేందుకు ఆర్థికంగా సహకరించిన పూర్వ విద్యార్థుల సంఘానికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపల్ మధుసూధనరావు

కరాటేలో ఎంటీఎంసీ క్రీడాకారుల ప్రతిభ

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పలువురు క్రీడాకారులు కరాటేలో ప్రతిభ చాటారని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన తాడేపల్లిలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో 600 మందికి పైగా కరాటే క్రీడాకారులు కటా, కుమితే విభాగాల్లో పాల్గొన్నారని అన్నారు. ఈ పోటీల్లో మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన విన్నీపాప, కాజ గ్రామానికి చెందిన పర్ణిక, మంగళగిరి పట్టణానికి చెందిన దామేశ్వరిలతో పాటు తాడేపల్లికి చెందిన నిశ్చితలు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు విజయవాడకు చెందిన కరాటే మాస్టర్లు విజయ్‌కుమార్, బ్రహ్మానందంలు రిఫరీలుగా వ్యవహరించారు.

కరాటేలో పోటీపడుతున్న క్రీడాకారులు

రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. ఒంటరిగా మహిళలు కనిపిస్తే మెడలో నుంచి బంగారాన్ని దోచుకువెళుతున్నారు. తాడేపల్లిలో చోటుచేసుకుంటున్న వరుస సంఘటనలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. వడ్డేశ్వరంలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒంటరిగా వెళుతున్న మతిస్థిమితం లేని అలివేలు మంగతాయారు అనే మహిళను దుండగులు టార్గెట్ చేశారు. ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెపై దాడి చేసి 6 కాసుల బంగారు చైన్, మంగళ సూత్రాలను లాక్కుని పరారయ్యారు. దీంతో మహిళ కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఆదివారం జరిగిన సంఘటనలో తాడేపల్లి పోలీసులు పురోగతి సాధించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను గుర్తించారు. సదరు ఇద్దరు యువకులు బెంగాల్‌కు చెందిన వారిగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ఎవరైనా వారిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పోలీసులు చైన్ స్నాచర్లుగా గుర్తించిన నిందితులు

బాల్య వివాహాలను నిర్మూలించాలి

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం అంగన్‌వాడీ సెంటర్‌లో గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం లైంగిక దాడులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ.. బాలికలపై జరిగే అఘాయిత్యాలు, లైంగిక హింస, లైంగిక వేధింపులు, గృహ హింస, ఆన్‌లైన్ వేధింపులు వంటి అనేక సమస్యలను నిర్మూలించాలని అన్నారు. ఇవి బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. తాడేపల్లి మండలంలోని 10 గ్రామాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం, బాల్య వివాహాల నివారణ కోసం పనిచేస్తున్నామని వివరించారు. పిల్లల అక్రమ రవాణా విషయం తెలిస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ చిన్నారులు, గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పోతురాజు, అనిల్, లావణ్య, నాగమణి, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిబ్బంది

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు సూర్యప్రకాష్, సాంబశివరావు, అంకయ్యలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులు 433 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా యాజమాన్యంలో స్పందన లేకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, లోకేష్ తన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. దీక్షల్లో సుభాని, హగ్గయ్య, దామవరపు నాగేశ్వరరావు, గురవయ్య, ఇశ్రాయేలు కూర్చొన్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బాషా, మాణిక్యరావు ఇమాంబి, శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న కార్మికులు, నాయకులు

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

మంగళగిరి టౌన్: తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని మంగళగిరి పట్టణ ఎస్‌ఐ శ్రీహరిబాబు సూచించారు. పాత బస్టాండ్ వద్ద సోమవారం ఆయన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్స్, నంబరు ప్లేట్లు, ఇన్సూరెన్స్ లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీహరిబాబు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. రహదారి ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం, మద్యం మత్తులో వాహనం నడపడంతోనే జరుగుతున్నాయని అన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
కుంచనపల్లి బ్రాంచి
[illegible] తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, పి-522501. ఫోన్: 8977513968.
డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం
రుణగ్రహీత: శ్రీ [illegible], తండ్రి: శ్రీ [illegible], డోర్ నెం. 2-245, [illegible], తాడేపల్లి మండలం, తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522501.
విషయము: బ్యాంక్ ఆఫ్ బరోడా, కుంచనపల్లి బ్రాంచి వారు మీకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం – హోమ్ లోన్, అకౌంట్ నెం. 82180000008837, టాప్‌అప్ అకౌంట్ నెం. 82180000008838 కి చెందిన అసలు మరియు వడ్డీ, మొదలగునవి చెల్లించడంలో మీరు విఫలం అయినారు.
[illegible] 12-12-2025 [illegible] తేది. 09-12-2025 [illegible] 60 [illegible] తేది. 07.12.2025 నాటికి రూ. 78,32,531.44 [illegible] తేది. 08.12.2025 [illegible] సెక్షన్ 13 సబ్ సెక్షన్ (13) [illegible] సెక్షన్ 13(2) ప్రకారం జారీ చేయడమైనది.
ఆస్తి వివరములు:
[illegible] 325 [illegible] 271.7 [illegible]
తేది: 12-12-2025
ప్రదేశము: కుంచనపల్లి
అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

భారత్‌తో మ్యాచ్ ఆడండి: పాకిస్తాన్ జట్టుకు ప్రభుత్వ ఆదేశం

టి20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో మ్యాచ్ ఆడమంటూ మొండికేసిన పాకిస్తాన్ జట్టు వెనక్కి తగ్గింది. ఈ నెల 15న కొలంబోలో జరగాల్సిన మ్యాచ్‌లో టీమిండియాతో తలపడాలని ఆ దేశ ప్రభుత్వం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)ను ఆదేశించింది. క్రికెట్ స్ఫూర్తిని కొనసాగించే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. శ్రీలంక, బంగ్లాదేశ్‌లనుంచి వచ్చిన అభ్యర్థనలకు స్పందిస్తూ భారత్‌తో మ్యాచ్‌కు పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ఓకే చెప్పారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అంతక ముందు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజోగ్ గుప్తా వెల్లడించారు. వరల్డ్ కప్‌నుంచి దూరమైన బంగ్లాదేశ్‌కు మద్దతు పలకడంతో పాటు పలు డిమాండ్లను ఐసీసీ ముందు ఉంచింది. వీటిపై ఐసీసీ సానుకూలంగా స్పందించింది. బంగ్లా బోర్డుపై ఎలాంటి జరిమానాలు, ఆంక్షలు విధించమని హామీ ఇవ్వడంతో పాటు 2028 నుంచి 2031 మధ్య ఒక ఐసీసీ ఈవెంట్‌కు బంగ్లా ఆతిథ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామని కూడా ఐసీసీ చెప్పింది.

గిల్, బుమ్రా

‘ఎ’ గ్రేడ్‌లో గిల్, బుమ్రా, జడేజా

బీసీసీఐ కాంట్రాక్ట్‌ల ప్రకటన ● ‘బి’ గ్రేడ్‌కు కోహ్లి, రోహిత్

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సీనియర్ జట్టు ఆటగాళ్లకు సంబంధించి 2025–26కు గాను వార్షిక కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. గత సీజన్ వరకు ఉన్న ‘ఎ ప్లస్’ గ్రేడ్‌ను తొలగించిన బోర్డు... ఈ సారి ‘ఎ’, ‘బి’, ‘సి’ గ్రేడ్‌లతోనే జాబితాను ఖరారు చేసింది. భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌తో పాటు ఆల్ ఫార్మాట్ స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ‘ఎ’ గ్రేడ్‌లో స్థానం లభించగా...భారత టెస్టు జట్టులో అందరికంటే ఎక్కువ అనుభవజ్ఞుడైన రవీంద్ర జడేజాకు కూడా ‘ఎ’ గ్రేడ్ దక్కడం విశేషం. ఇప్పుడు కేవలం వన్డేలకే పరిమితమైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిను ‘బి’ గ్రేడ్‌లో చేర్చగా, టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా ‘బి’లోనే ఉన్నాడు. వాషింగ్టన్ సుందర్‌కు ‘సి’ నుంచి ‘బి’కు ప్రమోషన్ లభించగా...వన్డే, టి20ల్లో రెగ్యులర్ సభ్యుడైన అక్షర్ పటేల్ స్థాయిని తగ్గించి ‘సి’లోకి చేర్చారు. 2024–25 కాంట్రాక్ట్‌తో పోలిస్తే ఎవరినీ అదనంగా చేర్చలేదు. నాడు 34 మందితో జాబితా ఉండగా... ఇప్పుడు నలుగురు ఆటగాళ్లు షమీ, సర్ఫరాజ్, రజత్ పాటీదార్, ముకేశ్ కుమార్‌లను కాంట్రాక్ట్ నుంచి తప్పించి 30 మందికి పరిమితం చేశారు.

అక్టోబర్ 1, 2025 నుంచి 26 సెప్టెంబర్, 2026 మధ్య కాలానికి కొత్త కాంట్రాక్ట్‌లు వర్తిస్తాయి.

గ్రేడ్ ‘ఎ’ – శుబ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా

గ్రేడ్ ‘బి’ – రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్, సిరాజ్, హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్.

గ్రేడ్ ‘సి’ – అక్షర్ పటేల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబే, సంజు సామ్సన్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్, ధ్రువ్ జురేల్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్ రెడ్డి, అభిషేక్ శర్మ, సాయిసుదర్శన్, రవి బిష్ణోయ్, రుతురాజ్ గైక్వాడ్.

‘ఆ నలుగురు’ టాప్ గ్రేడ్‌లో...

హర్మన్‌ప్రీత్, స్మృతి

భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ విజయం అందుకోవడంలో కీలక పాత్ర పోషించిన నలుగురు ప్లేయర్లకు ‘ఎ’ గ్రేడ్ కాంట్రాక్ట్ లభించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ‘ఎ’ జాబితాలో ఉన్నారు. గ్రేడ్ ‘బి’లో నలుగురు ప్లేయర్లు ఉండగా, గ్రేడ్ ‘సి’లో 13 మంది కలిపి మొత్తం 21 మంది సీనియర్ మహిళా క్రికెటర్లకు బీసీసీఐ కాంట్రాక్ట్ ఇచ్చింది.

గ్రేడ్ ‘ఎ’ – హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్

గ్రేడ్ ‘బి’ – రేణుకా ఠాకూర్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, స్నేహ్ రాణా

గ్రేడ్ ‘సి’ – రాధ యాదవ్, అమన్‌జోత్ కౌర్, ప్రతీక రావల్, క్రాంతి గౌండ్, ఉమా ఛెత్రి, అరుంధతి రెడ్డి, శ్రీచరణి, యస్తిక భాటియా, హర్లీన్ డియోల్, కాశ్వీ గౌతమ్, కమలిని, వైష్ణవి శర్మ, తేజల్ హసబ్నిస్.

దక్షిణాఫ్రికా శుభారంభం

- 57 పరుగులతో కెనడాపై విజయం
- మార్క్‌రమ్ అర్ధసెంచరీ
- ఇన్‌గిడికి 4 వికెట్లు


మార్క్‌రమ్

అహ్మదాబాద్: టి20 ప్రపంచ కప్ గత టోర్నీ రన్నరప్ దక్షిణాఫ్రికా ఈ సారి టోర్నీలో భారీ విజయంతో శుభారంభం చేసింది. సోమవారం గ్రూప్ ‘డి’లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 57 పరుగుల తేడాతో కెనడాపై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (32 బంతుల్లో 59; 10 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగాడు. అన్ష్ పటేల్‌కు 3 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్య ఛేదనలో కెనడా పోరాటంతో ఆకట్టుకున్నా...చివరకు ఓటమి తప్పలేదు. కెనడా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసి ఓడింది. నవనీత్ దలివాల్ (49 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, హర్ష్ ఠాకెర్ (29 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఇన్‌గిడి 4 వికెట్లు పడగొట్టగా, యాన్సెన్‌కు 2 వికెట్లు దక్కాయి.

మార్క్‌రమ్ ఫిఫ్టీ...

ఓపెనర్లు మార్క్‌రమ్, డికాక్ (22 బంతుల్లో 25; 2 ఫోర్లు) అనుభవం లేని కెనడా బౌలర్లపై చెలరేగారు. కెప్టెన్ మార్క్‌రమ్ బౌండరీలతో వేగం పెంచాడు. దీంతో 4.3 ఓవర్లలో జట్టు స్కోరు 50కి చేరింది. డికాక్ వెనుదిరిగిన తర్వాత ర్యాన్ రికెల్టన్ (21 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్‌తో కలిసి వేగంగా పరుగులు సాధించడంతో పదో ఓవర్ ముగియకముందే సఫారీ స్కోరు 100 దాటింది. మార్క్‌రమ్ 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత తక్కువ వ్యవధిలో మార్క్‌రమ్, రికెల్టన్, బ్రెవిస్ (6) అవుటయ్యారు. డేవిడ్ మిల్లర్ (23 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (19 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెరోవైపు నుంచి దూకుడుగా ఆడటంతో జట్టు స్కోరు 200 దాటింది.

మెరిపించిన నవ్‌నీత్

దక్షిణాఫ్రికాలాంటి గట్టి ప్రత్యర్థిపై 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించడం ఎవరికైనా కష్టం. కెనడాలాంటి కూనకైతే అసాధ్యం! లుంగి ఇన్‌గిడి దెబ్బకు ఆరంభంలోనే ఓపెనర్లు దిల్‌ప్రీత్ (0), యువరాజ్ (12) సహా నికోలస్ కిర్టన్ (4) వికెట్లను కోల్పోయింది. పవర్‌ప్లేలోనే మొవ్వ శ్రేయస్ (9) కూడా అవుట్ కావడంతో ఏకపక్షమే అనిపించింది. అయితే నవ్‌నీత్ దలివాల్, హర్ష్ ఠాకెర్ కాసేపు సఫారీ బౌలర్లకు సవాలుగా నిలిచారు. చక్కని సమన్వయంతో జట్టు స్కోరును వందకు తీసుకెళ్లారు. ఐదో వికెట్‌కు 69 పరుగులు జోడించాక హర్ష్ అవుటయ్యాడు. 39 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన నవ్‌నీత్ ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.

స్కాట్లాండ్ ఆల్‌రౌండ్ షో

ఇటలీపై 73 పరుగులతో జయభేరి

మైకేల్ లిస్క్

కోల్‌కతా: ఓపెనర్ జార్జ్ మున్సే (54 బంతుల్లో 84; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) బ్యాటింగ్‌లో దంచేయగా... ఆఫ్‌స్పిన్నర్ మైకేల్ లిస్క్ (4/17) కూల్చేయడంతో స్కాట్లాండ్ టి20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టింది. తొలిసారి క్రికెట్ వరల్డ్‌కప్ ఆడుతున్న ఇటలీపై 73 పరుగుల తేడాతో స్కాట్లాండ్ జయభేరి మోగించింది. సోమవారం గ్రూప్ ‘సి’లో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇటలీ 16.4 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. బెన్ మనెంటి (31 బంతుల్లో 52; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు.

మాజీ చాంపియన్ వెస్టిండీస్‌తో తొలి మ్యాచ్‌లో కంగుతిన్న స్కాట్లాండ్ ఈ మ్యాచ్‌లో భారీ విజయాన్ని సాధించింది. ఓపెనర్లు మున్సే, మైకేల్ జోన్స్ (37; 1 ఫోర్, 2 సిక్స్‌లు) చక్కని శుభారంభమిచ్చారు. ఇద్దరు తొలి వికెట్‌కు 126 పరుగులు జోడించారు. 30 బంతుల్లోనే మున్సే అర్ధ సెంచరీ బాదాడు. అతను అవుటయ్యాక వన్‌డౌన్ బ్యాటర్ బ్రాండన్ మెక్‌ములెన్ (18 బంతుల్లో 41 నాటౌట్; 4 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. ఆ తర్వాత ఇన్నింగ్స్ తొలి బంతికే జస్టిన్ మోస్క (0) వికెట్‌ను కోల్పోయిన ఇటలీ పవర్ ప్లే ముగియకముందే మూడు వికెట్లు కోల్పోయింది. అయితే హ్యారి మనెంటి (25 బంతుల్లో 37; 1 ఫోర్, 3 సిక్స్‌లు), బెన్ మనెంటి ఇద్దరు కలిసి జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. 29 బంతుల్లోనే బెన్ మనెంటి ఫిఫ్టీ సాధించాడు. అయితే చివర్లో దీంతో అనూహ్యంగా 5 పరుగుల వ్యవధిలోనే 5 వికెట్లను కోల్పోయిన ఇటలీ ఆలౌటైంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

నెదర్లాండ్స్ X నమీబియా
వేదిక: న్యూఢిల్లీ; ఉదయం 11 గంటల నుంచి

న్యూజిలాండ్ X యూఏఈ
వేదిక: చెన్నై; మధ్యాహ్నం 3 గంటల నుంచి

పాకిస్తాన్ X అమెరికా
వేదిక: కొలంబో; రాత్రి 7 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

జింబాబ్వే అలవోక విజయం

8 వికెట్లతో ఒమన్‌పై గెలుపు

కొలంబో: టి20 ప్రపంచకప్‌లో జింబాబ్వే ధాటికి ఒమన్ నిలువలేకపోయింది. సోమవారం జరిగిన గ్రూప్ ‘బి’ మ్యాచ్‌లో జింబాబ్వే 8 వికెట్ల తేడాతో ఒమన్‌ను ఓడించింది. టాస్ నెగ్గిన జింబాబ్వే ఫీల్డింగ్ ఎంచుకోగా ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 19.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. వినాయక్ శుక్లా (21 బంతుల్లో 28; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ బ్లెస్సింగ్ ముజరబాని (3/16) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అనంతరం జింబాబ్వే సులువైన లక్ష్యాన్ని 13.3 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ బ్రియాన్ బెనెట్ (36 బంతుల్లో 48 నాటౌట్; 7 ఫోర్లు) అజేయంగా రాణించాడు.

తొలి ఓవర్లో ఒమన్ 7 పరుగులు చేసింది. తర్వాత బంతికే మొదలైన కష్టాలు 7 ఓవర్లు గడిచేసరికి సగం వికెట్లను కూల్చేసింది. ఓపెనర్లు కలీమ్ (5), జతిందర్ (5) సహా హమద్ మీర్జా (0), కరణ్ సోనవాలె (0), వసీమ్ అలీ (3) ఇలా వచ్చి... అలా వెనుదిరిగారు. 27 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన ఒమన్‌కు సుఫియాన్ (25; 2 ఫోర్లు), వినాయక్ శుక్లా, ఆఖర్లో నదీమ్ (20; 1 ఫోర్, 1 సిక్స్) చేసిన ఇరవై పైచిలుకు స్కోరు జట్టు వంద పరుగులు దాటేలా చేసింది.

ఆ తర్వాత ఓపెనర్ బెనెట్ అజేయంగా నిలవడంతో పెద్దగా కష్టపడకుండానే జింబాబ్వే లక్ష్యాన్ని ఛేదించింది. బెనెట్ కంటే ముందు మరుమని (11 బంతుల్లో 21; 5 ఫోర్లు) ధాటిగా పరుగులు రాబట్టాడు. కానీ జట్టు స్కోరు 30 వద్ద మరుమని, మయేర్స్ (0) అవుటయ్యారు. బ్రెండన్ టేలర్, బెనెట్ మరో వికెట్ పడకుండా జింబాబ్వేను గెలుపుతీరం చేర్చారు. గెలుపువాకిట టేలర్ (30 బంతుల్లో 31; 3 ఫోర్లు) రిటైర్ట్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ సికందర్ రజా (5 నాటౌట్) వచ్చి మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు.

జనసేనలో పతాక స్థాయికి వర్గపోరు

శాంతిభద్రతల సమస్య మలికిపురం మండలంలో పోలీసుల కవాతు

మలికిపురం మండలంలో కవాతు చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ జనసేన పార్టీ శ్రేణుల మధ్య వర్గపోరు పతాక స్థాయికి చేరింది. దీనిని ఆ పార్టీ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అరికట్టలేకపోవడంతో నియోజకవర్గంలో శాంతి భద్రతల సమస్యగా మారి పోలీసులు కవాతు చేయాల్సిన పరిస్థితికి దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. గత బుధవారం ఎమ్మెల్యే వరప్రసాద్ ఇంటివద్ద జనసేన వర్గాల మధ్య కొట్లాట తీవ్రస్థాయికి చేరింది. ఆ కొట్లాటలో గాయపడిన యెనుముల వెంకటపతిరాజు వర్గానికి చెందిన ముత్యాల కన్నాకు మద్దతుగా కేశనపల్లి కూటమి కార్యకర్తలు సమావేశమై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటివరకు తనకు న్యాయం జరగలేదని సోమవారం ముత్యాల కన్నా తాడేపల్లిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. దిరిశాల బాలాజీ వర్గీయులు ఆదివారం మీడియా సమావేశంలో వెంకటపతిరాజుపై దుమ్మెత్తి పోయగా.. వెంకటపతిరాజు సోమవారం సోషల్ మీడియా వేదికగా దిరిశాల బాలాజీని దునుమాడారు. సొంత పార్టీలో ఇరువర్గాలు మీడియా వేదికగా పోట్లాడుకుంటున్నా.. అంతకుముందు కొట్లాడుకున్నా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పట్టించుకోకపోవడంతో పరిస్థితి చేయిదాటి పోలీసుల పరిధిలోకి వెళ్లిందన్న విమర్శలు ఇరుపక్షాల నుంచి వినిపిస్తున్నాయి.

పోస్టులు పెడితే జైలుకే: డీఎస్పీ హెచ్చరిక

వాట్సాప్, సోషల్ మీడియాలో పోస్టులు పెడితే జైలుకు పంపుతామని డీఎస్పీ సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. సోమవారం మలికిపురం మండలంలో ఆయన మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. మలికిపురం మండలం కేశనపల్లి, లక్కవరం, మలికిపురం గ్రామాల్లో సోషల్ మీడియా వేదికగా ఒకరి మీద ఒకరు పోస్టులు పెట్టుకుంటూ, పరస్పరం దాడి చేసుకుంటూ రెచ్చగొడుతున్న వారిని ఆయన హెచ్చరించారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం ఎస్సైలు, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో ఆయన కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సెక్షన్ 30 అమల్లో ఉన్నందున పోలీసుల అనుమతి లేకుండా సభలు, ఊరేగింపులు, ధర్నాలు నిషిద్ధమన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రతపై ఆందోళన

ఇష్టానుసారంగా, అనధికారికంగా పోలీసులు రూట్ మారుస్తున్నారు

అమిత జనాదరణ కలిగిన నేత అయినందున తక్షణమే పటిష్ట భద్రత కల్పించాలి

- ఇటీవల పర్యటనలో తలెత్తిన భద్రతా లోపాలపై విచారణ చేపట్టాలి
- కేంద్ర హోం శాఖకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం లేఖ

సాక్షి, అమరావతి : అమిత జనాదరణ గల నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం విమర్శించారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన వైఎస్ జగన్ ఇటీవల పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా లోపాలపై తక్షణమే విచారణ చేపట్టాలని కోరుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సోమవారం ఆయన లేఖ రాశారు. ఆ లేఖను ఆయన ఇక్కడ మీడియాకు విడుదల చేశారు. ఫిబ్రవరి 6న తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నానికి మాజీ సీఎం వైఎస్ జగన్ వెళ్లిన సందర్భంలో తీవ్ర స్థాయిలో భద్రతా లోపాలు కనిపించాయని లేఖలో పేర్కొన్నారు. సాధారణంగా కేవలం 22 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాన్ని పక్కనపెట్టి, విజయవాడ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో దాదాపు 47 కిలో మీటర్ల పొడవైన ప్రత్యామ్నాయ మార్గానికి ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా రూట్ మ్యాప్ మార్చారని పేర్కొన్నారు. అధికారులు సూచించిన మార్గాన్నే అనుసరించినా, తిరుగు ప్రయాణంలో మరింత ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని లేఖలో వివరించారు. భద్రతా బృందానికి గానీ, పార్టీ ప్రతినిధులకు గానీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా తిరుగు మార్గాన్ని అకస్మాత్తుగా మార్చారన్నారు. ఆ మార్గం అత్యంత రద్దీగా ఉందని, ఈ మార్గం జెడ్ ప్లస్ కేటగిరీ వీవీఐపీకి ఏమాత్రం అనుకూలం కాదని తలశిల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధమైన అనూహ్య రూట్ మార్పులు భద్రతా ప్రొటోకాల్స్‌ను బలహీనపరుస్తాయని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు వీవీఐపీ ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు భద్రతా అంచనా లేకుండా, రాతపూర్వక సమాచారం లేకుండా తీసుకున్న ఈ నిర్ణయాలు తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఒక్క ఘటన మాత్రమే కాదని, గతంలో కూడా వైఎస్ జగన్ భద్రతలో పలు లోపాలు చోటు చేసుకున్నాయని లేఖలో గుర్తు చేశారు.

- 2025 ఫిబ్రవరి 19న గుంటూరు మిర్చి యార్డ్‌ను సందర్శించినప్పుడు పూర్తి స్థాయిలో జెడ్‌ప్లస్ భద్రత కల్పించలేదని, బాధ్యత వహించాల్సిన అధికారులు తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు.
- 2025 ఏప్రిల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి పర్యటన సందర్భంగా కూడా తీవ్ర భద్రతా లోపాలు జరిగాయని పేర్కొన్నారు. హెలిప్యాడ్ వద్ద జరిగిన దాడిలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిని వీవీఐపీ ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిందన్నారు. అయినప్పటికీ అధికారుల వైఫల్యాన్ని అంగీకరించకుండా పార్టీ నేతలపై కేసులు పెట్టారని లేఖలో పేర్కొన్నారు.

తరచూ నిబంధనలు నీరుగారుస్తున్న పోలీసులు

తరచూ జరుగుతున్న ఇలాంటి ఘటనల ద్వారా జెడ్ ప్లస్ భద్రతా నిబంధనలను పదే పదే పోలీసులు నీరుగారుస్తున్నారని తలశిల మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తి భద్రతకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా వీఐపీ భద్రతా వ్యవస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రూట్ మార్పులపై తక్షణం విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనుంచైనా రాజకీయాలకతీతంగా జెడ్ ప్లస్ భద్రతా ఎస్‌ఓపీలను కఠినంగా అమలు చేయాలని కేంద్ర హోం శాఖను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైఎస్ జగన్ భద్రతపై స్వతంత్ర సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఆగని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ

- థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వహణకు టెండర్లు
- కార్మికుల్లో తీవ్ర ఆందోళన

ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ వైపు నెట్టేస్తున్న చర్యలు ఆగడంలేదు. ఇప్పటికే సింటర్ ప్లాంట్, ఎస్‌ఎంఎస్–1 వంటి కీలక విభాగాలను ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిన యాజమాన్యం.. తాజాగా థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ–1) నిర్వహణను కూడా ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు అడుగులు వేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. టీపీపీ నిర్వహణ, మెయింటెనెన్స్‌తో పాటు కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్వహణకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సోమవారం టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. రెండేళ్ల కాలపరిమితితో కూడిన ఈ టెండర్ విలువను రూ.83.52 కోట్లుగా నిర్ణయించారు. ఈనెల 26వ తేదీ సా.3 గంటల వరకు టెండర్లు స్వీకరించి, 27వ తేదీ సా. 3 గంటలకు వాటిని తెరవనున్నట్లు ప్రకటించారు. ఉక్కు ఉత్పత్తికి ప్రాణంలాంటి క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించడం ద్వారా స్టీల్‌ప్లాంట్ భవితవ్యానికే ముప్పు తెచ్చినట్లవుతుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. నిరంతర విద్యుత్ సరఫరా చేసే ఈ విభాగం ప్రైవేటు చేతుల్లోకి వెళ్తే ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని, తద్వారా ప్లాంట్‌ను ఆర్థికంగా మరింత బలహీనపరచాలనే ఉద్దేశమే కనిపిస్తోందని ఆరోపిస్తున్నాయి.

పోరాటం మరింత తీవ్రతరం..

ఒకవైపు కార్మికుల తొలగింపులు కొనసాగుతుండగా, మరోవైపు కీలక విభాగాలను దశలవారీగా ప్రైవేటీకరించడం ద్వారా విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసి చివరికి అమ్మకానికి సిద్ధంచేసే వ్యూహం అమలుచేస్తున్నారని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. రూ.11,440 కోట్ల ప్యాకేజీ తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను ఉద్ధరిస్తున్నామని గొప్పలు చెప్పిన టీడీపీ కూటమి నేతలు.. ఇప్పుడు క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించడంపై ఏం సమాధానం చెబుతారని కార్మిక నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని, ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు పోరాటాలు మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

6 నెలలకు ఒకసారి మీ-సేవ కేంద్రాల తనిఖీ

గ్రామ, వార్డు సచివాలయ శాఖలో జిల్లా, మండల కార్యాలయాల విధుల ఖరారు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మీ–సేవ కేంద్రాలను ఆరు నెలలకు ఒకసారి అయినా జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల (స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు) శాఖ అధికారులు తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో ఇటీవల కొత్తగా సచివాలయం, మండలం, జిల్లా అనే మూడంచెల వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చింది. వాటిలో మండల, జిల్లా కార్యాలయాల విధులను ఖరారు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి కాటంనేని భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

‘వక్ఫ్’ రణభేరి

మైనార్టీ ఆస్తుల పరిరక్షణకు నడుం కట్టిన వైఎస్సార్‌సీపీ

నెల్లూరులో జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న కాకాణి, చంద్రశేఖరరెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్ : వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ సమరభేరి మోగించింది. ఆ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అమరావతి నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి సాకుతో వక్ఫ్ ఆస్తుల కాజేతకు కూటమి సర్కారు పన్నుతున్న కుట్రలపై కన్నెర్రజేసింది. మహోద్యమానికి సిద్ధమని హెచ్చరించింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సోమవారం వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఖాసీం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ముస్లింలు నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా తదితరులు పాల్గొన్నారు.

- ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నేతలు వక్ఫ్ బోర్డు ఆస్తులను, అంజుమన్ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వద్దంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పాల్గొని జాయింట్ కలెక్టర్ ఇలక్కియకు వినతి పత్రం అందజేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను, అంజుమన్ భూములను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేలా కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే జేసీ తమ మాటలను సరిగా వినలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ముస్లింలు ధర్నా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాదర్ బాషా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. తొలుత ముస్లింలు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టరేట్‌లోని డీఆర్వో షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు.
- నెల్లూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలు ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. వీరు కలెక్టరేట్‌లో జేసీ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాకాణి గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో వక్ఫ్ బోర్డుకు చెందిన 72 ఎకరాల స్థలాన్ని కాజేయడానికి కూటమి సర్కారు యత్నించడంపై కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

WHAT IS THE NATIONAL ANTHEM OF THE BRITISH?

Social

CHAPTER - 1 HISTORY
THE RISE OF NATIONALISM IN EUROPE

1 MARK QUESTIONS

1. What was the aim of the Treaty of Vienna?
A. Undoing the changes during the Napoleonic wars.
2. By whom Napoleon was defeated in 1815?
A. By Britain, Russia, Prussia and Austria.
3. Who hosted the congress of Vienna in 1815?
A. The Austrian Chancellor Duke Metternich.
4. Who founded Young Italy in Marseilles?
A. Giuseppe Mazzini.
5. Who founded Young Europe in Berne?
A. Giuseppe Mazzini.
6. William I : Germany : : Victor Emmanuel 2 : ___ ?
A. Italy.
7. Who described Mazzini as 'the most dangerous enemy of our social order'?
A. Metternich.
8. "When France sneezes the rest of Europe catches the cold" Who said these words? .
A. Metternich.
9. Which treaty recognised Greece as an independent nation?
A. The Treaty of Constantinople of 1832.
10. Who was the ruler during 1848 in the France?
A. Louis Philippe.
11. Define the term feminist.
A. Awareness of women's rights and interests based on the belief of the social, economic and political equality of the genders
12. What were called Large landowners?
A. Junkers.
13. Who was the architect of the Germany unification process?
A. Otto von Bismarck.
14. Germany had participated wars with which nations to complete unification?
A. Austria, Denmark and France.
15. When was proclaimed the new German Empire?
A. On 18 January 1871.
16. By whom the new German Empire was headed?
A. Kaiser William I.
17. Who had formed a secret society called Young Italy?
A. Giuseppe Mazzini.
18. Who was 'La Talia'?
A. Victor Emmanuel's wife.
19. `Young Italy' was formed by?
A. Giuseppe Mazzini
20. What is the national anthem of the British?
A. God Save Our Noble King.
21. `World War1' period?
A. 1914–1918
22. Which figure is representing the Republic of France?
A. The figure of Marianne.
23. What is the meaning of Marianne?
A. The people's nation.
24. What did become the allegory of the German nation?
A. Germania.
25. What is the symbol of the British nation?
A. Britannia.
26. Arrange the following countries from West to east. China –USA – Germany - Japan.
A. USA, Germany, China, Japan.
27. Arrange the following countries from west to east. (Japan, England, France, Germany)
A. England – France – Germany – Japan.
28. Arrange the following countries from east to West (UK, China, USA, India)
A. China – India – UK – USA.
29. Which female allegory was used to represent France?
A. Marianne.

4 MARK QUESTIONS

1. Write a note on Giuseppe Mazzini.
1. Giuseppe Mazzini was an Italian revolutionary.
2. He became a member of the secret society called Carbonari.
3. He founded Young Italy in Marseilles.
4. Mazzini opposed monarchy.
5. Metternich described him as 'the most dangerous enemy of our social order'.

2. Write a note on Count Camillo de Cavour.
1. Cavour led the movement to unite the separate states of Italy.
2. He was neither a revolutionary nor a democrat.
3. He was the Chief Minister of Sardinia-Piedmont state.
4. He assisted Mazzini and Garibaldi in unification of Italy.
5. He engineered a careful diplomatic alliance with France.

3. Write a note on the Greek war of independence.
1. The Greek war of independence mobilised nationalist feelings.
2. Greece had been part of the Ottoman Empire.
3. The Greeks began struggle for independence in 1821.
4. Poets mobilised public against the Muslim empire.
5. Finally, the Treaty of Constantinople of 1832 was constituted.
6. It recognised Greece as an independent nation.

4. Write a note on Frankfurt parliament.
1. Frankfurt parliament was an all-German National Assembly.
2. It was convened in the Church of St. Paul in Frankfurt.
3. They drafted a constitution for a German nation.
4. It faced opposition from the aristocracy and military.
5. The parliament was dominated by the middle classes.
6. In the end, it was forced to disband on 31 May 1849.

5. Write a note on the role of women in nationalist struggles. / Imagine you were a woman of 19th century. Describe the role of woman in national movements.
1. Women had actively participated in nationalist struggles.
2. Liberty is personified as a woman.
3. Women formed their own political associations.
4. Women founded newspapers.
5. Women taken part in political meetings and demonstrations.

6. What steps did the French revolutionaries take to create a sense of collective identity among the French people?
1. Ideas of la patrie and le citoyen were popularized.
2. La patrie means the fatherland, Le citoyen means the citizen.
3. A new French flag replaced the royal standard.
4. The Estates General was elected by the body of active citizens.
5. The Estates General was renamed the National Assembly.

7. 'The most dangerous enemy of our social order'. Who, why called whom?
1. Metternich called Mazzini as like this.
2. Mazzini had relentless opposition to monarchy.
3. Mazzini's vision frightened the conservatives.

8. Who were Marianne and Germania? What was the importance of the way in which they were portrayed?
1. The figure of Marianne representing the Republic of France.
2. Marianne means the people's nation.
3. Germania became the allegory of the German nation.
4. The German oak stands for heroism.
5. They represent the ideals of 'liberty' and 'republic'.

9. Write about the new Conservatism after 1815. / Write about the Vienna Congress in 1815.
1. Britain, Russia, Prussia & Austria defeated Napoleon in 1815.
2. They met at Vienna to draw up a settlement for Europe.
3. It was hosted by the Austrian Chancellor Duke Metternich.
4. France lost the territories it had annexed under Napoleon.
5. A series of states were set up on the boundaries of France.
6. Imposed censorship on newspapers, books, plays and songs.

10. How the hunger and hardship led the Popular Revolts of 1830 and 1848 in France?
1. The 1830s were years of great economic hardship in Europe.
2. Enormous increase in population all over Europe.
3. In most countries there were more seekers of jobs.
4. The peasants struggled under the burden of feudal dues.
5. The rise of food prices led to poverty in the country.
6. Food shortages and unemployment brought the population of Paris out on the roads.

11. Write about the unification of Germany. / Write a

Continued on next page..

news report on unification of Germany / Imagine you were a Journalist, Write on unification of Germany.

1. Prussia took on the leadership of the movement for unification.
2. Otto von Bismarck was the architect of the unification process.
3. Three wars over 7 years with Austria, Denmark and France –completed the process of unification.
4. On 18 January 1871, proclaimed the new German Empire headed by Kaiser William I.

12. Write about the unification of Italy.

1. In the 19th century, Italy was divided into seven states.
2. During the 1830s, Giuseppe Mazzini sought to unify Italy.
3. Cavour led the movement to unify the regions of Italy.
4. Sardinia-Piedmont defeated the Austrian forces in 1859.
5. Giuseppe Garibaldi and his volunteers were joined the fray.
6. In 1861 Victor Emmanuel II proclaimed king of united Italy.

13. Briefly trace the process of German unification.

1. The process of German unification was continued by Prussia.
2. Otto von Bismarck was the chief minister of Prussia.
3. He was the architect of the unification process.
4. German unification completed in seven years.
5. Prussia faced three wars with Austria, Denmark and France.
6. On 18 January 1871, proclaimed the new German Empire.

14. Write about the Balkan issue.

1. Romania, Bulgaria, Albania, Greece, Macedonia, Croatia, Bosnia, Slovenia, Serbia and Montenegro were in Balkans.
2. A large part of the Balkans was ruled by the Ottoman Empire.
3. The ideas of romantic nationalism in the Balkans spreaded.
4. The different Slavic nationalities struggled for independence.
5. The Balkan area became an area of intense conflict.
6. The Balkan states were fiercely jealous of each other.
7. Russia, Germany, England tried to hold powers on the Balkans.

15. What changes did Napoleon introduce to make the admini- strative system more efficient in the territories ruled by him? / Imagine you were a citizen living under Napoleon's rule. Make a diary entry on the changes introduced by Napoleon.

1. Napoleon made the administrative system more efficient.
2. He formulated the Civil Code of 1804.
3. It established equality before the law.
4. It secured the right to property.
5. Napoleon simplified administrative divisions.
6. He abolished the feudal system.

16. Prepare a diary entry on Garibaldi's role.

1. Today I read about Garibaldi.
2. He was a brave Italian freedom fighter.
3. He united many parts of Italy.
4. He fought many battles for freedom.
5. Garibaldi army was known as Red Shirts.
6. People called him the "Hero of Two Worlds".
7. His courage and sacrifice inspired many nations.
8. I feel proud learning about him.

CHAPTER - 2
NATIONALISM IN INDIA

KEY POINTS

- The Rowlatt Act gave the British enormous powers.
- Rowlatt Act hurriedly passed through the Imperial Council.
- Martial law was imposed, and General Dyer took command.
- On 13, April the in Jallianwalla Bagh incident took place.
- The spiritual head of the Islamic world (the Khalifa).
- Gandhi wrote the famous book Hind Swaraj (1909).
- Gandhi started Non-cooperation movement in 1920.
- Khilafat Movement began in January 1921.
- In Awadh, peasants were led by Baba Ramchandra.
- By Oct 1920, the Oudh Kisan Sabha was set up headed by Nehru, Baba Ramchandra.
- In 1928, Vallabhbhai Patel led a peasant movement in Bardoli.
- Alluri Sitaram Raju led the militant guerrilla movement.
- Alluri Sitaram Raju was captured and executed in 1924.
- The Inland Emigration Act passed in 1859 by the British.
- In Feb 1922, Gandhi withdrawn the Non-Cooperation Movement.
- C.R. Das and Motilal Nehru formed the Swaraj Party.
- Simon Commission arrived in India in 1928.
- It was greeted with the slogan 'Go back Simon'.
- On 31-01-1930 Gandhi sent a letter to Irwin to abolish the salt tax.
- Gandhi started salt march with 78 volunteers.
- The march was over 240 miles, from Sabarmati to Dandi.
- On 6 April 1930 Gandhi reached Dandi.
- In December 1931, Gandhiji went to London for the conference.
- Apr 1919: Hartal against Rowlatt Act; Jallianwala Bagh incident
- Jan 1921: Non-Cooperation and Khilafat movement launched.
- Feb 1922: Chauri Chaura; Withdraw Non-Cooperation movement
- May 1924: Alluri Sitharama Raju arrested.
- Dec 1929: Lahore Congress; adopts the demand for Purna Swaraj
- 1930: Ambedkar establishes Depressed Classes Association.
- Mar 1930: Civil Disobedience Movement - breaking salt law.
- Mar 1931: Gandhiji ends Civil Disobedience Movement.
- Dec 1931: Second Round Table Conference.
- 1932: Civil Disobedience re-launched.
- Gandhi called the 'untouchables' harijan, or the children of God,
- Muhammad Ali Jinnah was Muslim League leader.
- Bharat Mata - first created by Bankim Chandra Chattopadhyay.
- In the 1870s Bankim Chandra wrote 'Vande Mataram'.
- The failure of the Cripps Mission and the effects of World War II created widespread discontentment in India.
- In Wardha on 14 July 1942, passed the historic 'Quit India' resolution .
- On 8 August 1942 in Bombay, the All-India Congress Committee endorsed the resolution. Gandhiji delivered the 'Do or Die' speech.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. Why do MNCs produce in different countries?

A) To get cheap labor and save costs
B) To increase expenses
C) To avoid selling products
D) To work only in one country

2. Special Economic Zone is

A) Agricultural centres B) Trade centres
C) Industrial centres
D) Recreation centres

3. This is not the result of Globalization

A) It has advantage to consumers of well of sections.
B) Availability of goods increased.
C) The condition of industrial workers has improved.
D) The quality of goods has increased at the lower price

4. The aims of WTO is

A) Promote trade between two countries
B) Impose barriers on foreign trade
C) Liberalize international trade
D) Liberalize domestic trade

5. Which of the following is an indicator of human development?

A) Population growth
B) Per capita income
C) Geographical area
D) Climate change

సాక్షి బిజినెస్

మంగళవారం
10-2-2026

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
485	174
84,066	25,867

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,306	▲	274
డోజోన్స్	50,111	▽	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,382	▲	12
డాక్స్	25,056	▲	335
షాంఘై	4,123	▲	58
నికాయ్	56,364	▲	2,110

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.15	91.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.88	124.91
€	యూరో	ఎస్‌బీఐ	105.75	108.59
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.09	58.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	62.36	64.71
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.82	72.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.15	13.97

బ్యాంకులకు లాభాల కళ

- డిసెంబర్ క్వార్టర్‌లో రూ.52,603 కోట్లు
- 18 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో లాభాల మోత మోగించాయి. ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వరంగ బ్యాంకులు ఉమ్మడిగా రూ.52,603 కోట్ల నికర లాభాన్ని నమోదు చేశాయి. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.44,473 కోట్లతో పోల్చి చూస్తే 18 శాతం మేర (రూ.8,130 కోట్లు) పెంచుకున్నాయి. ➤ అన్నింటిలోకి ఎస్‌బీఐ వాటా అధికంగా ఉంది. డిసెంబర్ త్రైమాసికం (క్యూ3)లో ఎస్‌బీఐ రూ.21,028 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 24 శాతం పెరిగింది. ➤ చెన్నై కేంద్రంగా పనిచేసే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 35 శాతం అధికంగా రూ.1,365 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ➤ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం 32 శాతం పెరిగి రూ.1,263 కోట్లుగా ఉంది. ➤ లాభంలో అధిక వృద్ధిని చూపించిన వాటిల్లో ఎస్‌బీఐతోపాటు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (27 శాతం), కెనరా బ్యాంక్ (26 శాతం) ఉన్నాయి. ➤ పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (19 శాతం) యూకో బ్యాంక్ (16 శాతం), పీఎన్‌బీ 13 శాతం చొప్పున లాభాన్ని డిసెంబర్ త్రైమాసికంలో పెంచుకున్నాయి. ➤ 12 ప్రభుత్వరంగ బ్యాంక్‌ల ఉమ్మడి లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 11 శాతం పెరిగి రూ.44,218 కోట్లుగా ఉంది. సెప్టెంబర్ త్రైమాసికంలో 9 శాతం తక్కువగా రూ.49,456 కోట్లుగా ఉండడం గమనించొచ్చు. ➤ ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ చివరి వరకు తొమ్మిది నెలల్లో ప్రభుత్వరంగ బ్యాంకుల లాభం రూ.1,46,277 కోట్లకు చేరింది. అంక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది రూ.1,29,994 కోట్లుగా ఉంది. ➤ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పీఎస్‌బీల లాభం రూ.2లక్షల కోట్లను అధిగమిస్తుందన్న ఆశాభావాన్ని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు వ్యక్తం చేశారు.

ఏప్రిల్ 1 విడుదల

పాన్ రూల్స్ రీలోడెడ్

- బైక్ నుంచి బంగ్లా వరకు ఒకటే రూల్
- హైవాల్యూ డీల్ అయితేనే పాన్... ● కొత్త రూల్స్‌తో రిలీఫ్ సీన్
- హైదరాబాద్‌కి మెట్రో హోదా. ఇక హెచ్‌ఆర్‌ఏలో బెనిఫిట్
- ప్రాపర్టీ ధర 20 లక్షలు మించినప్పుడే పాన్
- కారు ధర రూ.5 లక్షలు మించితేనే
- నగదు డిపాజిట్, ఉపసంహరణలు రూ.10 లక్షలు దాటితేనే
- ముసాయిదా నిబంధనలు వెల్లడి ● మార్చిలో నోటిఫికేషన్

న్యూఢిల్లీ: ప్రాపర్టీ, వాహన కొనుగోళ్లు, బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, ఉపసంహరణలకు ఇకపై ప్రతిసారీ పాన్ సమర్పించాల్సిన అవసరం రాదు! ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే కొత్త ఆదాయ పన్ను చట్టం కింద పాన్ విషయమై పన్ను చెల్లింపుదారులకు భారీ ఊరట దక్కనుంది. ఇందుకు సంబంధించి ముసాయిదా నిబంధనలను ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) సోమవారం విడుదల చేసింది. సంప్రదింపుల అనంతరం తుది నిబంధనలను మార్చి మొదటి వారంలో సీబీడీటీ నోటిఫై చేస్తుంది. క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లు ఆదాయ పన్ను శాఖతో సమాచారం పంచుకోవడాన్ని తప్పనిసరి కానుంది. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ఆమోదనీయమైన ఎలక్ట్రానిక్ చెల్లింపుల మాధ్యమంగా మారనుంది.

కొత్త నిబంధనలు ఇవే..

➤ ప్రస్తుతం బ్యాంకుల్లో ఒకరోజులో రూ.50,000కు మించి నగదు డిపాజిట్ చేస్తుంటే పాన్ కాపీ ఇవ్వడం తప్పనిసరి. అలాగే, ఆర్థిక సంవత్సరం మొత్తం మీద జమలు, ఉపసంహరణలు రూ.20 లక్షలు మించినప్పుడు కూడా ఇవ్వాల్సి వచ్చేది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒక ఆర్థిక సంవత్సరంలో నగదు డిపాజిట్, ఉపసంహరణల మొత్తం రూ.10 లక్షలకు మించినప్పుడే శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) ఇస్తే సరిపోతుంది. ఒక వ్యక్తికి ఒకటికి మించిన ఖాతాలున్నా సరే.. అన్నింటికీ ఉమ్మడిగా రూ.10 లక్షల పరిమితే వర్తిస్తుంది.

➤ ప్రాపర్టీ (ఇల్లు లేదా భూమి) కొనుగోలు లేదా విక్రయం లేదా బహుమతిగా ఇవ్వడం లేదంటే ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు చేసుకునే ఒప్పందం విలువ రూ.10 లక్షలకు మించితే ప్రస్తుతం పాన్ ఇవ్వాల్సి వస్తోంది. ఇకపై (ఏప్రిల్ 1 నుంచి) రూ.20 లక్షలకు మించినప్పుడే ఈ నిబంధన అమలవుతుంది.

➤ వాహనం కొనుగోలు విలువ రూ.5లక్షల్లోపు ఉంటే ఇకపై పాన్ అవసరం పడదు. కొనుగోలు ధర రూ.5లక్షలకు మించినప్పుడే పాన్ సమర్పించాల్సి ఉంటుంది. అన్ని వాహనాలకూ ఇకపై ఇదే అమలు కానుంది. ప్రస్తుతం ద్విచక్ర వాహన కొనుగోళ్లకు పాన్ నుంచి మినహాయింపు ఉంది. ఇతర అన్ని వాహనాల కొనుగోళ్ల సమయంలో ధరతో సంబంధం లేకుండా ప్రస్తుతం పాన్ ఇవ్వాలన్న నిబంధన అమల్లో ఉంది.

➤ హోటల్/రెస్టారెంట్ బిల్లు, కన్వెన్షన్ సెంటర్లు లేదా బాంక్వెట్ హాళ్ల (వేడుకల కేంద్రాలు)కు చేసే చెల్లింపులు రూ.లక్షకు మించితే ఇక మీదట పాన్ తప్పనిసరి. హోటల్/రెస్టారెంట్ బిల్లు రూ.50వేలు మించినప్పుడే ప్రస్తుతం పాన్ ఇవ్వాల్సి వస్తోంది.

➤ ఇకపై జీవిత బీమా పాలసీ కొనుగోలు సమయంలో పాన్ ఇవ్వడం తప్పనిసరి. ప్రస్తుతం వార్షిక ప్రీమియం రూ.50,000 మించిన పాలసీలకే ఇది అమలవుతోంది.

➤ ప్రథమ శ్రేణి మెట్రోలుగా హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్‌లను సైతం గుర్తించింది. ఈ నగరాల్లో నివసించే వారికి ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ)పై మినహాయింపుల పరిమితి రూ.40వేల నుంచి రూ.50వేలకు పెరగనుంది. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైలకే ఈ గుర్తింపు ఉంది.

➤ అధికారిక వాహనాలు, ఉద్యోగులకు సంస్థలు సమకూర్చే భోజనాలకు సైతం పన్ను మినహాయింపుల పరిమితులు పెరగనున్నాయి. వాహనం కోసం ప్రతి నెలా రూ.8,000, ప్రతి భోజనం రూ.200కు పన్ను ఉండదు.

➤ కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత పన్ను రిటర్నుల దాఖలు కూడా సులభతరం కానుంది.

➤ ప్రస్తుతం రూ.2 లక్షలకు మించి చేసే బంగారం కొనుగోళ్లకు (ఆభరణాలు, కాయిన్లు, ఇతర రూపాల్లోని బంగారం) పాన్ తప్పనిసరి. దీనితోపాటు జాబితాలో లేని ఇతర అన్ని లావాదేవీలకు ప్రస్తుత నిబంధనలే కొత్త చట్టం కింద అమలు కానున్నాయి.

84,000 పైకి సెన్సెక్స్

- కొనసాగిన 'ట్రేడ్ డీల్' ఉత్సాహం
- అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల హుషారు

ముంబై: భారత్–అమెరికాల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ఉత్సాహంతో సోమవారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్ అరశాతం పెరిగింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగాయి. సెన్సెక్స్ 485 పాయింట్లు పెరిగి 84 వేల స్థాయిపైన 84,066 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 174 పాయింట్లు లాభపడి 25,867 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 734 పాయింట్లు పెరిగి 84,315 వద్ద, నిఫ్టీ 229 పాయింట్లు బలపడి 25,922 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేశాయి. జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధాని సనాయే తకైచి నేతృత్వంలోనే లిబరల్ డెమోక్రటిక్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల్లో విజయం సాధించడంతో ఆసియా మార్కెట్లు ర్యాలీ చేశాయి. జపాన్, కొరియా మార్కెట్లు 4% లాభపడ్డాయి. థాయిలాండ్ తైవాన్, హాంగ్‌కాంగ్ 3–2%, చైనా, ఇండోనేషియా, సింగపూర్ సూచీలు 1% పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

➡ అంచనాలకు మించి డిసెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఇటీవల పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. బడ్జెట్ ప్రతిపాదనలు, యూఎస్‌తో వాణిజ్య ఒప్పంద మద్దతుతో సిమెంట్, క్యాపిటల్ గూడ్స్, టెక్స్‌టైల్స్, కన్జూమర్ డిస్క్రెషనరీ షేర్లు రాణించాయి.

➡ బీఎస్‌ఈ రంగాల వారీ ఇండెక్సుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ ఇండెక్సులు 3% ర్యాలీ చేశాయి. కమోడిటీస్, ఇండస్ట్రియల్స్, టెలికమ్యూనికేషన్, క్యాపిటల్ గూడ్స్, కన్జూమర్ డిస్క్రెషనరీ, మెటల్ సూచీలు 2% లాభపడ్డాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 2.31%, 1.27 శాతం పెరిగాయి.

➡ డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 90.36% వృద్ధి నమోదుతో కల్యాణ్ జ్యువెలరీస్ షేరు మెరిసింది. బీఎస్‌ఈలో 15% పెరిగి రూ.438 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 16% ర్యాలీ చేసి రూ.443 వద్ద గరిష్టాన్ని తాకింది.

మళ్లీ వెండి వేడి

రూ.17000 పెరిగిన ధర

న్యూఢిల్లీ: విలువైన లోహాల ధరలు మళ్లీ జోరందుకున్నాయి. తాజాగా వెండి కిలో ధర దాదాపు 7 శాతం (రూ. 17,000) జంప్‌చేసింది. అన్ని పన్నులు కలుపుకుని రూ. 2,72,000కు చేరింది. ఇదే బాటలో బంగారం ధరలు సైతం మెరిశాయి. స్థానిక బులియన్ మార్కెట్లో 99.9 స్వచ్ఛతగల 10 గ్రాములు రూ. 1,300 బలపడింది. రూ. 1,58,500ను తాకింది. వారాంతాన వెండి కేజీ రూ. 2,55,000 వద్ద, పసిడి 10 గ్రాములు రూ. 1,57,200 వద్ద నిలిచిన విషయం విదితమే. ధరల తాజా పెరుగుదలకు యూఎస్ డాలరు బలహీనపడటం, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పుంజుకోవడం కారణమైనట్లు బులియన్ వర్గాలు తెలియజేశాయి. అంతేకా కుండా ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో కొనసాగుతున్న అనిశ్చితికితోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ తీసుకుంటున్న అనూహ్య రాజకీయ, భౌగోళిక చర్యలు వెండి, పసిడి తదితర విలువైన లోహాలకు డిమాండును పెంచుతున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

విదేశీ మార్కెట్లో

అంతర్జాతీయ మార్కెట్లో సిల్వర్ స్పాట్ ధర ఔన్స్ 2.8 శాతం(2.2 డాలర్లు) ఎగసింది. 80.21 డాలర్లను తాకింది. మరోపక్క పసిడి ఔన్స్(31.1 గ్రాములు) 1 శాతం పుంజుకుని 5,013 డాలర్లకు చేరింది.

అరబిందో ఫార్మా లాభం ప్లస్

క్యూ3లో రూ. 910 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం ఎగసి రూ. 910 కోట్లను తాకింది. యూరప్, యూఎస్‌లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో హైదరాబాద్ కంపెనీ రూ. 846 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,979 కోట్ల నుంచి రూ. 8,646 కోట్లకు బలపడింది. ప్రధాన బిజినెస్‌లలో పటిష్ట ఎగ్జిక్యూషన్, నిలకడైన డిమాండ్, యూఎస్, యూరప్ తదితర కీలక మార్కెట్లలో విస్తరించిన బలమైన డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో వంటి అంశాలు క్యూ3 ఫలితాలను ప్రతిబింబిస్తున్నట్లు కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1 శాతం లాభంతో రూ. 1,201 వద్ద ముగిసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

నీట్ (యూజీ)-2026

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్‌ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్‌ఎంఎస్‌ల్లో ప్రవేశాల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) యూజీ(నీట్ యూజీ–2026) పరీక్షకు నోటిఫికేషన్ విడుదలచేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ) ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.02.2026.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.03.2026 నుంచి 12.03.2026.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.03.2026
» **నీట్ పరీక్ష తేది:** 03.05.2026(పరీక్ష సమయం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు)
» **వెబ్‌సైట్:** https://neet.ntaonline.in

ఇర్కాన్‌లో 26 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 26.
» **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఎస్–టీ.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–17, డిప్లొమా అప్రెంటిస్–09.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. » **వయసు:** 01.01.2026 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.10,000, డిప్లొమా అప్రెంటిస్‌కు 8,500
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.02.2026
» **వెబ్‌సైట్:** https://ircon.org

బీహెచ్‌యూ వారణాసిలో 21 పోస్టులు

వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ) తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ కన్సల్టెంట్–01, జూనియర్ కన్సల్టెంట్–01, రీసెర్చ్ అసోసియేట్–01, సీనియర్ రీసెర్చ్ ఫెలో–06, యంగ్ ప్రొఫెషనల్2–06, యంగ్ ప్రొఫెషనల్1–06.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ /ఎమ్మెస్సీ/ పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. » **వయసు:** 21 ఏళ్ల నుంచి 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి 80,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** nsmpbhu@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 17.02.2026.
» **వెబ్‌సైట్:** https://www.bhu.ac.in

సీఆర్‌ఆర్‌ఐ, న్యూఢిల్లీలో 12 పోస్టులు

న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్‌ఐఆర్)– సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఆర్‌ఆర్‌ఐ) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్–01, సెక్యూరిటీ అసిస్టెంట్/వాచ్ అండ్ వార్డ్ అసిస్టెంట్–01,మల్టీ టాస్కింగ్ స్టాఫ్–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా పీజీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, హిందీ, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు 30 ఏళ్లు, అసిస్టెంట్/వాచ్ అండ్ వార్డ్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు 25 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, సెక్యూరిటీ అసిస్టెంట్/వాచ్ అండ్ వార్డ్ అసిస్టెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.18,000 నుంచి రూ.56,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.02.2026
» **వెబ్‌సైట్:** https://crridom.gov.in

సీబీఓ పోస్టులకు సై అంటారా..!

» 2,050 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు
» నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్‌బీఐ
» డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం
» రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఇటీవల కాలంలో నిరంతరం ఉద్యోగ నోటిఫికేషన్లతో పలకరిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. తాజాగా మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా 16 సర్కిల్స్‌లో.. రెండు వేలకుపైగా సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. దీంతో బ్యాంకు ఉద్యోగార్థులకు మరో చక్కటి అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ సర్కిల్ బేస్డ్ ఆఫీసర్స్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్, కెరీర్ స్కోప్ తదితర సమాచారం..

16 సర్కిల్స్.. 2,050 పోస్టులు

ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా జాతీయ స్థాయిలో 16 సర్కిల్స్‌లో 2,050 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల నియామకం చేపట్టనుంది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి సర్కిల్‌లో 97 పోస్టులు, తెలంగాణలోని హైదరాబాద్ సర్కిల్‌లో 80 పోస్టులు ఉన్నాయి.

వేతనం

ప్రారంభ వేతన శ్రేణి నెలకు రూ.48,480 – రూ.85.920గా ఉంది.

అర్హతలు

✦ ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
✦ **పని అనుభవం:** 2025, డిసెంబర్ 31 నాటికి ఆఫీసర్ హోదాలో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ లేదా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో కనీసం రెండేళ్ల ఉద్యోగ అనుభవం తప్పనిసరి. నిబంధనల ప్రకారం డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాతే ఈ అనుభవం పొంది ఉండాలి.
✦ **వయసు:** 2025, డిసెంబర్ 31 నాటికి 21–30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులకు చేపట్టే నియామక ప్రక్రియలో రెండు దశల విధానాన్ని అమలు చేస్తున్నారు. తొలుత రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత సర్టిఫికెట్ల స్క్రీనింగ్ ఉంటుంది. చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

నాలుగు విభాగాల్లో రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలి దశలో నిర్వహించే రాత పరీక్షలో నాలుగు విభాగాలు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు–30 మార్కులు), బ్యాంకింగ్ నాలెడ్జ్ (40 ప్రశ్నలు–40 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ (30 ప్రశ్నలు–30 మార్కులు), కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (20 ప్రశ్నలు –20 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 120 ప్రశ్నలతో రెండు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు.

డిస్క్రిప్టివ్ టెస్ట్

రాత పరీక్షలో భాగంగానే ఆబ్జెక్టివ్ పరీక్ష ముగిసిన తర్వాత మరో 30 నిమిషాల వ్యవధిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో 50 మార్కులకు డిస్క్రిప్టివ్ పరీక్ష ఉంటుంది. ఇందులో భాగంగా లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ విభాగాల్లో పరీక్ష జరుగుతుంది. రెండు ప్రశ్నలతో మొత్తం 50 మార్కులకు ఈ డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

ఇంటర్వ్యూ

రాత పరీక్షలో మార్కుల ఆధారంగా.. సర్కిల్ వారీగా ఉన్న ఖాళీలకు అనుగుణంగా అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకి 50 మార్కులు కేటాయించారు. అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగంపై ఆసక్తి, సమకాలీన పరిణామాలపై అవగాహన, బ్యాంకింగ్ రంగ పరిజ్ఞానాన్ని పరిశీలించే విధంగా ఈ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

వెయిటేజీ విధానం

అభ్యర్థులకు నియామకాలను ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో ప్రతిభకు 75 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కల్పిస్తారు. అంటే.. 170 మార్కులకు నిర్వహించే రాత పరీక్షలో పొందిన మార్కులను 75 శాతానికి.. 50 మార్కులకు నిర్వహించే ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 25 శాతానికి మదింపు చేస్తారు. ఆ తర్వాత రాష్ట్రాల వారీగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

లాంగ్వేజ్ టెస్ట్

✦ సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియలో భాగంగా సంబంధిత రాష్ట్రానికి చెందిన అధికారిక భాషపై లాంగ్వేజ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న రాష్ట్రానికి చెందిన భాషకు సంబంధించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల్లో విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే నియామకం ఖరారు చేస్తారు.
✦ పదో తరగతి, 12వ తరగతిని సంబంధిత రాష్ట్రానికి చెందిన మాతృ భాషలో చదివిన వారికి ఈ రాత పరీక్ష నుంచి మినహాయింపు కల్పిస్తారు. దరఖాస్తు విషయంలో ప్రత్యేక నిబంధన విధించారు. అభ్యర్థులు కేవలం ఒక రాష్ట్రంలోని ఖాళీలకే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ముఖ్య సమాచారం

✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఆయా సర్కిళ్ల పరిధిలోని రాష్ట్రాల్లో ఏదైనా ఒక రాష్ట్రంలోని ఖాళీలకే దరఖాస్తు చేసుకోవాలి.
✦ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**2026, ఫిబ్రవరి 18
✦ **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2026, మార్చి నెలలో
✦ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, గుంటూరు, విజయవాడ, కర్నూలు, రాజమండ్రి, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్
✦ **ఆన్‌లైన్ దరఖాస్తు, పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/careers/currentopenings

విజేతగా నిలవాలంటే

బ్యాచిలర్ డిగ్రీ అర్హత, పని అనుభవం అర్హతలుగా నిర్వహించే ఎస్‌బీఐ సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల రాత పరీక్షలో విజయానికి ఇప్పటి నుంచే కృషి చేయాలి. విభాగాల వారీగా అనుసరించాల్సిన వ్యూహాలు..

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. ఇంగ్లిష్‌లో బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ

ఆర్థిక, వాణిజ్య, వ్యాపార పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు కొంత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. అంతేకాకుండా ఎకానమీకి సంబంధించి జీడీపీ మూల భావనలు, సమ్మిళిత వృద్ధి, మైక్రో, మ్యాక్రో ఎకనామిక్స్ భావనలు తెలుసుకోవాలి.

బ్యాంకింగ్ నాలెడ్జ్

బీఎఫ్‌ఎస్‌ఐ రంగంలో తాజా పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్

కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి. అదే విధంగా కంప్యూటర్ పదజాలం, బ్యాంకింగ్ రంగంలో వినియోగించే సాఫ్ట్‌వేర్‌ల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

డిస్క్రిప్టివ్ టెస్ట్

రాత పరీక్షలో కీలకంగా నిలిచే ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో ఉండే లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్‌లో రాణించడానికి బిజినెస్ లెటర్స్, అఫిషియల్ లెటర్స్, పర్సనల్ లెటర్స్‌ను రాయడం అలవర్చుకోవాలి. వీటి విషయంలో పంక్చుయేషన్స్ కూడా ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ఇక ఎస్సే రైటింగ్‌కు సంబంధించి బ్యాంకింగ్ రంగ పరిణామాలకు ప్రాధాన్యమిస్తూ వ్యాసాలు రాయగలిగే నేర్పు సాధించాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దిన పత్రికల్లో ప్రచురించే బిజినెస్ న్యూస్, అనాలిసిస్‌లను పరిశీలించడం ఉపయుక్తంగా ఉంటుంది. వాటిని విశ్లేషించి సారాంశాన్ని గ్రహించి ఎస్సే రాయగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

జేఎంజీఎస్-1 హోదా

సీబీఓ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్–1 హోదాలో కొలువు ఖరారు చేస్తారు. ఆరు నెలల ప్రొబేషన్ ఉంటుంది. ఈ ప్రొబేషన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకం ఖరారు చేస్తారు. ఇలా శాశ్వత నియామకం ఖరారు చేసుకున్న వారికి జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్–1 హోదా కల్పిస్తారు. ఆ తర్వాత ప్రతిభ పనితీరు ఆధారంగా చీఫ్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ సాహిత్యం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

ఆప్కాస్ ఉద్యోగాలకు మంగళం!

ఇటీవల సమగ్ర శిక్ష విడుదల చేసిన పోస్టుల్లో 50 శాతం ప్రైవేటు పరం?

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల శ్రమ దోపిడీకి మళ్లీ రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్) కింద సకాలంలో జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు పొందుతున్న ఉద్యోగులు టీడీపీ కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయంతో 2014 నాటి ఏజెన్సీ అవుట్ సోర్సింగ్ విధానంలోకి వెళ్లనున్నారు. ఈ మేరకు ప్రణాళిక సిద్ధమైంది. దీంతో.. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఒప్పంద ప్రాతిపదికన నియమించే ఉద్యోగాలను ఇకపై టీడీపీ అనుయాయులకు కట్టబెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీల్లోని 1,095 ఉద్యోగాల భర్తీకి డిసెంబరు 26న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులను జనవరి 31 నాటికి భర్తీ ప్రక్రియ పూర్తిచేసి ఆప్కాస్ ద్వారా వేతనాలు ఇచ్చేందుకు మార్గదర్శకాలు కూడా జారీచేశారు. దీంతో వేలల్లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం హఠాత్తుగా ఈ పోస్టుల భర్తీని నిలిపివేసింది. వీటిలో ఏఎన్ఎం, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, డే అండ్ నైట్ వాచ్ ఉమెన్, అటెండర్, స్వీపర్, స్కావెంజర్ వంటి దాదాపు 500 పోస్టులను ఏజెన్సీ ద్వారా భర్తీచేయాలని నిర్ణయించి అవుట్ సోర్సింగ్ సంస్థకు అప్పగించేందుకు రంగం సిద్ధంచేశారు. దీంతోపాటు సంక్షేమ శాఖలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు తదితర 10 విభాగాల్లో మరో 2,600 పోస్టులను కూడా ఇదే విధానంలో అప్పగించనున్నారు. ఆప్కాస్‌తో ఎలాంటి సంబంధంలేకుండా కాంట్రాక్టు సంస్థలే వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టారు. అయితే, ఈ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ ద్వారా ఒక్కరోజు మినహాయించి 12 నెలల వేతనాలు చెల్లిస్తుండగా,


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Social Welfare Department – Welfare Educational Institutions & Hostels – Outsourcing of Cleaning & Sanitation Services and Cooking Services through Third Party Agencies – Permission accorded – Orders – Issued.

SOCIAL WELFARE (EDU-II) DEPARTMENT

G.O.Rt.No.12 Dated:09-01-2026
Read the following:

1. U.O.Note No.3060930-Edu-II-2025, dated 03.12.2025.
2. G.O.Rt.No.295, SW (EDU-II) Department, Dated:05-12-2025.
3. Proposals received from the Residential Educational Institutions / Hostels in all Welfare Departments.
4. e-file No.3060930 of Social Welfare Department.

జీవో 151 ప్రకారం ఏజెన్సీల ద్వారా పోస్టుల భర్తీకి ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం 12

ఇకపై వారికి 10.5 నెలలు మాత్రమే వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే ప్రైవేటు ఏజెన్సీ ద్వారా పాఠశాల విద్యాశాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించగా, వీరికి సదరు సంస్థ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకుండా వేధిస్తోంది. ఈ వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, అకౌంటెంట్, ఏఎన్ఎం, టీచింగ్, హాస్టల్ వార్డెన్స్, పార్ట్‌టైమ్ టీచింగ్ స్టాఫ్ పోస్టులకు ప్రతిభ, పని అనుభవాన్ని పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం తమకు కావాల్సిన వారిని ఎంపిక చేశారు. వీటిలో ఒక్కో పోస్టుకు ఓ రేటు కట్టి వసూలు చేసినట్లు తెలిసింది.

నాటి టీడీపీ ప్రభుత్వంలో శ్రమ దోపిడీ..

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నియామకాలను గత టీడీపీ ప్రభుత్వం నిలిపివేసింది. కొత్తగా కాంట్రాక్టు విధానం తీసుకొచ్చింది. తన వర్గంలోని అనుయాయులకు లబ్ధిచేకూర్చేందుకు మధ్యవర్తులుగా 'అవుట్ సోర్సింగ్' కంపెనీలను తెరపైకి తెచ్చింది. ప్రభుత్వ విభాగాల్లోని ఖాళీ పోస్టులను మొత్తం గంపగుత్తగా తన వర్గం వారికి (మేన్‌పవర్ ఏజెన్సీలు) అప్పగించి వారితోనే నియామకాలు చేపట్టింది. వేతనాలు సైతం సదరు కంపెనీయే చెల్లించేది. ఈ కాంట్రాక్టు ఏజెన్సీల ద్వారా ఉద్యోగంలో చేరాలంటే లంచాలు ఇచ్చుకోవాల్సి వచ్చేది. అప్పట్లో ఈ ఉద్యోగులకు ఒప్పందం ప్రకారం వేతనాలు ఇవ్వకపోగా, జీతంలో కోతలు సర్వసాధారణమయ్యాయి. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులు సైతం ఎగవేశాయి. నియామకాల్లో ఒక విధానం అంటూ లేకుండా దారుణంగా ప్రవర్తించాయి. ఎవరైనా ప్రశ్నిస్తే నిర్దాక్షిణ్యంగా ఊస్టింగే. దీంతో చిరుద్యోగులకు రక్షణ లేకుండాపోయింది.

మళ్లీ మధ్యవర్తులతో దోపిడీకి స్కెచ్!..

మరోవైపు.. ఆప్కాస్‌ను రద్దుచేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నించడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో.. కొత్తగా చేపట్టే నియామకాలను మధ్యవర్తులు, మేన్‌పవర్ కంపెనీలకు అప్పగించేందుకు ఈనెల 9న ప్రభుత్వం ఉత్తర్వులు (జీఓ–12) జారీచేసింది. తొలి విడతలో 10 రకాల ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉద్యోగాలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తోంది. ఇందులో, సమగ్ర శిక్షలోని కేజీబీవీలు.. ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ.. గిరిజన సంక్షేమ శాఖ.. ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ (గురుకులాలు).. బీసీ సంక్షేమ శాఖ.. మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ.. మైనారిటీ సంక్షేమ శాఖ.. వికలాంగులు, ట్రాన్స్‌జెండర్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ ..జువెనైల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్, వీధి పిల్లల సంక్షేమ శాఖ.. ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలున్నాయి. వీటిల్లో ఖాళీగా ఉన్న 3 వేలకు పైగా పోస్టులను ప్రైవేటు అవుట్ సో ర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించడంతో పాటు ఏడాదిలో 10.5 నెలలకే జీతాలు చెల్లించాలని నిర్ణయించారు. ప్రభుత్వం 2016 ఆగస్టులో జారీచేసిన జీఓ ఎంఎస్ నెం.151 ప్రకారం ఈ నియామకాలు ఉండాలని పేర్కొనడంతో చిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆప్కాస్ కింద 1.07 లక్షల మందికి రక్షణ..

ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో చిరుద్యోగులను దోచుకుంటున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు, మేన్ పవర్ కంపెనీల నుంచి చిరుద్యోగులకు రక్షణ కల్పించేందుకు గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్) సంస్థను 2019 డిసెంబరులో చట్టబద్ధంగా ప్రారంభించింది. అప్పటిదాకా తీవ్ర శ్రమదోపిడీకి గురవుతున్న ఈ ఉద్యోగులను ఆప్కాస్ కిందకు తెచ్చి వారికి గరిష్ట ప్రయోజనాలు కల్పించారు. అలాగే, ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు, మధ్యవర్తులను పూర్తిగా తొలగించారు. ఎస్సీ/ఎస్టీ/ బీసీ, మైనారిటీలు, మహిళలకు రిజర్వేషన్ కల్పించారు. ఎవరికీ లంచాలిచ్చే ఆస్కారం లేకుండా, ఎలాంటి కోతలు విధించకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించారు. పీఎఫ్, ఈఎస్ఐ రక్షణ కల్పించారు. ఇలా ప్రస్తుతం ఆప్కాస్ కింద 1.07 లక్షల మంది పనిచేస్తున్నారు.

ఐదు నెలలుగా జీతాలు ఇవ్వని ఏజెన్సీలు..

సమగ్ర శిక్ష పరిధిలో అమలవుతున్న ఎన్ఎస్క్యూఎఫ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూల్స్, సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ ట్రేడ్స్‌లో వొకేషనల్ శిక్షణ ప్రారంభించారు. శిక్షణ కోసం తొమ్మిది వొకేషనల్ ట్రైనింగ్ పార్ట్‌నర్ ఏజెన్సీల (ప్రైవేట్ ఏజెన్సీలు) ద్వారా 3,350 మంది ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. అయితే, వీరికి ఐదు నెలలుగా జీతాలివ్వకుండా ఏజెన్సీలు వేధిస్తున్నాయి. దీంతో.. ఓ ట్రైనర్ 'తాము చేస్తున్నది వెట్టిచాకిరీనా మరేంటో అర్థం కావడంలేదు. వేతనాల్లేకుండా ఎలా బతకాల'ని సోషల్ మీడియాలో చేసిన పోస్టు కన్నీళ్లు పెట్టిస్తోంది. 'బ్రహ్మచారిగా ఉన్న తనకే ఇలా ఉంటే కుటుంబాలు ఉన్నవారి పరిస్థితి ఇంకెంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకంటే ఆత్మహత్య చేసుకోవడం మంచిద'ని ఆయన వాపోయాడు.

సత్వర న్యాయం ప్రజల మౌలిక హక్కు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్
- మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు న్యాయమూర్తులు

మాట్లాడుతున్న జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్. చిత్రంలో జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ తదితరులు

సాక్షి, అమరావతి: సత్వర న్యాయం ప్రజల మౌలిక హక్కు అని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. మధ్యవర్తిత్వంపై హైకోర్టు ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 40 గంటల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరీ, న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బీవీఎస్ హిమబిందు, ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్.అమరరంగేశ్వరరావు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి జి.మాలతి తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ..మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమైతే కక్షిదారులకు శాశ్వత, సంతృప్తికరమైన పరిష్కారం లభించినట్లవుతుందన్నారు. వివాహ, వ్యవసాయ, వ్యాపార సంబంధిత వివాదాల్లో మధ్యవర్తిత్వాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరముందని, మధ్యవర్తిత్వ ప్రక్రియను సమర్థవంతంగా వినియోగించుకోవాలని న్యాయవాదులకు సూచించారు. కోర్టుల్లో సుదీర్ఘంగా కేసులు పెండింగ్‌లో ఉండటంతో వాటికి సత్వర పరిష్కారం లభించాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. పలువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ.. న్యాయవాదులు, మధ్యవర్తులు విశేష కృషి వల్ల పెద్ద సంఖ్యలో కేసులు విజయవంతంగా పరిష్కారమయ్యాయని తెలిపారు. మధ్యవర్తిత్వంలో నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే హాస్టళ్ల విద్యార్థులకు అవస్థలు

- 20 నెలల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 18 ఘటనలు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు ఆగ్రహం

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు ఏర్పాటైన ఈ 20 నెలల కాలంలో సంక్షేమ హాస్టళ్లలో జరిగిన 18 దారుణ ఘటనల్లో పలువురు విద్యార్థులు మరణించగా, అనేకమంది విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రుల పాలయ్యారని, ఇవన్నీ విద్యార్థులపట్ల సీఎం చంద్రబాబు క్రూర మనస్తత్వానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న దారుణాలకు చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా పోలవరం జిల్లా మారేడుపల్లి మండలం దేవరపల్లి గిరిజన సంక్షేమ బాలుర హాస్టళ్లలో 89 మంది బాలురు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ఉడికీ ఉడకని ఇడ్లీ, నిల్వ ఉన్న చెట్నీ తినడంవల్ల వీరంతా ఆస్పత్రి పాలయ్యారన్నారు. మంత్రి లోకేశ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సుధారాణి ఇందుకు బాధ్యత వహించాలన్నారు. లోకేశ్ తన విద్యాశాఖను సరిగ్గా నిర్వహించలేకపోతున్నాడని ఆయన విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తే, చంద్రబాబు ప్రభుత్వం దాన్ని ఘోర ముద్దగా మార్చేసి చిన్నారుల ఆరోగ్యంతో ఆడుకుంటోందని మండిపడ్డారు. చివరికి.. హోంమంత్రి తిన్న భోజనంలోనే బొద్దింక కనిపించిందని సుధాకర్‌బాబు గుర్తుచేశారు. అలాగే, వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థుల సంక్షేమం, వసతి, ఆరోగ్యం కోసం వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో 40 లక్షల 50 వేల మంది విద్యార్థులకు రూ.7,245 కోట్లు ఖర్చు చేస్తే.. చంద్రబాబు 2014–19 మధ్య ఖర్చుపెట్టింది కేవలం రూ.450 కోట్లు మాత్రమేనన్నారు.

కెనడాలో భారతీయుడి హత్య

మృతుడు బెంగళూరుకు చెందిన టెక్కీ

చందన్‌కుమార్

దొడ్డబళ్లాపురం: కెనడాలో దుండగుల కాల్పుల్లో కర్ణాటకవాసి మృతిచెందాడు. బెంగళూరు సమీపంలోని నెలమంగళ తాలూకా త్యామగొండ్లు గ్రామం నివాసి చందన్‌కుమార్ రాజా (37) ఏడాది నుంచి బెంగళూరుకు చెందిన ఐటీ కంపెనీ తరఫున కెనడాలో టొరెంటో వద్ద బ్రాంప్టన్‌లో టెక్కీగా పని చేస్తున్నాడు. ఆ దేశ కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 3:30 సమయంలో టొరెంటోలో వుడ్‌బైన్ మాల్ వద్ద పార్కింగ్ లాట్‌లో తన కారు వద్ద ఉండగా గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరపడంతో బుల్లెట్‌లు తగిలి చందన్ పడిపోయాడు. స్థానిక పోలీసులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చందన్ చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం వివరాలు తెలియజేసినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. చందన్ తండ్రి నందకుమార్ మాట్లాడుతూ తమ కొడుకును 6 ఏళ్ల కిందట కంపెనీ కెనడాకు పంపిందన్నారు. జాతి వివక్షతో ఎవరైనా హత్య చేశారా ? లేక ఇతరత్రా కారణాలు ఉన్నాయా? అనే విషయాలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టొరెంటో పోలీసులు తెలిపారు.

ఉద్యోగులపై ప్రభుత్వానికి ఎందుకింత కక్ష?

వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉద్యోగులకు 33 ఏళ్ల సర్వీసు పూర్తయితే తప్పనిసరి రిటైర్మెంట్ ఇచ్చేలా చంద్రబాబు ప్రభుత్వం తెస్తున్న నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక చంద్రబాబు ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురిచేసి వాళ్ల చావులకు కారణమవుతున్నారని మండిపడ్డారు. 'గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచితే.. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం 33 ఏళ్ల సర్వీసు పూర్తయితే రిటైర్మెంట్ ఇచ్చి వాళ్ల నోరు కొట్టాలని చూస్తున్నారు. ఉద్యోగులకు 1వ తేదీ జీతాలిస్తున్నామని చెబుతున్నా..క్షేత్రస్థాయిలో 12వ తేదీ వరకు కూడా చాలామందికి జీతాలు అందడం లేదన్నారు.

ఒకే ఘటనపై ఎన్ని కేసులు పెడతారు?

- అంబటి రాంబాబుపై కేసుల నమోదుపై పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు
- రాంబాబుపై కేసుల విషయంలో సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని ఆదేశం
- తదుపరి విచారణ మార్చి 1కి వాయిదా

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వులు లేవని సీబీఐ–సిట్ చార్జిషీట్ దాఖలు చేసినా.. అధికార పార్టీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే క్రమంలో చేసిన వ్యాఖ్యలకు గాను తనపై రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నమోదైన 33 కేసులను కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు సోమవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించారు. లంచ్ మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ జరిపారు. ఒకే అంశంపై ఎన్ని ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. మొదటి ఫిర్యాదును ప్రధాన కేసుగా తీసుకుని మిగిలిన అన్ని ఫిర్యాదులను సీఆర్‌పీసీ సెక్షన్ 162 కింద వాంగ్మూలాలుగా ఎందుకు పరిగణించకూడదన్నారు. దీనిపై పోలీసులకు తగిన సూచనలు చేస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ విషయంపై తదుపరి విచారణ నాటికి స్పష్టత తీసుకోవాలని పీపీకి న్యాయమూర్తి స్పష్టం చేశారు. అంబటిపై రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 33 కేసుల్లో చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసి ఆయన వివరణ తీసుకోవాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మార్చి 2కి వాయిదా వేశారు. అంబటి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 35 కేసులు ఒకే అంశానికి సంబంధించినవని, దీనిపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి వీల్లేదని తెలిసినా పోలీసులు కేసులు నమోదు చేస్తూనే ఉన్నారని కోర్టుకు తెలిపారు.

చట్ట ప్రకారం నడుచుకోండి

గత ఏడాది జూన్‌లో వెన్నుపోటు దినం పేరుతో బైక్ ర్యాలీ నిర్వహించినందుకు అంబటి రాంబాబుపై నమోదైన కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని గుంటూరు, పట్టాభిపురం పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆయనకు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలంది. అంబటిపై నమోదైన కేసులు ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడేవేనని, ఫిర్యాదుదారులకు నోటీసులివ్వాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ మంత్రి అంబటికి బెయిల్.. మరో కేసులో రిమాండ్

- నల్లపాడు కేసులో బెయిల్ మంజూరు చేసిన మొబైల్ కోర్టు
- పట్టాభిపురం పోలీసుల పీటీ వారెంట్‌పై 14 రోజుల రిమాండ్
- దీంతో ఒక కేసులో బెయిల్ వచ్చినా.. విడుదల కాని అంబటి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/గుంటూరు లీగల్: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబుకు ఒక కేసులో బెయిల్ రాగా, మరో కేసులో ఈ నెల 22వ తేదీ వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబును పోలీసులు సోమవారం గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. ఒక కేసులో బెయిల్ లభించినా.. మరో కేసులో 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆయనను తిరిగి రాత్రి 7.30 గంటలకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకువచ్చారు.

అంబటిపై ఆగని కుట్రలు నల్లపాడు పోలీసు స్టేషన్‌లో కేసుకు సంబంధించి అంబటి రాంబాబుకు బెయిల్ ఇచ్చిన స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పోలీసులు వేసిన కస్టడీ పిటిషన్‌తోపాటు సౌకర్యాలు కోరుతూ రాంబాబు వేసిన ఎమినిటీస్ పిటిషన్‌లను తిరస్కరించారు. నల్లపాడు కేసులో బెయిల్ వస్తుందన్న ఉద్దేశంతో గతంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనపై పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో పెట్టిన కేసులో పీటీ వారెంట్‌పై సోమవారం రాజమండ్రి నుంచి గుంటూరు తీసుకువచ్చి ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది వక్కాల సూరిబాబు, మాజీ ఎంపీపీ మాతంగి శ్రీకాంత్, సహచర న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. బెయిలబుల్ సెక్షన్లతో ఉన్న కేసుల్లో వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, అలాంటి సందర్భాల్లో అరెస్ట్, రిమాండ్ అవసరంపై కోర్టు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే.. ఈ కేసులో ఈ నెల 22 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా.. అంబటికి ఎట్టిపరిస్థితుల్లో బెయిల్ రాకుండా, పాత కేసుల్లో పీటీ వారెంట్లు దాఖలు చేసేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు.

అంబటికి బెయిల్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- ప్రభుత్వ కక్ష సాధింపులకు కోర్టుల్లో చెక్
- ఒక్క వ్యాఖ్యపై 36 కేసులా?
- మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, లీగల్ సెల్ నేత సుదర్శన్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న పొన్నవోలు సుధాకర్ రెడ్డి, జల్లా సుదర్శన్ రెడ్డి

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టు బెయిల్ ఇవ్వడాన్ని, పోలీసుల కస్టడీ పిటిషన్‌ను తోసిపుచ్చడాన్ని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పార్టీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్‌రెడ్డి స్వాగతించారు. అంబటిపై కక్ష సాధింపులకు దిగిన ప్రభుత్వ తీరుకు ఇది చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అంబటి మాట్లాడిన ఒక్క మాటకు 36 కేసులు పెట్టడం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని ప్రోద్బలంతో, ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆమె భర్త వందలాది అనుచరులతో చేసిన అరాచకానికి కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని వ్యాఖ్యానించారు.

ఒక్క వ్యాఖ్య చేసినందుకు 36 కేసులా?

అంబటి రాంబాబు ఇంటిని టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని వారు ఆరోపించారు. గుంటూరు నడిబొడ్డున అంబటి ఇంట్లో విధ్వంసం జరుగుతుంటే పోలీసులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. కేవలం నలుగురిని పంపి ఊరుకుంటారా అని నిలదీశారు. ఇమ్రాన్ ప్రతాప్ గడి కేసులో ప్రాథమిక దర్యాప్తు లేకుండా ఎఫ్ఐఆర్ కట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని తాము తెలియజేసినా కోర్టు అంగీకరించకుండా అంబటిని రిమాండ్‌కు పంపించారన్నారు. ఆ తర్వాత రెండు రోజుల్లో అంబటి రాంబాబుపై 36 కేసులు నమోదు చేశారన్నారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దల రాక్షసత్వం, ఒక వ్యక్తిమీద కక్ష, కనిపిస్తున్నాయని అన్నారు. సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్ 2022లో ఇచ్చిన తీర్పు ప్రకారం ఓ కాగ్నిజబుల్ అఫెన్స్‌లో ఎఫ్ఐఆర్ నమో దు చేస్తే.. ఇక ఎక్కడా అలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదన్నారు. టీటీ ఆంథోనీ కేసులో నూ ఆర్టికల్ 141 ప్రకారం ఓ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత అదే కేసులో మరో ఎఫ్ఐ ఆర్ నమోదు చేయకూడదని సుప్రీంకోర్టు చెప్పినా ఈ ప్రభుత్వం ఆర్టికల్ 141ను, సుప్రీంకోర్టు తీర్పుల్ని లెక్కచేయడం లేదన్నారు. అంబటి ఇల్లు, కార్లు తగులబెట్టి, హత్యాయత్నం చేస్తే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేస్తారా అని నిలదీశారు. 'మీరు సరైన సెక్షన్లు పెట్టకపోతే మేం ప్రైవేటు ఫిర్యాదు ఇస్తాం..ముద్దాయిలుగా నిలబెడతాం..చట్టప్రకారం పోరాడతాం' అని స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

పీజీ సెట్ దరఖాస్తులు ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సంప్రదాయ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి సమగ్ర నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. సోమవారం నుంచే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించగా మార్చి 9 వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పించింది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు 24, 25 తేదీల్లో అవకాశం కల్పించింది. అభ్యర్థులు ఏప్రిల్ 21న వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పరీక్షలను మే 5 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్టు పేర్కొంది.

వలస కూలీలపై చిరుత దాడి

యశవంతపుర: కర్ణాటకలో చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా గౌతహళ్లి గ్రామంలోని కాఫీ తోటలో పని చేస్తున్న కూలీలపై చిరుతపులి దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. అసోంకు చెందిన వలస కూలీలు ఇక్కడ కాఫీ తోటలో పని చేస్తున్నారు. సోమవారం ఉదయం పనిలో ఉండగా ఓ చిరుత వారి మీదకు దూకి కాళ్ల మీద కరిచింది. ఇద్దరు మహిళా కూలీలు గాయపడ్డారు. వారు గట్టిగా అరవడంతో చిరుత పారిపోయింది. ఇతర కూలీలు బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. చిరుతను బంధించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో వాహనదారులు, కార్మికులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరించారు.

బెళగావిలో విచిత్ర మానవుడు

ఆకులు, అలములే అతని ఆహారం

ఆకులు తింటున్న బుడన్ ఖాన్

దొడ్డబళ్లాపురం: మనిషి జీవించాలంటే ఆహారం తినాలి. ఇది అందరికీ తెలిసిందే. కానీ కర్ణాటకలోని బెళగావికి చెందిన బుడన్‌ఖాన్ అలియాస్ బుడన్ మాలిక్ హొసమణి (25) ఆకులు, చిన్న చిన్న మొక్కలు తింటూ బతుకుతున్నాడు. సవదత్తి తాలూకా ఉగరగోళ గ్రామానికి చెందిన ఇతడు 10 ఏళ్లుగా అన్నం ముట్టుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే గ్రామ శివారులోని హెగ్గొల్ల గుట్ట మీద ఉంటున్నాడు. ఆకలైతే చుట్టుపక్కల చెట్ల ఆకులు, మొక్కలు తింటాడు. దాహం వేస్తే కుంటల్లో నీటిని తాగుతాడు. తరచూ ధ్యానం చేస్తాడు. మనుషులు తినే ఎటువంటి ఆహార పదార్థాలూ తినడు. కోతులు ఆకులు, కాయలు తిని బతకడం చూసి తానూ నేర్చుకున్నానని, ఇప్పటి వరకూ ఎటువంటి రోగాలు రాలేదని తెలుపుతున్నాడు. ఇతడి ఆహార పద్ధతి వైద్యులకు సవాలుగా మారింది. ఖాన్‌ను అందరూ టార్జాన్ అని ముద్దుగా పిలుస్తున్నారు.

సెన్సార్ బోర్డు ప్రత్యేక కమిటీ పరిశీలనకు 'జననాయకన్'

తమిళ సినిమా: ప్రముఖ హీరో విజయ్ నటించిన 'జననాయకన్' చిత్రాన్ని పది మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీ పరిశీలనకు పంపినట్లు సెన్సార్ బోర్డు సోమవారం వెల్లడించింది. ఈ కమిటీ 'జననాయకన్' సినిమాను చూసి నివేదిక ఇవ్వడానికి 20 రోజులు గడువు ఇచ్చింది. ప్రత్యేక కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సినిమా విడుదలపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'జననాయకన్' చిత్ర నిర్మాత సంస్థ హైకోర్టులో ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం వెనక్కి తీసుకున్నారు.

తల్లి నగ్నచిత్రాలు ప్రియుడికి..!

- బెంగళూరులో ఓ కూతురు నిర్వాకం
- పోలీసులకు ఫిర్యాదు

సాక్షి బెంగళూరు: సోషల్ మీడియా, ప్రేమ మోజులో పడి కొందరు విపరీతాలకు పాల్పడుతున్నారు. సొంత తల్లి, పెద్దమ్మ నగ్న ఫొటోలను రహస్యంగా తీసి వాటిని ప్రియుడికి పంపించిందో యువతి. బెంగళూరుకు చెందిన 49 ఏళ్ల మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమార్తె, ఆమె ప్రియుడు పవన్‌పై బ్యాటరాయనపుర పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సదరు మహిళకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె బీబీఎం చదువుతోంది. గతేడాది ఆమెకు మొబైల్ కొనిచ్చారు. నెల రోజులుగా అపరిచిత యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు అనుమానం వచ్చింది. విషయాన్ని బయట పెట్టకుండా యువతి మొబైల్ పాస్‌వర్డ్‌ను తెలుసుకున్నారు. తర్వాత ఆ మొబైల్‌ను పరిశీలించగా అందులో యువతి తల్లి ప్రైవేటు ఫొటోలతో పాటు ఆమె సోదరి అక్క ఫొటోలను యువకుడికి పంపినట్లు గుర్తించింది. అనంతరం కుమార్తె నిర్వాకంపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కుమార్తె ప్రియుడు పవన్ ఆ ఫొటోలను పంపించాలని ఒత్తిడి చేసినట్లు గుర్తించారు. కొన్ని రోజుల క్రితం పెళ్లి చేసుకుంటే తాను ప్రేమించిన యువకుడినే చేసుకుంటా అంటూ ఇంట్లో గొడవ పడి వెళ్లినట్లు కూడా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రైవేటు ఫొటోలను ఆ యువకుడు ఇతరులకు పంపే అవకాశం ఉందని, ఆ క్రమంలో తన కుమార్తె, ఆమె ప్రియుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

‘ఆప్టా’లో కన్సల్‌టెంట్ల కాంట్రాక్ట్ పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీ టూరిజం అథారిటీ (ఆప్టా)లో మిడ్‌లెవల్ కన్సల్‌టెంట్ల కాంట్రాక్టును మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. నెలకు రూ.2 లక్షల జీతం చొప్పున ఇద్దరు కన్సల్‌టెంట్లు సత్యప్రభ, వేమనలను 2026 నవంబర్ 5 వరకు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

జనగణనలో ఓబీసీ కులాన్ని చేర్చాలి

గజేంద్రసింగ్ షెకావత్‌కు ఓబీసీ సంక్షేమ సంఘం వినతి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన గెజిట్ కాలమ్–12లో ఎస్సీ, ఎస్టీల తీరుగానే ఓబీసీ అనే పదాన్ని చేర్చేందుకు కృషి చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో షెకావత్‌ను ఆయన నివాసంలో ఓబీసీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. సమగ్ర జనగణనలో ఓబీసీ కులగణన తొలి విడత గృహ నిర్ధారిత సేకరణ కాలమ్–12లో ఓబీసీ పదాన్ని పొందుపర్చకపోవటం వల్ల ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వివరించారు. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లి ఓబీసీలకు న్యాయం జరిగే లా చూడాలని కోరారు. అలాగే.. బొందిలి కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రామ్‌దాస్ అథవాలేను కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రులను కలిసిన వారిలో ఏపీ బొందిలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుజాన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సచివాలయ ప్రాంగణంలో హైడ్రాలిక్ బొల్లార్డ్‌ల ఏర్పాటు

రూ.55 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయ భవనాల ప్రాంగణంలో హైడ్రాలిక్ బొల్లార్డ్ (చిన్న స్తంభాలు) ఏర్పాటు కోసం రూ.55 లక్షలు మంజూరు చేస్తూ ఏపీ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్‌డీఏ కమిషనర్ చేసిన ప్రతిపాదనల మేరకు పరిపాలన అనుమతి మంజూరు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అమెరికాతో ఒప్పందం మన రైతులకు నష్టం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, అమరావతి: సుంకాల విషయంలో అమెరికాతో భారతదేశం ఒప్పందం వల్ల మన రైతులకు నష్టం కలుగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక వీడియో విడుదల చేశారు. సుంకాల విషయంలో మేలు చేసేలా ఒప్పందం ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి అనేక రకాల ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేసే మన రైతులకు అది ఇబ్బందికరంగా మారుతుందన్నారు. అమెరికాతో ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలపై పార్లమెంట్‌తోపాటు పౌర సమాజంలో చర్చకు పెట్టిన తర్వాతే అమలులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సేవలకు రూ.226 కోట్ల కాంట్రాక్టు

అక్షర ఎంటర్ ప్రైజెస్ అప్పగించిన ప్రభుత్వం

సాక్షి అమరావతి: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో హార్డ్‌వేర్ రిఫ్రెష్‌మెంట్, వినియోగ వస్తువుల సరఫరా, నెట్‌వర్క్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సేవల నిర్వహణ కోసం అక్షర ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.226 కోట్లకు పైగా కాంట్రాక్టు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రెవెన్యూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ హార్డ్‌వేర్ సేవల కాంట్రాక్టు విలువ మొత్తం రూ.225,59,56,377గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తంలో అన్ని పన్నులు కూడా కలుపుకుని ఉన్నట్లు జీఓలో పేర్కొన్నారు. కాంట్రాక్టు వ్యయాన్ని 20 సమాన త్రైమాసిక విడతలుగా (5 సంవత్సరాలు) చెల్లించనున్నారు.

సాఫ్ట్‌వేర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు అనుమతులు..

అలాగే కార్డ్ 2.0 సాఫ్ట్‌వేర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ పనులను క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించనుండగా, ఇందుకు రూ.21,00,63,600 ఖర్చు చేయనున్నట్లు పేర్కొంది. ఈ సంస్థలకు వర్క్ ఆర్డర్లు జారీ చేయాలని, అవసరమైన ఒప్పందాలు కుదుర్చుకుని తదుపరి చర్యలు చేపట్టాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు ప్రభుత్వం ఆదేశించింది.

ఏపీలో 134 నీటి నాణ్యత పరీక్ష ల్యాబ్‌లు

రాజ్యసభలో కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: జల్ జీవన్ మిషన్ కింద దేశవ్యాప్తంగా తాగునీటి నాణ్యత పరీక్షలను బలోపేతం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందని కేంద్రం తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 4 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 134 నీటి నాణ్యత పరీక్ష ప్రయోగశాల (డబ్ల్యూటీపీ)లు పనిచేస్తున్నాయని వాటిలో.. 81 ల్యాబ్‌లు గుర్తింపు పొందాయని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి వి.సోమన్న సమాధానమిచ్చారు.

అనుమతులుండవు.. అడిగేందుకు ఏ శాఖ అధికారీ ముందుకు రాడు. ఫిర్యాదులు వస్తే నామ్‌కే వాస్తేగా దాడులతో మమ అనిపిస్తారు. అధికారం మాది.. అధికారులు మావాళ్లు.. ఏవరి వాటా వారికిస్తున్నాం.. మా ఇష్టం అన్నట్లు తెల్ల ఖనిజాన్ని తెలుగు తమ్ముళ్లు కొల్లగొడుతూ రూ.కోట్లు దండుకుంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే కనిగిరి ప్రాంతంలోని తెల్లరాయికి మంచి గిరాకీ ఉండటంతో అధికార పార్టీ అండగా.. తెలుగు తమ్ముళ్ల భాగస్వామ్యంతో అక్రమార్కులు భారీగా తెల్లరాయి తవ్వకాలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.



తెల్ల రాయిని తవ్వుకుని తింటున్న మైనింగ్ మాఫియా

తెల్ల ఖనిజం తవ్వేస్తూ.. తమ్ముళ్ల జేబులు నింపేస్తూ..

రెవెన్యూ, ఫారెస్ట్ భూముల్లో జోరుగా అక్రమ తవ్వకాలు

- ప్రభుత్వ ఆదాయానికి గండి.. తెలుగు తమ్ముళ్ల జేబుల్లోకి నగదు దండి
- పీసీపల్లి అడ్డాగా.. తమ్ముళ్ల చీకటి దందా
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, ఫారెస్ట్, మైనింగ్ అధికారులు
- ఫిర్యాదులు వస్తేనే దాడులు

కనిగిరిరూరల్/పీసీపల్లి: మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు రూ.లక్షలవిలువైన సహజ వనరులను, ఖనిజ సంపదలను ఇష్టాను సారంగా దోచుకుంటున్నారు. ఆరు మండలాల్లో రెవె న్యూ, ఫారెస్ట్, కొండ పరివాహక శివారు ప్రాంత భూములను అడ్డాగా మార్చుకుని యంత్రాలతో రాత్రుల్లో తెల్లరాయిని యథేచ్ఛగా తవ్వి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కొన్నిచోట్ల కొంత భూమిని లీజు అనుమతి పొంది.. వారికి ఇష్టమొచ్చినంత తవ్వుతుండగా, మరి కొన్ని చోట్ల అసలు అనుమతి అనే మాట లేకుండానే అధికార పార్టీ అండే తమకు లైసెన్స్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అనేక మండలాల్లో తెల్లరాయి ఉన్నా.. కనిగిరి ప్రాంతంలో ఉన్న తెల్లరాయి కి మంచి గిరాకీ ఉంది. ఇక్కడ గ్రేడ్ 1 రకం రాయి లభ్యమవుతుంది. దీంతో కనిగిరి నియోజకవర్గంలో తెల్లరాయి తవ్వకాలకే మైనింగ్ మాఫియా పీసీపల్లి కేంద్రంగా సాగుతోంది. ఇక్కడ అనుమతులుండవు.. అధికారులు రారు.. తమ్ముళ్లదే ఇష్టారాజ్యం. అటవీ, రెవెన్యూ ఇలా ఏ భూముల్లో అయినా రాత్రింబవళ్లు తవ్వకాలు జోరుగా చేస్తుంటారు. ఒక్కో లారీకి 30 నుంచి 40 టన్నుల ఎగుమతి జరగ్గా.. టన్నుకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తోందని తెలిసింది. వారానికి నాలుగు లారీల చొప్పున తెల్లరాయి తరలిస్తున్నాయి.

పీసీపల్లి అడ్డాగా.. పచ్చనేతలచీకటి దందా

పీసీపల్లి మండలంలో మైనింగ్ మాఫియా రోజు రోజుకూ రెచ్చిపోతోంది. మండలంలోని అధికార పార్టీ మాజీ ఎంపీటీసీ కుమారుడు నేరేడుపల్లి, లక్ష్మక్కపల్లిలో గుంటూరు లింగన్నపాలెం, అడవి లోపల్లి, మెట్లవారిపాలెం, గుంటువల్లి, తురకపల్లి, మురిగమ్మి గ్రామాల్లో అక్రమ మైనింగ్‌కి పాల్పడుతున్నారు. మురగమ్మిలో 20 ఎకరాల్లో అటవీ, రెవెన్యూ, కొండపోరంబోకు భూములు, నేరేడుపల్లిలో 25 ఎకరాల్లో, గుంటువల్లిలో 10 ఎకరాల్లో, తురకపల్లిలో 15 ఎకరాల్లో, లక్ష్మక్కపల్లిలో (మాలకొండకు పోయే దారిలో) 20 ఎకరాల్లో, లింగన్నపాలెంలో 5 ఎకరాల్లో అటవీ, రెవెన్యూ, కొండపోరంబోకు భూముల్లో నెల్లూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన వారు స్థానిక అధికార పార్టీ నేతల అండతో జోరుగా తవ్వకాలు చేస్తున్నారు. గడిచిన కాలంలో ఒక్క మురగమ్మి ప్రాంతంలోనే మైనింగ్ శాఖ అధికారులు ఐదు సార్లు దాడులు చేసి లారీలను, జేసీబీలను, తెల్లరాయిని పట్టుకున్నారు. అయినా తెల్లరాయి దందాను తమ్ముళ్లు యథేచ్ఛగా సాగిస్తున్నారు. పీసీపల్లి నుంచి నెల రోజుల వ్యవధిలో సుమారు ఒక వెయ్యి టన్నుల మేర అక్రమార్కులు గ్రేజింగ్, అటవీ పోరంబోకు భూముల్లో తెల్లరాయి తవ్వకాలు జరిపినట్లు అంచనా.

పీసీపల్లిలో మైనింగ్ అధికారులు సీజ్ చేసిన లారీ (ఫైల్)

గుంటుపల్లి, లింగన్న పాలెం ప్రాంతాల్లో అక్రమంగా తవ్విన తెల్లరాయి

ఫిర్యాదులు చేస్తేనే కదలిక

మైనింగ్ అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు తెల్లరాయి ఖనిజాల తవ్వకాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. కానీ ఆ వైపు అడుగులు వేసిన దాఖలాలు లేవు. మైనింగ్ శాఖ రాష్ట్ర అధికారులకు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే.. నామ్‌కే వాస్తే రెండు నెలలకొకసారి మేమున్నాం అంటూ ఒకటి రెండు కేసులు పెట్టి మమ అనిపిస్తారు. కొంతకాలం క్రితం కనిగిరి, వెలిగండ్ల శివారు ప్రాంతాల్లో చీర్లదిన్నె, నాగిరెడ్డి కొండల మధ్య ఫారెస్ట్ బీట్ భూముల్లో టీడీపీ నాయకుడు అక్రమంగా మైనింగ్ తవ్వుతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. భారీ స్థాయిలో తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. అయితే సుమారు 10 టన్నుల రాయి స్టాక్ మాత్రమే దొరకడంతో రూ.1.30 లక్షల పెనాల్టీ వేసినట్లు తెలిసింది. గత గురువారం రాత్రి మురిగమ్మి కొండ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న తెల్లరాయిని మైనింగ్, విజిలెన్స్ ఉన్నతాధికారులు దాడులు చేసి ఓ లారీ, జేసీబీ సీజ్ చేశారు. బల్లిపల్లి ప్రాంతంలో తెల్లరాయి తవ్వకం విషయంలో కూటమి నేతలు పోటీ పడుతున్నట్లు సమాచారం.

ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రెవెన్యూ, అటవీ ప్రాంతం అధికంగా ఉండటం.. శివారు ప్రాంతం కావడంతో చెన్నై లాంటి ప్రాంతాలకు వైట్‌క్వార్జ్ (తెల్ల రాయిని)ని ఎక్కువగా తరలించే అవకాశం ఉండటంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వారు స్థానిక టీడీపీ నేతల అండతో ఇక్కడ మకాం వేసి అక్రమ దందా సాగిస్తున్నారు.

మామూళ్ల మత్తులో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు

తెల్లరాయి అక్రమ తవ్వకాల వ్యవహారం అధికారులకు తెలియదంటే పొరపాటే. అధికార పార్టీ నేతల ఒత్తిడి కొంత ఉన్నా.. అక్రమార్జనలో తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన కొల్లగొట్టిన తెల్ల ఖనిజ ఆదాయంలో అధికారులకు నెలవారీ నజరానాలు అందుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అధికారుల సలహాలు, సూచనలతో స్టాక్ పాయింట్‌లకు, తవ్వకాలకు కొంత భూములను అనుమతి తీసుకుని వాటిని అధికారులకు చూపిస్తూ ఇతర రెవెన్యూ, ఫారెస్ట్ భూములుగా నిర్ధారణ కాని, హద్దులు తేల్చని ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. రాత్రుళ్లు పొక్లైన్లతో, జేసీబీలతో తవ్వకాలు చేసి అనుమతి పొందిన స్టాక్ పాయింట్ ప్రదేశంలో వేసుకుని తెల్లవారిన తర్వాత తరలిస్తున్నారు. ఇది ఒకరకం దోపిడీ కాగా మరోరకం దోపిడీ అయితే అనుమతి (లీజు) పొందిన ప్రదేశంలో తవ్వకాలు జరిపినట్లు రికార్డులు చూపిస్తూ.. పది శాతం చలానా చెల్లించి.. 100 శాతం అధికార పార్టీ నేతలు జేబులు నింపుకుంటున్నారు.

తెల్లరాయి తవ్వకం ప్రాంతాలు ఇవే..

కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి మండలం బల్లిపల్లి, అడ్డరోడ్డు, చీర్లదిన్నె, బాల వెంకటాపురం, వెలిగండ్ల శివారు ప్రాంతాలు, నాగిరెడ్డిపల్లి, పీసీపల్లి మండలంలో గుంటుపల్లి, లక్ష్మక్కపల్లి, మురిగమ్మి, పామూరు మండలం మార్కొండాపురం,నాసికాత్రయంబకం తదితర ప్రాంతాల్లో రెవెన్యూ, ఫారెస్ట్ భూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

కష్టాల జరీ

పట్టుచీరలకు మాత్రం ‘మద్దతు’ లేని వైనం

పట్టుచీరల తయారీకి ఉపయోగించే జరీ మార్కులు

పట్టుచీరలు అందంగా, ఆకర్షణీయంగా కనపడేలా చేయడంలో ప్రధాన పాత్ర పోషించే జరీ ధరలు ఇటీవల విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో అదనపు భారం పడడంతో నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం స్పందించి చేయూత అందించకుంటే భారీగా నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- భారీగా పెరిగిన జరీ ధరలు
- నష్టాలబాటలో నేతన్నలు
- ప్రభుత్వం చేయూతనివ్వాలని వేడుకోలు

ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, గోరంట్ల, చిలమత్తూరు, సోమందేపల్లి, హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాలలో 35 వేలకు పైగా చేనేత మగ్గాలు ఉన్నాయి. ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.30 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. మిరమిట్లు గొలిపే రంగురంగుల పట్టుచీరలను నేతన్నలు తయారు చేస్తున్నారు.

కానరాని మద్దతు..

పట్టుచీరలను ఆకర్షణీయంగా రూపొందించేందుకు బార్డర్, పల్లు (కొంగు), మధ్యలో డిజైన్ తదితర చోట్ల జరీ వాడకం తప్పనిసరి. బంగారం, వెండి, రాగి వంటి లోహాల పూతతో చేసే దారాన్ని జరీ అంటారు. ప్రధానంగా కంచి జరీ (వన్‌గ్రాం గోల్డ్ పూత), జర్మన్ సిల్వర్ జరీ (వెండి పూత), నార్మల్ టెస్టెడ్ జరీ (గోల్డ్ కలర్ కోటింగ్), కాపర్ జరీ (రాగిపూత)ని నేతన్నలు ఉపయోగిస్తారు. ఇటీవల బంగారం, వెండి, రాగి ధరలు పెరగడంతో అందుకనుగుణంగా జరీ రేటు కూడా విపరీతంగా పెరిగింది. కొన్ని రోజుల క్రితం రూ.2 వేలు పలికిన కంచి జరీ మార్కు ఇటీవల ఏకంగా రూ. 4 వేలకు చేరింది. అదేవిధంగా జర్మన్ సిల్వర్ జరీ రూ.800 నుంచి రూ.1,200కు, కాపర్ జరీ రూ.700 నుంచి రూ.1,000కు, నార్మల్ టెస్టెడ్ జరీ రూ.600 నుంచి రూ.800కు ఎగబాకాయి. ఒక పట్టు చీర తయారీకి కనీసం రెండు మార్కుల వరకు జరీ వాడాల్సి ఉంటుంది. అనతికాలంలోనే జరీ ధరలు భారీగా పెరగడం, పట్టుచీరలకు మద్దతు ధర మాత్రం 5 ఏళ్ల క్రితం ఎంత ఉందో నేటికీ అంతే ఉండటంతో నేతన్నలు నష్టాల పాలవుతున్నారు.

సరఫరాలో జాప్యం..

గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో మాత్రమే జరీ తయారవుతుంది. అక్కడి వ్యాపారుల నుంచి జిల్లాకు చెందిన చేనేతలు జరీ కొనుగోలు చేసి తీసుకొస్తారు. ముందుగా జరీ బాక్స్‌లకు నగదును డీడీల రూపంలో చెల్లిస్తేనే సూరత్‌లోని కంపెనీ నిర్వాహకులు, ఏజెంట్‌లు పంపుతారు.ఇటీవల ఉత్తరాది రాష్ట్రాల్లో జరీకి డిమాండ్ పెరగడంతో నగదు చెల్లించినా ఇక్కడికి సరుకు సరఫరాలో జాప్యం అవుతోంది. దీంతో నేతన్నలకు మరిన్ని అవస్థలు తప్పడం లేదు.

కష్టతరంగా మగ్గాల నిర్వహణ

పెరిగిన జరీ ధరలకనుగుణంగా పెట్టుబడి వ్యయం బాగా పెరిగింది. ఇప్పటికే ముడిపట్టు, రేషం (నిలువు దారం, అడ్డదారం) ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న మమ్మల్ని పెరిగిన జరీ ధరలు మరింత సంక్షోభంలోకి నెట్టాయి. రోజంతా కష్టపడినా దిన కూలీ కూడా దక్కడం లేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే మగ్గాల నిర్వహణ కష్టంగా మారుతుంది.

–నాగరాజు, చేనేత కార్మికుడు, ధర్మవరం

ప్రభుత్వం ఆదుకోవాలి

గోల్డ్, సిల్వర్, కాపర్ జరీలతో ఆధునిక డిజైన్‌లను చేనేత మగ్గాలలో తయారు చేస్తే కార్మికులకు కొంత లాభదాయకంగా ఉండేది. ఇటీవల జరీ ధరల పెరుగుదల కారణంగా చేనేతలకు గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం స్పందించి జరీ ధరల పెరుగుదలను నియంత్రించాలి. చేనేతలకు సాయం అందించాలి.

–జింకా కంబగిరి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం

జరీ వ్యాపారమే నిలిపివేశాం

ఏడాది కాలంగా జరీ మార్కు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గతంలో కొన్ని నెలలే ధరలు పెరిగేవి. ప్రస్తుతం ధరలు అమాంతం పెరుగుతుండటంతో సూరత్ నుంచి సరిపడా స్టాక్ పంపడం లేదు. దీనికి తోడు వ్యాపారం కూడా మందకొడిగా సాగుతుండడంతో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశాం.

–బీరే జయచంద్ర, జరీ వ్యాపారి, ధర్మవరం

వ్యవసాయంలో కృత్రిమ మేధ

వ్యవసాయ శాఖ–వధ్వానీ ఫౌండేషన్ మధ్య ఒప్పందం

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించే లక్ష్యంతో న్యూఢిల్లీకి చెందిన వధ్వానీ ఫౌండేషన్‌తో వ్యవసాయ శాఖ ఒప్పందం చేసుకుంది. సచివాలయంలో సోమవారం వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో అవగాహనా ఒప్పందంపై వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ మనజీర్ జీలాని సమూన్, వధ్వానీ ఫౌండేషన్ తరపున జె.పి.త్రిపాఠి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక డిజిటల్ సాంకేతికతల వినియోగానికి ఇది కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు. వధ్వానీ ఫౌండేషన్ భాగస్వామ్యం ద్వారా పంటల తక్షణ స్థితి అంచనా, పురుగులు, తెగుళ్లపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డేటా ఆధారిత రైతు సలహా సేవల కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారితంగా అందించే పరిష్కారాలను అమలు చేస్తారన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుస్థిర వ్యవసాయం, రైతుల ఆదాయ భద్రత, సాంకేతిక ఆధారిత పాలన సాధించేందుకు ఏఐ కీలక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు.

ఏపీకి ‘ఎన్‌బీఏ’ నిధులు విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) తెలుగు రాష్ట్రాల్లోని జీవవైవిధ్య కమిటీలకు రూ.45.05 లక్షల నిధులను విడుదల చేసింది. తెలంగాణ, ఏపీతో సహా దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 90కి పైగా జీవవైవిధ్య నిర్వహణ కమిటీ (బీఎంసీ)లు ఈ ప్రయోజనాన్ని పొందనున్నాయి. ఈ నిధుల ద్వారా ఏపీకి చెందిన 15 మంది ఎర్రచందనం రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖ వెల్లడించింది. స్థానికుల జీవనోపాధిని మెరుగుపరుస్తూ, పర్యావరణాన్ని రక్షించేలా వారిని ప్రోత్సహించడం దీని లక్ష్యమని పేర్కొంది.

మే 9న కామెడ్‌కె యూజీఈటీ ప్రవేశ పరీక్ష

బీచ్‌రోడ్డు(విశాఖ): కామెడ్‌కె యూజీఈటీ /యూనిగేజ్–2026 జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను ఈ ఏడాది మే 9వ తేదీన నిర్వహించనున్నట్లు కర్ణాటక అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజెస్ అసోసియేషన్ (కామెడ్‌కె) ఒక ప్రకటనలో తెలిపింది. కర్ణాటకలోని 150కి పైగా ఇంజినీరింగ్ కళాశాలలు, దేశవ్యాప్తంగా ఉన్న 30కి పైగా ప్రసిద్ధ ప్రైవేట్, స్వయం ప్రతిపత్తి గల డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఈ ఏకీకృత పరీక్ష కీలకంగా ఉంటుంది. యూనిగేజ్ సభ్యత్వ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా ఉన్న సంస్థలు అందించే బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశం కోరుకునే అభ్యర్థుల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్ష దేశవ్యాప్తంగా 200కు పైగా నగరాల్లో, 400కు పైగా పరీక్షా కేంద్రాల్లో జరగనుంది. సుమారు 1.40 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. మార్చి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మరిన్ని వివరాలకు www.comedk.org లేదా www.unigauge.com వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు.

ముగిసిన మెడికల్ కౌన్సెల్ ఎన్నిక పోలింగ్

సాక్షి, అమరావతి: ఏపీ మెడికల్ కౌన్సెల్ కార్యవర్గానికి 13 మంది సభ్యుల ఎన్నిక కోసం సోమవారం పోలింగ్ ముగిసింది. సభ్యుల ఎన్నిక కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో 55 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల నిర్వహణ అధికారి చక్రధర్‌బాబు ప్రకటించారు. 56,156 మంది ఓటర్లకు గాను 30,773 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు. మంగళవారం ఉదయం 11.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని చక్రధర్‌బాబు వెల్లడించారు. ఉదయం 8 గంటలకు ఆన్‌లైన్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమవ్వగా మూడు గంటల పాటు సర్వర్ స్తంభించడం, వైద్యులకు ఓటీపీలు రాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో సాయంత్రం 5 గంటలకు ముగియాల్సిన ఓటింగ్‌ను రాత్రి 8 గంటల వరకూ పొడించారు. గుంటూరు, నెల్లూరు, రాయలసీమ, ఉత్తరాంధ్రలోని పలు జిల్లాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు మాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయి. వైద్య కళాశాలల్లో పనిచేసే అభ్యర్థులు వైద్య విద్యార్థుల సాయంతో బోధనాస్పత్రి, కళాశాలల్లో మాస్ ఓటింగ్‌కి పాల్పడుతున్నారని పలువురు అభ్యర్థులు ఎన్నికల నిర్వహణాధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ప్రభుత్వ గురుకులాల్లో ఘటనలపై విచారణ చేపట్టాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాలు, ఆశ్రమ పాఠశాల్లో వరుస ఘటనలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో కొంతకాలంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ (కలుషిత ఆహారం)కు గురవుతున్న ఘటనలు పదే పదే జరగడం ఆందోళన కల్గిస్తోందన్నారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టల్స్‌లో కలుషిత నీరు, ఆహార నాణ్యత లోపం వీటికి ప్రధాన కారణమని, ఈ ఘటనలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల పునరావృతం అవుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ జరిగిన ఘటనలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే, పోలవరం జిల్లా దేవరపల్లి ఆశ్రమ పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతికి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న సోమవారం వినతిపత్రం అందించారు.

అవినీతికి చిరునామాగా దూరవిద్యా కేంద్రాలు: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: దూర విద్య కేంద్రాలను అవినీతికి చిరునామాగా మారాయని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పేర్కొంది. దూర విద్యలో అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దూర విద్య స్టడీ సెంటర్లకు అనుమతివ్వడం నుంచే అవినీతి ప్రారంభమవుతుందని, పరీక్షలు నిర్వహణలో అది తార స్థాయికి చేరుతుందన్నారు. ఏయూ, ఏఎన్‌యూ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హార్ట్‌ఎటాక్ అంటే చాలామందికి ఆందోళన. కుటుంబంలో ఎవరికైనా లేదా చుట్టుపక్కల వాళ్లలో ఎవరికైనా హార్ట్ ఎటాక్ వచ్చి... నిన్నటి వరకూ తమతోనే ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా మిస్ అయిపోవడం ఎందరికో విషాదంతో కూడిన ఆశ్చర్యకరమైన అంశం. అందుకే... గుండెపోటును నివారించే మందులేమైనా ఉంటే బాగుండు అనే భావన. మరికొందరిలో... రక్తాన్ని పలచబార్చేవీ, గుండెనొప్పి అనిపించగానే నాలుక కింద పెట్టుకోమ్మని డాక్టర్లు చెప్పేవాటి గురించి విని... అలాంటి ఏవైనా మందులున్నాయనే అభిప్రాయం కూడా ఉంటుంది. నిజంగా గుండెపోటును నివారించే మందులేమైనా ఉంటాయా అన్న విషయం గురించి అసలు వాస్తవాలేమిటో చూద్దాం.

గుప్పెడు గుండెలో ఉప్పెన రాకుండా..

ఓ కేస్ స్టడీ...

శ్రీధర్ వాళ్ల నాన్నగారు చాలా చిన్నప్పుడే హార్ట్ ఎటాక్‌తో పోయారు. ఇటీవలే వాళ్ల చిన్నాన్నకు కూడా అకస్మాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చింది. అయితే అదృష్టవశాత్తూ ఆయనకేమీ కాలేదు గానీ... ఒకటోసారి, రెండోసారి హార్ట్ ఎటాక్ ఉపేక్షిస్తుందేమో గానీ మూడోసారి వచ్చిందంటే మాత్రం తప్పక ప్రాణాపాయం కలుగుతుందంటూ చుట్టుపక్కలవారు చెబుతుండటంతో అతడిలో ఆందోళన ఇంకా పెరిగిపోతోంది. అయితే శ్రీధర్‌కు ఇప్పటికైతే ఎలాంటి సమస్యా లేదు. కాకపోతే అతడి వయసు నలభై ప్లస్. కుటుంబంలో చాలామందికి హార్ట్ ఎటాక్ రావడం, పైగా నాన్నగారు హార్ట్ ఎటాక్‌తో పోవడంతో వంశపారంపర్యంగా తనకూ హార్ట్ ఎటాక్ వస్తుందేమోనన్న ఆందోళన అతడిని నిలువనీయడం లేదు. దాంతో తమకు తెలిసిన కార్డియాలజిస్ట్‌ను సంప్రదించి... ‘‘మా నాన్నకూ, చిన్నాన్నకూ వచ్చినట్టుగా నాకు హార్ట్ ఎటాక్ రాకుండా ఉండేందుకు మందులివ్వండం’’టూ డాక్టర్‌ను అడగసాగాడు.

శ్రీధర్‌కు వచ్చిన సందేహమే చాలామందిలో ఉంటుంది. ‘‘గుండెపోటు వచ్చాక కొన్ని రకాల మందులు తీసుకోవడం తప్పదు కదా. అయితే... అసలది రాకుండానే నివారించుకునేందుకు మొదట్నుంచీ ఆ మందులు తీసుకోవచ్చా?... ఇలాంటి నివారణ మందులేమైనా ఉన్నాయా?’’ అనే సందేహం కొందరిలో మెదులుతుంటుంది. మరీ ముఖ్యంగా కుటుంబంలో గుండెపోటు వచ్చినవారుండటం... వారేవో కొన్ని రకాల మందులు వాడుతుండటంతో... అవే మందులు తామూ వాడితే గుండెపోటు రాదేమో అనే ఆలోచనా ఉంటుంది. ఎందుకంటే... ఒకసారి గుండెపోటుకు గురైనవారికి మళ్లీ అది రాకుండా ఉండేందుకు డాక్టర్లు కొన్ని మందులు సూచిస్తుంటారు. ఉదాహరణకు... అలాంటి పేషెంట్లు ఆస్పిరిన్, క్లోపిడోగ్రెల్, రామిప్రిల్ వంటి మందులతో పాటు, బీటాబ్లాకర్, స్టాటిన్స్ వంటి మందుల్ని వాడుతుంటారు. దాంతో అవే మందుల్ని మనమూ తీసుకుంటూ ఉంటుంటే గుండెపోటును నివారించవచ్చు కదా అనే సందేహం రావడం చాలా సాధారణం.

గుండెపోటు / గుండెజబ్బులకు అవకాశమున్నది ఎవరికంటే...

కొందరిలో స్వాభావికంగానే గుండెజబ్బులు వచ్చే అవకాశాలెక్కువ. కొన్ని అంశాలు గుండెజబ్బులు / గుండెపోటుకు ఆస్కారమిస్తాయి. వాటిని రిస్క్‌ఫ్యాక్టర్స్‌గా చెప్పవచ్చు. అవేమిటంటే...

ఇవీ ఆ రిస్క్‌ఫ్యాక్టర్స్...

- **వయసు :** నలభై ఏళ్ల వయసు దాటాక గుండెజబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ.
- **డయాబెటిస్ :** చక్కెర వ్యాధి (మధుమేహం) ఉన్నవారిలో గుండెజబ్బులకు అవకాశాలెక్కువ.
- **రక్తపోటు :** అధికరక్తపోటు (హై–బీపీ) ఎక్కువగా ఉన్నవారిలో...
- **కొలెస్ట్రాల్ :** రక్తంలో చెడు కొలెస్ట్రాల్ వంటి కొవ్వు పదార్థాలు నిర్ణీత మోతాదు కంటే ఎక్కువగా ఉన్నవారిలో.
- **స్మోకింగ్ :** పొగతాగే అలవాటు ఉన్నవారిలో.
- **స్థూలకాయం :** ఉండాల్సిన దాని కంటే ఎక్కువ బరువు ఉన్నవారిలో గుండెజబ్బులూ / గుండెపోటు వచ్చే అవకాశాలెక్కువ.
- మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం, నిద్ర సరిగా పోకపోవడం, తల్లిదండ్రులు లేదా తోడబుట్టినవాళ్లలో తక్కువ వయసులో హార్ట్ ఎటాక్ రావడం వంటివి కూడా రిస్క్ ఫ్యాక్టర్లే.

డాక్టర్
ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

పురుషుల్లో గుండెజబ్బుల రిస్క్ ఎక్కువ...

మహిళలతో పోలిస్తే పురుషుల్లో గుండెజబ్బులకు ముప్పు ఎక్కువ. మహిళల్లో రుతుస్రావం కొనసాగుతున్నంత వరకూ వారిలో స్రవించే ఈస్ట్రోజెన్ కారణంగా వాళ్లకు ఓ స్వాభావిక రక్షణ ఉంటుంది. అయితే మహిళల్లో రుతుస్రావం ఆగాక (మెనోపాజ్ తర్వాత) ఈస్ట్రోజెన్ స్రావాలు తగ్గుతాయి కాబట్టి.. ఆ దశ తర్వాత పురుషులకూ, మహిళలకూ గుండెపోటు వచ్చే అవకాశాలు సమానంగా ఉంటాయి.

సెకండరీ ప్రివెన్షన్‌గా వాడే మందులివి...

ఆస్పిరిన్ : సాధారణంగా నొప్పుల నివారణకు వాడే ఆస్పిరిన్ మాత్ర రక్తాన్ని పలచబార్చడం కోసం కూడా సమర్థంగా ఉపయోగపడుతుంది. అలా పరచబార్చడం వల్ల రక్తనాళాల్లో రక్తం గడ్డలుగా పేరుకుపోయే అవకాశం తగ్గుతుంది. ఫలితంగా గుండెపోటు వచ్చే అవకాశాలూ తగ్గుతాయి. అందుకే ఒకసారి గుండెపోటు వచ్చినవారు జీవితాంతం ఆస్ప్రిన్ మాత్ర క్రమం తప్పకుండా వాడుతూనే ఉండాలి.

అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... గుండెజబ్బు లేకుండానే ఆస్పిరిన్ వాడటం వల్ల అంతగా ఫలితమేమీ కనిపించదు. పైగా ముందునుంచే మాత్రలు వేసుకోవడం వల్ల రక్తం పలచబారిపోవడం వల్ల ఏ చిన్నదెబ్బ లేదా చిన్నగాయానికైనా ఆగకుండా రక్తస్రావమై... ఆ కారణంగా పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం కూడా ఉంటుంది. అందుకే కొంతకాలం క్రితం డయాబెటిస్ ఉన్నవాళ్లకు గుండెజబ్బులు ఉన్నా లేకపోయినా ఆస్పిరిన్ ఇచ్చేవారు. కానీ... ఆ కారణంగా సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువని కొన్ని శాస్త్రపరిశోధనల్లో వెల్లడయ్యాక డయాబెటిస్ ఉన్న ప్రతి ఒక్కరికీ కాకుండా కేవలం హై రిస్క్ ఉన్నవారికి మాత్రమే ఆస్పిరిన్ సూచిస్తున్నారు.

రామిప్రిల్ : ఈ మందు హైబీపీని (రక్తపోటును) తగ్గించి... తద్వారా గుండెపోటు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది కాబట్టి గుండెపోటు వచ్చిన తర్వాత రామిప్రిల్‌గానీ... అలాంటి మరికొన్ని మందులుగానీ డాక్టర్లు సూచిస్తుంటారు.

అయితే ముందుజాగ్రత్తగా ఆహారంలో ఉప్పు మోతాదు, కొవ్వు పదార్థాలు తగ్గించడం, మద్యపానం మానివేయడం, నడక లాంటి వ్యాయామాలు చేయడం, పచ్చికూరలు తీసుకోవడం వంటి సూచనలనూ ఈ మందు తీసుకుంటూ పాటిస్తుండాలి.

బీటాబ్లాకర్స్ : ఒకసారి గుండెపోటు వచ్చిన తర్వాత గుండె పంపింగ్ తగ్గినవారికి మాత్రమే ఇవి ఉపయోగపడతాయి.

అయితే బీటాబ్లాకర్స్ వాడేటప్పుడు గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే... ఇవి వాడినప్పుడు రక్తపోటు (బీపీ) తగ్గే అవకాశముంటుంది. కాబట్టి బీపీని జాగ్రత్తగా మానిటర్ చేసుకుంటూ ఉండాలి.

స్టాటిన్స్ : రక్తంలోని కొవ్వుల మోతాదులను తగ్గించే మందులివి. మరీ ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ అయిన లో–డెన్సిటీ లైపోప్రోటీన్ (ఎల్‌డీఎల్) అనే కొవ్వులను తగ్గిస్తాయి. అందుకే గుండెపోటు వచ్చిన ప్రతివారికీ ఈ మందును జీవితాంతం సూచిస్తారు. అంతేకాదు... డయాబెటిస్ ఉన్నవారికి గుండెజబ్బుల ముప్పు కూడా పెరగడం వల్ల చక్కెర వ్యాధి ఉన్నవారు స్టాటిన్లు కూడా వాడాలంటూ డాక్టర్లు సూచిస్తారు.

ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే... కేవలం రిస్క్ ఎక్కువగా ఉన్నవారికి మాత్రమే గాక... తక్కువ రిస్క్ ఉన్నవారికి సైతం స్టాటిన్స్ వాడటం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువ అని తేలింది. దాంతో రక్త పరీక్షల్లో ‘హెచ్ఎస్ సీఆర్‌పీ’ విలువ – 2 ఎంజీ కంటే ఎక్కువగా ఉంటే గుండెపోటు లేనివాళ్లకూ గుండెజబ్బులను నివారించవచ్చని తేలింది. ‘సీటీ స్కాన్’తో చూసే ‘కరొనరీ క్యాల్షియమ్ స్కోర్’ ఎక్కువ ఉన్నప్పుడు కూడా డాక్టర్లు స్టాటిన్స్‌ను సూచిస్తారు. అందుకే స్టాటిన్స్ వాడాలంటే ముందుగా డాక్టర్ సూచనల మేరకు తగిన పరీక్షలు చేసి అవి తీసుకోవాలా లేదా అన్నది కేవలం డాక్టర్లు మాత్రమే నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.



ఆరోగ్య సమస్య ఏదీ లేనప్పుడు... అది రాకుండా చూసుకునేందుకు పాటించే నివారణ చర్యలను ‘ప్రాథమిక నివారణ’ (ప్రైమరీ ప్రివెన్షన్) అంటారు. అయితే గుండెపోటుగాని, బ్రెయిన్‌స్ట్రోక్‌గాని ఒకసారి వచ్చాక... అది మళ్లీ రాకుండా ఉండేందుకు కొన్ని రకాల మందులు తీసుకోవడం, అలాగే జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం చాలా సాధారణంగా జరిగే ప్రక్రియ. ఈ మందులు తీసుకోవడాన్ని, అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించే పద్ధతిని సెకండరీ ప్రివెన్షన్‌గా చెబుతారు.

మందులెప్పుడూ సెకండరీ ప్రిపెన్షన్‌గానే...

సాధారణంగా మధుమేహం (డయాబెటిస్), రక్తపోటు (హైబీపీ) ఉందని బయటపడ్డ తర్వాత అది గుండెపోటుకు లేదా గుండెజబ్బులకు దారితీయకుండా కొన్ని రకాల మందులు వాడటం లేదా కొన్ని ఆరోగ్య నియమాలు పాటించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం చేస్తుంటారు. దీన్ని ప్రైమరీ ప్రివెన్షన్‌గా చెప్పవచ్చు. అసలు డయాబెటిస్‌గానీ లేదా రక్తపోటు (హైబీపీ) గానీ రాకుండా ముందుగానే జాగ్రత్త పడటం ‘ప్రైమార్డియల్ ప్రివెన్షన్’ అవుతుంది. ఈ ప్రివెన్షన్ ప్రైమరీ ప్రివెన్షన్ కంటే ఇంకా ముందు దశ. అంటే రిస్క్ ఫ్యాక్టర్లు కనిపించక ముందే... నివారణ చర్యలు చేపట్టడం అన్న మాట. అంతేతప్ప... సెకండరీ ప్రివెన్షన్‌లో వాడే మందులను ముందునుంచే గుండెపోటు రాకుండా ఉండేందుకు వాడే మందులుగా పొరబడకూడదు.

నివారణకు మందుల కంటే మంచి మార్గాలివి...

మందుల కంటే సమతులాహారం తీసుకోవడం అందునా కొవ్వులు తక్కువగానూ, పీచుపదార్థాలు ఎక్కువగానూ ఉండే ఆహారాలతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటి ఆరోగ్యకరమైన అలవాట్ల వల్ల, రోజు కనీసం 30 నిమిషాల పాటు క్రమం తప్పకుండా చేసే వ్యాయామం వల్లనే గుండెజబ్బుల నివారణకు మంచి అవకాశం ఉంది.

- ఒమెగా 3 – ఫ్యాటీ యాసిడ్స్ ఉండే చేపల వంటి ఆహారాన్ని తీసుకోవడం. ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్‌తో గుండెజబ్బులు నివారితమవుతాయని ఖచ్చితంగా చెప్పలేకపోయినా... అవి తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని అనేక అధ్యయనాలలో తేలింది. కాబట్టి వాటిని వాడటం మంచిదే. ఈ ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ అన్నవి చేపల్లో ఎక్కువ ఉంటాయి. కాబట్టి వారంలో రెండు సార్లు చేపలు తినడం మంచిది.
- ఒక రోజు ఒక వ్యక్తి తినే ఉప్పు పరిమితి 5 నుంచి 6 గ్రాముల కంటే తక్కువగా ఉండటమే మేలు.
- రోజూ కనీసం 250 గ్రాముల తాజా పండ్లు తినడం వల్ల గుండెజబ్బుకు అవకాశాలు తక్కువ.

ఈ మందులతో నివారణ ఎప్పుడూ... ఎలాగంటే...

- హై రిస్క్ ఉన్నవారికి మాత్రమే : ఇవి సెకండరీ ప్రివెన్షన్ కోసం మాత్రమే.
- ఆస్పిరిన్‌ను సాధారణంగా... ఒకసారి గుండెజబ్బులు కనిపించిన వారికి మాత్రమే ఉపయోగిస్తారు. మునుపు డయాబెటిస్ ఉండి, గుండెజబ్బు లేనివారికి కూడా ప్రైమరీ ప్రివెన్షన్ కోసం ఆస్పిరిన్‌ను వాడేవారు. అయితే కొత్త పరిశోధనల ఆధారంగా ఇప్పుడు ఆస్పిరిన్‌ను కేవలం సెకండరీ ప్రివెన్షన్ కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారు.

పై అంశాలు లేకపోతే ఆస్పిరిన్ వాడటం వల్ల ప్రయోజనం కంటే రిస్క్ ఎక్కువ.

వ్యాయామంతో గుండెజబ్బులు దూరం

ప్రతిరోజూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయడం గుండెజబ్బులు / గుండెపోటుకు మంచి నివారణ అని అనేక అధ్యయనాల్లో తేలింది. అయితే ఈ వ్యాయామం కేవలం మొక్కుబడిగా కాకుండా... ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. కాకపోతే మరీ ఎక్కువగా శ్రమ కలిగించేలా ఉండకూడదు. అలాగని మరీ విశ్రాంతిగా కూడా ఉండకూడదు. శరీరానికి మరీ ఎక్కువ శ్రమ కలగని రీతిలో ఉండే బ్రిస్క్‌వాకింగ్, ఈత లేదా ఏదైనా స్పోర్ట్ వంటి వ్యాయామాలు మంచివి. మరీ ఎక్కువగా శ్రమ కలిగించేవి అకస్మాత్తుగా మొదలుపెట్టకూడదు. తీవ్రతను క్రమంగా పెంచుకుంటూ పోవడం మంచి పద్ధతి.

ఏయే కొలతలు ఎంతెంత ఉండాలంటే...

- గుండెజబ్బులు ఉన్నవారిలో రక్తపోటు విలువ 130/80 కంతే తక్కువగా ఉండాలి.

కొలెస్ట్రాల్ మోతాదులు :

- రక్తంలో పూర్తి కొలెస్ట్రాల్ మోతాదులు... 200 కంటే తక్కువ ఉండాలి.
- చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) మోతాదులు... 100 కంటే తక్కువ ఉండాలి. గుండె జబ్బులు ఉన్నవారికి 70 కంటే తక్కువగా ఉండాలి.
- మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) మోతాదులు... 40 కంటే ఎక్కువగా ఉండాలి.
- ట్రైగ్లిజరైడ్స్ అనే రకం కొవ్వుల మోతాదులు... 200 కంటే తక్కువగా ఉండాలి.

పరాజయం దిశగా ఆంధ్ర

బెంగాల్‌తో రంజీ క్వార్టర్స్ మ్యాచ్

కళ్యాణి: రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెంగాల్‌తో జరుగుతున్న ఈ పోరులో ఆంధ్ర ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకునేందుకు ప్రయత్నిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 334 పరుగుల ఆధిక్యం కోల్పోయిన ఆంధ్ర...మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లలో 64 పరుగులే చేసి 3 వికెట్లు కోల్పోయింది. అభిషేక్ రెడ్డి (5), సీఆర్ జ్ఞానేశ్వర్ (20), షేక్ రషీద్ (8) ఇప్పటికే పెవిలియన్ చేరారు. క్రీజ్‌లో కెప్టెన్ రికీ భుయ్ (18 బ్యాటింగ్), నితీశ్ కుమార్ రెడ్డి (1 బ్యాటింగ్) ఉన్నారు. ఆంధ్ర ప్రస్తుతం మరో 270 పరుగులు వెనుకబడి ఉంది. మ్యాచ్ చివరి రోజు పట్టుదలగా బ్యాటర్లు నిలబడి ఈ స్కోరును అధిగమించినా...బెంగాల్ ముందు భారీ లక్ష్యం ఉంచడం కష్టమే. ఒక వేళ మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా...తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో బెంగాల్ సెమీ ఫైనల్ చేరడం ఖాయం.

సుదీప్ ఘురామీ 299 అవుట్...

ఓవర్‌నైట్ స్కోరు 418/6తో బెంగాల్ సోమవారం బ్యాటింగ్ కొనసాగించింది. సుదీప్ కుమార్ ఘురామీ (596 బంతుల్లో 299; 31 ఫోర్లు, 6 సిక్సలు), హబీబ్ గాంధీ (229 బంతుల్లో 95; 8 ఫోర్లు, 1 సిక్స్) తమ జోరును కొనసాగిస్తూ భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 221 పరుగులు జోడించగా, హబీబ్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించే అవకాశాన్ని కోల్పోయాడు. ఆ వెంటనే ఆకాశ్‌దీప్ (12) కూడా పెవిలియన్ చేరాడు. మరో వైపు సుదీప్‌ను దురదృష్టం వెంటాడింది. కెరీర్‌లో ట్రిపుల్ సెంచరీ ఘనతను నమోదు చేసే అవకాశం అతనికి చేజారింది. పార్ట్‌టైమ్ స్పిన్నర్ షేక్ రషీద్ వేసిన లెగ్ బ్రేక్ అతని స్టంప్స్‌ను పడగొట్టడంతో 299 పరుగుల వద్ద తీవ్ర నిరాశతో సుదీప్ పెవిలియన్ చేరాడు. అయితే పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ (33 బంతుల్లో 53; 7 ఫోర్లు, 3 సిక్సలు) బ్యాటింగ్‌లో చెలరేగి బెంగాల్ స్కోరును 600 దాటించాడు. భారీ షాట్‌లతో సత్తా చాటిన షమీ 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకొని చివరి వికెట్‌గా అవుటయ్యాడు.

3 ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 299 పరుగుల వద్ద అవుటైన మూడో బ్యాటర్‌గా సుదీప్ కుమార్ ఘురామీ నిలిచాడు. గతంలో మార్టిన్ క్రో (న్యూజిలాండ్ - 1991లో శ్రీలంకపై), మైక్ పావెల్ (గ్లామోర్గాన్ - 2009లో గ్లూసెస్టర్‌షైర్‌పై) మాత్రమే ఈ స్కోరు వద్ద వెనుదిరిగారు.

లిఫ్టింగ్‌లో అజిత్ జాతీయ రికార్డు

మోదీ నగర్: తమిళనాడు లిఫ్టర్ నారాయణన్ అజిత్ జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రికార్డు నెలకొల్పాడు. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్‌ఎస్‌పీబీ)కి ప్రాతినిధ్యం వహిస్తున్న అజిత్ పురుషుల 71 కేజీల సీనియర్ కేటగిరీలో 320 కేజీల బరువెత్తి బంగారు పతకం గెలిచాడు. స్నాచ్‌లో 145 కేజీల బరువెత్తి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో అతను 175 కేజీలు ఎత్తాడు. ఆర్‌ఎస్‌పీబీ సహచరుడు టి.మాధవన్ కూడా క్లీన్ అండర్ జెర్క్‌లో 175 కేజీల బరువెత్తినప్పటికీ... స్నాచ్‌లో 142 కేజీలే ఎత్తి మొత్తం 317 కేజీలతో రెండో స్థానంలో నిలిచాడు. ఇందులో మహారాష్ట్ర లిఫ్టర్ యశ్ ఖండగలే 300 కేజీల బరువెత్తి కాంస్యం అందుకున్నాడు. జూనియర్ విభాగంలోనూ పోటీపడిన యశ్ స్నాచ్‌లో 138 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 162 కేజీల బరువెత్తి (మొత్తం 300 కేజీలు) బంగారు పతకం నెగ్గాడు. అభినొబ్ గొగొయ్ (ఎస్‌ఎస్‌సీబీ)కు రజతం దక్కింది. అతను స్నాచ్‌లో 123 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 153 కేజీలు మొత్తం 276 కేజీలతో రజతం చేజిక్కించుకున్నాడు. బెంగాల్ లిఫ్టర్ కల్లోల్ మాల్ (270 కేజీలు) కాంస్యం నెగ్గాడు.

జమ్మూ కశ్మీర్ అద్భుతం

- తొలి సారి రంజీ ట్రోఫీ సెమీఫైనల్‌కు
- క్వార్టర్స్‌లో మధ్యప్రదేశ్‌పై 56 పరుగులతో విజయం
- ఆఖిబ్ నబీకి 5 వికెట్లు

ఇండోర్: రంజీ ట్రోఫీ నాకౌట్ దశలో మరో సంచలనం నమోదైంది. ఈ టోర్నీలో ఆదివారం జార్ఖండ్‌ను ఓడించి చిన్న జట్టు ఉత్తరాఖండ్ తొలి సారి టోర్నీ సెమీస్ చేరగా... తర్వాతి రోజే దేశవాళీ క్రికెట్‌లో మరో చిన్న జట్టు జమ్మూ కశ్మీర్ జట్టు ఇలాంటి ఫలితాన్నే పునరావృతం చేసింది. 67 ఏళ్ల తమ రంజీ చరిత్రలో జమ్మూ కశ్మీర్ మొదటి సారి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 1959-60 సీజన్‌లో తొలి సారి ఈ టోర్నీలో ఆడిన జట్టు ఇన్నేళ్ల తర్వాత సెమీస్ చేరడం విశేషం.

సోమవారం ముగిసిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కశ్మీర్ 56 పరుగుల తేడాతో 2021-22 చాంపియన్ మధ్యప్రదేశ్‌పై విజయం సాధించింది. 291 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 87/5తో నాలుగో రోజు ఆట కొనసాగించిన మధ్య ప్రదేశ్ 68.3 ఓవర్లలో 234 పరుగులకే ఆలౌటైంది. సారాంశ్ జైన్ (81 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో పోరాడగా...శుభమ్ శర్మ (32) మాత్రమే ఫర్వాలేదనిపించాడు. వైస్ కెప్టెన్ వెంకటేశ్ అయ్యర్ (17) విఫలం కావడంతో జట్టు గెలుపు ఆశలు కోల్పోయింది. పేస్ బౌలర్ ఆఖిబ్ నబీ (5/70) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా...ఆబిద్ ముస్తాక్‌కు 3 వికెట్లు దక్కాయి. రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 12 వికెట్లు పడగొట్టిన ఆఖిబ్ నబీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

సెంచరీతో గెలిపించిన రాహుల్...

ముంబై: భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ (182 బంతుల్లో 130; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో ముందుండి నడిపించగా చిరకాల ప్రత్యర్థి, 42 సార్లు విజేత అయిన ముంబైని ఓడించి కర్నాటక సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. ఎనిమిది సార్లు చాంపియన్ కర్నాటక సోమవారం ఆసక్తికరంగా ముగిసిన క్వార్టర్స్ పోరులో 4 వికెట్ల తేడాతో ముంబైపై గెలుపొందింది. 325 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఓవర్‌నైట్ స్కోరు 113/2తో కర్నాటక నాలుగో రోజు ఆట కొనసాగించింది. కరుణ్ నాయర్ ((13) ఆరంభంలోనే వెనుదిరగ్గా... రాహుల్, రవిచంద్రన్ స్మరణ్ (123 బంతుల్లో 83 నాటౌట్; 11 ఫోర్లు) కలిసి జట్టును విజయం దిశగా నడిపించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 147 పరుగులు జోడించారు. తొలి సెషన్‌లోనే 147 బంతుల్లో రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 24వ సెంచరీ కావడం విశేషం. లంచ్ తర్వాత కర్నాటక ఇన్నింగ్స్ కొంత తడబాటుకు గురైంది. 19 పరుగుల వ్యవధిలో రాహుల్, శ్రేయస్ గోపాల్ (1), కృతిక్ కృష్ణ (2) అవుట్ కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య కొద్ది సేపు మైదానంలో వాదనలు కూడా జరిగాయి. అయితే స్మరణ్, విద్యాధర్ పాటిల్ (30 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కలిసి జట్టును గట్టెక్కించారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు అభేద్యంగా 40 పరుగులు జత చేశారు. ఆదివారం నుంచి జరిగే తొలి సెమీఫైనల్లో ఉత్తరాఖండ్‌తో కర్నాటక తలపడుతుంది.

బ్యాడ్మింటన్‌లో లీగ్ కం నాకౌట్ మ్యాచ్‌లు!

బ్యాడ్మింటన్ టోర్నీల నిర్వహణలో పలు మార్పులు ● స్థాయి తగ్గిన సయ్యద్ మోడీ టోర్నమెంట్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో టోర్నీల నిర్వహణకు సంబంధించి బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) పలు కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. దీని ప్రకారం పలు టోర్నమెంట్‌లో స్థాయిని తగ్గించడంతో పాటు మరికొన్ని టోర్నీలను అదనంగా చేర్చారు. వరల్డ్ టూర్ టోర్నమెంట్‌ల నిర్వహణ కోసం గత ఏడాది 32 దేశాలు దరఖాస్తు చేయగా, ఈసారి డిమాండ్ మరింతగా పెరిగి 56 దేశాలు మ్యాచ్‌ల నిర్వహణకు ఆసక్తి చూపించాయి. దాంతో భిన్న దేశాల్లో ఆటకు గుర్తింపు తీసుకురావడంలో భాగంగా తప్పనిసరి పరిస్థితుల్లో మార్పులు చేయాల్సి వచ్చిందని బీడబ్ల్యూఎఫ్ ప్రకటించింది. దీని ప్రకారం భారత్ ఎప్పటిలాగే కచ్చితంగా నిర్వహించే ఏడాదికి నాలుగు టోర్నీల సంఖ్య తగ్గి రెండుకు పరిమితం అయింది. 2023లో సూపర్-750 టోర్నీగా గుర్తింపు తెచ్చుకున్న ఇండియా ఓపెన్ అదే స్థాయిలో కొనసాగుతుంది. ఇటీవల ఈ టోర్నీ అస్తవస్త నిర్వహణ పట్ల పలు విమర్శలు వచ్చినా...అదృష్టవశాత్తూ బీడబ్ల్యూఎఫ్ నుంచి ఎలాంటి చర్యలూ ఎదురు కాలేదు. అయితే మరో టోర్నీ సయ్యద్ మోడీ సూపర్-300 స్థాయి మాత్రం మారింది. లక్నోలో ప్రతీ ఏటా భారత మాజీ షట్లర్ సయ్యద్ మోడీ సంస్మరణార్థం నిర్వహించే ఈ టోర్నీని ఇప్పుడు సూపర్-100కు పరిమితం చేశారు. ఇండియా ఓపెన్ కాకుండా తమకు సూపర్-100 మాత్రమే దక్కే అవకాశం ఉండటంతో దేశంలో చాలా ఏళ్లుగా జరుగుతున్న టోర్నీ కాబట్టి పేరు మార్చకుండా సయ్యద్ మోడీనే స్థాయి తగ్గించి కొనసాగించాలని నిర్ణయించుకున్న భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) స్పష్టం చేసింది. ఇప్పటి వరకు భారత్‌లో కొనసాగుతున్న మరో రెండు సూపర్-100 టోర్నీలు (గువహటి, ఒడిషా)లను సర్క్యూట్‌నుంచి బీడబ్ల్యూఎఫ్ పూర్తిగా తొలగించింది.

మొత్తం 36 టోర్నీలు...

బీడబ్ల్యూఎఫ్ కొత్త క్యాలెండర్ ప్రకారం ఒక ఏడాదిలో టోర్నీలను ఆరు స్థాయిల్లో విభజించారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ అన్నింటికంటే అగ్రభాగాన ఉంటుంది. ఆ తర్వాత 5 సూపర్-1000, 5 సూపర్-750, 9 సూపర్-500, 8 సూపర్-300 టోర్నీలు జరుగుతాయి. తొలి సారి సూపర్-100 టోర్నీలను కూడా ప్రధాన టూర్ సర్క్యూట్‌లో చేర్చారు. ఏడాదికి 8 సూపర్-100 టోర్నమెంట్‌లు నిర్వహిస్తారు. గతంలో సూపర్-1000 టోర్నీలు నాలుగు మాత్రమే ఉండగా ఇప్పుడు వాటిని ఐదుకు పెంచారు. అన్ని టోర్నీలు కలిపి మొత్తం ప్రైజ్‌మనీని 26.9 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 245 కోట్లు) పెంచుతున్నట్లు కూడా బీడబ్ల్యూఎఫ్ ప్రకటించింది. ఫార్మాట్‌లో కూడా స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ఇప్పటి వరకు తొలి మ్యాచ్‌నుంచి 'నాకౌట్' కాగా... ఇప్పుడు దీనిని మార్చి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఒక్కో ప్లేయర్ ఒక టోర్నీలో కనీసం రెండు మ్యాచ్‌లైనా ఆడే అవకాశం కల్పించాలనేదే అందుకు కారణం. టీమ్ ఈవెంట్లు సుదిర్మన్ కప్, థామస్ కప్, ఉబెర్ కప్‌లలో కూడా జట్ల సంఖ్యను పెంచనున్నారు. మరింత ఎక్కువ మందికి బ్యాడ్మింటన్‌కు చేరువ చేసే క్రమంలో భాగంగా సాధ్యమైనన్ని ఎక్కువ మ్యాచ్‌లను టీవీల్లో ప్రసారం చేయాలని ఫెడరేషన్ నిర్ణయించింది. దీని ప్రకారం ఏడాదికి కనీసం 3 వేల మ్యాచ్‌లు ప్రసారం అయ్యేలా ఏర్పాట్లు చేస్తారు.

ఇషా సింగ్‌కు కాంస్యం

మనుభాకర్‌కు చేజారిన స్వర్ణావకాశం ● ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: తెలంగాణ షూటర్లు ఇషా సింగ్, తనిష్క్ మురళీధర్ నాయుడు ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటుకున్నారు. ఇద్దరూ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. రెండు ఒలింపిక్ పతకాల విజేత, స్టార్ షూటర్ మను భాకర్ తృటిలో స్వర్ణం చేజార్చుకుంది. చివరకు 'షూటాఫ్'లో ఆమె రజతంతో సరిపెట్టుకుంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో మను భాకర్, వియత్నాం షూటర్ ఎన్‌గుయెన్ తు త్రంగ్ పసిడి లక్ష్యంపైనే గురిపెట్టారు. ఇద్దరి బుల్లెట్లు పోటాపోటీగా లక్ష్యాన్ని చేరడంతో ఇద్దరు సమఉజ్జీగా నిలిచారు. దీంతో విజేతను తేల్చేందుకు షూటాఫ్ నిర్వహించగా వియత్నాం షూటర్ పైచేయి సాధించడంతో మను భాకర్ రజతంతో తృప్తిపడింది. ఈ ఈవెంట్‌లోనే మూడో స్థానంలో నిలిచిన ఇషా సింగ్‌కు కాంస్యం లభించింది. ఎనిమిది మంది ఫైనల్స్‌కు అర్హత సాధించగా భారత్ నుంచి ముగ్గురు పతకం బరిలో నిలిచారు. రిథమ్ సాంగ్వాన్ కూడా క్వాలిఫై అయ్యింది. అయితే పాయింట్ల పరంగా మను, ఇషా, రిథమ్‌లు 1751 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలవడంతో టీమ్‌ఈవెంట్ స్వర్ణం లభించింది. 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ ఈవెంట్‌లో తనిష్క్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం, టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం గెలుపొందాడు.

'ఎంతో ఎత్తుకు ఎదగాలి'

అండర్-19 ప్రపంచ కప్‌లో భారత జట్టును విజేతగా నిలిపిన కెప్టెన్ ఆయుశ్ మాత్రేకు అరుదైన ప్రత్యేక ప్రశంస లభించింది. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ స్వయంగా మాత్రేను అభినందించి అతని విజయంపై శుభాకాంక్షలు చెప్పాడు. 2013లో తాను ఆడిన ఆఖరి టెస్టు సిరీస్‌లో ధరించిన జెర్సీని కూడా సచిన్ బహుమతిగా అందజేశాడు. ముంబైకి చెందిన మాత్రే కెరీర్‌లో మరింత ఎత్తుకు ఎదగాలని, మరిన్ని విజయాలు సాధించాలని సచిన్ ఆకాంక్షించాడు. మాత్రే ఇప్పటికే రెండు సీజన్లలో కలిపి ముంబై తరఫున 13 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు.

ఇది ఆరంభం మాత్రమే

బెంగళూరు: భారత డేవిస్ కప్‌లో కొత్త సంచలనంగా ఆవిర్భవించిన దక్షిణేశ్వర్ సురేశ్ తాజా 'డబుల్ ధమాకా' ప్రదర్శన ఆరంభం మాత్రమేనని ముందుముందు మరిన్ని విజయాలపై దృష్టి సారిస్తానని చెప్పాడు. ప్రపంచ సింగిల్స్‌లో 465, డబుల్స్‌లో 457 ర్యాంకుల్లో ఉన్న దక్షిణేశ్వర్ నెదర్లాండ్స్‌పై సంచలన ఆటతీరుతో అదరగొట్టాడు. డబుల్స్, రివర్స్ సింగిల్స్‌లో గెలిచి భారత్‌ను వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ రెండో రౌండ్‌కు చేర్చాడు. అమెరికాలో ఉన్నత విద్య ఈ ఏడాది మేలో పూర్తవుతుందని... తర్వాత పూర్తిస్థాయిలో ఏటీపీ టూర్ ఈవెంట్లకు సిద్ధమవుతానని చెప్పాడు. డేవిస్ కప్‌లో దక్షిణేశ్వర్ నాలుగు విజయాలు సాధించాడు. భారత దిగ్గజం లియాండర్ పేస్ స్ఫూర్తితో సుదీర్ఘ కాలం టెన్నిస్‌లో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన పోటీల్లో తను భిన్నమైన ఆటతీరును కనబరిచినట్లు వివరించాడు. డేవిస్ కప్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో భాగంగా భారత జట్టు... ఈ సెప్టెంబర్‌లో దక్షిణ కొరియాతో తలపడనుంది.

లద్దాఖ్‌కు చెందిన దివ్యాంగ బాలలతో సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ముచ్చటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

పరీక్షా పే చర్చ సందర్భంగా ఢిల్లీలో తన అధికార నివాసంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌లో బస్తర్ పండుమ్‌-2026 ముగింపు వేడుకల సందర్భంగా ఓ స్టాల్‌లో మిఠాయి రుచి చూస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

చిప్ రంగంలో స్వయం సమృద్ధి!

బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించిన కేంద్రం

దేశీయంగానే 75 శాతం చిప్స్ తయారీ లక్ష్యం

సాక్షి, న్యూఢిల్లీ: డిజిటల్ ప్రపంచంలో 'ఆత్మనిర్భర్ భారత్'నినాదానికి బలం చేకూరుస్తూ కేంద్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రానిక్స్ రంగానికి వెన్నెముక లాంటి సెమీకండక్టర్ల (చిప్స్) తయారీలో దేశాన్ని అగ్ర స్థానానికి చేర్చేందుకు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0'(ఐఎస్‌ఎం 2.0)కు శ్రీకారం చుట్టింది. 2026–27 బడ్జెట్‌లో ఈ మిషన్ కోసం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయించింది. పరిశోధన, శిక్షణ, పరికరాల తయారీపై దృష్టి సారిస్తూ, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని కేంద్రం ప్రకటించింది.

ఆ మూడు దేశాలదే పెత్తనం

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల తయారీలో తైవాన్, చైనా, కొరియా దేశాల ఆధిపత్యం నడుస్తోంది. కోవిడ్ సమయంలో చిప్స్ సరఫరా చైన్ దెబ్బతినడంతో మొబైల్స్ నుంచి కార్ల తయారీ వరకు అన్నీ స్తంభించిపోయాయి. ఈ చేదు అనుభవాల దృష్ట్యా, సరఫరా గొలుసులో చైనాపై ఆధారపడకూడదని భారత్ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే 'మేక్ ఇన్ ఇండియా –మేక్ ఫర్ ది వరల్డ్'లక్ష్యంతో అడుగులు వేస్తోంది.

2035 నాటికి టాప్ ప్లేస్‌లో..

భారత సెమీకండక్టర్ మార్కెట్ 2030 నాటికి 100–110 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనాలున్నాయి. 2029 నాటికి దేశీయ అవసరాల్లో 70–75 శాతం చిప్స్ మన దగ్గరే తయారయ్యేలా చూడటం, 2035కల్లా ప్రపంచంలోని టాప్ సెమీకండక్టర్ దేశాల సరసన భారత్ నిలవడం ఈ మిషన్ అంతిమ లక్ష్యమని కేంద్రం ప్రకటించింది. రాబోయే రోజుల్లో దేశీయంగా 3–నానోమీటర్, 2–నానోమీటర్ అత్యాధునిక చిప్స్ తయారీ ప్రణాళిక కార్యరూపం దాల్చుతుందని ధీమా వ్యక్తం చేసింది.

అప్పుడు ఐఎస్‌ఎం 1.0 సూపర్ హిట్..

కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రారంభించిన తొలి దశ (ఐఎస్‌ఎం 1.0) విజయవంతమైంది. రూ.76 వేల కోట్ల ప్రోత్సాహకాలతో మొదలైన ఈ ప్రయాణంలో డిసెంబర్ 2025 నాటికి ఏకంగా రూ.1.60 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 భారీ ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. ఇప్పుడు ఐఎస్‌ఎం 2.0 ద్వారా కేవలం చిప్స్ అసెంబ్లింగ్ మాత్రమే కాకుండా ముడి సరుకులు, పరికరాలు, డిజైనింగ్ కూడా భారత్‌లోనే జరిగేలా ప్రణాళిక రచించారు.

2026–27 బడ్జెట్ లక్ష్యం ఇదే..

సెమీకండక్టర్, డిస్‌ప్లే తయారీ ఎకోసిస్టమ్ కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 8,000 కోట్ల భారీ ప్రణాళిక రూపొందించారు. రూ. 4,000 కోట్ల పెట్టుబడితో మరో కొత్త చిప్ తయారీ యూనిట్ ద్వారా 1,500 మందికి ఉపాధి కల్పించనున్నారు. రూ. 11,000 కోట్ల పెట్టుబడితో 9 కొత్త ఏటీఎంపీ/ఓశాట్ అసెంబ్లింగ్ యూనిట్ల ద్వారా 3,000 మందికి ఉపాధి ఇవ్వనున్నారు. అంతేగాక 30 డిజైన్ కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు 10 కొత్త చిప్ ఐపీ కోర్లను అభివృద్ధి చేయనున్నారు.

మన సొంత చిప్ 'ధ్రువ్–64'

విదేశీ టెక్నాలజీపై ఆధారపడకుండా సీ–డాక్ ఆధ్వర్యంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'ధ్రువ్–64'మైక్రోప్రాసెసర్ ఒక గేమ్ ఛేంజర్. 5జీ, ఆటోమొబైల్, రక్షణ రంగాల్లో దీని వినియోగం కీలకం కానుంది.

జిమ్మీ లాయ్‌కి 20 ఏళ్ల జైలు

- మీడియా మాజీ అధిపతికి హాంకాంగ్ కోర్టు శిక్ష
- ప్రభుత్వ వ్యతిరేక కుట్రలకు లాయ్‌ని సూత్రధారిగా పేర్కొన్న జడ్జీలు

హాంకాంగ్: చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించే ప్రజాస్వామ్య అనుకూల, హాంకాంగ్ మీడియా మాజీ అధిపతి జిమ్మీ లాయ్(78)కి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. దేశ భద్రతకు ప్రమాదం కలిగించేందుకు విదేశీ శక్తులతో చేతులు కలిపారని, విద్రోహ వార్తా కథనాలను ప్రచురించారని బ్రిటిష్ పౌరుడు కూడా అయిన లాయ్‌పై అభియోగాలున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక కుట్రలన్నిటికీ జిమ్మీ లాయ్‌ని ముఖ్య సూత్రధారిగా తీర్పు సందర్భంగా జడ్జిలు పేర్కొన్నారు. లాయ్ వయస్సు, ఆరోగ్య పరిస్థితులు, కఠినమైన ఏకాంత కారాగారవాసం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని, జరిమానా తగ్గించామన్నారు. అక్రమాలకు సంబంధించిన వేర్వేరు కేసుల్లో ఆయన ఐదేళ్ల 9 నెలలపాటు శిక్ష అనుభవించాల్సి ఉన్నందున ఇది పూర్తయ్యాకే తాజాగా విధించిన జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హాంకాంగ్‌లో అసమ్మతిని అణిచివేసేందుకు చైనా ప్రభుత్వం తీసుకువచ్చిన కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద విధించిన మొట్టమొదటి దీర్ఘకాలం శిక్ష ఇదే కావడం గమనార్హం. లాయ్‌తోపాటు ఆయన స్థాపించిన యాపిల్ డైలీ వార్తాపత్రికలోని ఆరుగురు ఉద్యోగులు, ఇద్దరు ఉద్యమకారులకు కూడా పదేళ్లు, ఆరేళ్లు, మూడు నెలల జైలు శిక్షలు విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. వీరిలో ఎక్కువ మంది నేరం అంగీకరించడంతోపాటు ప్రభుత్వం పక్షానికి మారడంతో శిక్షల తీవ్రత తగ్గింది. కాగా, సోమవారం కోర్టుకు వచ్చే సమయంలో అక్కడున్న మద్దతుదారుల వైపు చేతులు ఊపుతూ నవ్వుతూ కనిపించిన లాయ్...తిరిగి వెళ్లేటప్పుడు మాత్రం సీరియస్‌గా ఉన్నారు. తీర్పు విన్న తర్వాత పబ్లిక్ గ్యాలరీలో ఉన్న కొందరు రోదించారు. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళతారా అని ప్రశ్నించగా జిమ్మీ లాయర్ 'నో కామెంట్'అంటూ బదులిచ్చారు. కాగా, తన తండ్రి జైలులోనే అమరుడవుతారని లాయ్ కుమార్తె గద్గద స్వరంతో అన్నారు. 'మా గుండె బద్దలైంది'అని ఆయన కుమారుడు సెబాస్టియన్ అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం 2019లో హాంకాంగ్‌లో నిరసనలు తీవ్రతరమయ్యాయి. ఆ సమయంలో చైనా ప్రభుత్వం వివాదాస్పద జాతీయ భద్రతా చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం కింది 2020లో హాంకాంగ్ అధికారులు లాయ్‌తోపాటు కొన్ని నెలల వ్యవధిలోనే యాపిల్ డైలీ సీనియర్ జర్నలిస్టులను కూడా అరెస్ట్ చేశారు. దీంతో, 2021లో ఆ పత్రిక మూతబడింది.

పాక్‌లో తక్షశిలకు ఎందుకెళ్లారు?

- రావల్పిండి పర్యటన ఏర్పాట్లు చేసిందెవరు?
- అనధికార పర్యటనపై గౌరవ్ గొగోయ్ వివరణ ఇవ్వాలి
- అస్సాం సీఎం హిమంత డిమాండ్

గువాహటి: అస్సాం బీజేపీ అగ్రనేత, రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ మధ్య పరస్పర ఆరోపణల అగ్ని మరింత రాజుకుంది. ''భార్య ఉద్యోగ పనుల నిమిత్తం 2013 డిసెంబర్‌లో పాకిస్తాన్‌కు వెళ్లానని గొగోయ్ చెప్తున్నారు. అయితే వీసా అనుమతుల ప్రకారం లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్‌లకు మాత్రమే పర్యటించే వీలుంది. కానీ రావల్పిండి జిల్లాలోని తక్షశిలకు గొగోయ్ దంపతులు ఎందుకు వెళ్లాల్సి వచ్చింది?. వీసా పరిధిలోని నగరాలకు వెళ్లేందుకు పాకిస్తాన్‌లో స్థానికంగా గొగోయ్‌కు ఎవరు అనుమతి ఇచ్చారు?. రావల్పిండి జిల్లాల పర్యటన ఏర్పాట్లు స్థానికంగా చేసిందెవరు?. పాకిస్తాన్ ఆర్మీ జనరల్ ప్రధాన కార్యాలయం సైతం రావల్పిండిలోనే ఉంది. పాక్ నిఘా వర్గాలతో గొగోయ్‌కు సంబంధం ఉందనడానికి ఇంతకంటే రుజువులు కావాలా?. గొగోయ్ తన పాక్ అనధికర, దేశవ్యతిరేక పర్యటనపై వివరణ ఇవ్వాల్సిందే''అని సీఎం హిమంత డిమాండ్‌చేశారు.

హిమంత మాటల్లో నిజం లేదు: గొగోయ్

హిమంత ఆరోపణలపై గొగోయ్ సోమవారం దీటుగా ప్రతిదాడిచేశారు. ''నా కుటుంబానికి పాకిస్తాన్‌తో ఎలాంటి సంబంధం లేదు. భార్య పనినిమిత్తం పది రోజులు మాత్రమే పాక్‌కు వెళ్లివచ్చాం. అక్కడ ఎవరినీ కలవలేదు. ఈ విషయం అస్సాం పోలీస్ రిపోర్ట్‌లోనూ స్పష్టంగా ఉంది. నివేదిక వచ్చి ఆరు నెలలవుతుంటే ఇన్నాళ్లూ హిమంత ఏం చేస్తున్నట్లు?. హిమంత తన కుటుంబం ఆక్రమించిన వేల ఎకరాల భూముల అంశం నుంచి అస్సామీల దృష్టి మరల్చేందుకే నాపై అభాండాలు వేస్తున్నారు. రాష్ట్రంలో ఆరు కులాలకు ఎస్టీ హోదా, మాదకద్రవ్యాలు హోరెత్తడం వంటి సమస్యలపై దృష్టిపెడితే బాగుంటుంది. అవి వదిలేసి బంగ్లాదేశీ ముస్లిం వలసదారు(మియా)లను లక్ష్యంగా చేసుకుంటూ వాళ్లను రైఫిల్‌తో గురిపెట్టి కాల్చుతున్నట్లు ఉన్న వీడియోను ఆన్‌లైన్‌లో విస్తృత ప్రచారంచేశారు. ఇలాంటి మతవిద్వేష వీడియోలను బీజేపీ అస్సాం విభాగం సోమవారం 'ఎక్స్'లో పోస్ట్‌చేసి తీవ్ర విమర్శలు రాగానే తొలగించారు. ఈ వివాదంలో పోలీసులు సూమోటోగా కేసు నమోదుచేసి సీఎంపై నేరం మోపాలి''అని గొగోయ్ డిమాండ్‌చేశారు.

పెట్రోలియం నిల్వలు 74 రోజులకు సరిపడా

- అస్థిర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యూహం సిద్ధం
- కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో 74 రోజులకు సరిపడా పెట్రోలియం నిల్వలున్నాయని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. వీటిని 90 రోజులకు పెంచేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. అంతర్జాతీయంగా అస్థిర పరిస్థితులు తలెత్తితే ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహముందన్నారు. దేశ ఆర్థికస్థిరత్వానికి, ఇంధన భద్రతకు ఈ నిల్వలు ఎంతో కీలకమని చెప్పారు. సోమవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఓ ప్రశ్నకు లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. దేశ తూర్పు, పడమర తీర ప్రాంతాల్లో పలు చమురు రిఫైనరీలున్నాయని గుర్తు చేశారు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో పెట్రోలియం నిల్వ డిపోలుండగా త్వరలోనే ఒడిశాలో మరోటి ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ప్రపంచంలోనే మనం మూడో అతిపెద్ద క్రూడాయిల్ వినియోగదారులం. చమురు శుద్ధి విషయంలో నాలుగో స్థానం, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో ఐదో స్థానంలో ఉన్నాం'అని వివరించారు. 'ఏపీ, కర్నాటకల్లో ఉన్న మూడు వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వు కేంద్రాల్లో 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) క్రూడాయిల్‌ను నిల్వ ఉంచుకోవచ్చు. ప్రస్తుతం వీటిలో 4.094 ఎంఎంటీల క్రూడాయిల్, అంటే సామర్థ్యంలో 77 శాతం ఉంది. మొత్తం నిల్వ సామర్థ్యంలో 50 శాతం వరకు వాణిజ్య కార్యకలాపాలకే సరిపోతుంది'అని పూరి వివరించారు.

కష్టాల్లో కీర్ స్టార్మర్

బ్రిటన్ ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం

- వరసబెట్టిన రాజీనామాలు చేస్తున్న కీలక వ్యక్తులు
- స్టార్మర్ దిగిపోవాలంటూ సొంత పార్టీ నుంచే డిమాండ్లు

లండన్: అమెరికాలో మొదలైన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం బ్రిటన్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఏకంగా కీర్ స్టార్మర్ ప్రభుత్వ పునాదులనే కదిలిస్తోంది! సంపన్నులు, రాయబారులు, అగ్రనేతలు, రాజకుటుంబీకుల లైంగికావసరాలు తీర్చేందుకు అమాయక యువతులు, ముఖ్యంగా మైనర్లను అక్రమంగా సరఫరా చేసిన కేసులో ప్రధాన నిందితుడు ఎప్‌స్టీన్ బతికున్నప్పటి కంటే చనిపోయాక ఈ అంశం మరింత ప్రకంపనలు సృష్టిస్తోంది. బ్రిటన్ ప్రభుత్వ పెద్దల పదవులకు ఎసరుపెడుతోంది. ఇప్పటికే ఒకరిని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్వయంగా తొలగించగా పశ్చాత్తాపంతో మరొకరు రాజీనామా చేశారు. తాజాగా సోమవారం స్టార్మర్ ప్రభుత్వంలో కమ్యూనికేషన్స్ విభాగ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టిమ్ అలాన్ తన పదవికి రాజీనామాచేశారు. పదవి చేపట్టిన కేవలం 5 నెలలకే ఆయన తప్పుకోవాల్సి రావడం గమనార్హం. ''స్టార్మర్ ప్రభుత్వంలో కొత్త బృందం కొలువు తీరేందుకు మార్గం సుగమం చేస్తూ నేను వైదొలగుతున్నా. ప్రధానికి, ఆయన కొత్త బృందానికి విజయం చేకూరాలని కోరుకుంటున్నా''అని టిమ్ వ్యాఖ్యానించారు. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంతో సంబంధమున్న అమెరికాలో బ్రిటన్ రాయబారి పీటర్ మాండెల్సన్‌ను గతేడాది సెప్టెంబర్‌లో స్టార్మర్ తొలగించారు. మాండెల్సన్‌ను ఆ పదవికి ఎంపిక చేయడానికి తన సిఫార్సే కారణమని చింతిస్తూ స్టార్మర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మోర్గాన్ మెక్ స్వీనీ ఆదివారం రాజీనామా చేశారు. గోర్డన్ బ్రౌన్ ప్రధానిగా ఉన్న కాలంలో వాణిజ్య శాఖ మంత్రి హోదాలో మాండెల్సన్ బ్రిటన్ విధానపర నిర్ణయాలను ఎప్‌స్టీన్‌కు రహస్యంగా ముందే చేరవేసినట్లు ఎప్‌స్టీన్ పత్రాల్లో తాజాగా తేలింది. దీంతో కీలక పదవుల్లో సమర్థుల నియామకంలో ప్రధానిగా స్టార్మర్ ఘోరంగా విఫలమయ్యారని విపక్ష పార్టీలతో పాటు సొంత లేబర్ పార్టీ ఎంపీలు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయనకు ప్రధానిగా కొనసాగే అర్హత లేదని తిట్టిపోస్తున్నారు.

స్టార్మర్ రాజీనామా చేయాల్సిందే

ప్రధానిగా స్టార్మర్ తప్పుకోవాలని స్కాట్లాండ్‌లో లేబర్ పార్టీ నేత అనాస్ సర్వార్ డిమాండ్‌చేశారు. చీఫ్ ఆఫ్ స్టాఫ్ వంటి కీలక పదవుల నుంచే రాజీనామాల పర్వం మొదలవడంతో స్టార్మర్ వెంటనే నష్ట నివారణ చర్యలు ఆరంభించి కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. మాండెల్సన్ నియామకంలో తప్పిదం చేశానని స్టార్మర్ క్షమాపణలు చెప్పినా విమర్శలు ఆగడం లేదు. ఈ వారం జరగబోయే పార్లమెంటరీ లేబర్ పార్టీ సమావేశంలో స్టార్మర్ మరోసారి తన నాయకత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అయితే సోమవారం లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ ప్రాంతానికి చేరుకున్న కేబినెట్ మంత్రులు పలువురు స్టార్మర్‌కు మద్దతు పలకడం విశేషం.

''ఆయన పదవిలోకి వచ్చి 18 నెలలే అవుతోంది. ఆయన పనిని సవ్యంగా చేయనిస్తాం''అని విద్యా శాఖ మంత్రి బ్రిగ్జెడ్ ఫిలిప్సన్, హోం మంత్రి షబానా మహ్మూద్ అన్నారు.

తొలిసారిగా స్పందించిన రాజకుటుంబం

ఎప్‌స్టీన్ వ్యవహారానికి యూకే అధికార వర్గాలతో సంబంధం ఉండటంపై బ్రిటన్ రాజకుటుంబం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు యువరాజు ప్రిన్స్ విలియం, ఆయన భార్య కేట్ మిడిల్టన్ నివసించే అధికారిక రాజప్రాసాదం 'కెన్సింగ్టన్ ప్యాలెస్'సోమవారం ఒక ప్రకటన విడుదలచేసింది.''యువరాజు కుటుంబం తాజా పరిణామాలపై చాలా మనస్తాపం చెందింది. అధికార వర్గాలతో సంబంధాలు ఒక్కొక్కటిగా బయటపడటం విస్మయం కల్గిస్తోంది. ఈ పరిణామాలను విలియం, కేట్ గమనిస్తున్నారు. ముఖ్యంగా ఈ ఉదంతంలో ఆనాడు బాధితులుగా మిగిలిపోయిన అమాయక టీనేజర్లు, యువతుల పోరాటానికి రాజకుటుంబం తమ సంఘీభావం వ్యక్తం చేస్తోంది''అని కెన్సింగ్టన్ ప్యాలెస్ పేర్కొంది. అయితే రాజు చార్లెస్–3కు తమ్ముడు, ఇటీవల రాజకుటుంబ హోదా వదలుకున్న ఆండ్రూపై విచారణ జరిపే విషయాన్ని ప్రకటనలో ఎక్కడా ప్రస్తావించలేదు. ఎప్‌స్టీన్‌కు చెందిన ద్వీపాల్లోని విలాసవంత ఎస్టేట్‌లకు పలుమార్లు ఆండ్రూ వెళ్లినట్లు వెల్లడైన విషయం విదితమే.

కెనడాలో కర్నాటక వాసి కాల్చివేత

ఒట్టావా/బెంగళూరు: కెనడాలోని టొరంటో నగరంలో ఉన్న షాపింగ్ సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో కర్నాటక వాసి (37) ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని బ్రాంప్టన్‌లో ఉండే చందన్ కుమార్ రాజా నందకుమార్‌గా కెనడా పోలీసులు గుర్తించారు. వుడ్‌బైన్ షాపింగ్ సెంటర్ వాహన పార్కింగ్ ప్రాంతంలో శనివారం సాయంత్రం 3.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. కాల్పుల గురించి సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నామని పోలీసులు తెలిపారు. బుల్లెట్ గాయాలతో పడి ఉన్న వ్యక్తిని వెంటనే ఆస్పత్రికి తరలించామని, చికిత్స పొందుతూ అతడు చనిపోయాడన్నారు. చందన్‌కుమార్ వాహనం కిటికీల అద్దాలకు బుల్లెట్ రంధ్రాలు పడగా, డ్రైవర్ వైపు ఉన్న కిటికీ అద్దం పూర్తిగా ధ్వంసమైంది. కాగా, కాల్పులకు పాల్పడిన వ్యక్తుల వివరాలు తెలియనప్పటికీ, దీనిని లక్షిత ఘటనగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటికి రావాలని చెబుతున్నా... వినలేదు:తల్లిదండ్రులు

చందన్ మరణవార్త విని కర్నాటక రాజధాని బెంగళూరులో శివారు నెలమంగళలో ఉంటున్న అతడి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. ఇలాంటిది జరుగుతుందని తాము కలలో సైతం ఊహించలేదన్నారు. దాదాపు ఏడేళ్ల నుంచి కెనడాలో ఉంటున్న చందన్‌ను ఇంటికి రావాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని, కానీ వినిపించుకోలేదని తండ్రి నందన్ కుమార్ వాపోయారు. అంతిమ సంస్కారం జరిపేందుకు మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు సాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని ఆయన కోరారు. చందన్ టొరంటోలో ఇటీవలే కన్నడ అసోసియేషన్‌ను స్థాపించారని, బహుశా ఇదే కక్షతో అతడిని బలి తీసుకుని ఉంటారని తల్లి అనుమానం వ్యక్తం చేశారు.

అరాచకం సృష్టించాలని చూస్తే ఊరుకోం

కోర్టు హాల్‌లో లాయర్‌పై దాడి ఘటన.. సీజేఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: కోర్టు హాలులో అందరూ చూస్తుండగానే తనపై దాడి జరిగిందంటూ ఓ లాయర్ చేసిన ఆరోపణపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్‌సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. అరాచకం సృష్టించాలని చూసే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి ముందుగా ఈ అంశాన్ని తీసుకెళ్లాలని, అక్కడ తీసుకున్న చర్యలను తమకు తెలపాలని బాధిత లాయర్‌కు సూచించారు. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఎదుట సోమవారం బాధిత లాయర్ హాజరయ్యారు. తన కేసుపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరిన ఆయన.. 'ఈ నెల 7వ తేదీన తీస్ హజారీ కోర్టులో అదనపు జిల్లా జడ్జి హర్జిత్ సింగ్ పాల్ ఎదుట ఓ కేసును వాదిస్తున్నాను. అవతలి పక్షం లాయర్, మరికొందరితో కలిసి నాపై దాడి చేశారు. జడ్జి, కోర్టు హాల్లో అందరూ చూస్తుండగానే నన్ను కొట్టారు'అంటూ తన గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన సీజేఐ.. 'గూండారాజ్‌ను మేం ఏమాత్రం ఆమోదించబోం. అలాంటిది జరిగితే చట్టం విఫలమైనట్లుగానే భావించాల్సి వస్తుంది'అని వ్యాఖ్యానించారు. 'ఈ నెల 7వ తేదీన చోటుచేసుకున్న ఈ ఘటన విషయాన్ని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారా అని ఆ లాయర్‌ను ప్రశ్నించారు. ముందుగా ఢిల్లీ హైకోర్టు సీజేకి ఈ అంశంపై లేఖ రాయండి. ఆ కోర్టు పరిపాలన పరమైన చర్య తీసుకోవాల్సి ఉంది. ఏం జరిగిందో నాకూ సమాచారమివ్వండి'అని సూచించారు.

డిజిటల్ దోపిడీ రూ.54 వేల కోట్లు!

నిరోధానికి నిబంధనలు తేవాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాల ద్వారా ప్రజల నుంచి ఏకంగా రూ.54వేల కోట్లను కొట్టేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సాధారణ మోసం కాదు, అత్యంత దారుణమైన దోపిడీ అంటూ అభివర్ణించింది. ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలీకమ్యూనికేషన్స్ శాఖ వంటి సంబంధీకులతో సంప్రదింపులు జరిపి ఈ దారుణాలను అడ్డుకునేందుకు తగు నిబంధనలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. డిజిటల్ నేరగాళ్లు దోచుకున్న మొత్తం చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువేనని వ్యాఖ్యానించింది. నేరగాళ్లతో బ్యాంకు అధికారులు కుమ్మక్కవడం వల్ల లేదా వారి నిర్లక్ష్యం వల్లే ఇలాంటి నేరాలు చోటుచేసుకున్నట్లుగా పేర్కొంది. ఇటువంటి ఘటనలపై ఆర్‌బీఐ, సంబంధిత బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందజేసే విషయంలో అమికస్ క్యూరీ ఇచ్చే సూచనలను పరిశీలించాలంటూ డిసెంబర్‌లో జరిగిన విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం ఆదేశించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టింది. ఆర్‌బీఐ అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ విధానాలను, టెలీకమ్యూనికేషన్స్ శాఖ తీసుకున్న నిర్ణయాలను పరిగణనలోకి తీసుకోవాలంటూ హోం శాఖను ఆదేశించింది. డిజిటల్ మోసాలను సమర్థవంతంగా నివారించేందుకు తగు నిబంధనలను సిద్ధం చేసి నాలుగు వారాల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించింది. తమ ఆదేశాల అమలు పురోగతిపై అప్పటికల్లా నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది.

వాంగ్‌చుక్ చాలా ఆరోగ్యంగా ఉన్నారు

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో చాలా ఆరోగ్యంగా ఉన్నారని కేంద్రం సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. జోధ్‌పూర్ ఎయిమ్స్ వైద్యులు ఆయనకు ఉత్తమ వైద్యచికిత్సలను అందిస్తున్నారని వెల్లడించింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనానికి కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ ఈ విషయం తెలిపారు. క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, వాంగ్‌చుక్ నిర్బంధంపై సమీక్ష చేపట్టాల్సిందిగా తాము కోరిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ఏమైనా పురోగతి ఉందా అని ప్రశ్నించగా లేదని నటరాజ్ బదులిచ్చారు. ఆరోగ్యం మరింతగా దిగజారుతున్నందున వాంగ్‌చుక్ విడుదల చేయాలని ఆయన తరఫు లాయర్ కోరగా..అందుకే తాము కూడా కేంద్రానికి ఈ విషయం సూచించినట్లు ధర్మాసనం వివరించింది. వాంగ్‌చుక్ ఆరోగ్యం బాగోలేదన్న విషయం డాక్టర్లు అందజేసిన నివేదికలో కూడా ఉందని తెలిపింది. వాంగ్‌చుక్‌కు ఎయిమ్స్‌లో అత్యుత్తమ వైద్యం అందుతోందని, ఆయన బాగానే ఉన్నారని నటరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కూడా విచారణ కొనసాగించాలని ఆయన కోరారు. అయితే, వాంగ్‌చుక్ నిర్బంధం చట్టవ్యతిరేకమంటూ ఆయన భార్య గీతాంజలి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. ఆ తర్వాత విచారణ వాయిదా కోరేందుకు అవకాశం లేదని నటరాజ్‌కు స్పష్టం చేసింది.

మదురై కొండపై జంతుబలి నిషేధం సబబే: సుప్రీం

న్యూఢిల్లీ: తమిళనాడులోని మదురైలో ఉన్న తిరుపరన్‌కుండ్రం కొండపై ముస్లింల ప్రార్థనలకు పరిమిత హక్కులు కల్పించడంతోపాటు జంతుబలిని నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు సమర్థించింది. గతేడాది అక్టోబర్ 25వ తేదీన వెలువరించిన ఈ ఆదేశాలు సమంజసంగా ఉన్నాయని, తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు మత స్వేచ్ఛకు విరుద్ధమంటూ వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. ఆ ప్రాంతంలో ఎప్పుడూ శాంతిభద్రతల సమస్య తలెత్త లేదన్నారు. అయితే, శాంతిభద్రతల సమస్యే లేకుంటే అక్కడ శాంతి కమిటీ సమావేశం జరిపే అవసరం వచ్చేది కాదు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బక్రీద్, రంజాన్ పండుగల వేళ నెల్లితోపు ప్రాంతంలో ప్రార్థనలు, సమావేశాలకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అయితే, ఈ ప్రార్థనలు సమీపంలోని సుబ్రమణ్య స్వామి ఆలయానికి సంబంధించిన సంప్రదాయక పాదముద్రలకు, ఆచారాలకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదని షరతు విధించింది. జంతు బలులు, వంట చేయడం, మాంసాహారాన్ని తీసుకెళ్లడం, వడ్డించడం వంటి వాటిని సివిల్ కోర్టు తుది నిర్ణయం తీసుకునే వరకు అక్కడ అనుమతించబోమని హైకోర్టు తెలిపింది.

ఉన్నావ్ రేప్ ఘటన.. సెంగార్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం నో

న్యూఢిల్లీ: ఉన్నావ్ రేప్ కేసు బాధితురాలి తండ్రి లాకప్ డెత్ కేసులో ఆరోపణలెదుర్కొంటున్న బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అదేవిధంగా, ఈ అంశంపై ప్రాథాన్యతా క్రమంలో విచారణ చేపట్టి, మూడు నెలల్లోగా ఏదో ఒకటి తేల్చాలని ఢిల్లీ హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఢిల్లీ హైకోర్టు జనవరిలో వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ సెంగార్ వేసిన పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ముందుకు రాగా పైవిధంగా ఆదేశాలిచ్చింది. ట్రయల్ కోర్టు తీర్పుపై బాధితురాలి కుటుంబం ఏదైనా అప్పీల్ వేసి ఉంటే, దాన్ని కూడా సెంగార్ పిటిషన్‌తో కలిపి విచారించాలని కూడా స్పష్టం చేసింది. అదే సమయంలో, ఈ కేసు గురించి మీడియా ఎదుట సెంగార్ తరఫు లాయర్ చేస్తున్న ప్రకటనలపై సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. కోర్టు వెలుపల జరిగే సమాంతర విచారణలను తాము సహించబోమని హెచ్చరించారు. సెంగార్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఈ నెల 11వ తేదీన విచారించనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

భాగవత్ విందులో అద్నాన్ సమీ

ఆరెస్సెస్ జాతి వ్యతిరేకి: కాంగ్రెస్

ముంబై: గాయకుడు అద్నాన్ సమీతో కలిసి భోజనం చేయడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ దేశ వ్యతిరేక చర్యకు పాల్పడ్డారంటూ కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకల్లో భాగంగా ఆదివారం ముంబైలో సల్మాన్ ఖాన్, విక్కీ కౌశల్, రవీనా టాండన్, శిల్పా శెట్టి తదితరులకు భాగవత్ విందు ఇచ్చారు. ఆయనతో కలిసి భోజనం చేస్తున్న ఫొటోను అద్నాన్ సమీ పోస్ట్ చేశారు. ''భాగవత్ జీ అద్భుతమైన వ్యక్తి. నా అపోహలు, అపార్థాలను చక్కగా నివృత్తి చేశారు'' అంటూ పొగడ్తలు కురిపించారు. దీనిపై కాంగ్రెస్, శివసేన(యూబీటీ)లు తీవ్రంగా స్పందించాయి. 'అద్నాన్ సమీ తండ్రి అర్షద్ సమీ ఖాన్ పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ పైలట్. 1965 యుద్ధంలో ఆయన మన పఠాన్‌కోట్ వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతి వ్యతిరేకి' అని కాంగ్రెస్ ఎక్స్‌లో మండిపడింది. ఆర్థిక నేరారోపణలతో లుకౌట్ నోటీసు జారీ అయిన నటునికి విందు ఇచ్చిన భాగవత్ ఏం సందేశం ఇస్తున్నారని శివసేన (యూబీటీ) ప్రశ్నించింది.

జిల్లాపరిషత్ చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారతదేశ అభివృద్ధిలో గ్రామాల పాత్ర అత్యంత కీలకం. గ్రామీణ అభివృద్ధి, సమాజ వికాస సాధనలో స్థానిక ప్రభుత్వాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ హోదా కల్పించారు. అందువల్ల దీన్ని 'పంచాయతీరాజ్ చట్టం' అని కూడా అంటారు.

73వ రాజ్యాంగ సవరణ చట్టం

స్థానిక ప్రభుత్వాల బలోపేతం ద్వారా గ్రామీణ వికాసాన్ని సాధించడానికి స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని 1986లో నియమించిన ఎల్.ఎం.సింఘ్వి కమిటీ సిఫార్సు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1989లో 64వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందగా రాజ్యసభలో తిరస్కరించారు. అనంతరం పి.వి. నరసింహారావు ప్రభుత్వం 1991లో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. పార్లమెంట్ దీన్ని 1992లో ఆమోదించగా, రాష్ట్రపతి 1993 ఏప్రిల్ 20న ఆమోదించారు. ఇది 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం గురించి ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అధికరణలు 243(ఎ) నుంచి 243(ఒ) వరకు దీని గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా 9వ భాగంలో చేర్చారు. ఈ చట్టంలో చేర్చిన మొత్తం అంశాలు 29.

243వ అధికరణ నిర్వచనాలు

జిల్లా, గ్రామసభ, మాధ్యమిక స్థాయి (మండల పరిషత్), పంచాయతీ ఏరియా, జనాభా మొదలైన అంశాలపై గవర్నర్ నోటిఫికేషన్ ద్వారా నిర్వచనాలు తెలియజేస్తారు.

అధికరణ 243(ఎ) – గ్రామసభ: పంచాయతీ రాజ్ చట్టం ద్వారా గ్రామసభకు అత్యంత ప్రాముఖ్యం కల్పించారు. దీంట్లో గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. గ్రామసభ కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. సమావేశాల కోరం 1/10వ వంతు. గ్రామ సర్పంచ్ ఈ సమావేశాలను ఏర్పాటు చేసి, నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీ దీనికి సమష్టి బాధ్యత వహిస్తుంది. ఈ సమావేశాల్లో గ్రామ పంచాయతీ ఎజెండాను రూపొందిస్తారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి దీన్ని ప్రాతిపదికగా భావించవచ్చు.

అధికరణ 243(బి)–పంచాయతీల వ్యవస్థాపన : ప్రతి రాష్ట్రంలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. 20 లక్షల లోపు జనాభా ఉన్న రాష్ట్రాల్లో మాధ్యమిక వ్యవస్థ తప్పనిసరి కాదు.

1. **గ్రామ పంచాయతీ:** 500ల మందికి మించి జనాభా ఉన్న గ్రామాన్ని గ్రామ పంచాయతీగా గుర్తించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి సంఖ్య సుమారుగా 21,590. తెలంగాణలో గ్రామాల సంఖ్య సుమారుగా 8872. వార్షిక ఆదాయం 60 వేలు దాటితే మేజర్ పంచాయతీగా, అంత కంటే తక్కువగా ఉంటే మైనర్ పంచాయతీగా పేర్కొంటారు.
2. **మండల పరిషత్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986లో ప్రవేశపెట్టారు. సుమారుగా 40 వేల జనాభాకు 20 నుంచి 30 గ్రామాలను కలుపుతూ మండలాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం మండలాల సంఖ్య 1104. ప్రస్తుతం వీటి సంఖ్య 1128. వీటిలో తెలంగాణలో 454 మండలాలున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకారం మండల పరిషత్‌ల సంఖ్య 1096. ఎంపీటీసీల సంఖ్య 16,589.
3. **జిల్లా పరిషత్:** పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలు,వాటికి 13 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. తెలంగాణలో జిల్లాలు 10, జిల్లా పరిషత్‌లు 9 (హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు).

అధికరణ 243 (సి) – పంచాయతీల నిర్మాణం : రాష్ట్ర శాసన సభ నిర్ణయించిన చట్టాల మేరకు పంచాయతీల నిర్మాణం ఉంటుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌లో ప్రధానంగా ఆరు విభాగాలుంటాయి.

జిల్లా పరిషత్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1) ప్రత్యక్షంగా ఎన్నికైన జడ్పీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యులు

వీరితోపాటు జిల్లా గ్రంథాలయ, సహకార బ్యాంక్, డెయిరీ, మార్కెట్ కమిటీ చైర్మన్ శాశ్వత ఆహ్వానిత సభ్యులుగా కొనసాగుతారు.

జిల్లా పరిషత్ చైర్మన్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

జిల్లా మహాసభ: జిల్లా పరిషత్ మండల పరిషత్‌కు మధ్య వారధిగా పనిచేస్తుంది. జడ్పీటీసీ, ఎంపీపీలు సభ్యులుగా కొనసాగుతారు.

స్థాయీ సంఘం: జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘాల పాత్ర కీలకమైంది. అందువల్ల వీటిని 'స్థానిక ప్రభుత్వాల కళ్లు, చెవులు'గా పేర్కొంటారు. ప్రతి జిల్లా పరిషత్‌లో ఏడు స్థాయీ సంఘాలు ఉంటాయి.

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో): సీఈవోగా సీనియర్ గ్రూప్–1 అధికారిని నియమిస్తారు. ఈయన జిల్లా సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

కలెక్టర్: జిల్లా పరిపాలనలో ఈయనే ముఖ్యులు. జిల్లాకు ఈయన ప్రధాన న్యాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎన్నికలు, శాంతి భద్రతలు, పౌరసరఫరా, కరవు కాటకాల అధికారిగా వ్యవహరిస్తారు.

మండల పరిషత్

మండల పరిషత్‌లో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

మండల పరిషత్ కౌన్సిల్: దీంట్లో మూడు రకాలు సభ్యులుంటారు.

1) పార్టీ ప్రాతిపదికన ప్రత్యక్షంగా ఎన్నికైన ఎంపీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యుడు

మండల పరిషత్ ప్రెసిడెంట్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మండల మహాసభ: మండల పరిషత్‌కు గ్రామ పంచాయతీకి మధ్య వారధిగా పనిచేస్తుంది. దీంట్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ్యులుగా ఉంటారు. మండల పరిషత్ ప్రెసిడెంట్ దీని సమావేశాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తారు.

ఎంపీడీవో: గ్రూప్–1 అధికారిని ఎంపీడీవోగా నియమిస్తారు. ఈయన మండల సమాచారాన్ని జిల్లా పరిషత్‌కు అందజేస్తారు.

గ్రామ పంచాయతీ

గ్రామ పంచాయతీలో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

పంచాయతీ బోర్డు: వార్డు మెంబర్లు సభ్యులుగా ఉంటారు. వీరి సంఖ్య కనిష్ఠంగా 5, గరిష్ఠంగా 21 ఉండాలి. పంచాయతీ బోర్డు కనీసం నెలకు ఒకసారి సమావేశం కావాలి.

సర్పంచ్: గ్రామ ఓటర్లు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. గ్రామ ప్రథమ పౌరుడు ఈయనే. ఈయనను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించే అవకాశం లేదు.

గ్రామసభ: గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి.

పంచాయతీ కార్యదర్శి: ఈయన ప్రభుత్వ ఉద్యోగి. గ్రామ పంచాయతీ సమాచారాన్ని మండల పరిషత్‌కు అందజేస్తారు.

అధికరణ 243 (డి) – రిజర్వేషన్లు: ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన, మహిళలకు మూడో వంతు సీట్లు కేటాయించారు. బీసీ రిజర్వేషన్లను రాష్ట్రాలే నిర్ణయిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలకు 18.25 శాతం, ఎస్టీలకు 8.25 శాతం, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మహిళా రిజర్వేషన్‌ను ఇటీవల కొన్ని రాష్ట్రాలు 50 శాతానికి పెంచాయి. దీన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం బీహార్.

అధికరణ 243 (ఇ) – పంచాయతీల పదవీ కాలం: స్థానిక ప్రభుత్వాల సాధారణ కాల పరిమితి అయిదేళ్లు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే రద్దుచేయవచ్చు. ఒకవేళ ముందుగా రద్దు చేస్తే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి.

అధికరణ 243 (ఎఫ్) – పంచాయతీ సభ్యుల అనర్హతలు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా ఈ అనర్హతలను నిర్ణయిస్తుంది. 21ఏళ్ల లోపు ఉన్న వారు పోటీ చేసేందుకు అనర్హులు. 1995 తర్వాత ఇద్దరికి మించి సంతానం ఉన్నవారు అనర్హులు.

అధికరణ 243 (జి) – పంచాయతీల విధులు, అధికారాలు: పంచాయతీలకు 29 అంశాలకు సంబంధించిన విధులు, అధికారాలను కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో చేర్చారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు బదలాయించాలి.

ఉదాహరణలు:

1) వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2) భూ సంస్కరణలు, భూ పరిరక్షణ
3) తాగునీరు, సాగునీటి సరఫరా
4) పశు సంరక్షణ, కోళ్ల పరిశ్రమ
5) చేపలు
6) వనసంరక్షణ, సామాజిక అడవులు

అధికరణ 243 (హెచ్)–పంచాయతీల ఆదాయ వనరులు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా పంచాయతీలకు కొన్ని పన్నులను విధించే అధికారం కల్పిస్తుంది. కొన్ని పన్నుల్లో వాటా, సహాయ నిధులను కూడా ఇస్తుంది.

అధికరణ 243 (ఐ) – రాష్ట్ర ఆర్థిక సంఘం: రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని గవర్నర్ ఏర్పాటు చేస్తారు. దీని పదవీ కాలం 5 ఏళ్లు. ఇందులో చైర్మన్, సభ్యులు ఉంటారు. వీరిని నియమించే, తొలగించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఆర్థిక సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. దీని చైర్మన్ లక్ష్మణస్వామి. రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులు, పన్నుల విభజన, ఇతర సహాయ గ్రాంట్ల గురించి సిఫార్సులు చేస్తుంది. సంబంధిత నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తుంది. గవర్నర్ శాసనసభకు అందజేస్తారు.

అధికరణ 243 (జె) – పంచాయతీ ఖాతాల ఆడిటింగ్: పంచాయతీల ఆడింటింగ్ నిర్వహణకు శాసన చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో దీన్ని ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ విధులను రాష్ట్ర ఆడిట్ సంచాలకులు నిర్వహిస్తున్నారు.

అధికరణ 243 (కె) – రాష్ట్ర ఎన్నికల కమిషన్: పంచాయతీలకు సకాలంలో సక్రమంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపొందించడం తదితర విధులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఎన్నికల కమిషనర్‌ను గవర్నర్ నియమిస్తారు. ఈయన పదవీ కాలం అయిదేళ్లు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. మొదటి కమిషనర్ కాశీ పాండ్యన్. 2014లో తెలంగాణకు ప్రత్యేక ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీని కమిషనర్ నాగిరెడ్డి.

అధికరణ 243(ఎల్) – కేంద్ర పాలిత ప్రాంతాలకు అనువర్తన: పంచాయతీరాజ్ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా వర్తింపజేయవచ్చు. శాసనసభ ఉంటే శాసనసభ ప్రత్యేక తీర్మానం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. శాసనసభ లేకుంటే రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా వర్తింపజేయవచ్చు.

అధికరణ 243 (ఎం) – మినహాయింపులు: పంచాయతీరాజ్ చట్టం నుంచి కొన్ని ప్రాంతాలకు మినహాయింపులు ఇచ్చారు. ముఖ్యంగా జమ్ము–కశ్మీర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, షెడ్యూల్ ప్రాంతాలు, మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి మినహాయింపులు ఉన్నాయి.

అధికరణ 243 (ఎన్) – పాత చట్టాల కొనసాగింపు: ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది వరకు పాత చట్టాలు అమల్లో ఉండవచ్చు. అంతకు ముందు రాష్ట్ర శాసనసభ 73వ సవరణ చట్టం మౌలిక స్వరూపానికి భంగం వాటిల్లకుండా సొంత చట్టాలను రూపొందించుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన చట్టం 1994 నుంచి అమల్లోకి వచ్చింది.

అధికరణ 243 (ఒ)– న్యాయస్థానాల జోక్యం: పంచాయతీల్లో నియోజకవర్గాల ఏర్పాటు, వాటిలో సీట్ల కేటాయింపు గురించి న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. వీటి వివాదాల పరిష్కారానికి శాసనసభ తీర్మానం ద్వారా లీగల్ అథారిటీలను ఏర్పాటు చేయాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **జిల్లాపరిషత్ చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?**
   ఎ) ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓటర్లు
   బి) మండల పరిషత్ అధ్యక్షులు
   సి) జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు
   డి) జిల్లాలోని సర్పంచ్‌లు
2. **పంచాయతీరాజ్ వ్యవస్థను మొదటగా1959 అక్టోబరులో ఏ రాష్ట్రం అమలు చేసింది?**
   ఎ) రాజస్థాన్
   బి) తమిళనాడు
   సి) కర్ణాటక డి) కేరళ
3. **న్యాయ పంచాయతీల ఉద్దేశం ఏమిటి?**
   ఎ) గ్రామ పంచాయతీలను నిర్వహించడం
   బి) పంచాయతీ ప్రెసిడెంట్ ఇచ్చిన తీర్పులను కొట్టేయడం
   సి) హైకోర్టు అప్పీలుకు అనుమతి ఇవ్వడం
   డి) గ్రామీణ ప్రజలకు త్వరగా ఎక్కువ ఖర్చు లేకుండా న్యాయాన్ని అందించడం
4. **73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలు కింది వాటిలో ఏ రాష్ట్రాలకు వర్తించవు?**
   ఎ) గోవా, జమ్ము–కశ్మీర్, పాండిచ్చేరి
   బి) ఢిల్లీ, గోవా, మిజోరాం, మేఘాలయ
   సి) మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం
   డి) సిక్కిం, అసోం, మిజోరాం
5. **ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏ ముఖ్యమంత్రి కాలంలో ప్రవేశపెట్టారు?**
   ఎ) నీలం సంజీవరెడ్డి
   బి) దామోదరం సంజీవయ్య
   సి) కాసు బ్రహ్మానందరెడ్డి
   డి) పి.వి. నరసింహారావు

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ.

సంవాహన ప్రక్రియ అధికంగా జరిగే మండలం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

వాతావరణ పీడనం - పీడన మేఖలలు

మన చుట్టూ ఉన్న గాలిలో చాలా వాయు పరమాణువులు ఉంటాయి. ఆ పరమాణువులు ఒకదానిపై ఒకటి ఒత్తిడిని కలిగిస్తాయి. లేదా వాటి దారిలోకి వచ్చిన వాటిపై ఒత్తిడి కలిగిస్తాయి.

ఏ వస్తువు పై అయినా చూపే ఒత్తిడి ప్రభావాన్ని 'వాయు పీడనం' అంటారు. గాలి పై నుంచే కాకుండా అన్ని వైపుల నుంచి పీడనాన్ని కలిగిస్తుంది. గాలికి బరువు ఉంటుంది అని కనుగొన్న మొదటి శాస్త్రవేత్త గెలీలియో.

- వాయు పరమాణువులు వేడెక్కినప్పుడు వాటికి ఎక్కువ శక్తి లభించి వేగంగా కదులుతాయి. దీనివల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఎక్కువ పరమాణువులు వాతావరణంలోని పైపొరలోకి వెళ్లినప్పుడు భూమికి దగ్గరగా వాటి సంఖ్య తగ్గుతుంది. అదేవిధంగా పీడనం తగ్గుతుంది.
- గాలి వేడెక్కినప్పుడు పీడనం తగ్గి, గాలి చల్లబడినప్పుడు పీడనం పెరుగుతుంది. గాలి, పీడనం విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి.
- వేడెక్కిన గాలి పైకి వెళుతున్న కొద్దీ భూమి ఉపరితలం నుంచి పొందిన శక్తిని వేడిమి రూపంలో కోల్పోవడం మొదలు పెడుతుంది. శక్తి తగ్గినప్పుడు పరమాణువుల వేగం తగ్గి, మందకొడిగా తయారై దగ్గర దగ్గరవుతాయి. గాలి చల్లబడి గట్టిగా అవుతుంది. ఇలా చిక్కబడిన గాలి భూమ్యాకర్షణ శక్తి వల్ల ఉపరితలం దగ్గరకు వస్తుంది. చల్లటి గాలి కిందికి దిగిన చోట వాయుపీడనం పెరుగుతుంది.
- భూమిలో ఒక భాగం వేడెక్కి పీడనం తగ్గిందంటే.. అక్కడ తక్కువ పరమాణువులు, ఎక్కువ ఖాళీ ఉందని అర్థం. అధిక పీడనం ఉన్న ప్రాంతాల నుంచి గాలి ఈ ఖాళీ ప్రదేశాల వైపు కదులుతుంది. అందువల్లే గాలి ఎక్కువ పీడనం ఉన్న ప్రాంతాల నుంచి తక్కువ పీడనం ఉన్న ప్రాంతాలకు వీస్తుంది.

వాతావరణ పీడనం

ఏదైనా ఒక ప్రదేశంపై ఉన్న వాయువుల పొర బరువును ఆ ప్రదేశానికి సంబంధించిన 'వాతావరణ పీడనం' అంటారు. వాతావరణ పీడనాన్ని కొలిచే సాధనం భారమితి. కాబట్టి దీన్ని భారమితి పీడనం అంటారు. భారమితిలో పాదరస మట్టం అకస్మాత్తుగా తగ్గడం తుపాను రాకను తెలుపుతుంది. అదేవిధంగా భారమితిలో పాదరస మట్టం పెరగడం ప్రశాంత వాతావరణాన్ని తెలుపుతుంది.

సముద్రమట్టం వద్ద సామాన్య (లేదా) ప్రామాణిక వాతావరణ పీడనం ఉన్నప్పుడు పాదరస మట్టం ఎత్తు 760 మి.మీ. లేదా 29 అంగుళాలుగా ఉంటుంది. భారమితిలో పాదరస మట్టం 760 మి.మీ. ఉన్నప్పుడు వాతావరణ పీడనం 1013.2 మిల్లీబార్లుగా ఉంటుంది. పాదరస మట్టం ఎత్తు 3 మి.మీ. అయితే అది 4 మిల్లీబార్ల వాతావరణ పీడనానికి సమానం.



వాతావరణ పీడనాన్ని ప్రభావితం చేసే అంశాలు:

ఎత్తు

భూమి ఆకర్షణ శక్తి వల్ల వాతావరణం కింది పొరలు దట్టంగా ఉండి అధిక పీడనం కలిగిస్తాయి. కాబట్టి భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లే కొద్దీ పీడనం తగ్గుతుంది. ప్రతి 10 మీటర్ల ఎత్తుకు ఒక మిల్లీబారు చొప్పున (లేదా) 300 మీటర్లకు 34 మిల్లీబార్ల పీడనం తగ్గుతుంది.

ఉష్ణోగ్రత

వేడెక్కిన గాలి వ్యాకోచించి తేలికగా ఉంటుంది. చల్లటి గాలి సంకోచించి ఎక్కువ బరువుగా ఉంటుంది. ఉష్ణోగ్రత పెరిగితే పీడనం తగ్గుతుంది. ఉష్ణోగ్రత తగ్గితే పీడనం పెరుగుతుంది. ఉష్ణోగ్రత, పీడనం విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి.

నీటి ఆవిరి

పొడి గాలి కంటే నీటి ఆవిరి తేలికగా ఉంటుంది. కాబట్టి వాతావరణంలో నీటి ఆవిరి పరిమాణం ఎక్కువైతే పీడనం తగ్గుతుంది.

పీడన మేఖలలు

క్షితిజ సమాంతరంగా భూమి ఉపరితలంపై వివిధ పీడన మేఖలలు ఏర్పడ్డాయి.అధిక,అల్పపీడన మేఖలలు ఒకదాని తర్వాత ఒకటిగా ఏర్పడ్డాయి.

- భూగోళంపై మొత్తం 7 పీడన మేఖలలు ఉన్నాయి.

భూమధ్యరేఖ అల్పపీడన మేఖల

ఇది 10° ఉత్తర అక్షాంశం నుంచి 10° దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది. ఇది అధిక ఉష్ణోగ్రతల వల్ల ఏర్పడింది. దీన్ని నిర్వాత మండలం, డోల్‌డ్రమ్, ప్రశాంత మండలం అని కూడా అంటారు. ఈ మేఖలలో సూర్యకిరణాలు నిట్టనిలువుగా ప్రసరించడం వల్ల రోజూ సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. ఈ విధమైన వర్షపాతాన్ని 'సంవహన వర్షపాతం' అంటారు.

ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల

ఇది $23\ 1/2^\circ$ ఉత్తరార్ధగోళం నుంచి 35° దక్షిణార్ధ గోళంలో విస్తరించి ఉంది. భూమధ్యరేఖ నుంచి పైకి తేలి వచ్చే వాయువులు సంకోచించి ఇది ఏర్పడుతుంది. ఈ మండలాన్ని 'నిమజ్జిత మండలం' అంటారు.

ఉప ధ్రువ అల్ప పీడన మేఖల (లేదా) సమశీతోష్ణ అల్పపీడన మేఖల

ఈ మేఖలలు 45°–$66\frac{1}{2}^\circ$ అక్షాంశాల మధ్య, పశ్చిమ పవనాలు, ధ్రువ పవనాలు మధ్య భాగంలో ఏర్పడతాయి. ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల నుంచి వచ్చే వేడి గాలులు ధ్రువ అధిక పీడన మేఖల నుంచి వీచే చల్ల గాలులు అవిసరణం చెందడం వల్ల అల్పపీడన మేఖల ఏర్పడుతుంది.

ధ్రువ అధిక పీడన మేఖల

ఇది 75° నుంచి 90° అక్షాంశాల మధ్య, అతిశీతల ప్రాంతం, అధిక గురుత్వాకర్షణ బలాలు పనిచేయడం వల్ల ధ్రువ ప్రాంతాల్లో అధిక పీడన మేఖలలు ఏర్పడతాయి. ఈ ప్రాంతంలో సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించడం వల్ల అధిక పీడనాలు ఏర్పడతాయి.

పీడన ప్రవణత

ఒక ప్రమాణ వైశాల్యం ఉన్న భూభాగంపై పీడనంలో కలిగే మార్పు రేటును 'పీడన ప్రవణత' అంటారు.

ముఖ్యాంశాలు

- సూర్య గమనాన్ని బట్టి అల్ప, అధిక పీడన మేఖలలు ఉత్తరం వైపు, దక్షిణం వైపు జరుగుతూ ఉంటాయి.
- భూగోళంపై ఇప్పటి వరకు నమోదైన అధిక వాతావరణ పీడనం 1083.3 మిల్లీ బార్లు. 1963 డిసెంబర్ 31న సైబీరియాలోని అగాటా వద్ద దీన్ని గుర్తించారు.
- 1979 అక్టోబర్ 12న మెరియానా ద్వీపాల్లో 'టిప్' అనే చక్రవాతంలో గుర్తించిన అత్యల్ప వాతావరణ పీడనం 870 మిల్లీబార్లు.
- ప్రపంచపటంలో సమానమైన పీడనం ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలను 'సమభార రేఖలు' అంటారు. ఇవి వేసవిలో భూభాగంపై ఉత్తర దిశకు, సముద్రంపై దక్షిణం వైపు వంగి ఉంటాయి.
- శీతాకాలంలో సమభార రేఖలు భూమి మీద దక్షిణం వైపు సముద్రం మీద ఉత్తరం వైపు వంగి ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. **వాతావరణంలో ప్రతి 300 మీటర్ల ఎత్తుకు ఎన్ని మిల్లీబార్ల వాతావరణ పీడనం తగ్గుతుంది?**
   1) 1 మిల్లీబారు 2) 12 మిల్లీబార్లు
   3) 34 మిల్లీబార్లు 4) 30 మిల్లీబార్లు
2. **పశ్చిమ పవనాలు, ధ్రువ పవనాల మధ్య ఏర్పడిన అల్పపీడన మేఖల?**
   1) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
   2) ఉపధ్రువ అల్పపీడన మేఖల
   3) ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల
   4) అధిక పీడన ధ్రువ మేఖల
3. **అధిక గురుత్వాకర్షణ బలాల వల్ల ఏర్పడ్డ పీడన మేఖల?**
   1) అధిక పీడన ధ్రువ మేఖల
   2) ఉప ధ్రువ అల్పపీడన మేఖల
   3) ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల
   4) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
4. **ఉరుములు, మెరుపులతో సంభవించే వర్షపాతం?**
   1) చక్రవాత 2) పర్వతీయ
   3) నిమ్నోన్నత 4) సంవహన
5. **కింది వాటిలో అభిసరణ మండలం ఏది?**
   1) భూమధ్యరేఖ అల్పపీడనం
   2) ఉప ఆయనరేఖ అధిక పీడనం
   3) ఉపధ్రువ అల్పపీడనం
   4) ధ్రువ అధిక పీడనం
6. **వాతావరణ పీడనాన్ని కొలవడానికి ఉపయోగించే పరికరం?**
   1) హైగ్రోమీటర్ 2) హైడ్రోమీటర్
   3) బార్‌మీటర్ 4) ప్రెజర్ గేజ్
7. **కింది వాటిలో ఏ గాలి ఎక్కువ పీడనాన్ని కలిగిస్తుంది?**
   1) తడి గాలి 2) పొడి గాలి
   3) రెండూ సమాన పీడనాన్ని కలగజేస్తాయి
   4) ఏదీకాదు
8. **భూమధ్యరేఖ అల్పపీడన మండలం ఏయే అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది?**
   1) 0°–15° 2) 0°–5°
   3) 20°–40° 4) $66\ {}^{1}/_{2}{}^\circ$ – 90°
9. **సంవాహన ప్రక్రియ అధికంగా జరిగే మండలం?**
   1) భూమధ్యరేఖ అల్పపీడన మండలం
   2) ఉప ఆయనరేఖ అధిక పీడన మండలం
   3) ఉపధ్రువ అల్పపీడన మండలం
   4) ధ్రువ అధిక పీడన మండలం
10. **పీడన ప్రవణత అంటే?**
    1) ఉత్తరం నుంచి దక్షిణ దిశగా ప్రతి యూనిట్ దూరానికి పీడనంలో చోటు చేసుకునే వ్యత్యాసం
    2) ప్రతి యూనిట్ దూరానికి పీడనంలో చోటు చేసుకునే తరుగుదల
    3) ప్రతి యూనిట్ దూరానికి పీడనం పెరుగుదల
    4) ఏదీకాదు

సమాధానాలు

1) 3 2) 2 3) 1 4) 4 5) 1
6) 3 7) 2 8) 2 9) 1 10) 2

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ గోవాలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) గోవా గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (జనరల్ స్ట్రీమ్)ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీబీఏ/బీసీఏ(ఆర్ట్స్/కామర్స్/సైన్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కంప్యూటర్ అప్లికేషన్స్/మేనేజ్‌మెంట్ సైన్స్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.12,300.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఇంటర్వ్యూ తేదీ:** 17.02.2026.
» **ఇంటర్వ్యూ వేదిక:** అడ్మిన్ బ్లాక్, ఐఐటీ గోవా, జీఈసీ క్యాంపస్,ఫార్మాగుడి, పోండా, గోవా.
» **వెబ్‌సైట్:** https://iitgoa.ac.in

జూనియర్ టెక్నీషియన్ పోస్టులు

తిరువనంతపురం(కేరళ)లో నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్(ఎన్‌సీఈఎస్ఎస్) రెగ్యులర్ ప్రాతిపదికన జూనియర్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.18,000 నుంచి 56,900.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.02.2026
» **వెబ్‌సైట్:** www.ncess.gov.in

ఎయిమ్స్ న్యూఢిల్లీలో ఎడ్యుకేషన్ మీడియా జర్నలిస్ట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) న్యూఢిల్లీలో ఒప్పంద ప్రాతిపదికన ఎడ్యుకేషన్ మీడియా జర్నలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ, పీజీ(ఎడ్యుకేషన్, హెల్త్ ఎడ్యుకేషన్, సైకాలజీ, బిహేవియరల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్/కమ్యూనికేషన్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.67,700.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.02.2026
» **వెబ్‌సైట్:** www.aiims.edu

పండితారాధ్య చరిత్ర కావ్యాన్ని రచించింది ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ సాహిత్యం

గ్రూప్స్ జనరల్ స్టడీస్ సిలబస్‌లో 'సంస్కృతి,నాగరికత, కళలు – తెలంగాణ సాహిత్యం' అనే అంశాలను ఒక ప్రత్యేక అధ్యాయంగా పొందుపర్చారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి ఈ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించాలి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత వస్తున్న నోటిఫికేషన్లు కావడం వల్ల పోటీచాలా తీవ్రంగా ఉండనుంది. జనరల్ స్టడీస్‌లో ఇప్పటికే ఉన్న అంశాలకు తెలుగు,ఇంగ్లిష్ విభాగాలను జతచేశారు. కాబట్టి అభ్యర్థులు తెలంగాణ చరిత్రతోపాటు 'తెలంగాణ సంస్కృతి, నాగరికత, కళలు, సాహిత్యం' మొదలైన అంశాలపై కూడా అవగాహన ఏర్పర్చుకోవాలి. ఇందు కోసం తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, కళారూపాలు,తెలంగాణలోని ప్రాచీన కవులు, ఆధునిక కవులు, కవయిత్రులు, ముఖ్య పండుగలు మొదలైన అంశాలపై పట్టు సాధించాలి.

తెలంగాణ ప్రాచీన కవులు

పాల్కురికి సోమనాథుడు (1160-1240)

జన్మస్థలం: వరంగల్ జిల్లా జనగామ సమీపంలోని పాలకుర్తి.

బిరుదులు: ప్రథమాంధ్ర విప్లవ కవి, దేశీ కవిత్వోద్యమ పితామహుడు.

రచనా శిల్పం: 'అల్పాక్షరాల అనల్పార్థ రచన'

రచనలు:

1. **పద్య ప్రకృతులు:**
   అనుభవసారం, చతుర్వేదసారం, చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకం
2. **లఘుకృతులు:**
   బసవరగడ, నమస్కార గద్య, శరణుబసవ గద్య, బసవాష్టకం, బసవోదాహరణం, బసవ లింగ నామావళి.
3. **ద్విపద కావ్యాలు:**
   బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, మల్లమదేవి పురాణం (అలభ్యం).

పాల్కురికి సోమనాథుడు కాకతీయుల కాలానికి చెందినవాడు. పరిశోధకులు పాల్కురికి సోమనాథుణ్ని 'తెలంగాణ ఆదికవి'గా పేర్కొంటారు. తెలుగు కవితా ప్రపంచంలో ప్రథమాంధ్ర విప్లవ కవి పాల్కురికి సోమనాథుడు. తెలుగు సాహిత్యంలో శైవ సాహిత్యానికి సుస్థిర స్థానం సంపాదించి పెట్టిన వారిలో పాల్కురికి ఆద్యుడు, అగ్రగణ్యుడు. పాల్కురికి సోమనాథుడు ద్విపద కావ్య ప్రక్రియకు ఆద్యుడు. ఉదాహరణ కావ్య రచనకు మార్గదర్శకుడు.

సంఖ్యా నియమం, మకుట నియమం ఉన్న మొదటి శతకం వృషాధిప శతకం. పాల్కురికి సోమనాథుడి తొలి రచన అనుభవసారం. తెలుగు సాహిత్యంలో శుద్ధమైన తొలి దేశీ స్వతంత్ర పురాణంగా బసవ పురాణం పేరొందింది. ఇది ఏడు ఆశ్వాసాల ద్విపద కావ్యం. సమకాలీన సమాజాన్ని చిత్రించిన తొలి తెలుగు సాంఘిక కావ్యం బసవ పురాణం. పాల్కురికి సోమనాథుడి ద్విపద బసవ పురాణాన్ని పిడుపర్తి సోమన పద్యకావ్యంగా రాశారు.

రుద్రపశుపతి, గొడగూచి, బెజ్జ మహాదేవి, ఉడుమూరి కన్నప్ప, ముగ్ధ సంగయ్య, చిరుతొండ నంబి లాంటి చిన్నపాత్రలకు పాల్కురికి సోమన కావ్య ప్రవేశం కల్పించారు. 'ఉరుతర పద్యోక్తుల కంటే సరసమై ఎరిగిన జాను తెనుగు' అన్న కవి పాల్కురికి సోమనాథుడు. ఇతడి చివరి కృతి పండితారాధ్య చరిత్ర. తెలుగులో తొలిసారిగా జీవిత చరిత్ర రాసింది పాల్కురికి సోమనాథుడే అని విమర్శకుల అభిప్రాయం. తొలి తెలుగు విజ్ఞాన సర్వస్వంగా పండితారాధ్య చరిత్రను విమర్శకులు ప్రశంసించారు.

బద్దెన (13వ శతాబ్దం)

బిరుదు: కమలాసనుడు

రచనలు:

నీతిశాస్త్ర ముక్తావళి, సుమతీ శతకం.

బద్దెన కాకతీయుల సామంతరాజు. వేములవాడ చాళుక్య రాజు భద్రభూపాలుడే 'బద్దెన' అని చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రచించిన 'నీతిశాస్త్ర ముక్తావళి' ఒక గొప్ప రాజనీతి గ్రంథం. తెలుగులో వచ్చిన నీతి శతకాల్లో అగ్రగణ్యమైంది సుమతీ శతకం. ఇది కంద పద్య రచనలో వెలువడింది.

గోన బుద్ధారెడ్డి (13వ శతాబ్దం)

బిరుదులు: కవి కల్పతరువు, కవిలోక భోజుడు.

రచన: రంగనాథ రామాయణం

కవితా శైలి: సరళం, పండిత పామర జన రంజకం

గోన వంశ రాజులు కాకతీయుల సామంతులు. వీరు రాయచూరు ప్రాంతాన్ని పరిపాలించేవారు. గోన బుద్ధారెడ్డి నిజాం రాష్ట్రంలోని రాయచూరు ప్రాంతాన్ని పాలించినట్లు 'బూదపూరు, రాయచూరు శాసనాలు' తెలుపుతున్నాయి. గోన బుద్ధారెడ్డి 'పాత్యగేయేచ మధురం' అనే కావ్యోక్తిని దృష్టిలో పెట్టుకొని రంగనాథ రామాయణాన్ని దేశీ ఛందమైన ద్విపదలో రచించాడు. తెలుగులో వచ్చిన రామాయణ కావ్యాల్లో మొదటిది రంగనాథ రామాయణం. ఇది ద్విపద ప్రక్రియకు చెందిన రచన. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని యుద్ధకాండ వరకు మాత్రమే రాశాడు. ఉత్తర కాండను ద్విపదలో రాసిన సోదర జంట కవులు కాచవిభుడు, విఠలనాథుడు. తెలుగులో వెలువడిన ద్విపద కావ్యాల్లో ప్రథమ గౌరవం పొందిన రచన రంగనాథ రామాయణం.

మారన (13వ శతాబ్దం)

రచన: మార్కండేయ పురాణం

మార్కండేయ పురాణాన్ని ప్రథమాంధ్ర మహాపురాణంగా పిలుస్తారు. అష్టాదశ పురాణాల్లో ఇది ఏడోది. మార్కండేయ పురాణం కృతిపతియైన 'నాగయగన్నడు' కాకతీయ రెండో ప్రతాపరుద్రుడి సేనాపతి. మార్కండేయ పురాణం తెలుగులో అనేక మనోహర కథలకు పుట్టినిల్లు. మార్కండేయ పురాణం ఎనిమిది ఆశ్వాసాల చంపూ కథాకావ్యం.

శరభాంకుడు

కాలం:

రెండో ప్రతాపరుద్రుడి సమకాలీకుడు.

రచన: శరభాంక లింగమ శతకం

పోతన (1420-1480)

నివాసం: బమ్మెర (ఓరుగల్లు)

తల్లిదండ్రులు: కేసన, లక్కమాంబ

బిరుదులు:

సహజ పండితుడు, నిగర్వ చూడామణి.

కవితాశైలి:

మధుర కవితా నిర్మాణం (అతి మధురం)

రచనలు: వీరభద్ర విజయం, నారాయణ శతకం (అలభ్యం), భోగినీ దండకం, మహాభాగవతం.

శ్రీనాథుడి సమకాలీకుల్లో అగ్రగణ్యుడు పోతన. కృతిని మానవులకు అంకితం చేయనని ప్రతిజ్ఞ చేసిన తొలి తెలుగు కవి పోతన. 'సత్కవుల్ హాలికులైననేమి' అని పోతన ప్రకటించాడు. పోతన సర్వజ్ఞ సింగ భూపాలుడు అనే రాజును తిరస్కరించాడు. పోతన భాగవతాన్ని రాస్తూ 'నా జననంబు సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్' అని చెప్పుకున్నాడు. భాగవత పురాణంలో ద్వాదశ స్కంధాలున్నాయి. పోతన భాగవతాన్ని శ్రీరామచంద్రుడికి అంకితమిచ్చాడు. తెలుగు వాఙ్మయ ప్రపంచంలో పోతనను చిరంజీవిని చేసిన రచన భాగవతం. ఇందులో ప్రధానంగా భక్తి మార్గ ప్రశంస ఉంది. భాగవతాన్ని శుకమహర్షి మోక్షశాస్త్రంగా పేర్కొన్నాడు.

తెలుగు భాగవత పురాణంలో పంచమ స్కంధాన్ని బొప్పరాజు గంగన, షష్ఠమ స్కంధాన్ని ఏర్చూరి సింగన, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను వెలిగందుల నారయ రచించగా, 1, 2, 3, 4, 7, 8, 9, 10 స్కంధాలను పోతన రచించారు. క్రీ.శ.1848లో పురాణం హయగ్రీవ శాస్త్రులు తొలిసారిగా భాగవతాన్ని ముద్రించారు. శ్రీకృష్ణుని బాల్య క్రీడలు భాగవతంలోని దశమ స్కంధంలో ఉన్నాయి.

'కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ...' అంటూ పోతన ప్రహ్లాద చరిత్రం ఘట్టంలో తన భక్తి పారవశ్యాన్ని చాటుకున్నాడు.

'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై...' అనే ప్రసిద్ధ పద్యం పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలోనిది.

భాగవతంలో మధురభక్తికి చక్కని ఉదాహరణగా దశమస్కంధంలో శ్రీకృష్ణుడి రాసక్రీడల సందర్భంలో పోతన చెప్పిన 'నల్లని వాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై..' పద్యాన్ని చెప్పుకోవచ్చు.

పిల్లలమర్రి పిన వీరభద్రుడు (15వ శతాబ్దం)

పూర్వీకులు:

నల్లగొండ జిల్లా పిల్లలమర్రి నివాసులు

ఆస్థానం: సాళువ నరసింగరాయలు

రచనలు:

శృంగార శాకుంతలం, జైమినీ భారతం.

శ్రీనాథుడి కాలం నాటికి పిల్లలమర్రి వంశస్థులు నెల్లూరులో ప్రధానులుగా ఉండేవారు. పిల్లమర్రి పినవీరభద్రుడు 'వాణి నా రాణి' అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు. ఇతడు రచించిన సుప్రసిద్ధ కావ్యం శృంగార శాకుంతలం. దీనికి శకుంతలా పరిణయం అనే పేరుంది. శృంగార శాకుంతలం నాలుగు ఆశ్వాసాల శృంగార ప్రబంధం. ఈ గ్రంథ కృతిపతి చిల్లర వెన్నయామాత్యుడు. జైమినీ భారతం కృతిపతి సాళువ నరసింగరాయలు. కురుక్షేత్రం తర్వాత ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగం గురించి జైమిని మహర్షి జనమేయుడికి చెప్పిన కథే జైమినీ భారతం ఇతివృత్తం.

చరిగొండ ధర్మన్న (1480-1530)

జన్మస్థలం: పాలమూరు జిల్లా చరికొండ

బిరుదులు: శతలేఖినీ సురత్రాణ, శతఘంట సురవూతాణుడు.

రచన: చిత్ర భారతం.

ఇది ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధం. చిత్రభారతానికి మూలం పద్మపురాణం. దీని కృతిపతి ఎనుమలూరి పెద్దన మంత్రి.

అద్దంకి గంగాధరుడు 1525-1585

ప్రాంతం: గోల్కొండ నివాసి

రచన: తపతీ సంవరణోపాఖ్యానం

అంకితం: ఇబ్రహీం కుతుబ్‌షా

తపతి సంవరణోపాఖ్యానం ఐదు ఆశ్వాసాల ప్రబంధం. ఇది చక్కటి లోకోక్తులతో, 24 రకాల వర్ణనలతో కూడుకున్న ప్రబంధం. మహమ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి అద్దంకి గంగాధరుడు. ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగు కవులకు ఆశ్రయమిచ్చి, తెలుగువారితో స్నేహభావంతో మెలిగాడు.

పొన్నికంటి తెలగన (1520-1580)

ప్రాంతం: గోల్కొండ నివాసి

రచన: యయాతి చరిత్ర

పొన్నికంటి తెలగననే పొన్నగంటి తెలగనార్యుడు అని పిలుస్తారు. తొలి అచ్చ తెలుగు కావ్యం యయాతి చరిత్ర. ఈ గ్రంథ కృతిపతి అమీన్ ఖాన్. ఇతడు ఇబ్రహీం కుతుబ్‌షాకు సామంతుడు. యయాతి చరిత్ర అయిదు ఆశ్వాసాల శృంగార కావ్యం.

మరింగంటి సింగరాచార్యులు (1520-1590)

బిరుదులు: శతఘంటావధాని,

అష్టభాషా కవితా విశారదుడు

రచనలు:

నిరోష్ఠ్య రామాయణం (దశరథరాజ నందన చరిత్రం), సీతాకళ్యాణం(శుద్ధాంధ్ర ప్రబంధం), తారకబ్రహ్మ రామ శతకం, రామకృష్ణ విజయం(ద్వ్యర్థి కావ్యం), నలయాదవ రాఘవ పాండవీయం(చతుర్థీ కావ్యం), శ్రీరంగశతకం.

తెలుగులో మొదటి నిరోష్ఠ్య రచన దశరథ రాజనందన చరిత్రం. మొదటి అచ్చ తెలుగు నిరోష్ఠ్య రచన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణం. తెలుగులో త్వ్యర్థి, చతుర్థి కావ్యాల రచనలకు ఆద్యుడు మరింగంటి సింగరాచార్యులు.

ఎలకూచి బాలసరస్వతి (17వ శతాబ్దం)

జన్మస్థలం: మహబూబ్‌నగర్ జిల్లా

ఆస్థానం: సురభిమాధవ రాయలు

సంస్థానం: జటప్రోలు

రచనలు: రాఘవ యాదవ పాండవీయం (నాలుగు ఆశ్వాసాల కావ్యం), సుభాషిత త్రిశతి అనువాదం, మల్లభూపాలీయం (నీతి శతకం), చంద్రికా పరిణయం (ప్రబంధ కావ్యం), సురభి మల్లా! వైదుషీ భూషణా! (వైరాగ్య శతకం), రంగ కౌముది (యక్షగానం).

భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన తొలి వ్యక్తి ఎలకూచి బాలసరస్వతి. ఇతడే ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్యాత. తెలుగులో త్వ్యర్థి కావ్యమైన 'రాఘవ యాదవ పాండవీయం'ను ఎలకూచి బాలసరస్వతి రచించి తిరుపతి వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చాడు.

కంచర్ల గోపన్న (1620 - 1684)

జన్మస్థలం: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి

బిరుదు: భక్త రామదాసు

రచనలు: దాశరథీ కీర్తనలు, దాశరథీ శతకం, దాసబోధ.

నిజాం పరిపాలకుడైన అబుల్ హసన్ తానీషా వద్ద మంత్రులైన అక్కన్న, మాదన్నల మేనల్లుడే కంచర్ల గోపన్న. ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా భూమి శిస్తులను దుర్వినియోగం చేశాడన్న ఆరోపణలతో తానీషా గోల్కొండ కోటలో రామదాసును బంధించాడు. భద్రాచలంలోని రామదాసు మండపంలో రామదాసు రాసిన 220 కీర్తనలు చెక్కబడి ఉన్నాయి. ఇతడి కీర్తనలు 'భజన సంప్రదాయానికి' చెందినవి. ఆనందభైరవి రాగాన్ని మొదట ఉపయోగించిన వాగ్గేయకారుడు రామదాసు. 'రామదాసు చరిత్ర' రచయిత సింగిరి దాసు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. పొన్నికంటి తెలగన రాసిన అచ్చ తెలుగు కావ్యం?
   1) సౌందరనందం 2) నాగానందం
   3) రాజశేఖర చరిత్ర
   4) యయాతి చరిత్ర
2. తెలుగు సాహిత్యంలో రెండో యుగకర్త?
   1) పాల్కురికి సోమన
   2) నన్నయ 3) తిక్కన
   4) నన్నెచోడుడు
3. మార్కండేయ పురాణాన్ని మారన ఎవరికి అంకితమిచ్చాడు?
   1) మల్ల సైన్య విభుడు
   2) నాగయ గన్న విభుడు
   3) ఎల్లయ సైన్యనాథుడు
   4) నాగయ మేచవిభుడు

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2.

Which file is responsible to start MS-Word?

BANK EXAMS

COMPUTER AWARENESS

MS - WORD

1. Which is not a font style?
   1) Bold 2) Superscript
   3) Italic 4) Regular
   5) None of above
2. What is gutter margin?
   1) Margin that is added to right margin when printing
   2) Margin that is added to the left margin when printing
   3) Margin that is added to the outside of the page when printing
   4) Margin that is added to the binding side of page when printing
   5) None
3. Landscape is?
   1) A font style
   2) Paper Size
   3) Page Layout
   4) Page Orientation
   5) None
4. Typeface option will come under which menu?
   1) Edit 2) View 3) Format
   4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
   1) Web layout view
   2) Print Preview
   3) Reading View
   4) Print Layout view 5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page Setup 2) Section
   3) Page 4) Document
   5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
   1) Tab stop box 2) Left Indent
   3) Right Indent 4) Center Indent
   5) None of above
8. Gutter position can be set in following positions
   1) Left & Right 2) Left & Top
   3) Left & Bottom
   4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
   1) CTRL + Enter
   2) Alt + Enter 3) Shift + Enter
   4) Space + Enter
   5) None of above
10. By pressing F12, which of following will happen?
    1) Save As dialog box will open
    2) Save dialog box will open
    3) Open dialog box will open
    4) Close dialog box will open
    5) None of above
11. Which key will open an Open dialogue box?
    1) F12 2) Alt + F12
    3) Ctrl + F12 4) Shift + F12
    5) None of above
12. How will MS Word will respond in repeated word ?
    1) A Green wavy line under the repeated word
    2) A Red wavy line under the repeated word
    3) A Blue wavy line under the repeated word
    4) A pink wavy lines under the repeated word
    5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
    1) It changes all selected text into Capital Letter
    2) It adds captions for selected Image
    3) It shows all the image captions
    4) It changes some text into Capital Letter
    5) None of above
14. Which file is responsible to start MS Word?
    1) Winword.exe 2) Win.exe
    3) Word.exe 4) Wordwin.exe
    5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
    1) Editions 2) versions
    3) Tracks 4) Traces
    5) None of above
16. Which is not a type of margin?
    1) Top 2) Left 3) Right
    4) Center5) None of above
17. What will be the use of Ctrl + J?
    1) Insert Image
    2) Insert Hyperlink
    3) Align Justify
    4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
    1) Ctrl + A 2) Ctrl + E
    3) Ctrl + D 4) Ctrl + B
    5) None of above
19. Which shortcut will we use to make text Italic?
    1) Ctrl + U 2) Ctrl + T
    3) Ctrl + I 4) Ctrl + P
    5) None of above
20. How to use Format Painter multiple times?
    1) By Click on Lock Format Painter Icon
    2) Format Painter cannot be use multiple times
    3) By Double Click on the Format Painter Icon
    4) By Double Click on the Format Painter Icon
    5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
    1) Indicators
    2) Split buttons
    3) Tab stop buttons
    4) View buttons
    5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
    1) On the top of vertical scroll bar
    2) On the bottom of vertical scroll bar
    3) On the left of horizontal scroll bar
    4) On the right of horizontal scroll bar Comment on this question 5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
    1) Decimal Alignment
    2) Center Alignment
    3) Bar Alignment
    4) Justify Alignment
    5) None of above
24. What is the use of bookmarks?
    1) To correct the spellings.
    2) To jump to a specific location in the document
    3) To ignore spelling mistakes
    4) To save alignments as it is
    5) None of above
25. Which feature is used to replace straight quotes with smart quotes as you type?
    1) Auto Correct as you type
    2) Auto Change as you type
    3) Auto Ignore as you type
    4) Auto Format as you type
    5) None of above
26. Ctrl + D is short cut used for?
    1) Open Dialogue Box
    2) Font Dialogue Box
    3) Save as Dialogue Box
    4) Save Dialogue Box
    5) None of above
27. Ctrl + G is shortcut for?
    1) Open Find and Replace Dialog box with activating Goto Tab
    2) Open Find and Replace Dialog box with activating Find Tab
    3) Open Find and Replace Dialog box with activating Replace Tab
    4) Open Goto Dialog box
    5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
    1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
    2) Open Find and Replace Dialog box with activating Go to Tab
    3) Open Find and Replace Dialog box with activating Find Tab
    4) Open Find and Replace Dialog box with activating Replace Tab
    5) None of above
29. What can be searched by find?
    1) Format 2) Characters
    3) Symbol 4) All of above
    5) None of above
30. On which page the header or the footer is printed by default?
    1) On first page
    2) on last page
    3) on alternate page
    4) Every page 5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
    1) Standard 2) Formatting
    3) Options 4) Review
    5) None of above
32. To spell check which function key you will press?
    1) F5 2) F6 3) F7
    4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
    1) From insert -> sound menu option
    2) From insert -> object menu option
    3) From insert -> subject menu option
    4) From insert -> file menu option
    5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
    1) 45 2) 50 3) 55
    4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
    1) Smallest 8 and Largest 70
    2) Smallest 5 and Largest 72
    3) Smallest 8 and Largest 72
    4) Smallest 5 and Largest 70
    5) None of above
36. Why drop cap is used in document?
    1) To get all first character capital
    2) To get all first character small
    3) To begin a paragraph with a large dropped initial capital letter
    4) To begin a paragraph with a large dropped initial small letter
    5) None of above
37. What is Macro?
    1) Small add-on programs that are installed afterwards if you need them
    2) Type of high level programming language
    3) Type of low level programming language
    4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
    5) None of above
38. Which among following can be a vertical separation between columns?
    1) Margin 2) Header
    3) Orientation 4) Gutter
    5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
    1) Edit 2) View 3) Tools
    4) Format 5) None of above
40. To auto fit the width of column:
    1) Double click the left border of column
    2) Double click the right border of column
    3) Double click the column header
    4) None of above
    5) All the above

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2;
6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1;
11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2;
16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4;
26) 2; 27) 1; 28) 4; 29) 4; 30) 4;
31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3;
36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2;